ఈనాడు

విజయవాడ 5-3-2018 సోమవారం సిటీ సంపుటి 44 . సంచిక 204

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net


Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

గుండెకు సేంద్రియ రక్ష




సేంద్రియ ఎరువులతో పెంచిన గడ్డిని తీసుకుని ఆవులు ఇచ్చే పాలు గుండెకు మేలు చేస్తాయని తాజా అధ్యయనంలో తేలింది. అమెరికాలోని జాన్స్‌హాప్కిన్స్ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. పాలల్లో ఒమేగా-6, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలుంటాయి. వీటిలో ఒమేగా-6ను ఎక్కువగా, ఒమేగా-3ను తక్కువగా తీసుకుంటే హృద్రోగాలు, మధుమేహం, ఊబకాయం లాంటి వ్యాధులు చుట్టుముట్టే ముప్పుంది. అయితే సేంద్రియ గడ్డిని తీసుకునే ఆవులు ఇచ్చే పాలల్లో ఈ రెండు రకాల ఆమ్లాల నిష్పత్తి సమానంగా ఉంటున్నట్లు తేలింది. ఇది గుండె జబ్బులతోపాటు జీవక్రియా సంబంధిత వ్యాధుల ముప్పునూ దూరం చేసేందుకు తోడ్పడుతుంది'అని పరిశోధకులు చార్లెస్ బెన్‌బ్రూక్ తెలిపారు.

మద్యపానం శిక్ష



తల్లిదండ్రులూ జాగ్రత్త..! పిల్లల నోటికి ఒక్క చుక్క కూడా మద్యం తగలనివ్వొద్దని తాజా అధ్యయనం సూచిస్తోంది. సరదాగా రుచి చూపించారో.. భవిష్యత్తులో వారికి మద్యపాన సంబంధిత సమస్యలు చుట్టుముట్టే అవకాశముందని హెచ్చరిస్తోంది. అమెరికాలోని బుఫాలో వర్సిటీ నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. బాల్యంలో అప్పుడప్పుడు మద్యం రుచి చూసినవారికి.. భవిష్యత్తులో తరచూ మద్యం తీసుకోవడం, ప్రతిసారీ ఎక్కువ మద్యం తాగడం లాంటి సమస్యల ముప్పు ఎక్కువగా ఉంటున్నట్లు వెలుగులోకి వచ్చింది. 'ఇతరులతో వాగ్వాదం, కొట్లాటలకు దిగడం, తలనొప్పులకూ బాలల మద్యపానం కారణమవుతోంది'అని పరిశోధకులు క్రైగ్ కోల్డర్ తెలిపారు.

ఆర్థిక మాంద్యం భక్షణ



ప్రపంచాన్ని కుదిపేసిన "ఆర్థిక మాంద్యం-2008".. అనారోగ్య ముప్పులనూ వెంటపెట్టుకొచ్చిందని తాజా అధ్యయనంలో తేలింది. ఊబకాయం, మధుమేహం, మానసిక సమస్యల ముప్పులు పెరిగేందుకు ఇది కారణమైందని వెలుగులోకి వచ్చింది. బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ లండన్, కింగ్స్ కాలేజీ లండన్ నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. 9000 మంది సమాచారాన్ని వారు విశ్లేషించారు. ఊబకాయులయ్యే ముప్పును 4.1 శాతం, భారీ ఊబకాయులయ్యే ముప్పును 2.4 శాతం వరకూ ఆర్థిక మాంద్యం పెంచినట్లు వెలుగులోకి వచ్చింది. మధుమేహం చుట్టుముట్టే ముప్పు 1.5 శాతం, మానసిక సమస్యలు పీడించే ముప్పు 4 శాతం పెంచినట్లు బయటపడింది.

అవినీతి శతకం!

- వీఆర్వో ఆస్తి రూ.100 కోట్లు
- బయటపడుతున్న సంజీవ్‌కుమార్ అక్రమార్జన
- రూ.3.77 కోట్ల నుంచి రూ.6.36 కోట్లకు పెరిగిన పుస్తక విలువ
- బినామీల ముసుగులో అంతులేని ఆస్తులు
- చైన్‌మన్ నాగేశ్వరరావు ఖాతాలో మరో రూ.10 కోట్ల విలువైన స్థలం

ఈనాడు - విశాఖపట్నం

తీగ లాగితే కోట్ల డొంక కదులుతోంది. అక్రమాల చిట్టా ఒక్కొక్కటి వెలుగుచూస్తోంది. బహిరంగ విపణిలో రూ.40 కోట్లనుకున్న విశాఖపట్నం అర్బన్ మండలం మల్కాపురం క్లస్టర్ వీఆర్వో సంజీవ్‌కుమార్ అక్రమార్జన తాజాగా ఏకంగా రూ.100 కోట్లు దాటేసింది. శనివారం జరిపిన సోదాల్లో పుస్తక విలువ రూ.3.77 కోట్ల అక్రమార్జనకు సంబంధించిన ఆధారాలు లభించాయి. మరిన్ని కీలక పత్రాలు, ఖాళీ చెక్కు పుస్తకాలు, కారులో ల్యాప్‌టాప్, ఇతర సాక్ష్యాలను అనిశా అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. దీంతో పుస్తక విలువ రూ.6.36 కోట్లకు చేరింది. నగరంలోని కీలక ప్రాంతాల్లో ఉన్న ఈ ఆస్తుల ధరలను బట్టి చూస్తే విపణి విలువ రూ.వంద కోట్లకుపైనే ఉంటుందని అధికారులు వెల్లడించారు.

మద్దిలపాలెం సమీపంలోని శ్రీసాయి ఆదిత్య నిలయంలో 303 నంబరు ఫ్లాటులో నిర్వహిస్తున్న ప్రైవేటు కార్యాలయానికి తాళాలు వేసి అక్కడి ప్రైవేటు సిబ్బంది పరారయ్యారు. అక్కడ ఒక్కొక్కరికి రూ.25 వేల జీతాలిచ్చి సంజీవ్‌కుమార్ నియమించుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ అనధికార కార్యాలయంలో సోమవారం సోదాలు చేయనున్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బొగ్గు వెంకటసుబ్రహ్మణ్యం మల్లిఖార్జునరావు అనే ఇంజినీరును బినామీగా పెట్టి ఆదిత్యవర్ధన్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్‌ను ప్రారంభించాడు. భూములు కొనుగోలు చేస్తూ, వాటిలో బహుళ అంతస్తులను నిర్మిస్తూ విక్రయిస్తున్నట్లు అనిశా అధికారులు గుర్తించారు. ఈ బినామీని ఆదివారం విచారించారు. రూ.50 కోట్ల వరకు ఈ లావాదేవీలు జరిగి ఉండవచ్చని అంచనా వేశారు. మరికొందరు బినామీలతో సుజనా కన్‌స్ట్రక్షన్స్ పేరుతో మరో నిర్మాణ సంస్థ నడుపుతున్నారని గుర్తించారు. ఇక్కడా రూ.కోట్లలోనే వ్యాపారం జరిగినట్లు తెలుస్తోంది. సంజీవ్‌కుమార్ ప్రత్యేకంగా నియమించుకున్న గణాంకాధికారి సామ (మిగతా 2లో)



సంజీవ్‌కుమార్

గిరిజనులకు 'గిరి చంద్రన్న దీవెన'

- గిరిజన ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార బుట్ట
- 2018-19 బడ్జెట్‌లో నిధుల కేటాయింపు
- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- దళితవాడల్లోని పిల్లలకూ అదనపు పోషకాహారం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లల కోసం 'గిరి చంద్రన్న దీవెన' పేరుతో ప్రతినెలా పౌష్టికాహారాల బుట్ట(న్యూట్రీ బాస్కెట్)ను అందించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 2018-19 బడ్జెట్‌లో కేటాయింపులు జరపనున్నారు. స్త్రీ శిశు సంక్షేమ (మిగతా 2లో)



కోర్టు చెప్పినా 'కొండ'పైనే ధరలు

- తిరుమలలో ఇడ్లీ 60.. భోజనం రూ.150..
- హోటళ్లలో కొనసాగుతున్న ధరల దందా

16లో



పీక్కు తింటున్నా పట్టించుకోరా?

- వీధుల్లో శునకాల స్వైరవిహారం
- గ్రామసింహాల దాడిలో ప్రాణాలు కోల్పోతున్న చిన్నారులు
- వేసవిలో పెరగనున్న బెడద

6లో

నిరంకుశత్వం దిశగా..

- జీవితాంతం అధ్యక్ష పీఠంపై షి జిన్‌పింగ్‌ను కూర్చోబెట్టడానికి రంగం సిద్ధం
- రాజ్యాంగ సవరణకు నేడు ఎన్‌పీసీ ఆమోదం
- సీపీసీ ఐక్యతకే ఈ సవరణ
- ఎన్‌పీసీ అధికార ప్రతినిధి వివరణ

14లో

ఆధార్‌తో ఆరోగ్య చరిత్ర

- వాటిని చూసి చికిత్స అందించే వెసులుబాటు
- చిన్నారుల కోసం ఈ నెల 5 నుంచి 31దాకా పలకరింపు
- ప్రతి నెలా 4న రాష్ట్ర, జిల్లా, గ్రామీణ ఆరోగ్య సమాచారం
- కార్యక్రమాల ప్రారంభంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



రాష్ట్ర ఆరోగ్య సమాచారాన్ని విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.

ఈనాడు - అమరావతి

'ప్రజల ఆరోగ్య దస్త్రాలను డిజిటల్ లాకర్‌లో పెడుతున్నాం. వైద్యుడి వద్దకెళ్లి ఆధార్ నంబరు చెబితే ఆరోగ్య వివరాలు మొత్తం కన్పిస్తాయి. దాన్ని చూసి సరైన వైద్యం అందించే వీలుంటుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. కొందరు వైద్యులు అరకొర పరిజ్ఞానంతో అవసరం లేని మందులు ఇస్తే కొత్త సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యసేవలు అందించే అందరి వివరాలు మ్యాపింగ్ చేయాలని సూచించారు. కొన్ని చోట్ల ఆసుపత్రులే అంటువ్యాధుల నిలయాలవుతున్నాయని ముఖ్యమంత్రి ఆందోళన (మిగతా 2లో)



తృతీయ కూటమి రావాలి

- కేసీఆర్ ఆలోచనలను స్వాగతిస్తున్నా
- ఆంధ్రప్రదేశ్‌కు హోదాపై మాట్లాడిన గులాబీ దళపతికి కృతజ్ఞతలు
- తెరాస ఎంపీల మద్దతును తెదేపా, వైకాపా తీసుకోవాలి
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు

2లో

హస్తినలో మళ్లీ ప్రకంపనలు!

- దేశ రాజధానిలో మోహరించిన అధికార, విపక్షాలు
- విభజన సమస్యలపై పార్లమెంటు వేదికగా ఉద్యమానికి సిద్ధం!
- నేడు భాజపా అధ్యక్షుడు అమిత్‌షాతో తెదేపా నేతల భేటీ

6లో

ఫ్లోరైడ్ పాపం

- రోజురోజుకు పెరుగుతున్న మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు
- సరిగా అందని వైద్య సహాయం
- మండలానికి ఒకే వైద్యురాలు
- ఆదాయంగా మలుచుకుంటున్న ఆర్‌ఎంపీలు
- కృష్ణా జిల్లా ఎ.కొండూరు మండలంలో దుస్థితి

ఎ.కొండూరు నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

ఫ్లోరైడ్ సమస్య గ్రామాలను పట్టిపీడిస్తోంది. చాపకింద నీరులా విస్తరిస్తోంది. మారుమూల ప్రజలకు దీనిపై సరైన అవగాహన లేకపోవడంతో దీని బారిన పడే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. పాలకుల నిర్లక్ష్యం తోడవడంతో మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు పెరుగుతూనే ఉన్నారు. సరైన తాగునీటి సదుపాయాలు కల్పించకపోవడం.. వ్యాధి ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు సరిపోయిన సంఖ్యలో వైద్యులు లేకపోవడంతో వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. కృష్ణా జిల్లా ఎ.కొండూరు మండలమే ఇందుకు ఉదాహరణ. ఇక్కడ సరైన సంఖ్యలో వైద్యులు లేకపోవడంతో కనీస అర్హతలేని ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. వారు (మిగతా 2లో)



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బాబురావు(బాబ్జ). ఇతనిది కృష్ణారావుపాలెం శివారు దీప్లానగర్‌తండా. గత రెండేళ్లుగా నడుము, మోకాళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నాడు. ఆస్పత్రికి వెళ్లి వైద్యసేవలు పొందటానికి ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో స్థానికంగా దొరికే మందులు వాడుతున్నాడు. ఆరోగ్య శిబిరంలో రక్తనమూనాలు తీసి పరీక్షలు నిర్వహించగా క్రియాటినైన్ 2.5శాతంకు మించి ఉన్నట్లు నిర్ధరించారు.



పూలంగళ్ల కూడలిలో రాళ్లు విసురుతున్న వైకాపా కార్యకర్తలు
★ ఇరువర్గాల దాడిలో గాయపడిన ట్రాఫిక్ ఎస్సై చిరంజీవి

పులివెందుల ఉద్రిక్తం

వైకాపా, తెదేపా వర్గీయుల ఘర్షణ

- అభివృద్ధిపై బహిరంగచర్చ సందర్భంగా దాడులు, ప్రతిదాడులు
- బాష్పవాయువును ప్రయోగించిన పోలీసులు
- ట్రాఫిక్ ఎస్సై, వైకాపా కౌన్సిలర్‌కు గాయాలు

16లో

కడప జిల్లా పులివెందులలో ఆదివారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. తెలుగుదేశం, వైకాపా వర్గీయుల నడుమ ఘర్షణ తలెత్తింది. పులివెందుల అభివృద్ధిపై ఎవరెవరు ఏమి చేశారో తెలియజేసేందుకు శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి విసిరిన సవాల్‌ను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్వీకరించిన నేపథ్యంలో.. ఈ బహిరంగ చర్చకు వేదికైన స్థానిక పూలంగళ్ల కూడలిలో ఘర్షణ వాతావరణం ఏర్పడింది.

ఇదీ సంగతి!



ఆధార్‌తో ఆరోగ్య చరిత్ర

(మొదటి పేజీ తరువాయి)

వెలిబుచ్చారు. రాష్ట్ర, జిల్లా, గ్రామీణ ఆరోగ్య బులెటిన్లతో పాటు చిన్నారుల ఆరోగ్యం కోసం నిర్వహించే 'పలకరింపు' కార్యక్రమాలను ఉండవల్లి ప్రజాదర్బార్ మందిరం నుంచి ఆదివారం చంద్రబాబు ప్రారంభించారు. ప్రతి నెలా 4న రాష్ట్ర స్థాయి ఆరోగ్య బులెటిన్‌ను తాను విడుదల చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా స్థాయిలో మంత్రులు, కలెక్టర్లు, గ్రామ స్థాయిలో సాధికార మిత్రలు విడుదల చేస్తారన్నారు. 'పలకరింపు'లో భాగంగా మార్చి 5 నుంచి 31 దాకా రాష్ట్రంలోని 50లక్షల చిన్నారుల ఇళ్లకు 57,555 బృందాలకు చెందిన అంగన్‌వాడీ, ఆశ, మెప్మా కార్యకర్తలు వెళ్లి వివరాలు సేకరిస్తారని వివరించారు. ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు, పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించడం, అనారోగ్యంగా ఉన్న వారికి చికిత్స చేయించడం, పుట్టుకతో వచ్చిన లోపాలు, బరువు తక్కువ పిల్లల గుర్తింపు ఇందులో ప్రధానాంశాలని తెలిపారు. ఉపాధి నిధుల ద్వారా ప్రతి పంచాయతీలో మూడెకరాల విస్తీర్ణంలో ఆకు కూరలు, పోషకాలు అందించే ఇతర పంటలు వేసుకుని పోషక లోపం తగ్గించవచ్చని ముఖ్యమంత్రి సూచించారు.

వ్యాధులు గుర్తించిన చోట ప్రత్యేక కార్యాచరణ

వ్యాధులు గుర్తించిన ప్రాంతాల్లో తక్షణ ఉపశమనం, చర్యలతోపాటు మూలాలను గుర్తించేందుకు పరిశోధనలు చేయిస్తున్నామని చంద్రబాబు వివరించారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో మూత్రపిండాల వ్యాధుల తీవ్రతను గుర్తించిన వెంటనే వారికి రూ.2,500 చొప్పున పింఛన్, ఉచిత డయాలసిస్ అందుబాటులోకి తెచ్చామని అన్నారు. వైద్యులు కూడా ఎన్నో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, తమ వద్దకు వచ్చే రోగులకు మించి సమస్యలుంటున్నాయని పేర్కొన్నారు. వైద్యులు ఆరోగ్యానికి ప్రతిరూపంగా ఉండాలని ఆకాంక్షించారు. 'వచ్చే బడ్జెట్లో ఆరోగ్య రంగానికి ప్రాధాన్యమిస్తున్నాం.. రాష్ట్రంలో మాతాశిశు మరణాల రేటును తగ్గించాలి. వ్యాధులు నియంత్రించాలి. ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రూపొందించడానికి పంచాయతీల సహకారం అవసరం' అని సూచించారు.

1.20కోట్ల కుటుంబాలకు బృందాలు

సమావేశంలో భాగంగా పలు జిల్లాల అధికారులతో వీడియో సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. వారి సూచనలు తీసుకున్నారు. కృష్ణా జిల్లా ఎ.కొండూరు మండలం గద్దలగూడెంలో మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందిస్తున్నామని జడ్పీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ వివరించారు. 'పలకరింపు' కింద 1.20కోట్ల కుటుంబాలకు ఆశ, అంగన్‌వాడీ, మెప్మా సిబ్బంది వెళ్లి వివరాలు సేకరిస్తారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఆరోగ్యబులెటిన్ల ద్వారా వ్యాధులను గుర్తించి ప్రజలకు తెలియజేయడమే కాకుండా సమన్వయ శాఖలు వెంటనే చర్యలు చేపట్టేలా అప్రమత్తం చేయడమే లక్ష్యమని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య వివరించారు.

జిల్లాలవారీగా ప్రధానంగా గుర్తించినవి..

జిల్లా	సమస్య	ఏ మండలాల్లో ఎక్కడ అధికం
శ్రీకాకుళం	ఆస్తమా	ఆముదాలవలస, వంగర
నెల్లూరు	ఆస్తమా	ఇందుకూరు పేట, కోవూరు, నెల్లూరు, చేజర్ల
కృష్ణా	గుండె జబ్బులు	జిల్లావ్యాప్తంగా
గుంటూరు	గుండె జబ్బులు	మాచర్ల
విజయనగరం	రక్తపోటు	విజయనగరం, పార్వతీపురం పట్టణాలు
కడప	రక్తపోటు	ప్రొద్దుటూరు, కడప నగరాలు
అనంతపురం	కీళ్లనొప్పులు	శింగనమల, నార్పల
కర్నూలు	కీళ్లనొప్పులు	గోనెగండ్ల, నందవరం
ప్రకాశం	కీళ్లనొప్పులు	తాళ్లూరు, సీఎస్‌పురం, చీరాల, చినగంజాం, కురిచేడు
చిత్తూరు	కీళ్లనొప్పులు	చిన్నగొట్టిగల్లు, పిచ్చాటూరు, ఎర్రావారిపాలెం, నగరి
విశాఖపట్నం	కీళ్లనొప్పులు	మునగపాక
పశ్చిమగోదావరి	మధుమేహం	ఆచంట, ఉండి
తూర్పుగోదావరి	మధుమేహం	రాజమహేంద్రవరం, సీతానగరం



ఉండవల్లిలోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో 'పలకరింపు' కార్యక్రమ కరపత్రాన్ని విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి కామినేని శ్రీనివాస్, ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య, సంచాలకులు అరుణ్‌కుమార్

పెళ్లి చేసుకొని పిల్లల్ని కనాలి

- కుటుంబ వ్యవస్థకు ప్రాధాన్యం పెరగాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

'కుటుంబ వ్యవస్థ మన సొంతం. ఇది చాలా సమస్యలను పరిష్కరిస్తుంది. భార్యాభర్తల మధ్య గొడవలొస్తే పెద్దలు సరిదిద్దుతారు. చిన్నపిల్లలతో ఆడుకోవడం, మంచిచెడులు చెప్పడం ద్వారా మానసికంగా, శారీరకంగా ఎదగడానికి వీలవుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆరోగ్య బులెటిన్ విడుదల సందర్భంగా ఆయన కుటుంబ వ్యవస్థపై కొద్దిసేపు మాట్లాడారు.

- మానసిక సమస్యలకు ఒంటరితనమే ప్రధాన కారణం. ఇది పోవాలంటే కుటుంబంతో కలిసి సంతోషంగా ఉండాలి. అందరూ కలిసి కూర్చుని భోజనం చేసేప్పుడు మాట్లాడుకుంటుంటే ఎంతో ఆనందం ఉంటుంది. లండన్‌లో అయితే ఒంటరితనాన్ని నిరోధించడంపై ప్రత్యేకంగా ఓ మంత్రిత్వ శాఖనే పెట్టారు.
- చైనాలో ఒక బిడ్డకే ప్రాధాన్యమిస్తున్నారు. వారు పెళ్లి చేసుకుని వెళ్లిపోతే పెద్దలు ఒంటరి అవుతున్నారు.
- చాలా మందికి బాగా డబ్బులొస్తున్నాయి. అందుకే పెళ్లిళ్లు చేసుకోవడం లేదు. ఒకవేళ పెళ్లి చేసుకుంటే పిల్లలు వద్దనుకుంటున్నారు. కొన్ని దేశాల్లో చూస్తే 30 నుంచి 40శాతం మంది పెళ్లి జోలికి వెళ్లడం లేదు. పెళ్లి చేసుకోకుంటేనే ఆనందమని చెబుతున్నారు. మీరూ పెళ్లి చేసుకోవద్దని ప్రచారం చేస్తున్నారు.

అమ్మాయి, అబ్బాయిలకు ఐటీ ఉద్యోగాలొచ్చాయి. సంపద పెరిగింది. వాళ్లేమంటున్నారంటే డబుల్ ఇన్‌కం.. నో కిడ్స్.. ఎంజాయ్ లైఫ్.. ఇదెక్కడి విచిత్రమో నాకు అర్థం కావట్లేదు. మీ తల్లిదండ్రులు అదే అనుకుంటే మీరొచ్చేవాళ్లు కాదు కదా? కొంతమంది పిల్లలు కండీషన్లు పెడుతున్నారు. పిల్లలు కావాలంటే నాకు పెళ్లి వద్దంటున్నారు. ఇదో రకమైన వ్యవహారం.

మాట్లాడాలన్నా మనుషులుండరు

ఎక్కువమంది పిల్లలను కనండి. లేదంటే లేనిపోని సమస్యలు వస్తాయి. జనాభా తగ్గిపోతుంది. వృద్ధులు ఎక్కువ అవుతున్నారు. మందులు కావాలన్నా, ఇంట్లో మాట్లాడాలన్నా మనుషులు ఉండరు. చివరకు మనం కూడా జపాన్ మాదిరి రోబోలను తెచ్చుకోవాల్సి వస్తుంది. విలువలతో కూడిన సమాజం, సంతోషం రావాలంటే కుటుంబ వ్యవస్థకు ప్రాధాన్యమివ్వాలి. పెళ్లి చేసుకుని పిల్లలను కనాలి.

గిరిజనులకు 'గిరి చంద్రన్న దీవెన'

(మొదటి పేజీ తరువాయి)

శాఖ ద్వారా కొత్త ఈ పథకాన్ని తీసుకువచ్చేందుకు ఆర్థిక శాఖ ఆమోద ముద్ర వేసినట్లు తెలిసింది.

రంపచోడవరం, పాడేరు, సీతంపేట తదితర ఏజన్సీ ప్రాంతాలతోపాటు మైదాన ప్రాంతాల్లోని గిరిపుత్రులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు స్త్రీ శిశు సంక్షేమ కార్యాచరణ సిద్ధం చేసింది. శ్రీశైలం చెంచు ఐటీడీఏలోనూ ఈ పథకాన్ని అమల్జేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజూ ఇచ్చే పోషకాహారానికి అదంగా ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో 'గిరి గోరుముద్దలు' పేరుతో 5సంవత్సరాల్లోపు పిల్లలకు ప్రతీరోజూ గుడ్డు, 100మిల్లీలీటర్ల పాలు, అన్న అమృత హస్తం పథకం కింద గర్భిణులు, బాలింతలకు ప్రతిరోజు ఒకపూట భోజనాన్ని అందిస్తున్నారు. వీటి ద్వారా 40శాతం మేర పోషకాహారాన్నే అందించినట్లవుతోంది. మిగిలిన 60శాతాన్ని వారే సొంతంగా సమీకరించుకుని తినాల్సిన పరిస్థితి. ఇది అందరికీ సాధ్యపడే విషయం కాదు. దీంతో ఆ 60శాతం పోషకాహారాన్ని కూడా అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పుడు ఇస్తున్న ఆహారానికి అదనంగా నెలకోసారి పౌష్టికాహారాల బుట్టను ఇవ్వాలని నిర్ణయించారు. బాలింతలకైతే అయిదు నెలలవరకు, పిల్లలైతే 5ఏళ్ల వయసు వరకు ఇస్తారు. ఇందులో కందిపప్పు, రాగిపిండి, బెల్లం, నూనె వంటివాటిని ఆయా ప్రాంతాల్లో వినియోగాన్నిబట్టి ఇవ్వాలని ప్రతిపాదించారు. 'గిరి చంద్రన్న దీవెన' పథకం కోసం ఈ బడ్జెట్‌లో అదనంగా రూ.87కోట్లు కేటాయించాలన్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రతిపాదనపై ఆర్థికశాఖ ఆమోదం తెలిపిందంటున్నారు.

బెల్లం చిక్కీలు, ఓ పండు

గిరిపుత్రుల్లాగే.. దళితవాడల్లోనూ లబ్ధిదారులకు అదనపు పోషకాహారాన్నందించేందుకు మరో పథకాన్నీ ఈ శాఖ ప్రతిపాదించగా ఆర్థికశాఖ ప్రాథమికంగా ఆమోదం తెలిపిందంటున్నారు. ఇంకా పేరు ఖరారుకానీ ఈ పథకం కోసం రూ.200కోట్లు కేటాయించాలని ఆ శాఖ ప్రతిపాదించింది. ఎస్సీ కాలనీల్లో 100శాతం మందికి ఈ పథకం కింద పల్లీలు బెల్లంతో తయారు చేసే చిక్కీలు, ఒక పండు అన్న అమృత హస్తం కింద భోజనానికి అదనంగా ఇవ్వాలని నిర్ణయించారు. ఇతర ప్రాంతాల్లో 60శాతం పైగా ఎస్సీలుంటే అక్కడా ఈ పథకాన్ని వర్తింపజేయాలని భావిస్తున్నారు.

అంగన్‌వాడీ భవనాలు

ఎస్సీ, గిరిజన ప్రాంతాల్లో 2,500 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలను ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో భవనాన్ని రూ.11.20లక్షలతో నిర్మించాలని నిర్ణయించారు. ఈ నిధులను ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికల నుంచి సమీకరించుకునేందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్థికశాఖ అనుమతిని కోరింది.

నీరవ్‌మోదీ-పీఎన్‌బీ కుంభకోణంలో నలుగురి అరెస్టు

దిల్లీ: నీరవ్‌మోదీ-పీఎన్‌బీ కుంభకోణానికి సంబంధించి సీబీఐ ఆదివారం నలుగురిని అరెస్టు చేసింది. సీబీఐ అరెస్టు చేసిన వారిలో నీరవ్ మోదీ గ్రూపు సంస్థల ఉద్యోగులిద్దరూ, ఓ ఆడిటరు ఉన్నారు. వారితో పాటూ చోక్సీకి చెందిన గీతాంజలి గ్రూపు సంస్థల డైరక్టరు ఒకరున్నట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు.

నీరవ్ మోదీ సంస్థల అధికారి మనీష్.కె. బొసామియా, ఆర్థిక వ్యవహారాల మేనేజరు మితేన్ అనిల్ పాండ్యలు అరెస్టయిన వారిలో ఉన్నారు. ఛార్టర్డ్ అకౌంటెంట్ సంజయ్ రాంభియా, మెహుల్ చోక్సీ వజ్రాల సంస్థ డైరక్టరైన అనియత్ శివరామన్ నాయర్‌లను కూడా సీబీఐ అరెస్టు చేసింది.

ఫ్లోరైడ్ పాపం

(మొదటి పేజీ తరువాయి)

చేసే తెలిసీ తెలియని వైద్యంతో మూత్రపిండాల వ్యాధులు మరింత ముదురుతున్నాయి.

ప్రమాద స్థాయిలో క్రియాటినైన్

ఎ.కొండూరు మండలంలో ప్రభుత్వం ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా రక్త పరీక్షలను నిర్వహించగా. . క్రియాటినైన్ స్థాయి ఎక్కువగా ఉన్నట్లు తేలింది. క్రియాటినైన్ మనిషి శరీరంలోని మూత్రపిండాల సామర్థ్యాన్ని సూచిస్తుంది. మూత్రపిండాలు సరిగా పనిచేయనివారిలో దీని మోతాదు ఎక్కువగా ఉంటుంది. శుక్రవారం వరకు 269 మంది నుంచి రక్త నమూనాలు సేకరించగా సుమారు 160 ఫలితాలు వచ్చాయి. 76 మంది(47.5%)లో క్రియాటినైన్ 2 ఎంజీకిపైగా నమోదైనట్లు తేలడంపట్ల వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వీరిలో 12 మంది చక్కెర వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు తెలిపారు. శనివారం నాటికి 282 మందికి పరీక్షలు నిర్వహిస్తే 86 మందిలో 2 ఎంజీకిపైన క్రియాటినైన్ ఉంది. 164 మందిలో 1.5 ఎంజీ ఉన్నట్లు గుర్తించారు. 12 మందికి 1.6 ఎంజీ, 10 మందిలో 1.7 ఎంజీ, ఆరుగురి నమూనాల్లో 1.8 ఎంజీ, నలుగురి నమూనాల్లో 1.9 క్రియాటినైన్ ఉన్నట్లుగా తేలింది. ఈ 86 మందిలో 17 మంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. మిగిలిన వారిలో 59 మంది ఒకట్రెండు సంవత్సరాల నుంచి పరీక్షలు చేయించుకొని మందులు వాడుతున్నారు. మిగిలిన 10 మాత్రం తాజాగా గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో కొత్తగా నమోదు అయ్యారు.

ఎ.కొండూరు మండలంలో 50వేల మంది జనాభా ఉంది. 16 గ్రామాలు, 4 శివారు గ్రామాలు, 12 గిరిజన తండాలు ఉండగా ఒకే ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, 11 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉండాలి. కానీ ఒక వైద్యురాలే ఉన్నారు. ఇటీవలే మరో వైద్యురాలిని తాత్కాలిక పద్ధతిలో కేటాయించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటలు పనిచేస్తున్నట్లు గుర్తించినప్పటికీ దానికి తగినట్లు నియామకాలు, సదుపాయాలు సమకూరలేదు.

40 మంది ఆర్‌ఎంపీలు.. కూలీ చేసుకునే వీరు నిత్యం శరీరంలో ఏదో ఒక భాగంలో నొప్పితో బాధపడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేక.. . ప్రభుత్వ ఆస్పత్రులపై విశ్వసనీయత లేక ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. కనీస అర్హతలేని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేసిన అనుభవంతోనే వీరు వైద్యం చేస్తున్నారు. ఒక మండలంలోనే సుమారు 40 మంది వరకు ఆర్‌ఎంపీలు ఉన్నారు. ఉదయాన్నే వీరంతా ద్విచక్రవాహనాలపై గ్రామాలకు చేరుకొని కూలీ పనులకు వెళ్లే వారిని కలుసుకుంటున్నారు. చిన్న అనారోగ్యం గురించి చెప్పినా..వెంటనే సంచుల్లో సిద్ధంగా ఉండే మాత్రలు, ఇంజెక్షన్లను వేస్తున్నారు. ఫీజు, మందుల డబ్బులను ఖాతా పుస్తకంలో రాసుకొని తరువాత వసూలు చేసుకుంటున్నారు. బకాయిలు పెరిగిపోగానే అప్పు ఉన్నట్లు 'నోటులు' రాయించుకునే వారు కూడా ఉన్నారని స్థానికులు తెలిపారు. దీంతో పలువురు ఆర్‌ఎంపీలు ఆర్థికంగా బాగా నిలదొక్కున్నట్లు తెలిసింది. వీరి వద్దకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అవసరమంటూ ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి 20% కమీషన్ పొందుతున్నారు. ఆర్‌ఎంపీల మధ్య పోటీ ఎక్కువగా ఉండటంతో త్వరితగతిన ప్రభావం చూపే మందులను ఇస్తున్నారు. వీటికి అలవాటు పడిన వారు నొప్పుల నుంచి వెంటనే ఉపశమనం లభించే మాత్రలు, సూది మందుల ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని ఇద్దరు ఆర్‌ఎంపీలు 'ఈనాడు' ప్రతినిధితో పేర్కొన్నారు. ఫ్లోరైడ్ సంబంధిత నొప్పులతో బాధపడుతున్న వారికి అవసరానికి మించి మందులు, ఇంజెక్షన్లను వాడుతుండడంవల్ల క్రమంగా మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. ఇంటర్‌లో బైపీసీ చదివి.. చదువు మానేసివారు కూడా ద్విచక్రవాహనంపై వైద్యుల చిహ్నంతో తిరుగుతున్నారు. అర్హులైన వైద్యులను సంప్రదించాలని రోగులకు చెబుతున్నా... ప్రభుత్వ ఆస్పత్రులకు రావాలని కోరుతున్నా పట్టించుకోవడంలేదని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు అనుషా ఆవేదన వ్యక్తంచేశారు.

కుటీర పరిశ్రమగా నాటుసారా తయారీ

గిరిజన తండాల్లో నాటుసారా తయారీ కుటీర పరిశ్రమగా సాగుతోంది. నల్లబెల్లం, కుళ్లిన అరటి పళ్లు, ఆకులు, అమ్మోనియా, యూరియా, బ్యాటరీలనుంచి వచ్చే నల్లని పదార్థాలు, పలురకాల రసాయనాలు వాడుతూ నాటుసారాను తయారు చేస్తారు. ఇవన్నీ ప్రమాదకర రసాయనాల మిశ్రమాలు కావడంతో ఇవి తాగిన వారి ఆరోగ్యంపై కొద్దికాలంలోనే తీవ్ర దుష్ప్రభావాలను చూపుతున్నాయి. వీటి వల్ల కిడ్నీ సమస్యలు వస్తాయని ఆరోగ్యశాఖ అధికారులు అంటున్నారు.

కశ్మీరులో తీవ్రవాదుల దాడి
నలుగురి మృతి

శ్రీనగర్: షోపియాన్ జిల్లాలో తీవ్రవాదులు ఆదివారం రాత్రి భద్రతా సిబ్బందిపై కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు మృతి చెందారు. ఇందులో ఓ తీవ్రవాది కూడా ఉన్నారు. రాత్రి షోపియన్ ప్రాంతంలో తిరుగుతున్న సైనికుల సంచార వాహనంపై తీవ్రవాదులు బాంబులతో దాడి చేసినట్లు తెలిపారు. భారత సైన్యం ఇందుకు దీటుగా సమాధానం చెప్పినట్లు ప్రతినిధులు తెలిపారు. ఇక, పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి ఉన్న గ్రామాలపై పాకిస్తానీ దళాలు సుమారు రెండుగంటల పాటు భారీ కాల్పులు జరిపాయి. శనివారం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత ఈ ఘటన జరిగినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ప్రాణనష్టం ఏమైనా జరిగిందా అనే సంగతి వెంటనే తెలియరాలేదు.

అవినీతి శతకం!

(మొదటి పేజీ తరువాయి)


ఉదయనాగరాజునూ అధికారులు విచారించారు.

తుపాకీ, కత్తి బెదిరింపులకేనా..?

అనిశా సోదాల్లో అనకాపల్లిలోని ఎన్జీవో కాలనీలో సంజీవ్‌కుమార్‌కు చెందిన నివాసంలో డమ్మీ తుపాకీతోపాటు మరో బటన్ కత్తిని స్వాధీనం చేసుకున్నారు. భూముల క్రయవిక్రయాలు, సెటిల్మెంట్ల సమయంలో అవతలి పార్టీని బెదిరించడానికి వీటిని ఉంచుకున్నారా? అన్న కోణంలో ఆరా తీస్తున్నారు. ఆ తుపాకీ మీట నొక్కితే అగ్గిరవ్వలు వస్తున్నాయి.

- విజయనగరం జిల్లా గణుగుబూడిలో సంజీవ్ కుమార్ ఏకంగా 200 ఎకరాల కొనుగోలుకు అడ్వాన్సు ఇవ్వడంతోపాటు సంజీవ వనం పేరుతో అభివృద్ధి చేస్తున్నట్లు తేలింది. చాలా భూములకు ఇదేలా అడ్వాన్సులు ఇచ్చినట్లు, మరికొన్ని కొనుగోలు చేసి అభివృద్ధి చేసి వేరొకరికి అమ్మినట్లు వెల్లడైంది. సంతకాలతో కూడిన రూ.లక్షల విలువైన ఖాళీ చెక్కులనూ గుర్తించారు. వీఆర్వో సంజీవ్‌కుమార్, అతని కుటుంబీకులకు ఐదు బ్యాంకుల్లో ఖాతాలున్నాయి. మూడింటిలో నిల్వలపై సోమవారం స్పష్టత రానుంది.







వీఆర్వో సంజీవ్‌కుమార్ ఇంట్లో స్వాధీనం చేసుకున్న తుపాకీ, బటన్ కత్తి
సంజీవ్‌కుమార్ బినామీ వెంకట సుబ్రహ్మణ్యం మల్లికార్జునరావును విచారిస్తున్న అనిశా అధికారి

చైన్‌మన్ ఖాతాలో మరో రూ.10 కోట్లు

జీవీఎంసీ జోన్-3 చైన్‌మన్ మునికోటి నాగేశ్వరరావు అవినీతిపై అధికారులు మరింత లోతుగా ఆరా తీయగా.. విశాఖలోని వెంకోజీపాలెంలో రూ.10 కోట్ల విలువైన 339 గజాల స్థలం ఉన్నట్లు తేలింది. దీనిపై న్యాయపరమైన చిక్కులున్నట్లు గుర్తించారు. నాగేశ్వరరావు బావమరిది గతంలో రౌడీషీటర్‌గా పోలీసు రికార్డుల్లో ఉన్నాడు. అతడికి ఎలాంటి ఉద్యోగం లేకున్నా అతడి పేరుతో రూ.85 లక్షల విలువైన ఆస్తులున్నట్లు గుర్తించామని అనిశా అధికారులు తెలిపారు.

ఇద్దరికి ఈ నెల 16 వరకు రిమాండ్

చైన్‌మన్ నాగేశ్వరరావు, వీఆర్వో పోలిశెట్టి వెంకటేశ్వరరావును అధికారులు అనిశా న్యాయస్థానంలో హాజరుపరిచారు. వీరికి ఈనెల 16 వరకు రిమాండ్ విధించారు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీఆర్వో సంజీవ్‌కుమార్ కోలుకున్నాక విచారిస్తారు.

తృతీయ కూటమి రావాలి: పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: ప్రజల్ని ఏ మాత్రం లక్ష్యపెట్టని విధివిధానాలను మార్చేలా కొత్త ఆలోచన విధానం రావాలంటే తృతీయ కూటమి ఉండి తీరాలని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు. దీనికి అంకురార్పణ చేయాలనుకున్న కేసీఆర్ ఆలోచనను సాటి తెలుగువాడిగా స్వాగతిస్తున్నానని, మనస్ఫూర్తిగా మద్దతిస్తున్నానని పేర్కొన్నారు. తృతీయ కూటమిని ముందుకు తీసుకెళ్లే సమర్థత ఆయనకుందని బలంగా నమ్ముతున్నానన్నారు. 2019లో ప్రాంతీయ పార్టీలు లేకుండా దేశ రాజకీయాలు, అభివృద్ధి జరగదని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన వీడియో సందేశం ద్వారా విలేకరులతో మాట్లాడారు.

"దశాబ్దంన్నర పాటు సుదీర్ఘమైన పోరాటాన్ని, బలమైన ఉద్యమాన్ని, ఏ మాత్రం ఒడిదుడుకులు లేకుండా నిబద్ధతతో తీసుకెళ్లిన నాయకుడు కేసీఆర్. దేశవ్యాప్తంగా ఆయనకు విస్తృత పరిచయాలున్నాయి. దేశ, స్థానిక సమస్యల పట్ల లోతైన అవగాహన ఉంది. హింసకు దారి తీసే పరిస్థితుల్లోనూ ఒక్క రక్తపు చుక్కా కింద పడకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. అలాంటి నాయకుడు ఇప్పుడు తృతీయ కూటమిని ముందుకు తీసుకెళ్తానంటే అది సత్ఫలితాలు ఇస్తుందని నమ్ముతున్నా. జనసేన తరఫున మద్దతు ప్రకటిస్తున్నా. అన్ని సమస్యల పరిష్కారం కోసం త్రికరణ శుద్ధిగా ముందుకెళితే తృతీయ కూటమి విజయం సాధిస్తుంది. యూపీఏ పదేళ్ల పాలనలో దేశాన్ని అస్తవ్యస్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్డీయే వస్తే సుస్థిరత వస్తుందని ఆశించాం. అది జరగకపోగా.. ఇంకా ఇబ్బందులు అలాగే ఉన్నాయి. ఈ నేపథ్యంలో తృతీయ కూటమిపైన పార్టీలు, ప్రజా సంఘాలు, వ్యక్తులు ఇలా చాలా సమూహాల మధ్య చర్చ జరుగుతోంది. అక్కడెక్కడో మారుమూలన దక్షిణ భారత దేశంలో ఉండే దక్షిణ భారతీయులు వారు. వారికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన అవసరం ఏముంది? ఇవ్వకపోతే ఏమైంది? అక్కడ వస్తే నాలుగైదు ఎంపీ స్థానాలు వస్తాయి. పట్టించుకోవాల్సిన అవసరం ఏముంది? తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక అవి ఎంత? అంటూ ఎక్కడో కూర్చొని మాట్లాడుకోవడం దేశ సమగ్రతను, సుస్థిరతను దెబ్బతీస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో సున్నితమైన సమస్యలను అర్థం చేసుకునే వ్యక్తుల సమూహం దేశానికి అవసరముంది" అని పవన్‌కల్యాణ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయంలో మద్దతు పలికినందున సోమవారం నుంచి జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో తెదేపా, వైకాపాలు తెరాస ఎంపీల సాయం కూడా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వారి మద్దతుతో సమస్యకు పరిష్కారం వెతకాలన్నారు.

సాయం చేసిన పార్టీ ఉనికినే చంపేస్తామంటే ఎలా?

"మూడున్నరేళ్ల కిందట భాజపా అధ్యక్షుడు అమిత్ షా నాతో మాట్లాడుతూ.. భవిష్యత్తు అంతా జాతీయ పార్టీలదేనని.. భాజపాలోకి వచ్చేయమని కోరారు. అదే నా ఉద్దేశమయితే భాజపాలోకే వచ్చేవాణ్ని కదా! ఇంకో పార్టీ పెట్టాల్సిన అవసరం నాకు ఏముంది అని ఆయన్ను అడిగాను? ఏ ఉనికి అయితే ఎన్నికల్లో భాజపాకు, తెదేపాకు సాయం చేసిందో.. ఆ ఉనికినే చంపేస్తామంటే ఎలా? ఆ ఉనికినే కోల్పోమంటే ఎలా? అన్న బాధ కూడా నాకు కలిగింది. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లడానికి కదా మేం పార్టీ పెట్టింది. మా ఆకాంక్షలను పట్టించుకోకపోవడం వల్లే మేం రోడ్ల మీదకు, నేను రాజకీయాల్లోకి రావాల్సిన పరిస్థితి తీసుకొచ్చారు.

ఒకే భావజాలం..ఒకే ఆలోచన విధానం

ప్రత్యేక హోదా ఇస్తారా? ఇవ్వరా? స్పష్టమైన ప్రకటన చేయండి.. అంటూ శనివారం జరిగిన సంయుక్త నిజ నిర్ధరణ కమిటీ కమిటీ సమావేశంలో మేం ప్రకటించాం. సరిగ్గా అదే సమయానికి మరో ప్రెస్‌మీట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తే ఇవ్వండి... ఇవ్వకపోతే ఇవ్వలేమని తెగేసి చెప్పండి. ..అంతే తప్ప గందరగోళం సృష్టించొద్దు. ప్రజలను అయోమయానికి గురిచేయొద్దు' అంటూ కేంద్రాన్ని ఉద్దేశించి మాట్లాడారు. దీని వల్ల తెలుగు వారు ఎక్కడున్నా... ఒకరినొకరు అర్థం చేసుకుంటారు. ఒకరికొకరు అండగా నిలబడతారు అన్న భావన ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ఆంధ్రప్రాంత, తెలుగు ప్రజల తరఫున కేసీఆర్‌కు అభినందనలు, కృతజ్ఞతలు.

కేసీఆర్ మాటలతో కొండంత నైతిక బలం

ప్రత్యేక హోదా కోసం ప్రజలు తీవ్రమైన మనోవేదన అనుభవిస్తున్నారు. అలాంటి సమయంలో మాట్లాడాల్సిన అవసరం లేకపోయినప్పటికీ కేసీఆర్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా గురించి మాట్లాడటం. .సాటి తెలుగు ప్రజల పట్ల ఆయనకున్న ప్రేమాభిమానాలను రుజువు చేసింది. నాతో సహా ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్న వ్యక్తులు, రాజకీయ పార్టీలకు ఇది కొండంత నైతిక బలాన్ని ఇచ్చింది. కేసీఆర్ ప్రత్యేక హోదా కోసం మాట్లాడితే తెలంగాణ హైకోర్టు రావాలని మేం మాట్లాడుతాం. ఆయన విశాఖపట్నం రైల్వేజోన్ గురించి ప్రస్తావిస్తే.. బయ్యారం ఉక్కు గనుల సాధన కోసం వారితో కలిసి పోరాటం చేస్తాం. ఇలా అన్ని విషయాల్లోనూ పరస్పరం సహకరించుకుంటాం. ప్రత్యేక పరిస్థితుల వల్ల విడిపోయామే కానీ మా మధ్య మనస్పర్థలు, గొడవలు లేవు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఇక్కడ సుఖశాంతులు, సామరస్యం ఉండటానికి కేసీఆర్ అనుసరించిన విధివిధానాలు ప్రశంసనీయం. ఆంధ్రప్రాంత ప్రజలు ఇవన్నీ చూస్తున్నారు. జాతీయ పార్టీలు ప్రాంతీయ సమస్యలను, అక్కడి ప్రజల ఆకాంక్షలను పట్టించుకోనప్పుడు, వాటిని నెరవేర్చనప్పుడు కచ్చితంగా ప్రాంతీయ పార్టీలు పుట్టుకొస్తాయి" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

స్నానాల గదిలో జంట అనుమానాస్పద మృతి

హోలీ ఆడిన కాసేపటికే గాజియాబాద్‌లో ఘటన

గాజియాబాద్: ఆనందంగా హోలీ ఆడిన కొన్ని గంటలకే ఓ జంట అనుమానాస్పదంగా మృతిచెందింది. స్నానాల గదిలో నగ్నంగా పడివున్న వీరి మృతదేహాలు పలు సందేహాలకు తావిస్తున్నాయి. శవ పరీక్షలోనూ వీరి మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఉత్తర్ ప్రదేశ్ గాజియాబాద్‌లోని ఇందిరాపురానికి చెందిన నీరజ్ సింఘానియా(37), ఆయన భార్య రుచి (35) శుక్రవారం హోలీఆడారు. దాదాపు ఐదు గంటల సమయంలో వీరు ఇంటిలోకి వెళ్లి లోపలి నుంచి గడియ పెట్టుకున్నారు. ఎంతసేపటికీ బయటకురాకపోవడంతో మిగతా కుటుంబ సభ్యులు తలుపులు బద్దలుకొట్టారు. దీంతో నగ్నంగా పడివున్న వీరి మృతదేహాలు కనిపించాయి. వీరి శరీరంపై విద్యుదాఘాతం తగిలినట్లు కానీ, శ్వాస ఆడక మృతిచెందినట్లు కానీ ఎలాంటి ఆధారాలూ లేవు. ప్రైవేటు సంస్థల్లో నీరజ్, రుచి పనిచేస్తున్నారు. 2010లో వీరు ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. వీరికి ఐదేళ్ల కుమార్తె ఉంది.

గ్రహం అనుగ్రహం
5-3-2018 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
చవితి: తె. 3-03 తదుపరి పంచమి
చిత్త నక్షత్రం: రా. 10-38 తదుపరి స్వాతి
అమృత ఘడియలు: సా. 4-11 నుంచి 5-49 వరకు
వర్జ్యం: ఉ. 6-25 నుంచి 8-02 వరకు
తిరిగి తె. 4-25 నుంచి 6-04 వరకు
దుర్ముహూర్తం: మ. 12-34 నుంచి 1-21 వరకు
తిరిగి మ. 2-55 నుంచి 3-42 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6-20; సూర్యాస్తమయం: సా.6-03

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	38.8	18.9
శ్రీకాకుళం	38.0	21.0
రాజమహేంద్రవరం	38.0	20.0
విశాఖపట్నం	37.4	22.4
హైదరాబాద్	37.3	20.3
సూర్యాపేట	37.0	24.0
గుంటూరు	37.0	19.0
అనంతపురం	36.3	19.2
విజయవాడ	36.2	20.0
ఖమ్మం	36.0	23.0
కడప	36.0	20.0
నరసాపురం	34.5	23.0
ఒంగోలు	34.5	22.3
నెల్లూరు	34.0	21.0
తాడేపల్లిగూడెం	34.0	22.0

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై కార్యాచరణ

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారని ఇంధన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దశలవారీగా లక్ష ఎలక్ట్రిక్ వాహనాలను అద్దెకు తీసుకుని వినియోగించేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించినట్లు పేర్కొంది. 'ప్రభుత్వ శాఖలన్నీ తప్పనిసరిగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించాలి. తర్వాత ప్రైవేటు రంగానికి విస్తరించాలి. సులభతర వ్యాపార నిర్వహణ, ఇంధన పొదుపు, పునరుత్పాదక ఇంధన వనరుల ప్రోత్సాహం, నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాలో ఇప్పటికే అగ్రగామిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంలోనూ అగ్రగామిగా కావాలి. ప్రపంచ రికార్డు సృష్టించాలి' అని చంద్రబాబు చెప్పినట్లు ప్రకటనలో పేర్కొంది. అలాగే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు కోసం రూ.10,250 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ ముందుకువచ్చిందని, లక్ష ఈ-వాహనాల నిర్వహణ కార్యకలాపాలకు ఏడాదికి రూ.2 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుందని ప్రకటనలో వివరించింది.

నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు


ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 9.28 గంటలకు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగించనున్నారు. అనంతరం శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) సమావేశం జరుగుతుంది. 29వ తేదీ వరకూ మొత్తం 18 పని దినాల పాటు సమావేశాలు నిర్వహించాలని ప్రాథమికంగా భావిస్తున్నారు. బీఏసీ సమావేశంలో దీనిపైన తుది నిర్ణయం తీసుకుంటారు. 8వ తేదీన ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఈసారి కూడా సమావేశాలకు హాజరుకాకూడదని వైకాపా ఇప్పటికే నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షం లేకుండానే బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో చర్చించేందుకు గాను మొత్తం 29 అంశాల్ని తెదేపా శాసనసభాపక్షం ఎంపిక చేసింది.

ఆయుర్ గుడ్లు.. ఆహా!

- సహజ రీతిలో కోళ్ల పెంపకం
- ఆయుర్వేద గుణాలతో కూడిన ఆహారం అందజేత
- మార్కెట్లో రెండు రకాల గుడ్లు
- దేశీ గుడ్డు రూ.21.50, ఆయుర్ ప్లస్ గుడ్డు రూ.12.50
- రావులపాలెం యువకుడి వినూత్న ఆలోచన

న్యూస్‌టుడే - రావులపాలెం


ఆయుర్ పేరుతో గుడ్లు


దేశీ గుడ్లు


ఫారంలో గుడ్లు పెట్టిన దేశీ కోడి

ఆయుర్వేద విధానంలో ఆహారాన్ని, శుద్ధిచేసిన నీటిని కోళ్లకు అందిస్తూ, ఔషధ గుణాలతో వినూత్న విధానంలో రుచికరమైన గుడ్లను ఉత్పత్తి చేస్తున్నారు చిన్నం హర్షవర్ధన్‌రెడ్డి. తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం మండలం రావులపాడుకు చెందిన ఈయన అమెరికాలో ఎం.బి.ఎ. పూర్తిచేశారు. తండ్రి చంద్రారెడ్డి అండతో ఈతకోట వద్ద సౌభాగ్య గ్రూపు పేరుతో కోళ్ల వ్యాపారాన్ని ప్రారంభించారు. 1993 నుంచి చంద్రారెడ్డి ఇక్కడ కోళ్ల ఫారాలను నిర్వహిస్తున్నారు. ఆరేళ్లుగా ఆయన కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి విభిన్నంగా కోళ్లను పెంచడంతో పాటు వాటి మేతలో ఎలాంటి రసాయన మందులు వాడకూడదన్న లక్ష్యంతో పరిశోధనలు చేసి విజయం సాధించారు. ఇక్కడి కోళ్ల ఫారంలో ప్రస్తుతం 35వేల కోళ్లను పెంచుతుండగా వాటి నుంచి రోజుకు 25 వేల నుంచి 26 వేల వరకు గుడ్లను ఉత్పత్తి చేస్తున్నారు. వీటిని విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, కర్నూలు, కడప, నెల్లూరు నగరాలతో పాటు హైదరాబాద్, బెంగళూరుకు ఎగుమతి చేస్తున్నారు. భవిష్యత్తులో వాటిని దేశ వ్యాప్తంగా ఎగుమతి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

రసాయన రహితంగా...

పసుపు, వెల్లుల్లి, అల్లం, తులసి, ఉసిరి, మునగ, మొక్కజొన్న, సోయా, పిప్పళ్లపొడి వంటి సుమారు 40 రకాల పదార్థాలతో ఆహారాన్ని తయారుచేసి కోళ్లకు అందిస్తున్నారు. దీనివల్ల ఇక్కడి కోళ్లలో ఎలాంటి రసాయన ప్రభావం కనిపించదని, గుడ్లలోనూ ఆయుర్వేద గుణాలు ఉంటున్నాయని హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. మంచి రుచి కూడా తోడవడంతో ఈ గుడ్లకు గిరాకీ ఉంటోందని వివరించారు. కోళ్లకు శుద్ధిచేసిన తాగునీటిని అందుబాటులో ఉంచుతారు. ఫారంలోనే ఉండిపోకుండా కోళ్లు స్వేచ్ఛగా ఆరుబయట తిరిగేందుకూ ఏర్పాట్లు చేశారు.

ధర ప్రియమే..

ఆయుర్వేద పద్ధతుల్లో కోళ్లకు మేత పెట్టి గుడ్లను ఉత్పత్తి చేస్తున్నందున వాటి ధర కూడా ఎక్కువగానే ఉంటోందని హర్షవర్ధన్ చెప్పారు. ఇక్కడ దేశీ, ఆయుర్ ప్లస్ అనే రెండు రకాల కోళ్లను పెంచుతున్నామని, దేశీ గుడ్డు రూ.21.50, ఆయుర్ ప్లస్ గుడ్డు రూ.12.50 వంతున విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కోళ్ల మాంసం కిలో రూ.480 వంతున ప్రస్తుతం హైదరాబాద్‌లో మాత్రమే విక్రయిస్తున్నట్లు తెలిపారు.

టెట్ కీ విడుదల

ముసునూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష 'కీ'ని https://aptet.apcfss.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. గత నెల 21 నుంచి మార్చి 3వ తేదీ వరకు ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, భాషా పండిత విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. ఆయా తేదీలు, ఉదయం, మధ్యాహ్నం విభాగాల వారీగా ప్రశ్నపత్రాల జవాబులను ఆన్‌లైన్‌లో పెట్టారు. అభ్యర్థులకు సందేహం ఉన్న ప్రశ్నలు, సమాధానాలపై అభ్యంతరాలు తెలియజేడానికి అవకాశం ఇచ్చారు. అభ్యర్థుల హాల్‌టికెట్, పరీక్ష వివరం నమోదు చేసి, ఆయా ప్రశ్నపత్రాల్లో సందేహంగా ఉన్న ప్రశ్నలను నమోదు చేసే వెసులుబాటును విద్యాశాఖ కల్పించింది.


రక్తదానం చేస్తున్న యువకులు

వివాహ వేడుక.. రక్తదాన వేదిక

శ్రీకాకుళం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం అన్నంపేట గ్రామానికి చెందిన కానిస్టేబుల్ పరిడాల రమేష్, అశ్వనిలు వినూత్నంగా పెళ్లి వేడుక నిర్వహించుకున్నారు. వరుడితో పాటు 23 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పెళ్లికి హాజరైన ప్రతి ఒక్కరికి కడియం నుంచి తెప్పించిన గులాబీ మొక్కలను పంపిణీ చేశారు. అంధులకు ప్రోత్సాహంగా వారితో ఆర్కెస్ట్రా ఏర్పాటుచేయించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర గవర్నర్, రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహన్ నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

దళితులపై దాడుల బాధ్యులను అరెస్ట్ చేయాలి

- దళిత ఆత్మగౌరవ సభలో మధు

ఈనాడు డిజిటల్, గుంటూరు: పెదగొట్టిపాడులో దళితులపై దాడులు చేసిన ప్రధాన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. పెదగొట్టిపాడు దళిత బాధితుల సంఘీభావ కమిటీ కన్వీనర్ శాంతకుమార్ ఆధ్వర్యంలో దళిత ఆత్మగౌరవ సభ ఆదివారం గుంటూరులో జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. దాడి చేసిన వారిని ప్రభుత్వం రక్షిస్తోందని విమర్శించారు. పది రోజుల్లో బాధ్యుల్ని అరెస్ట్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో చలో రాజమండ్రికి పిలుపునిచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను ఉద్ధృతం చేస్తామన్నారు. తెదేపా ప్రభుత్వం దళిత తేజం పేరుతో కొంతమందికి కార్లను ఇచ్చి దళితులందర్నీ బాగుచేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. వివిధ దళిత, ప్రజా సంఘాల జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొని దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ముక్తకంఠంతో నినదించారు.


సభలో ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు

ప్రమాదకర స్థాయిలో రొమ్ము క్యాన్సర్!

- ఏటా 250 మంది మృత్యువాత
- ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సీఈవో రవిశంకర్ అయ్యన్నార్


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రవిశంకర్ అయ్యన్నార్

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: రొమ్ము క్యాన్సర్ బారినపడి ఏటా 250 మంది మహిళలు మృత్యువాత పడుతున్నారని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సీఈవో రవిశంకర్ అయ్యన్నార్ ఆవేదన వ్యక్తం చేశారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ఆధ్వర్యంలో గుంటూరు వైద్య కళాశాల(జీఎంసీ) సమావేశ మందిరంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ అయ్యన్నార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గత మూడేళ్లలో 20,933 మంది తమ ట్రస్టు ద్వారా చికిత్స పొందారని వివరించారు. వీరందరికీ వైద్య ఖర్చుల కోసం వివిధ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.41.734 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడంతో వ్యాధి ముదిరిపోయాక వైద్యుల్ని సంప్రదిస్తున్నారన్నారు. ప్రతి మహిళకు దీనిపై అవగాహన కల్పించేలా గ్రామీణ ప్రాంతాల్లోనూ సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు ప్రయివేటు వైద్యులూ ముందుకు రావాలన్నారు. వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే వీలుంటుందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జీఎంసీ ఉప ప్రధాన ఆచార్యులు ఫణికుమార్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య మండలి పరిశీలకులు సతీష్‌కుమార్, సర్జికల్ ఆంకాలజిస్ట్ మోహనవంశీ తదితరులు పాల్గొన్నారు.


కాలి బూడిద అయిన దుకాణాలు

తిరుపతమ్మ ఆలయం వద్ద అగ్నిప్రమాదం

50 దుకాణాలు దగ్ధం ● రూ.లక్షల్లో ఆస్తి నష్టం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలు గ్రామంలోని తిరుపతమ్మ అమ్మవారి దేవాలయం వద్ద ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో 50 దుకాణాలు దగ్ధమయ్యాయి. మధ్యాహ్నం దుకాణంలో ఓ మహిళ పొంగళ్లు చేస్తుండగా గ్యాస్ పొయ్యి మంట పక్కనే ఉన్న తాటాకుకు అంటుకుని మంటలు చెలరేగాయని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. వ్యాపారులు, భక్తులు అప్రమత్తం అయ్యేలోగా మిగిలిన దుకాణాలకు మంటలు వ్యాపించాయి. దీంతో వస్తువులను మొత్తం అక్కడే వదిలేసి వారంతా సమీపంలోని మునేటిలోకి పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. అప్పటి వరకు అక్కడే ఉన్న అగ్నిమాపక శకటం ప్రమాదానికి అరగంట ముందే జగ్గయ్యపేట వెళ్లడంతో ప్రమాదాన్ని అదుపులోకి తేలేకపోయారు. దీంతో మొత్తం 50 దుకాణాలు కాలి బూడిదగా మారాయి. శుక్రవారం నుంచి తిరుపతమ్మ అమ్మవారి చిన్నతిరునాళ్లు జరుగుతుండటంతో దుకాణాల్లో సరకు పెద్దఎత్తున దిగుమతి చేసుకున్నారు. ఒక్కో దుకాణంలో రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు సామగ్రి దగ్ధమైందని బాధితులు వాపోతున్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య, సంయుక్త కలెక్టర్-2 పి.బాబూరావు, మాజీ విప్ సామినేని ఉదయభాను బాధితులను ఓదార్చారు.

చిత్తూరులో దుస్తుల పరిశ్రమ ఏర్పాటుపై ఒప్పందం

ఈనాడు డిజిటల్, అమరావతి: చిత్తూరు జిల్లాలో జౌళి, దుస్తుల పరిశ్రమ ఏర్పాటుకు ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ అరవింద్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి సంస్థ(ఏపీఈడీబీ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు అరవింద్ సంస్థ ఎండీ సంజయ్‌లాల్ భాయ్, ఏపీఈడీబీ సీఈవో జె.కృష్ణకిషోర్ ఆదివారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పందంపై సంతకం చేశారు. సుమారు 125 ఎకరాల్లో దశలవారీగా నెలకొల్పనున్న ఈ ప్రాజెక్టుకు ప్రాథమికంగా రూ.250కోట్ల నుంచి రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. పది వేల మందికి ఉపాధి లభించనుంది. ఏడాదికి 2.4 కోట్ల జీన్స్‌ప్యాంటులు, చొక్కాల తయారీ సామర్థ్యంతో నిర్మించనున్నారు.

విశాఖ మన్యం బంద్ ప్రశాంతం

అరకులోయ, న్యూస్‌టుడే: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలని, బోయ వాల్మీకులను, మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చవద్దనే డిమాండ్లతో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన విశాఖ మన్యం బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్ కారణంగా అరకులోయలో గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానం మూతపడ్డాయి. వారాంతం కావడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి అరకు విహారానికి వచ్చిన పర్యటకులు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. గిరిజన సంఘం నాయకులు, కార్యకర్తలు అరకు, పాడేరు ప్రాంతాల్లో దుకాణాలను మూసివేయించారు. ఆర్టీసీ బస్టాండు నుంచి బస్సులు బయటకు రాకుండా బైఠాయించారు. పలు ప్రాంతాల్లో సాయుధ బలగాలు మోహరించాయి.

ఈనాడు

అణ్వస్త్రాలకు కొత్త కోరలు!

ఏ దేశ అస్తిత్వ, స్థిర సార్వభౌమత్వ ప్రకటనకైనా అణ్వాయుధాలేనా ఆధారభూతం? రాశి, వాసిపరంగా అణ్వస్త్రాల గుట్టల్ని పెచ్చులువిడిగా పేర్చుకొంటూ పోయే పెడ ధోరణుల్లోనే పొంచి ఉంది సర్వనాశనం! యావత్ ప్రపంచాన్ని కొన్ని వేల సార్లు భస్మీపటలం చెయ్యగల స్థాయిలో అణ్వాయుధాల్ని సిద్ధం చేసి పెట్టుకొన్న అమెరికా, రష్యాలు- అత్యాధునిక సాంకేతికతతో వాటిని శత్రు దుర్భేద్యం చేసే ప్రయోగాల్లో ఏళ్లతరబడి మునిగి తేలుతున్నాయి. అమెరికా రూపొందించిన క్షిపణి విధ్వంసక రక్షణ చక్రానికి ఏమాత్రం చిక్కకుండా, లక్ష్యాన్ని సూటిగా ఛేదించగలిగే తిరుగులేని మారణాస్త్రాల్ని తయారు చేసినట్లు తాజాగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ జాతిని ఉద్దేశిస్తూ చేసిన ప్రసంగంలో వెల్లడించడం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. 'రష్యాను నిలువరించడానికి వాళ్లు (అమెరికా, నాటో దేశాలు) చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. ఇంతకాలం మాస్కోను లెక్కచేయనివాళ్లు ఇకమీదట ఒళ్లు దగ్గర పెట్టుకొని అది చెప్పేది వినాల్సి ఉంటుంది' అన్న పుతిన్ వ్యాఖ్యల్లో కొత్త వాస్తవాల్ని గుర్తెరిగి ప్రవర్తించాలన్న హెచ్చరిక ధ్వనిస్తోంది. అణుశక్తి ఆధారిత చిన్న ఇంజిన్లతో ప్రయోగించగల అణు క్షిపణుల వంటివి పుతిన్ ఘనంగా చాటిన అణ్వస్త్ర అద్భుతాల్లో కొలువుదీరాయి. అణు శక్తితో దూసుకుపోయే అణ్వస్త్ర క్షిపణి వంటిది ప్రపంచంలో ఇంకెక్కడా లేదని, మున్ముందు దాన్ని వేరేవాళ్లు అభివృద్ధి చేసినా, అప్పటికి తాము మరో కొత్త ఆవిష్కరణతో సిద్ధమవుతామన్న పుతిన్ ప్రకటన- అక్షరాలా మరో అణ్వాయుధ పోటీకి తెరతీస్తోంది. సైనికంగా రష్యా బలపడటం ప్రపంచశాంతికి భరోసా ఇస్తుందని పుతిన్ స్పష్టీకరిస్తున్నా- క్రమంగా ప్రపంచ యవనికపై ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం కమ్ముకొస్తున్న వాస్తవం సరికొత్త భయాలకు ఆవాహన పలుకుతోంది!

రెండో ప్రపంచ యుద్ధం తరవాత అణ్వస్త్ర దాడి ప్రమాదం అత్యంత తీవ్ర స్థాయికి ఇప్పుడే చేరిందని ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ నిరుడు వాపోయారు. అణు నిరాయుధీకరణ ఒప్పందం (ఎన్‌పీటీ), సమగ్ర అణుపరీక్షల నిషేధ ఒప్పందం (సీటీబీటీ) వంటి అంతర్జాతీయ ఒడంబడికల్ని ఇష్టారాజ్యంగా స్వప్రయోజనాలకు వాడుకొని అణుభూతానికి కోరలు తొడగడంలో తిలాపాపం తలా పిడికెడు! 2009 ఏప్రిల్‌లో చెక్ రాజధాని ప్రేగ్‌లో అణ్వస్త్ర వ్యాప్తి నిరోధానికి అమెరికా అధ్యక్షుడిగా ఒబామా త్రిసూత్ర కార్యాచరణ ప్రతిపాదించారు. ఇప్పటికే ఉన్న అణ్వాయుధాల్ని క్రమేణా తగ్గించి పూర్తిగా రూపుమాపాలన్నది అందులో మొట్టమొదటి సూత్రం కాగా- అమెరికా అణు ఆయుధాగారం ఆధునికీకరణకు లక్షకోట్ల డాలర్ల ప్రతిపాదనల్ని ఒబామాయే ఖరారు చేశారు. సరికొత్త వ్యూహాత్మక ఆయుధాల ఒప్పందంపై 2010లో అమెరికా, రష్యా అధ్యక్షులు సంతకాలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 15 వేల అణ్వస్త్రాలు ఉంటే, వాటిలో 90 శాతానికిపైగా అమెరికా రష్యాల చెంతే పోగుపడ్డాయి. 1987నాటి ఇంటర్మీడియట్ న్యూక్లియర్ ఫోర్సెస్ (ఐఎన్ఎఫ్) ఒప్పందం వంటి వాటి ద్వారా అణు సుస్థిరత సాధనకు అమెరికా రష్యాలు ప్రాధాన్యం ఇస్తూ వచ్చాయి. భవిష్యత్తులో ఉగ్రవాద, ధూర్త దేశాల దాడులనుంచి తనను తాను రక్షించుకొనే సామర్థ్య సాధనకు పెద్ద అవరోధంగా మారిందంటూ 1972నాటి యాంటీ-బాలిస్టిక్ క్షిపణి ఒప్పందంనుంచి 2002లో జార్జి బుష్ అమెరికాను తప్పించారు. నిజానికి అసలు ఆయుధ పోటీ అప్పుడే మొదలైందంటున్న పుతిన్, రష్యా దూకుడును నిలువరించలేకపోవడం సాధ్యం కాదని నేడు స్పష్టీకరిస్తున్నారు. దానాదీనా పెను విధ్వంసక పోటీకి ఇక బహిరంగంగానే తెరలేవనుందని చెప్పక తప్పదు!

ఒకనాటి సోవియట్ యూనియన్ అమెరికాల ప్రచ్ఛన్న యుద్ధక్షేత్రంగా అఫ్ఘానిస్థాన్ ఎలా ఛిద్రమైపోయిందో- మారిన కాలమాన పరిస్థితుల్లో నేడు సిరియాదీ అదే పరిస్థితి. ఇరాన్‌తో కుదుర్చుకొన్న అణు ఒప్పందం తనకు సమ్మతం కాదంటూ డొనాల్డ్ ట్రంప్ శివాలెత్తుతున్న నేపథ్యంలో, ఆ ఒడంబడిక అమలు విషయంలో రష్యా- టెహరాన్ వెన్ను కాస్తోంది. ఉదజని బాంబు విస్ఫోటం ధ్వని తాలూకు పులకరింతతో నిరుడు పండగ చేసుకొన్న ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్‌పై అధ్యక్షుడు ట్రంప్ ఒంటికాలి మీద లేస్తున్నా చైనా, పాకిస్థాన్, రష్యాలనుంచి అతగాడికి దన్ను పుష్కలంగా లభిస్తోంది. మాస్కో మిత్రదేశాలపై అణుదాడిని రష్యాపై దాడిగానే పరిగణించి తక్షణం ప్రతిదాడులకు సిద్ధపడతామన్న పుతిన్ హెచ్చరిక- ప్రాంతీయ సంక్షోభాల అగ్గికి ఆజ్యం పోసేదే! తన చుట్టుపక్కల పోలెండ్, రొమేనియా, అలస్కాల్లో క్షిపణి రక్షణ వ్యవస్థల్ని 'నాటో' ఏర్పాటు చేసినా- అవిప్పుడు ఎందుకు కొరగానివిగా మారాయంటున్న రష్యా- అలాంటి వాటిని రేపు దక్షిణ కొరియా, జపాన్లు పెట్టుకొని ఏం లాభమని ప్రశ్నిస్తోంది! తమ అణుపాటవాన్ని నిర్వీర్యం చేసేలా ఉన్న అమెరికా క్షిపణి రక్షణ వ్యవస్థపై లోగడ రష్యా వ్యక్తీకరించిన ఆందోళనల్ని శ్వేతసౌధం పెడచెవిన పెట్టి, అభివృద్ధిని అడ్డుకొనేలా ఆంక్షలు విధించబట్టే సరికొత్త అజేయ మారణాస్త్రాల్ని రూపొందించామని మాస్కో గొప్పగా చాటుతోంది. అమ్ములపొదిలోని కొత్త ఆయుధ శ్రేణిపై రక్షణ రంగ నిపుణుల్లో కొన్ని సందేహాలున్నా, పెంటగాన్ ప్రతిస్పందనను బట్టి భూమాత గుండెలపై అణ్వాయుధ పోటీ కుంపట్ల ప్రజ్వలనం మొదలైపోయింది!

నెల ముందే... నిప్పుల సూరీడు

ఉక్కపోతలో ఉభయ తెలుగు రాష్ట్రాలు


డాక్టర్ జీవీఎల్ విజయ్‌కుమార్

ఎండకాలం ఏప్రిల్‌తో మొదలవుతుందని అనుకుంటే పొరపాటే! అది ఒకప్పటి మాట. మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి. ఇక నడివేసవిలో అవి తారాస్థాయికి చేరుకుంటాయని స్పష్టమవుతోంది. ఏటా ఎండలు తీవ్రమవుతుండటం, వడగాడ్పులు వీచే రోజుల సంఖ్య క్రమేపీ పెరుగుతుండటం వంటివి వాతావరణంలో పెనుమార్పుల్ని సూచిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ హెచ్చరించిన ప్రకారమే, గడచిన ఎండకాలంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిన నమోదయ్యాయి. ఈసారి కూడా సాధారణం కంటే అధికస్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని తాజా నివేదిక వెల్లడించింది. ఉత్తరాదిలోని అనేక ప్రాంతాల్లో మే వరకు విపరీతంగా ఎండలు కాస్తాయని, ఇది 1981 నుంచి 2010 మధ్య సాధారణ సగటు కన్నా అధికమని పేర్కొంది. వాతావరణ విభాగం గత జనవరిలో విడుదల చేసిన నివేదికను బట్టి- ఎండలు అత్యంత తీవ్రతరంగా మారిన నాలుగో సంవత్సరంగా 2017 ఓ రికార్డు సృష్టించింది.



అసాధారణ స్థితిగతులు

భారత వాతావరణ శాఖ గత మార్చి నుంచి మే వరకు (మూడు నెలలు) వాతావరణ పరిస్థితుల తీరుతెన్నులపై ముందస్తు నివేదిక వెలువరించింది. అది విడుదలైన ఫిబ్రవరి 28నే ముంబయిలో నమోదైన ఉష్ణోగ్రత సాధారణం కన్నా 5.5 డిగ్రీలు అధికం. కేరళలోని పలక్కాడ్ మొదలు ముంబయి వరకు పశ్చిమతీరాన ఇదే రీతిలో ఉష్ణోగ్రత పెరిగింది. జమ్ము కశ్మీర్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ-తూర్పు రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రాంతాలు; ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, గుజరాత్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ సగటు ఉష్ణోగ్రత సాధారణం కన్నా అధికంగా ఉండనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. చాలా చోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు సరాసరి కన్నా 2 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు ఎక్కువగా నమోదవుతున్నాయనడానికి ఫిబ్రవరి 28నాటి వివరాలే నిదర్శనం. దక్షిణాదిన తమిళనాడు, కర్ణాటక, అలాగే తెలుగునాట రాయలసీమలోనూ ఈసారి ఎండలు సాధారణం కన్నా అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ చెబుతుండటం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో, తెలంగాణ అంతటా సాధారణ సగటు ఉష్ణోగ్రతల కన్నా ఈసారి అధికంగా నమోదయ్యే అవకాశం ఉందంటున్నారు. ఈసారికి సగటున 20 రోజులకు మించి వడగాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ అంచనా. ఎండకాలం తెలుగు రాష్ట్రాల్లో ముందే మొదలైంది. ప్రస్తుతం తెలంగాణలో గరిష్ఠ పగటి ఉష్ణోగ్రతలు 36 నుంచి 38 డిగ్రీల మధ్య; ఆంధ్రప్రదేశ్‌లో 34 నుంచి 37 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతున్నాయి. మే నెలలో కాచే ఎండల్ని తలచుకుంటేనే ఆందోళన రేగుతోంది. వడగాడ్పుల తీవ్రత ఎక్కువ కావడానికి ప్రధాన కారణాలు అనేకం. వాటిలో- మధ్యధరా, పసిఫిక్ సముద్రాల ఉపరితల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతుండటం ఒకటి. రాజస్థాన్ నుంచి దక్షిణాదికి వీచే వేడిగాలుల ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకించి కోస్తా జిల్లాల్లో, తెలంగాణలో తీవ్రత పెరుగుతుందంటున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతల నడుమ వ్యత్యాసం చాలా ఎక్కువ కావడంతో ఇప్పటికే ఎండలు మండుతున్నాయి. శీతకాలం చివరన, వేసవికి ప్రారంభంలోనే తెలంగాణలోని ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఫిబ్రవరి నెలలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలో గత పదేళ్ల ఫిబ్రవరి నెలలకు సంబంధించి, ఈసారే అధిక తీవ్రతతో ఎండలు నమోదయ్యాయి. వాతావరణంలో తేమశాతం సాధారణం కన్నా 21 శాతం వరకు తక్కువ నమోదవుతోంది. పగటిపూట ఉక్కపోత పెరుగుతోంది. సూర్యకిరణాలు నేరుగా భూమిని తాకుతున్నాయి.

వేసవిలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలు (సెల్సియస్ డిగ్రీల్లో)

తెలంగాణ			ఆంధ్రప్రదేశ్		
సంవత్సరం	తేదీ	ఉష్ణోగ్రత	సంవత్సరం	తేదీ	ఉష్ణోగ్రత
2017	మే 23	47.6	2017	మే 30	47.2
2016	మే 26	46.6	2016	మే 28	45.6
2015	మే 19	46.4	2015	మే 19	47.3

(ఆధారం: భారత వాతావరణ శాఖ నివేదిక)

కర్బన ఉద్గారాల ధాటి

కర్బన పదార్థాలను విపరీతంగా వినియోగించడమే మండే ఎండలకు మూలం. కర్బన ఉద్గారాలకు వ్యతిరేకంగా పోరాడేలా ప్రపంచ దేశాలతో కలిసి ఒక సమగ్ర కార్యాచరణను భారత్ అనుసరించాల్సి ఉంది. ఐక్యరాజ్యసమితికి చెందిన వాతావరణ మార్పుల కమిటీ ఇటీవలి నివేదిక వెల్లడించిన అంచనాలు, ముందస్తు హెచ్చరికలు- దక్షిణాసియాలో ప్రత్యేకించి భారత్‌లో మారుతున్న పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. నిరుడు ఐరాస అంచనా వేసినట్లుగానే ఉత్తర, పశ్చిమ భారత్‌లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దక్షిణ భారతదేశంలోనూ అవి గణనీయమవుతున్నాయి. రాత్రి, పగటి, ఉష్ణోగ్రతల్లోనూ వ్యత్యాసం భారీగా ఉంటోంది. పగటి ఉష్ణోగ్రతల్లో గరిష్ఠంగా అయిదు డిగ్రీల పెరుగుదల ఉంటుందని, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే రాత్రుల సంఖ్య 80 వరకు ఉండవచ్చని ఐరాస కమిటీ నివేదించింది.

ఏటా దేశవ్యాప్తంగా ఎండల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నవారిలో తెలుగు రాష్ట్రాలవారే అత్యధికంగా ఉంటున్నారు. మండుతున్న ఎండల నుంచి ఉపశమనం పొందాలంటే, కర్బన ఉద్గారాల నిర్వహణ విధానాన్ని దేశమంతటా విస్తృతం చేయాలి. దీని ద్వారా ఆయా ఉద్గారాల్ని మోతాదుకు మించి విడుదల చేస్తున్న పరిశ్రమలు, సంస్థలను నియంత్రించడం సాధ్యమవుతుంది. మార్కెట్ ఆధారిత వ్యవస్థ ఇది. ఉద్గారాల విడుదలకు కారణమవుతున్న పరిశ్రమలు- పలు వాయువుల విడుదలను నిర్దేశిత పరిమితి, నిర్దిష్ట కాలవ్యవధిలో నియంత్రించాల్సి ఉంది.

సమగ్ర కార్యాచరణ ద్వారానే, కర్బన వ్యతిరేక పోరాటంలో అగ్రదేశాల సరసన భారత్ నిలవగలుగుతుంది. దేశమంతటా వాతావరణ శాఖ కార్యక్రమాలు విస్తృతం కావాల్సి ఉంది. సూక్ష్మ స్థాయిలో కార్యాచరణ చేపట్టి సమర్థంగా అమలు చేయగలగాలి. ముఖ్యంగా వ్యవసాయ క్షేత్రాల్లో పనులు చేసుకునే రైతులు, కూలీలు ఎండదెబ్బకు గురికాకుండా చూడాలి. వాతావరణ పరిస్థితులను అతిసూక్ష్మ స్థాయిలో విశ్లేషించేందుకు రాడార్ వ్యవస్థను పటిష్ఠపరచాల్సి ఉంది. సమాచార విశ్లేషణ, జీఐఎస్ ఆధారిత సమాచార సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ప్రజల్ని అప్రమత్తం చేయాలి. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో కేంద్రం- మండే ఎండల్ని, వడగాడ్పుల్ని విపత్తుల జాబితాలోకి చేర్చాలి. రాష్ట్రాల విపత్తు నిర్వహణ సంస్థలు, వాతావరణ శాఖ విభాగాలు అత్యంత సమన్వయంతో, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే- మండే ఎండల తీవ్రత నుంచి ప్రజల ప్రాణాల్ని కాపాడటం సాధ్యపడుతుంది!

ఆరోగ్యంపై అవగాహన

వేసవి తీవ్రతను అదుపుచేయడంలో భాగంగా, కర్బన ఉద్గారాల నిర్వహణ విధానాన్ని దేశమంతటా సమర్థంగా అమలు పరచాలి. దీన్ని పర్యవేక్షించడానికి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన నియంత్రణ సంస్థ ఏర్పాటు కావాలి. ఇది రాజకీయ ప్రమేయానికి ఆస్కారం లేకుండా, పారదర్శకంగా పనిచేసేలా చూడాలి. ప్రతిపాదిత నియంత్రణ సంస్థ పలు కర్బన ఉద్గారాల తగ్గింపు దిశగా అందరినీ చైతన్యపరిస్తే పరిస్థితులు కొంతైనా మెరుగవుతాయి. ఆయా ఉద్గారాల్ని తగ్గించుకునే మార్గాలపై విస్తృత ప్రచారం సాగించాలి. సమగ్ర అవగాహన కల్పించాలి. ఉద్గారాల్ని విడుదలచేసే సంస్థలకు ఈ నియంత్రణ సంస్థ ఒక సాంకేతిక సలహాదారుగా వ్యవహరిస్తుందనడంలో సందేహం లేదు. ఆయా రాష్ట్రాల్లో గల పరిశ్రమల్ని ఉద్గారాల విడుదల స్థాయిని బట్టి వర్గీకరించాలి. ప్రభుత్వం వ్యూహాత్మకమైన నిర్ణయాలు తీసుకోవాలి. బొగ్గు రంగంలోని థర్మల్ విద్యుచ్ఛక్తి కేంద్రాలు అత్యధికంగా కర్బన ఉద్గారాలను విడుదల చేసే విభాగంలోకి వస్తాయి. ఇతర పరిశ్రమలు విడుదల చేసే ఉద్గారాల లక్షణాలు, స్వభావాల్ని బట్టి ప్రభుత్వం వ్యవహరించాలి. ఆయా సంస్థల ఆర్థిక పరిస్థితుల్ని గమనించాలి. బాధ్యతల నిర్వహణను ఎక్కడికక్కడ అప్పజెప్పడం ద్వారా, కర్బన ఉద్గారాల స్థాయిని అదుపులో ఉంచవచ్చు. దేశ రాజధాని దిల్లీలో ఆయా ఉద్గారాల విడుదల 30 శాతంపైగా పరిశ్రమలు, వాణిజ్య సంస్థల నుంచే కొనసాగుతోంది. కర్బన ఉద్గారాల్ని తగ్గించడం వల్ల శిలాజ ఇంధనాల్ని సంరక్షించుకున్నట్లవుతుంది.



కాంగ్రెస్ కుటిల నీతి


వీరేంద్ర కపూర్

మనదేశంలో అవినీతిపరులైన రాజకీయ నాయకులు చట్టం చేతికి చిక్కడమే అరుదు. ఒకవేళ ఎప్పుడైనా పట్టుబడితే- తమపై కక్ష సాధిస్తున్నారని, దురుద్దేశంతో తమను అపకీర్తిపాల్జేస్తున్నారని గగ్గోలు పెట్టడం వారికి ఆనవాయితీ. కార్తీ చిదంబరం చేసిన పని అదే! ఏదో ఘనకార్యం చేసినట్లు సగర్వంగా కోర్టు గదిలోకి ప్రవేశించిన ఆయన- తనను పాలకపక్షం అన్యాయంగా కేసులో ఇరికించిందని, త్వరలోనే దీనినుంచి బయటపడతానని చెప్పారు. ప్రభుత్వ నాయకులు తెలివిలేనివారని ఆయన ఉద్దేశం. బోఫోర్స్ కుంభకోణంలో చిక్కిన ఇటాలియన్ నేరగాడు అట్టేవియో ఖత్రోకీ కూడా ఇలానే గావుకేకలు పెట్టాడు. తాను ఇందిరాగాంధీ కుటుంబానికి సన్నిహితుణ్ని కాబట్టి కేసులు బనాయించారనీ ఆరోపించాడు. కానీ, శతఘ్నుల బేరం బోఫోర్స్ సంస్థ చేతికి చిక్కేట్లు చూసిన పాత్రధారి ఖత్రోకీయే! ఈ వ్యవహారంలో అందరికన్నా ఎక్కువ ముడుపులు ముట్టింది కూడా ఆయనకే. ఇందులో పెద్ద మొత్తమే తెర వెనక సూత్రధారులకు ముట్టిఉంటుందనడంలో సందేహం లేదు. దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నారన్న సామెత ఇలాంటివారిని చూసే పుట్టి ఉంటుంది.

అణువణువునా వంచన

పరిస్థితి ఇలా ఉన్నప్పుడు కార్తీ చిదంబరానికి శిక్ష పడుతుందా అని అనుమానించేవారు లేకపోలేదు. 2 జీ కుంభకోణంలో ఏ.రాజా తదితర నిందితుల మీద కట్టుదిట్టమైన కేసు ఉన్నా, ఆయన నిర్దోషిగా ప్రకటితులై నిక్షేపంగా బయటపడ్డారు. దీన్నిబట్టి మన ప్రాసిక్యూషన్, న్యాయవ్యవస్థల సామర్థ్యం, నిష్పాక్షికతల మీద ఎంతవరకు నమ్మకం ఉంచగలమన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అదలా ఉంచి, కార్తీ చిదంబరం నడిపిన 'స్ట్రాటజిక్ ఎడ్వాంటేజ్ కన్సల్టింగ్' సంస్థ ఆయనను, ఆయన తండ్రి- కేంద్ర మాజీ ఆర్థికమంత్రి పళనియప్పన్ చిదంబరాన్నీ పులుసులో పడేసింది. కార్తీ తన తండ్రి మంత్రి పదవిని అడ్డుపెట్టుకుని స్వదేశీ, విదేశీ కరెన్సీలలో బాగా డబ్బు దండుకొన్నారని సీబీఐ దర్యాప్తులో తెలియవచ్చింది. కేంద్ర ఆర్థిక శాఖ నుంచి అనుమతులు సంపాదించడానికి సలహాదారు ముసుగులో కార్తీ- వ్యవస్థను దుర్వినియోగం చేసి బాగా డబ్బు చేసుకున్నారని ఆరోపణ.

ఆర్థిక సంస్కరణల తరవాత భారత్‌లో వ్యాపారం ప్రారంభించదలచిన విదేశీ కంపెనీలు మొదట విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎఫ్ఐపీబీ) అనుమతి సంపాదించాలి. గతంలో దిల్లీలో చిన్నపాటి పైరవీలు చేసుకొంటూ బండి నడిపిన దీపక్ తల్వార్, పలు బహుళజాతి కంపెనీలకు ఎఫ్ఐపీబీ అనుమతులు సంపాదించిపెట్టి కోట్లకు పడగలెత్తారు. ఎఫ్ఐపీబీ అనుమతుల కోసం దరఖాస్తు పెట్టుకునే సంస్థలు తల్వార్‌ను సంప్రదించాల్సి ఉండేది. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ముఖ్య కార్యదర్శి ఏఎన్ వర్మకు తాను చాలా సన్నిహితుడినని తల్వార్ చెబుతుండేవారు. యూపీఏ ప్రభుత్వం వచ్చిన తరవాత మరొక కీలక మంత్రితో చేతులు కలిపి పౌర విమానయాన రంగంలో చక్రం తిప్పారాయన!

భారత్‌లో గతించిన సోషలిస్టు యుగంలో కొందరు మంత్రులు తమ చేతులు తడిపే వ్యవస్థాపకులకు దేశ వనరుల్ని దోచిపెట్టేవారని చెప్పవచ్చు. పీవీ హయాములో వచ్చిన ఆర్థిక సంస్కరణలు అలా సొమ్ము చేసుకునే అవకాశాల్ని విపరీతంగా పెంచేశాయి. వ్యాపారావకాశాల కోసం వచ్చే పెట్టుబడిదారుల మధ్య పోటీ పెంచి, మంత్రులు భారీగా డబ్బు చేసుకోసాగారు. నరసింహారావు హయాములో దీపక్ తల్వార్, యూపీఏ పాలనలో కార్తీ చిదంబరం వంటి వారు ఈ బాగోతానికి ఘరానా దళారులుగా ఉపయోగపడ్డారు.


కేంద్ర మాజీమంత్రి చిదంబరం తనయుడు కార్తీని అరెస్టుచేసిన దృశ్యం

కుంభకోణాల సూత్రధారి కార్తీ

సీనియర్ చిదంబరం మహా తెలివైనవారనడంలో సందేహమే లేదు. ఆయన సంపన్నుల కుటుంబంలో పుట్టి, ఉత్తమ శ్రేణి విద్యను అభ్యసించి, న్యాయవాద వృత్తిలో పేరూ డబ్బూ సంపాదించారు. అయినా పి. చిదంబరం మంత్రి అయిన ప్రతిసారీ ఏదో ఒక వివాదంలో చిక్కుకుపోవడమెందుకో అర్థం కాదు. దీనికి అంతులేని దురాశే కారణమని భావించక తప్పదు. చిదంబరం కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు, ఆయన భార్య నళిని ఒక పన్నుల బోర్డుకు న్యాయవాదిగా వ్యవహరించారు. కోల్‌కతాకు చెందిన ఓ లాటరీ మాయగాడు నళినీ చిదంబరానికి కోటి రూపాయలు ముట్టజెప్పాడు. తీరా అతగాడు అరెస్టయ్యాక, ఆ కోటి రూపాయల్ని ఆదాయ పన్ను రిటర్నులో చూపానని నళిని బుకాయించారు. అసలు అంత మొత్తం తీసుకోవలసిన అవసరమేమొచ్చింది?

కార్తీ చిదంబరం కేసు మీద జరగనున్న రాద్ధాంతంతో, బడ్జెట్ సమావేశాల్లో ద్వితీయార్థం వృథా కానుంది. తనను పూర్తిస్థాయి ప్రతిపక్ష నాయకుడిగా కాకుండా ప్రత్యేక ఆహ్వానితుడిగా మాత్రమే గుర్తించారన్న కుంటిసాకుపై కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గే లోక్‌పాల్ ఎంపిక సంఘాన్ని ఇప్పటికే బహిష్కరించి ఉన్నారు. నిజానికి ఖర్గే పూర్తిస్థాయి ప్రతిపక్ష నాయకుడు కారు. అవినీతిపై పోరుకు కట్టుబడి ఉన్నానని కాంగ్రెస్ చెప్పుకోవడం డొల్ల మాటలు తప్ప మరేమీ కావని ఖర్గే చర్యతో నిరూపితమైంది. లోక్‌పాల్ వ్యవహారం మీదా బడ్జెట్ సమావేశాల్లో వాగ్యుద్ధం చెలరేగనుంది.

ఇప్పటికే పాలక భారతీయ జనతాపార్టీ నినాదమైన 'హిందుత్వ'ను రాహుల్‌గాంధీ కొంతవరకు అందిపుచ్చుకున్నారు. ఇక ఇప్పుడు అవినీతిపై పోరు నినాదాన్నీ తన గళంలో వినిపించాలనుకుంటున్నారు. గత ఎన్నికల్లో భాజపాకు గెలుపు సాధించిపెట్టిన 'హిందుత్వ-అవినీతిపై వ్యతిరేకత' వ్యూహాన్ని ఈసారి తాను సొంతం చేసుకోవాలనుకుంటున్నారు. అవినీతిపై పోరులో కాంగ్రెస్ మాటలను ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. దీర్ఘకాలం నుంచీ అవినీతికి కాంగ్రెస్ పర్యాయపదంగా మారిందనే వాస్తవాన్ని రాహుల్ మరచినట్లుంది. అవినీతి వ్యతిరేకతలో నరేంద్ర మోదీకి రాహుల్ సాటి కాలేరు. మోదీకి అవినీతి మరకే లేదు. ఈ విషయంలో ఆయనను ఎవరూ తప్పుపట్టలేరు.

రాజకీయ మాయ

ఇందిరా గాంధీ కుటుంబానికి గొప్ప ఆదాయ వనరులు లేకపోయినా, తరతరాలుగా అత్యంత విలాసవంతమైన జీవన శైలిని ఎలా గడపగలుగుతున్నారు? ఇతరుల ఖర్చుతో విలాసాలు చేసుకునే పరాన్నభుక్కులా వారు? ఇందిర కుటుంబసభ్యులు తలచినదే తడవుగా, జెట్ విమానాల్లో ప్రపంచంలో ఏమూలకైనా వెళ్లిరాగలరు. ఒక ప్రధానమంత్రికి వచ్చే జీతంతోనే కాదు, ఒక పార్లమెంటు సభ్యుడి జీతభత్యాలతో కూడా ఇంతటి వైభోగం సాధ్యపడదు. మైదానాల్లో, కొండల్లో, గ్రామాల్లో, పట్టణాల్లో గాంధీల మాదిరిగా విలాసవంతమైన భవంతులు సమకూర్చుకోవడం అసలే సాధ్యం కాదు. ఇందిర కుటుంబానికి వారసత్వ ఆస్తి లేదు. అలాగని వృత్తివ్యాపారాల్లో బాగా సంపాదించినవారూ కారు. వారికి తెలిసిందల్లా రాజకీయాలే! అవే వారి వృత్తి. రాజకీయాల్లో నిజాయతీగా ఉంటే ఏమీ సంపాదించలేరని అందరికీ తెలుసు. అలాంటప్పుడు ఇందిర కుటుంబం ఇంత సుసంపన్న జీవితం ఎలా గడపగలుగుతోంది?

భాజపా మీద అవినీతి వ్యతిరేక ఢంకా మోగించే అర్హత రాహుల్‌కు లేదు. అది ఉందని ఒకవేళ ఎవరైనా రాహుల్‌కు చెబితే, అది తప్పుడు సలహా కిందకు వస్తుంది. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణమూ ఆయనకు ఏమాత్రం ఉపయోగపడదు. వ్యవస్థాపరమైన లోపాల వల్లే బ్యాంకు మోసగాళ్లు తప్పించుకోగలిగారు. 2014 మే లో భాజపా నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం పగ్గాలు చేపట్టడానికి చాలాముందే బ్యాంకుల్లో ప్రజాధనం భారీగా కైంకర్యమైంది. రుణ ఎగవేతదారులుగా మారగలవారి పాస్ పోర్టులను ఏకమొత్తంగా స్వాధీనపరచుకోవాలన్నా కోర్టులు అందుకు ఒప్పుకోవు. కాబట్టి అవినీతి వ్యతిరేక వ్యూహంతో భాజపాను దెబ్బతీయడం రాహుల్‌కు సాధ్యం కాదు. అలాగే హిందుత్వ నినాదాన్నీ ఆయన సొంతం చేసుకోలేరు. గుజరాత్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు వచ్చాయంటే అది హార్దిక్ పటేల్, జిగ్నేశ్ మేవానీల చలవే కానీ రాహుల్ ఘనత కాదు. దేశ రాజకీయాల్లో మళ్లీ వెలుగులోకి రావాలంటే కాంగ్రెస్ పార్టీ ఏదైనా కొత్త వ్యూహాన్ని, నినాదాన్ని చేపట్టాల్సి ఉంటుంది.

అంతర్యామి

దైవ బలం

బలం వేరు, శక్తి వేరు. రెండూ కలిసినప్పుడే కార్యసాధన పూర్తవుతుంది.

శివుడికి 'భీమ' అనే పేరు ఉంది. అనంతమైన బలవంతుడు అని ఆ మాటకు అర్థం. పరిమితులు లేని బలం కలిగినవాడే పరమశివుడు. అంతటివాడికీ శివానీ (శక్తి) సహాయం అత్యవసరం. దేవీ భాగవతం, అమ్మవారి శక్తి విశేషాలు దీన్ని స్పష్టీకరిస్తాయి.

శివుడు అంటే- ఒకడుగా కనిపించే రెండు. రెండుగా గోచరించే ఒకడు. రూపరహితుడు, రూపధారి- రెండూ ఆయనే!

శివ, శివానీలు వాగర్థాల మాదిరిగా అభేద్యులు. శక్తి వల్ల ప్రపంచంలోని సృష్టి సమస్తం చలిస్తోంది. శివుడి కారణంగా శుభాలు కలుగుతున్నాయి. మానవాళికి సకల శుభాలూ చేకూరాలి. బలం, శక్తి లభించాలి. అందుకే శివ, శక్త్యారాధన సాగించాలి.

శివుడు సులభసాధ్యుడైనా, మానవచిత్తం ఆయన మీదకు మళ్లడం అంత తేలిక కాదు. మనిషి ఈ ప్రపంచంలోకి ప్రవేశించి ఎదుగుతున్న కొద్దీ, అందరికంటే తానే అధికుణ్ని అనిపించుకోవాలని తెగ ఆరాటపడతాడు. అందులో అంతర్లీనంగా ఎంతో అత్యాశ ఉంటుంది. అందువల్ల ఆశాభంగం అతడి పాలిట అనివార్యమైనదే!

ఆధిక్యం అనేది అత్యాశతో లభించదు. అహంకారంతో అది అసలే వీలు కాదు. అంతో ఇంతో లభించిన ప్రజ్ఞకు మనిషి విర్రవీగితే గర్వ, గౌరవ భంగాలు తప్పవు. ప్రగతి పథం వైపు కదిలే పాదాలు పరనింద, ఆత్మస్తుతి అనే కంటకాల వల్ల అక్కడే ఆగిపోతాయి. 'నేను అధికుణ్ని' అనుకునేవాడు తనకు తాను అపకారం చేసుకుంటాడు. ఏ ఆధిక్యమూ తనది కాదు, అది దైవ కృప. దైవబలమే మానవుడికి ఇంధనం. చిన్న ముల్లు గుచ్చుకుంటేనే విలవిలలాడే అతడి బలం ఏ పాటిది?

దీనికి చక్కటి ఉదాహరణలు కురుక్షేత్ర సంగ్రామ రంగంలో కనిపిస్తాయి. అర్జునుడి మీదకు అశ్వత్థామ నారాయణాస్త్రాన్ని ప్రయోగిస్తాడు. దాని బీభత్సానికి చలించిన పాండవులు శ్రీకృష్ణుణ్ని ప్రార్థిస్తూ 'దేవా! నీవే నారాయణుడివి. ఈ మహాస్త్రం నుంచి మమ్మల్ని రక్షించు' అంటారు. అందుకు జవాబుగా ఆయన 'అందరూ మీ అస్త్రాలు వీడండి. చేతులు జోడించండి. వాహనాలు దిగి, నేలమీద నిలవండి. అప్పుడే అస్త్రం శాంతిస్తుంది' అని తరుణోపాయం సూచిస్తాడు. భీముడు తప్ప అందరూ ఆ సలహా పాటిస్తారు. బలగర్వం వల్ల భీమసేనుడు



మొదట్లో రథం దిగడు. ఆ తరవాత తప్పని సరై కిందకు దిగి చేతులు జోడించడంతో, అస్త్రం శాంతిస్తుంది.

మానవ జీవితంలోనూ ఈ తరహా సంఘటనలు ఎదురవుతుంటాయి. ధన, జన, యౌవన గర్వాలు భ్రమింపజేస్తుంటాయి. 'భగవంతుడి సహాయం లేకుండా ఏదైనా చేయగలను' అనుకుంటాడు మనిషి. వరస వైఫల్యాలు అతణ్ని వెక్కిరించి గుణపాఠాలు నేర్పుతాయి. అహంకారం అనే తెర కరిగి జ్ఞానోదయమవుతుంది.

అర్జునుడు, గరుత్మంతుడు, జయ-విజయులు పరమ భక్తులు. అటువంటివారి అహంకారాన్నే పరమాత్మ అణచివేశాడంటే, అది వారిలోని కాలుష్యాన్ని తొలగించడమే తప్ప మరొకటి కాదు. శ్రీకృష్ణ నిర్యాణం తరవాతగానీ, తన బలపరాక్రమాలన్నీ పరమాత్మ ప్రసాదితాలని అర్జునుడికి అర్థం కాలేదు.

మహా బలవంతుల్ని సైతం మృత్యుదేవత తనవెంట అనాయాసంగా తరలించుకుపోతుంది. దానికన్నా అధికులెవరు? మనుషులు పరిమితకాల జీవులు. ఉదయించడం, ప్రభవించడం, అస్తమించడం వారికి తప్పవు. ఇదే, సూర్యభగవానుడు నిత్యమూ ప్రపంచానికి అందించే మౌన సందేశం. దీన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. అహాన్ని వదిలి, వినయంగా భక్తిపూర్వకంగా దైవానికి అంజలి ఘటించాలి. ఎవరి బలిమి ఎంత ఉన్నా, దైవ బలమే ఎంతో గొప్పది!

– కె. విజయలక్ష్మి

ప్రత్యేక ఉద్యమానికి కలిసి రావాలి

- దిల్లీలో జరగబోయేది ఆఖరి పోరాటం
- పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి పిలుపు
- ఉత్తరాంధ్ర చర్చావేదిక ఆధ్వర్యంలో విశాఖలో భారీ ప్రదర్శన

విశాఖపట్నం - న్యూస్‌టుడే

ప్రత్యేక హోదా సాధన కోసం దిల్లీలో జరగబోయేది ఆఖరి పోరాటమని.. ఈ ఉద్యమానికి అందరూ కలిసి రావాలని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రతిపక్ష నేత జగన్ కూడా ఈ ప్రత్యేక ఉద్యమంలోకి రావాలన్నారు. ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో విశాఖ సాగర తీరంలో 'ఉత్తరాంధ్ర జనఘోష, తెలుగువారి ఆత్మగౌరవ శంఖారావం' పేరిట ఆదివారం రాత్రి కొవ్వొత్తులు, కాగడాలతో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువీరా మాట్లాడుతూ ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీల సాధన కోసం చేసే పోరాటానికి ప్రజలు దీవెనలు అందించాలన్నారు. కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో ఉన్న అన్ని పార్టీలు ప్రత్యేక హోదా ఉద్యమానికి సంఘీభావం తెలుపుతున్నాయన్నారు. ప్రత్యేక రైల్వేజోన్, విశాఖ ఉక్కుకు సొంత గని (క్యాప్టివ్‌మైన్), విశాఖ మెట్రో రైల్, పెట్రో కాంప్లెక్స్, వైజాగ్ కారిడార్, [illegible] పోర్టు తదితర హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. సినీనటుడు శివాజీ మాట్లాడుతూ ప్రజలంతా రోడ్లపైకి వచ్చి ఉద్యమించాలన్నారు. వర్షం వచ్చి వెలసిన రీతిగా ఉద్యమాలు ఉండకూడదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని అయిదు కోట్ల మంది జీవితాల్లో వెలుగు నింపే ఉద్యమమన్నారు. ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్సింగరావు మాట్లాడుతూ ప్రజాగ్రహానికి గురికావద్దని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ, సీపీఐ రాష్ట్ర నాయకులు జె.వి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కాగడాలు పట్టుకొని నిరసన తెలుపుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, కొణతాల రామకృష్ణ, పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి. చిత్రంలో సినీనటుడు శివాజీ తదితరులు

ముఖ్యమంత్రి దిల్లీలో దీక్షకు దిగాలి: ప్రత్యేకహోదా కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీలో దీక్ష చేపట్టాలని మాజీ మంత్రి సి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విశాఖలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు భాగస్వామ్య సదస్సుల పేరిట ప్రజాధనాన్ని, అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెడుతున్నారని ఆరోపించారు. చంద్రబాబు తన నాలుగేళ్ల పాలనపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ప్రత్యేకహోదా వస్తేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు.

తాడోపేడో తేల్చుకుంటాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఈనాడు డిజిటల్, విజయవాడ: ప్రత్యేక హోదా ఇచ్చే విషయంలో దేశ రాజధానిలోనే తాడోపేడో తేల్చుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సోమవారం నుంచి జంతర్‌మంతర్ వద్ద పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విజయవాడలో ఆయన మాట్లాడుతూ... ఏపీ ఆర్థిక లోటును భర్తీ చేసే క్రమంలో 45 నెలలుగా కేంద్రం మోసపూరిత మాటలతో కాలం వెళ్లదీస్తోందన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ముగ్గురు మాజీ ఐఏఎస్ అధికారులతో ఏర్పాటైన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ(జేఎఫ్‌సీ) కేవలం 14 రోజుల్లో లెక్కలు తేల్చిందన్నారు. ఇకనైనా ప్రజలను మభ్యపెట్టే మాటలను కట్టిపెట్టి రాష్ట్రానికి ప్రత్యేక హోదా సహా.. విభజన చట్టంలోని అన్ని హామీలను నెరవేర్చేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. మూడున్నరేళ్లుగా కాలక్షేపం చేసిన భాజపా నేతలు అసెంబ్లీ సమావేశాల్లో కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధుల గురించి ఏకరవు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏమాత్రం చిత్తశుద్ధి, నైతిక విలువలు ఉన్నా తక్షణమే పదవులకు రాజీనామా చేయాలి.. తిరిగి గెలవాలని డిమాండ్ చేశారు. హోదా విషయమై రాష్ట్రంలో పెద్దఎత్తున ఆందోళనలు జరుగుతుంటే రాయలసీమలో సమావేశం పెట్టి ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే పనికి భాజపా పూనుకోవడం దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య, పుట్టా హరినాథరెడ్డి ఉన్నారు.



ప్రకాశం జిల్లా అద్దంకి బహిరంగసభలో ప్రసంగిస్తున్న జగన్

చిత్తశుద్ధితో పోరాటం: జగన్

ఈనాడు డిజిటల్, ఒంగోలు: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధనకు వైకాపా చిత్తశుద్ధితో పోరాడుతుందని ఆ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి అన్నారు. అవినీతి పాలన కారణంగా చంద్రబాబు భయపడి కేంద్రం వద్ద సాగిలపడుతున్నారని ఆరోపించారు. హోదాపై రోజుకో మాట మాట్లాడుతూ ఊసరవెల్లి కంటే అధికంగా రంగులు మారుస్తున్నారని సీఎంనుద్దేశించి విమర్శించారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా అద్దంకిలో ఆదివారం నిర్వహించిన బహిరంగసభలో జగన్ ప్రసంగించారు. సాగర్ కుడికాలువ కింద నాలుగేళ్లుగా మాగాణి వేసుకునే పరిస్థితి లేదన్నారు. ఎడమ కాలువ కింద తెలంగాణలో మాత్రం పంటలు పండిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతి లేదని, లంచాలపై తప్ప నీళ్లపై ఆలోచన లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా జిల్లాలోని కీలకమైన సాగునీటి ప్రాజెక్టు గుండ్లకమ్మను నాలుగేళ్లుగా పూర్తి చేయలేదని ప్రస్తావించారు. 'చంద్రబాబు నోరు తెరిస్తే మోసం, అబద్ధం. దొంగప్రేమ చూపిస్తున్నారు. సాగర్ నీళ్లు రావడం లేదా? అయ్యో తెలిదే..! పింఛను రావడం లేదా? ఆరోగ్యశ్రీ అందడం లేదా? అయ్యో తెలిదే అంటూ డ్రామాలు చేస్తున్నాడు' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కొండచిలువను నమ్మి మనిషి మోసపోయిన కథను చెప్పారు. కొండచిలువ మాదిరిగా చంద్రబాబు కూడా రాష్ట్రప్రజలను పీల్చిపిప్పి చేస్తాడని, వదిలిపెట్టడని వ్యాఖ్యానించారు. హోదాపై ఆఖరి అస్త్రంగా కేంద్రంలో ఉన్న తమ మంత్రుల రాజీనామా అంటేనే సీఎం చిత్తశుద్ధి అర్థమవుతోందని, మార్చి 5నే రాజీనామా చేయాలని సవాలు విసిరారు. చంద్రబాబు భాగస్వామి పవన్ సూచన మేరకు కేంద్రంపై అవిశ్వాసానికి తాము అంగీకరించామని, 21న పెట్టబోయే అవిశ్వాస తీర్మానానికి రాష్ట్రంలోని 25 మంది ఎంపీలు ఏకతాటిపైకి వస్తే ఫలితం ఉంటుందని జగన్ అన్నారు.

దిల్లీలో భిక్షాటన చేసి నిరసన

ఈనాడు, దిల్లీ, మంగళగిరి, న్యూస్‌టుడే: విభజనతో నష్టపోయిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా కేంద్రం ఇచ్చే భిక్ష కాదని, ఆంధ్రుల హక్కు అని ఆంధ్రప్రదేశ్ నాన్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అప్పికట్ల శ్రీహరినాయుడు పేర్కొన్నారు. దిల్లీలో ఆంధ్రప్రదేశ్ భవన్ వద్ద ఆదివారం వారు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ప్రత్యేక హోదా కోసం కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. రాజీనామాలు చేయకపోతే వారి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యస్వామి, రాష్ట్ర నిరుద్యోగుల పోరాట సమితి అధ్యక్షుడు మర్రివేముల శ్రీనివాసులు, ఏటుకూరి గంగాధరరావు, జి.కోటేశ్వరరావు, బసిరెడ్డి, దాసు పాల్గొన్నారు. ఈనెల 5న వైకాపా చేపట్టే ధర్నా, 6న వామపక్షాల ధర్నాకు మద్దతిస్తున్నట్లు శ్రీహరినాయుడు ఫోన్‌లో 'న్యూస్‌టుడే'కు చెప్పారు.



ర్యాలీలో పాల్గొనేందుకు ఆదివారం దిల్లీలోని సఫ్దర్‌జంగ్ రైల్వే స్టేషన్‌కు చేరిన వైకాపా కార్యకర్తలు

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు... భిక్షకాదు

ఈనాడు, దిల్లీ: ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పెట్టే భిక్ష కాదని వైకాపా ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ప్రత్యేక హోదా డిమాండు చేస్తూ సోమవారమిక్కడ నిర్వహించే నిరసన కార్యక్రమంలో పాల్గొనడానికి ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కోన రఘుపతి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాజన్నదొర, కళావతి తదితరులతోపాటు ప్రత్యేక రైలులో సుమారు 800 మంది పార్టీ నేతలు, కార్యకర్తలు ఆదివారం దిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, కళావతి, రాజన్నదొరలు మీడియాతో మాట్లాడారు. ప్రత్యేకహోదా కోసం తొలి నుంచి పోరాటం చేస్తున్న పార్టీ వైకాపా అని అన్నారు. నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడని సీఎం చంద్రబాబు ఇప్పుడు ఎన్నికల నేపథ్యంలో నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. ప్రజా వ్యతిరేకత వస్తోందనే తెదేపా ఆందోళనలు ప్రారంభించిందని విమర్శించారు.

23 మంది ఎమ్మెల్యేలపై వేటు వేయండి

- చింతమనేని స్థానాన్ని ఖాళీ అని ప్రకటించండి
- అప్పుడే అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతాం: వైకాపా

ఈనాడు, అమరావతి: పార్టీ ఫిరాయించిన 23 మంది ఎమ్మెల్యేలపై కాలయాపన చేయకుండా వెంటనే శాసనసభాపతి అనర్హత వేటు వేస్తే.. 5న దిల్లీలో ధర్నా ముగించుకుని 6 నుంచి అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతామని వైకాపా స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని సభాపతిని కలిసి విన్నవించామని వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి, శాసన మండలిలో ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. విజయవాడలో విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. 23 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని.. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు భీమడోలు కోర్టు శిక్ష విధించినందున ఆస్థానాన్ని ఖాళీ అయినట్లు వెంటనే ప్రకటించాలని సభాపతిని కోరామన్నారు. వైఎస్ హయాంలో జరిగిన ఫిరాయింపులపై ప్రశ్నించగా.. ఎవరు చేసినా తప్పు తప్పే.. వారు చేశారు కాబట్టి మేం తప్పు చేస్తామనే సిద్ధాంతం సరికాదన్నారు. కేంద్రంపై అవిశ్వాసం పెట్టె అంశంపై తెలంగాణ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ..జనసేన అధ్యక్షుడు పవన్ చెప్పడం వల్లే జగన్ కేంద్రంపై అవిశ్వాసం పెడదామని నిర్ణయించారన్నారు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ కంటే ఎక్కువగానే అన్ని కోణాల్లో ఆలోచించే అవిశ్వాసంపై నిర్ణయం తీసుకుంటామన్న విషయాన్ని మరచిపోరాదన్నారు. అవిశ్వాసం చీప్ ట్రిక్ అని కేసీఆర్ లాంటి సీనియర్ నాయకుడు మాట్లాడడం అర్థరహితమన్నారు.



సభాపతి కోడెలకు వినతి పత్రం అందజేస్తున్న వైకాపా నేతలు విజయసాయిరెడ్డి, ఉమ్మారెడ్డి

ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయండి: మంత్రి దేవినేని

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 38 నీటి ప్రాజెక్టులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఇంజినీర్లకు ఆదేశించారు. ప్రాజెక్టుల పురోగతిపై ఆదివారం విజయవాడలో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సాంకేతిక నిపుణుల సలహా మండలి సభ్యులు ఎంకే రెహమాన్, బీఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆంజనేయులు మాదిగ

గాంధీనగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా జి.ఆంజనేయులు మాదిగ (ప్రకాశం), రెండు రాష్ట్రాల సలహాదారుగా డాక్టర్ కలివెలేషియా కుమార్(నెల్లూరు), ప్రధాన కార్యదర్శిగా పొలిమెర హరికృష్ణ(పశ్చిమ గోదావరి) ఆదివారం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జి.వరదరాజులు (చిత్తూరు), వర్కింగ్ కమిటీ ఛైర్మన్‌గా పిమిడిపాటి కోటయ్య (గుంటూరు), యువసేన రాష్ట్ర అధ్యక్షుడిగా దాసరి సువర్ణరాజు (విజయవాడ), మహిళా అధ్యక్షురాలిగా శ్రీరామ్ దేవమణి (కృష్ణా జిల్లా), రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా మంద రవికుమార్ (నెల్లూరు), బి.ఇజ్రాయేలు మాదిగ (తూర్పుగోదావరి), ఉపాధ్యక్షులుగా పీజీ గంగయ్య (కడప), కె.ఓబులేసు (అనంతపురం), రాష్ట్ర అధికార ప్రతినిధులుగా దావులూరి దేవకుమార్ (నెల్లూరు), ఎ.సుబ్బారాయుడు (కడప), బూదాల ప్రేమ్‌దాస్ (నెల్లూరు), టి.రాజారావు (ప్రకాశం), బొత్స ఏసు, బెల్లం కొండవెంకయ్య, పి.వెంకటాద్రి, దండు పెంచలయ్య, యు.రమణ తదితరులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ఎన్నిక సంఘం వ్యవస్థాపకుడు ఎం.ఎస్.రాజు, అధ్యక్షుడు జెన్ని రమణయ్యల అధ్యక్షతన గాంధీనగర్‌లోని ఒక హోటల్‌లో జరిగింది. ఎమ్మార్పీఎస్ బలోపేతానికి నూతన సభ్యులు కృషి చేయాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎస్.రాజు పిలుపునిచ్చారు.

2020 నాటికి ప్రతి ఒక్కరికీ సొంతిల్లు

- పురపాలక శాఖ మంత్రి నారాయణ

అనకాపల్లి పట్టణం, నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ 2020 నాటికి సొంతిల్లు అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంలో 2,592 బహుళ అంతస్తుల ఇళ్ల నిర్మాణానికి మంత్రి అయ్యన్నపాత్రుడుతో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనకాపల్లి పట్టణం సమీపంలో నిర్మాణంలో ఉన్న 2,520 గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 6.81 లక్షల ఇళ్లు మంజూరు చేస్తే.. వాటిలో 5 లక్షలు ప్రభుత్వ స్థలాల్లో నిర్మించి ఇచ్చేందుకు పనులు ప్రారంభించామన్నారు. 2018 చివరికల్లా వీటిని పూర్తిచేసి పేదలకు అందిస్తామన్నారు. సెర్వాన్ టెక్నాలజీ, ఆధునిక వసతులతో గృహాలను నిర్మిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 35 పురపాలికల్లో ఈనెల 24న ముఖ్యమంత్రి చేతులమీదుగా పదిహేను వేల గృహప్రవేశాలు చేయించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఆపై ప్రతినెలా పదిహేను వేల నుంచి ఇరవైవేల వరకు గృహ ప్రవేశాలు జరుగుతాయని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి తీరాలని స్పష్టం చేశారు. దీనికోసం సీఎం సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పోరాటం చేస్తున్నామన్నారు. పార్లమెంట్ సమావేశాల్లోగా ప్రత్యేక హోదా అంశంపై కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలిపారు. లేకుంటే తెదేపా ఎంపీల నిరసన కొనసాగుతుందని వెల్లడించారు. హోదాతో వచ్చేవన్నీ ప్రత్యేక ప్యాకేజీలో అమలు చేస్తామని చెప్పి దీనిని విస్మరించారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని మంత్రి పేర్కొన్నారు.



నర్సీపట్నంలో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రులు నారాయణ, అయ్యన్నపాత్రుడు

ఫౌండేషన్ కోర్సుతో విద్యార్థులకు మేలు

ఈనాడు డిజిటల్, విజయవాడ: రాష్ట్రంలోని మున్సిపల్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫౌండేషన్ కోర్సుతో విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతోందని పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. 57 పురపాలక పాఠశాలల్లో ఈ కోర్సు నిర్వహిస్తున్నామని..వచ్చే ఏడాది అన్ని పాఠశాలల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విజయవాడ పట్టణంలోని సి.వి.ఆర్ మున్సిపల్ పాఠశాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో కాసేపు ముచ్చటించి, వారికి దిశానిర్దేశం చేశారు. విజయవాడ పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల్లో చదివే 90 మంది విద్యార్థులను ఒకచోటకు చేర్చి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ పాఠశాలలకు 70వేల బెంచీలను వివిధ సంస్థల నుంచి సమీకరించినట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో మున్సిపల్ పాఠశాలల్లో నోఅడ్మిషన్ బోర్డులు కనిపించేంతగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో విజయవాడ మేయర్ కోనేరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సురభి కళాకారులను ప్రోత్సహించాలి

ప్రభుత్వానికి కళా సంఘం వినతి

తాడేపల్లి, న్యూస్‌టుడే: సురభి నాటక రంగాన్ని నిలబెట్టేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని సురభి కళా సంఘం కోరింది. ఆదివారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో 13 జిల్లాలకు చెందిన సురభి నాటక కళాకారులు సమావేశమయ్యారు. సురభి కళాకారులు అనేక మంది ఎక్కడెక్కడో ఉండిపోయారని వారందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషిచేయాలని సమావేశం నిర్ణయించింది. అనంతరం సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. అధ్యక్షునిగా ఆవేటి నాగేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా అపర్ణ, కార్యదర్శిగా కృష్ణబాబు, సహాయక కార్యదర్శిగా అయ్యంగళం వివేకానంద్, కోశాధికారిగా నాగమణి చెల్లాయమ్మతోపాటు మరో 9 మందితో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు.

సామాజిక మాధ్యమాల్లో 'పది' ప్రీఫైనల్ ప్రశ్నపత్రం

కర్నూలు, న్యూస్‌టుడే: పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షల నిర్వహణ గాడితప్పింది. ప్రశ్నపత్రాలు పరీక్షకు ఒకరోజు ముందుగానే వెలుగు చూస్తున్నట్లు ఆరోపణలు ఉండగా ..సోమవారం జరగాల్సిన గణితం పేపర్-2 ప్రశ్నపత్రం విద్యార్థులకు ముందుగా చేరడం ఇందుకు బలం చేకూర్చింది. 40 మార్కులకు చెందిన ప్రశ్నపత్రం, 10 మార్కులకు చెందిన బిట్‌పేపర్, వాటికి సమాధానాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. పది విద్యార్థులకు ఫిబ్రవరి 24 నుంచి ఈనెల 10 వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిపుణులతో రూపొందించిన ప్రశ్నపత్రాన్ని ఎస్‌సీఈఆర్‌టీ ముద్రించి జిల్లా డీసీబీఈలకు పంపుతుంది. అక్కడి నుంచి మండల ఎమ్మార్సీ కేంద్రాలకు సరఫరా చేస్తారు. పరీక్షరోజు గంట ముందుగా ఎమ్మార్సీ కేంద్రం నుంచి పాఠశాలకు చెందిన సిబ్బందికి ప్రశ్నపత్రాలను ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ప్రశ్నపత్రాలు ఒకరోజు ముందే సామాజిక మాధ్యమాల్లో దర్శనమివ్వడంపై విద్యాశాఖ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధ్యాయుల ఖాళీల వివరాలు సేకరణ

- మార్చి 31వరకు ఉండే సమాచారాన్ని పంపండి

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల ఖాళీల వివరాలను పంపించాలంటూ పాఠశాల విద్యాశాఖ జిల్లా విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే మూడు పర్యాయాలు సేకరించిన విద్యాశాఖ తాజాగా మరోమారు సమాచారం కోరుతూ జిల్లాలకు ఉత్తర్వులు పంపింది. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 31వరకు ఖాళీల వివరాలను పంపించాలంటూ ఆదేశాలు జారీ చేయడంతో ఈ మేరకు వివరాలను సేకరిస్తోంది. జిల్లా విద్యాధికారులు ఖాళీల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లోగాని, ఫోన్ ద్వారాగాని చెప్పాలని ఆదేశించారు. ఇప్పటికే ఉపాధ్యాయ అర్హత పరీక్ష పూర్తయినందున ఉపాధ్యాయ నియామక పరీక్షను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. నియామక పరీక్షను నిర్వహించే బాధ్యతను ఏపీపీఎస్సీకి అప్పగించింది. మార్చి 15నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈలోపే ఖాళీల వివరాలను లెక్క తేల్చి ప్రభుత్వానికి పంపేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

మారనున్న పోస్టుల సంఖ్య..

రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో 9,259 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు భర్తీ చేస్తామని గతేడాది రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. అనంతరం మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు మీడియా సమావేశంలో 12,730 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు ప్రకటించారు. పాఠశాల విద్యాశాఖ అధికారులు పోస్టుల సంఖ్య 14,494గా తేల్చారు. పురపాలిక ఉపాధ్యాయుల ఖాళీలు, కంప్యూటర్ ఉపాధ్యాయుల పోస్టుల భర్తీని పేర్కొనడంతో ఈ సంఖ్య పెరిగిందని అప్పట్లో ప్రకటించారు. మార్చి 31వ తేదీ వరకు ఖాళీలను సేకరిస్తే ఈ జాబితాల్లో మార్పులు జరిగే అవకాశం ఉంది.

రాష్ట్రస్థాయి పోస్టుల పరిస్థితి ఏంటి?

రాష్ట్ర విభజన నేపథ్యంలో కొన్ని పోస్టులు తెలంగాణకు కేటాయించడంతో అక్కడ ఇన్‌ఛార్జిలను నియమిస్తున్నారు. వీటిని సృష్టించాలని విద్యాశాఖ ఓ ప్రతిపాదన పంపింది. కొన్ని పోస్టులను హేతుబద్ధీకరించడం ద్వారా వీటిని ఏర్పాటు చేయాలని కోరింది. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్టీ), పుస్తకాల విభాగం, ఎస్ఎస్‌సీ బోర్డు, సార్వత్రిక విద్యా పీఠం, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల సొసైటీ సంచాలకుల పోస్టులను ఏర్పాటు చేయాలని కోరింది. రాష్ట్రస్థాయి పోస్టులను సృష్టించి, శాశ్వత అధికారులను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సాహిత్యంలో స్వీయచరితలకు ప్రాముఖ్యం అధికం

సాహితీ సదస్సులో ఆచార్య మృణాళిని

ఈనాడు, దిల్లీ: సాహిత్యంలో స్వీయచరిత, జీవిత చరిత్రలకు ప్రాముఖ్యత ఎక్కువని ఆచార్య మృణాళిని తెలిపారు. ఆదివారమిక్కడ ఏపీభవన్‌లో 'తెలుగులో స్వీయచరిత్రలు' అనే అంశంపై సాహితీ వేదిక, దిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. తెలుగు సాహిత్యం, పాశ్చాత్య సాహిత్యంలో జీవిత చరిత్రలు, స్వీయచరిత్రల ఆవిర్భావ వికాసాన్ని వివరించారు. స్వీయ, జీవిత చరిత్రలు ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తాయన్న మృణాళిని తెలుగులో వచ్చిన ప్రముఖుల చరిత్రలను ఈ సందర్భంగా విశ్లేషించారు. వాసిరెడ్డి నవీన్, పింగళి చైతన్య, ఏ. కృష్ణారావు, జీస్ రామ్మోహన్‌రావు, ప్రభల జానకి, ఎంవీ లక్ష్మి, మన్నవ పద్మ, సోమలత, సురేఖ, వెంకటరామయ్య, దాసరి అమరేంద్రలు పలువురి జీవిత చరిత్రలపై ప్రసంగించారు.

తెలంగాణలో మరో ప్రాంతీయ పార్టీ ఏర్పాటైంది. 'తెలంగాణ ప్రజల పార్టీ' పేరుతో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన నూతన పార్టీని స్థాపించారు.

సముద్రపు జీవిని అనుకరించే కృత్రిమ మేధస్సు

వాషింగ్టన్: నత్తలా కనిపించే ఓ సముద్రపు జీవిని అనుకరించే కృత్రిమ మేధస్సును శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. దీనిలో జీవం ఉట్టిపడటం విశేషం. దీనికి "సైబర్ స్లగ్"గా అమెరికాలోని ఇల్లినాయిస్ వర్సిటీ నిపుణులు నామకరణం చేశారు. సముద్రంలోని పురుగులను స్వాహాచేసే జీవి "సీ స్లగ్"లా దీన్ని తయారుచేశారు. ఇతర జీవులు, ఆహారం కనిపించినప్పుడు సీస్లగ్ స్పందించే తీరును అచ్చంగా సైబర్ స్లగ్ అనుకరిస్తోంది. 'మొదట సీ స్లగ్ మెదడులోని అనుసంధానాలను క్షుణ్నంగా పరిశీలించాం. వీటి చర్యలపైనా దృష్టిపెట్టాం. ఈ సమాచారం ఆధారంగా ప్రత్యేక అల్గారిథమ్‌లు రచించాం. వీటి సంకలనమే సైబర్ స్లగ్' అని పరిశోధకులు రానోర్ జిల్లెట్ తెలిపారు.

కన్నతండ్రే కొడుకు పాలిట కాలయముడు

- భార్యను కాపురానికి రప్పించాలని విష ప్రయోగం
- ఖమ్మం జిల్లాలో ఘటన

ఏన్కూరు, న్యూస్‌టుడే: తనకు దూరంగా ఉంటున్న భార్యను బెదిరించేందుకు ఓ భర్త తన కుమారుడిపై విష ప్రయోగం చేయడంతో అది కాస్తా వికటించి చిన్నారి మృతి చెందిన సంఘటన ఇది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం ఇందిరానగర్‌కు చెందిన బాలకృష్ణకు అతడి భార్యకు మధ్య విభేదాలు పొడచూపాయి. దీంతో ఏడాదిగా వారు వేర్వేరుగా జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు షర్మిల (4), జశ్వంత్ (2). వీరిద్దరూ తండ్రి వద్దే ఉంటున్నారు. భార్యను ఎలాగైనా సంసారానికి తీసుకొచ్చేందుకు బాలకృష్ణ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరగా పిల్లలను అనారోగ్యానికి గురిచేస్తే ఆమె తప్పక తిరిగివస్తుందని భావించి ఇంట్లో ఉన్న ఖాళీ కలుపుమందు డబ్బాలో నీళ్లుపోసి గత నెల 27న కుమారుడు జశ్వంత్‌తో తాగించాడు. దీంతో బాలునికి వాంతులయ్యాయి. ఆపై ఏమీ ఎరగనట్లు కుటుంబీకులతో కలిసి చిన్నారిని ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ జశ్వంత్ మరుసటి రోజు మృతిచెందాడు. అంత్యక్రియల అనంతరం తనపై ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు బాలకృష్ణ.. కుమారుడి మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పిండివంటల్లో ఎవరో కావాలనే విషం కలిపి తినిపించారని ఆరోపించాడు. ఈ ఉదంతంపై గురువారం కేసు నమోదు చేసిన పోలీసులు పలు కోణాల్లో విచారించగా చిన్నారి మృతికి తండ్రి బాలకృష్ణే కారణమని తేలింది. నేరాన్ని అంగీకరించడంతో ఆదివారం అతణ్ని అరెస్టు చేశారు.





కాకి చనిపోతే వచ్చిన గుంపు

కాకుల్లో కారుణ్యం.. మనుషుల్లో కాఠిన్యం!

మాయమవుతున్న మానవత్వం

విజయవాడలోని విజయవాడలోని కృష్ణా నది ఘాట్‌లో ఓ కాకి చనిపోయింది. దీన్ని చూసిన పది కాకులు అక్కడికి చేరి కావ్‌కావ్‌మంటూ ఇతర కాకులను పోగేశాయి. గంటల తరబడి అక్కడే ఉండి దానిని బతికించేందుకు ప్రయత్నించాయి. ఇదే ఘాట్‌కు సమీపంలో విజయవాడ రాణీగారి తోట సబ్‌స్టేషన్ వద్ద శనివారం రాత్రి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఆదివారం మధ్యాహ్నం అటుగా వెళ్లినప్పుడు వాకబు చేస్తే శనివారమే చనిపోయినట్లు స్థానికులు చెప్పారు. అదే సమయంలో పోలీసులు వచ్చి మృతదేహంపై గోనె సంచి కప్పి వెళ్లారు. అంటే.. శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు వేలాది మంది అటుఇటూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదని అర్థమవుతోంది. నగరపాలక సంస్థ సిబ్బందికి చెప్పినా స్పందించలేదు.

– ఈనాడు, అమరావతి



మృతదేహాన్ని చూస్తూ వెళ్లిపోతున్న జనం

హస్తినలో మళ్లీ ప్రకంపనలు!

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మళ్లీ దిల్లీకి చేరాయి. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు రెండో విడత సోమవారం నుంచి ప్రారంభమవుతుండటంతో అధికార, విపక్షాలన్నీ దేశ రాజధానిలో కార్యకలాపాలు మొదలుపెడుతున్నాయి. ఇదే సమయంలో సమస్యల పరిష్కారానికి భాజపా అధ్యక్షుడు అమిత్‌షా ప్రత్యక్షంగా రంగంలోకి దిగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటివరకూ విభజన సమస్యలపై వివిధ స్థాయిల్లో ప్రధాని దగ్గరి నుంచి అరుణ్‌జైట్లీ వరకూ ప్రభుత్వంతో చర్చలు కొనసాగాయి. వీటిల్లో చాలా వాటిపైన రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సిన నేపథ్యంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు జోక్యం చేసుకుని.. చొరవ తీసుకోవాలని అమిత్‌షాకు సూచించారు. ఇందులో భాగంగానే ఈ నెల ఒకటో తేదీన అమిత్‌షా తెదేపా నేతలతో తొలి దఫా చర్చించారు. రెండో తేదీన చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడి చర్చలకు ఆహ్వానించారు. ముఖ్యమంత్రి తన తరఫున సుజనాచౌదరి, రామ్మోహన్‌నాయుడు, కుటుంబరావులను పంపుతామని చెప్పినట్లు వార్తలు వచ్చాయి. సోమవారం సాయంత్రం వీరి మధ్య సమావేశం జరగనుంది. తెలుగుదేశం పార్టీ ప్రధానంగా ప్రత్యేక హోదా, రెవెన్యూ లోటు భర్తీ, జాతీయ విద్యాసంస్థల నిర్మాణాన్ని వేగవంతం చేయడం, రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ, కేంద్ర, గిరిజన విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు పట్టుబడుతోంది. దుగరాజపట్నం ఓడరేవు బదులు ప్రత్యామ్నాయ స్థలం చూపడానికి సిద్ధమవుతోంది. వీటికి తోడు విభజన చట్టంలో పొందుపరిచిన సమస్యలకు పరిష్కారం కోరుతోంది. వాటిపైన కేంద్ర హోంశాఖ ఇప్పటికే చర్చిస్తున్నందున రాజకీయ నిర్ణయం అనివార్యమైన అంశాలపైనే అమిత్‌షాతో జరిగే సమావేశంలో పట్టుబట్టే అవకాశం ఉంది. ప్రత్యేక హోదా బదులు లోగడ ప్రత్యేక సాయానికి అంగీకరించారు. ఇప్పటివరకూ అందులో పైసా కూడా విడుదల కాకపోవడంతో ముఖ్యమంత్రి తిరిగి హోదా కోసం పట్టుబడుతున్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 90 శాతం, ఈఏపీ రుణాల్లో 90 శాతం వాటాను కేంద్రమే భరించడంతో పాటు ఈశాన్య రాష్ట్రాల తరహాలో పన్ను రాయితీలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం పట్టుబడుతోంది. దానికి ఏ పేరు పెట్టినా ప్రయోజనం మాత్రం వంద శాతం హోదా ప్రకారమే ఉండాలని డిమాండ్ చేస్తోంది. రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ, రెండు విశ్వవిద్యాలయాల ఏర్పాటు, మిగతా నిధుల పంపిణీపై నిర్దిష్ట గడువుతో ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతోంది. ప్రతి అంశంలోనూ ప్రజలను ఒప్పించగలిగే చర్య ఉండాలని కోరుతోంది. కేంద్రం ఇప్పటివరకూ ఏ అంశంపైన తన స్పందన చెప్పలేదు. ఫిబ్రవరి 9న రాజ్యసభలో అరుణ్‌జైట్లీ చేసిన ప్రకటనకు అమిత్‌షా రాజకీయ ముద్ర వేసినందున అందులో చెప్పినవన్నీ చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందని భాజపా వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ ప్రకటనకు ముందు అమిత్‌షా ప్రధానితోనూ మాట్లాడి ఆయన అంగీకారం తీసుకున్నందున దానికి రాజకీయ విలువ ఉందని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఈ వాదనతో తెలుగుదేశం ఏకీభవించడం లేదు. అమిత్‌షాతో చర్చలు ఉన్నప్పటికీ, ఉభయసభల్లో ఆందోళనలు కొనసాగించాలని ఆ పార్టీ నిర్ణయించింది. రెండు పార్టీల మధ్య ప్రస్తుతం రాజకీయ అపోహలు మొదలయ్యాయి. ఒకరినొకరు నమ్మలేని పరిస్థితి ఉంది. అన్ని చేస్తామని చెప్పి చేయకపోతే మేం రాజకీయంగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని.. కేంద్రం నుంచి సంతృప్తికరమైన చర్యలు వెలువడేవరకూ ఆందోళనలు కొనసాగిస్తామని తెదేపా చెబుతోంది. తాము అన్నీ చేశామని, తర్వాత తెదేపా రాజకీయ తెగదెంపులు చేసుకుంటే నష్టపోవాల్సి వస్తుందనే వాదనను భాజపా వినిపిస్తోంది. ఇలాంటి అపార్థాల వాతావరణంలో సోమవారం చర్చల్లో అటు రాజకీయ నిర్దుష్టత, ఇటు సమస్యల పరిష్కారంపై స్పష్టతకు పట్టుబట్టే అవకాశం ఉంది. ఇందులో ఎవరికి నమ్మకం కలగకపోయినా అనిశ్చితి కొనసాగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఎస్-400 క్షిపణి వ్యవస్థ ఒప్పందంపై దృష్టి పెట్టనున్న భారత్

దిల్లీ: రష్యా నుంచి రూ.40వేల కోట్ల విలువైన ఎస్-400 ట్రయంఫ్ గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థను సమకూర్చుకునే అంశాన్ని ఖరారు చేసుకోవాలని భారత్ భావిస్తోంది. ధరల విషయంలో రెండు పక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ ఒప్పందం అంశం ముందుకెళ్లకుండా ఆగిపోయింది. రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్ వచ్చే ఆరు వారాల్లో రష్యా పర్యటనకు వెళ్లనున్నారు. ఆమె పర్యటన సందర్భంగా ఈ ఒప్పందాన్ని ఖరారు చేసుకోవడానికి ప్రయత్నం జరగవచ్చని తెలుస్తోంది.

మూడో ప్రత్యామ్నాయమే మార్గం!

- దిల్లీలోనే మొత్తం పెత్తనం ఏమిటి?
- నాలుగేళ్లలో భాజపా ఒక్క మంచి పనీ చేయలేదు
- దేశమంతా ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తోంది
- కాంగ్రెస్, భాజపాయేతర దీటైన శక్తితోనే మార్పు సాధ్యం
- త్వరలోనే జాతీయ ఎజెండా రూపొందిస్తా
- తెలంగాణ సీఎం కేసీఆర్ వెల్లడి

ఈనాడు – హైదరాబాద్

దేశమంతా కాంగ్రెస్సేతర, భాజపాయేతర పార్టీలకు ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్, భాజపాల పాలనతో దేశానికి ఒరిగిందేమీ లేదన్నారు. త్వరలోనే ఏకాభిప్రాయం ఉన్న నేతలతో మాట్లాడతానని, ఆర్థిక నిపుణులు, శాస్త్రవేత్తలు, రైతులతో చర్చించి జాతీయ ఎజెండా రూపొందిస్తానని చెప్పారు. దేశానికి మూడో ప్రత్యామ్నాయం అవసరమన్న సీఎం కేసీఆర్ నిర్ణయానికి మద్దతు తెలిపేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలను ఉద్దేశించి ఆదివారం ఆయన ప్రగతి భవన్ ప్రాంగణంలో ప్రసంగించారు. "70 సంవత్సరాల ప్రయాణం సాగించిన తర్వాత దేశం ఎటుపోతోంది? దేశంలో నెలకొన్న పరిస్థితులు ఏంటి? దేశంలో రైతు ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయి. మనకు నీళ్లు లేవా అంటే 70 వేల టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. నీటి వాటాలు తేల్చరు. కృష్ణా, గోదావరి నదీ జలాల లెక్కలు తేల్చడానికి 2004లో బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ వేశారు. 14 ఏళ్లయింది. ఇప్పటికీ తేల్చలేదు. నది నీళ్ల పంపిణీకి ఇన్నేళ్లు కావాలా? లెక్కల్లేవా? గేజ్‌లు లేవా? ఇలాంటి దిల్లీనా ప్రజలకు కావాల్సింది? అమెరికాలో అలా ఉంటుంది. జర్మనీ ఇలా ఉంటుందని ఎన్నాళ్లు చెప్పుకుందాం. కథలు, ఉపన్యాసాలు చెబితే దేశంలో పేదరికం పోదు. జపాన్, చైనా, సింగపూర్ ఎలా పైకొచ్చాయో ఈ దేశం కూడా అలా పైకి రావాలి. ధైర్యం, చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే వందశాతం వచ్చి తీరుతుంది.



ప్రగతిభవన్‌వద్ద నిర్వహించిన సభలో ఓ అభిమాని అందించిన కరవాలంతో ముఖ్యమంత్రి కేసీఆర్

రైతు ఆత్మహత్యలు ఎలా ఆగుతాయ్

కేంద్రం రైతులకు చేసింది ఏముంది? సబ్బులు, నూనెలు, చక్కెర ధరలు పెరుగుతాయి. రైతు పండించే ధాన్యం మద్దతు ధర మాత్రం పెరగదు. దేశంలో అతిపెద్ద జనాభాగా ఉన్న రైతు సంక్షోభంలో కూరుకుపోతుంటే కేంద్రానికి ఏమాత్రం పట్టింపు లేదా? మోదీ వచ్చాక చాలాసార్లు ఆయనతో మాట్లాడా. రైతులకు, గిరిజనులకు మేలు చేయాలని అడిగా. ఫసల్ బీమా యోజన తెచ్చామని చెప్పారు. అది కూడా బాగా లేదు. ప్రతి ఒక్కరి వద్ద ప్రీమియం తీసుకుంటారు. పంట పాడయితే మాత్రం డబ్బులు రావు. ఇలా అయితే రైతుల ఆత్మహత్యలు ఎలా ఆగుతాయ్. అవన్నీ జరగాలంటే మార్పు ఎక్కడో ఒక చోట మొదలవ్వాలి. అది తెలంగాణ నుంచే ప్రారంభమయింది." అన్నారు.

మార్పు లేదు..పార్టీలే మారుతున్నాయి

కాంగ్రెస్ మీద కోపంతో భాజపాకే ఓటేశాం. ఏం జరిగింది. ఈ నాలుగేళ్లలో రైతులకు గానీ, నిరుద్యోగులకు గానీ ఏమైనా ఒరిగిందా? మళ్లీ వీళ్ల మీద కోపమొస్తే వాళ్లొస్తారు. కొత్తగా ఏమన్నా మారుతుందా? చైనా 24 ఏళ్లలోనే అమెరికా తర్వాత అత్యంత బలమైన దేశంగా రూపొందింది. సింగపూర్‌లో ఏముంది. వాళ్లు తాగే నీళ్లు కూడా వాళ్లవి కావు. అయినా వాళ్లు అభివృద్ధి చెందలేదా?

రాజకీయ లబ్ధి కోసం పాకులాటేనా

జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు కూడా దిల్లీ నుంచి డబ్బులు వేసే ప్రజాస్వామ్య వ్యవస్థ మనది. దేశానికి నిజమైన సమాఖ్య వ్యవస్థ రావాలి. అధికారాలు రాష్ట్రానికి ఉండాలి. ఆరోగ్య విధానం, విద్య, వ్యవసాయ విధానాలను రాష్ట్రాలకు అప్పగించాలి. కేంద్ర ప్రభుత్వానికి దవాఖానాలు, మున్సిపల్ మోరీల వద్ద ఏం పని?

కేసీఆర్‌కు వెల్లువలా మద్దతు

- సంఘీభావం ప్రకటించిన మమతా బెనర్జీ, హేమంత్ సోరెన్
- అసదుద్దీన్, పవన్ కల్యాణ్ అభినందనలు

ఈనాడు, హైదరాబాద్: దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి ఏర్పాటు కోసం చొరవ చూపుతానని ప్రకటన చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మద్దతు వెల్లువెత్తుతోంది. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆదివారం మధ్యాహ్నం సీఎం కేసీఆర్‌కు ఫోన్ చేసి ఆయన ఆలోచనలకు సంపూర్ణ మద్దతు తెలిపారు. జాతీయ రాజకీయాల్లోకి రావాలనే ఆయన నినాదంతో తాను ఏకీభవిస్తున్నానని, ఆయనతో కలిసి పనిచేస్తానని చెప్పారు. దేశరాజకీయాల్లో గుణాత్మక మార్పులు తక్షణావసరమన్న కేసీఆర్ వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని వెల్లడించారు. ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ కేసీఆర్‌కు ఫోన్ చేసి సంఘీభావం ప్రకటించారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, మహారాష్ట్రకు చెందిన ఇద్దరు ఎంపీలూ కేసీఆర్‌కు మద్దతు ప్రకటించారు. దేశ రాజకీయాల్లో ప్రత్యామ్నాయం అవసరమని కేసీఆర్ చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. భాజపా, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా కేసీఆర్ చేసిన వ్యూహరచన 2019 ఎన్నికల్లో ఫలించనుందన్నారు.

కేసీఆర్‌కు అభినందనలు: పవన్ కల్యాణ్

సీఎం కేసీఆర్ కోరుకుంటున్న రాజకీయ ప్రత్యామ్నాయానికి తాను మద్దతు ఇస్తున్నట్లు, ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై కేసీఆర్ కుండబద్దలు కొట్టినట్లుగా మాట్లాడారని పవన్ అన్నారు. ప్రత్యేక హోదాపై మద్దతు తెలిపినందుకు గాను ఏపీ ప్రజల తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. దేశ రాజకీయాలు మారాలంటే సీఎం కేసీఆర్ లాంటి వ్యక్తులకే సాధ్యమని సినీదర్శకుడు, నటుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు.

యువత, గిరిజనుల్ని లక్ష్యంగా చేసుకుని నెగ్గాం: దేవధర్

ముంబయి: యువతను, గిరిజనుల్ని లక్ష్యంగా చేసుకుని ముందడుగు వేయడం వల్లనే ఈశాన్య రాష్ట్రాల శాసనసభల ఎన్నికల్లో భాజపా మంచి విజయాలను సాధించగలిగిందని ఆరెస్సెస్ ప్రచారక్ సునీల్ దేవధర్ చెప్పారు. ఆ రెండు వర్గాల నుంచి పార్టీకి మద్దతును కూడగట్టగలిగామని- ఈశాన్యంలో కీలక పాత్ర పోషించిన ఆయన వివరించారు. స్థానిక భాషల్ని నేర్చుకుని ప్రజల్లోకి చొచ్చుకుపోగలిగామని ఆదివారం ఆయన విలేకరులకు చెప్పారు. త్రిపురలో వామపక్షాల్లో ఉన్న అవినీతి కారణంగా కార్యకర్తల్లో భ్రమలు వీడిపోయి భాజపా వైపు రావడంతో తాము విజయ తీరాలు చేరుకోగలిగామని వివరించారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడమే తనకు అప్పగించిన బాధ్యత అనీ, ప్రభుత్వంలో ఎలాంటి ప్రమేయం ఉండబోదనీ చెప్పారు.



ఆలోచన వికసించె.. వృక్షాలు చిగురించె

అమరావతి పరిధిలో రోడ్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనుల్లో తొలగించిన భారీ వృక్షాలను మరోచోట నాటి (ట్రాన్స్‌ప్లాంటేషన్) సంరక్షిస్తున్నారు. ఇటీవల ఏలూరు రోడ్డు అభివృద్ధి, పైవంతెన నిర్మాణం, బందరు రోడ్డు విస్తరణలో తొలగించిన వృక్షాలను ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం వేళ్లతో సహా తీసుకువచ్చి రామలింగేశ్వరనగర్‌లోని ఎన్‌టీపీ ప్లాంటు ఆవరణలో నాటి సంరక్షిస్తున్నారు. సుమారు 200వరకూ వృక్షాలకు భారీగా పాదులు చేసి కాపాడుతున్నారు. వాటి పెరుగుదలపై ఏరోజుకారోజు నివేదిక రూపొందిస్తున్నారు. చెట్టును నరికేయకుండా మరోచోట నాటి సంరక్షించే విధానంపై ఇక్కడ పరిశోధనలు చేస్తున్నారు. ఇక్కడున్న 95 శాతం చెట్లు ఆరోగ్యంగా పెరుగుతూ చిగురులు తొడిగాయి.

– ఈనాడు, అమరావతి

దుండగుల కాల్పుల్లో ఒకరి మృతి

- ఒడిశాలోని గజపతి జిల్లాలో ఘటన

కాశీనగర్(ఒడిశా), న్యూస్‌టుడే: ఒడిశాలోని గజపతి జిల్లా కాశీనగర్ సమితి కె. సీతాపురం గ్రామంలో దుండగుల కాల్పుల్లో ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన రాధాకృష్ణ కలింగ(40) ఫైనాన్స్ వ్యాపారి. రోజువారీ కలెక్షన్ నిమిత్తం ఆయన జి.ఆనందరావు కిరాణా దుకాణం వద్దకు రాత్రి 9 గంటలకు వెళ్లారు. అదే సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాధాకృష్ణపై ఒక్కసారిగా కాల్పులు జరిపి పరారయ్యారు. రాధాకృష్ణకు కడుపులో, చేతిపై తీవ్ర గాయాలు కాగా, పక్కనే ఉన్న ఆనందరావుకు స్వల్ప గాయాలయ్యాయి. అపస్మారక స్థితికి చేరుకున్న రాధాకృష్ణను స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. అనంతరం బ్రహ్మపుర ఎంకేసీజీ ఆసుపత్రికి తరలించే సమయంలో మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీనగర్ ఐఐసీ ఆనంద్‌చంద్ర పాత్ర్ తెలిపారు.



పర్లాఖెముండి ఆసుపత్రిలో గాయాలతో రాధాకృష్ణ

తెలంగాణలో ఉపాధ్యాయ నియామక పరీక్షలు(టీఆర్‌టీ) ఆదివారంతో ముగిశాయి. దాదాపు 8792 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఈ పరీక్షలకు 2.77 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎనిమిది మాధ్యమాల్లో భాషలు, సబ్జెక్టులకు కలిపి 48 పరీక్షలు నిర్వహించారు.

పీక్కు తింటున్నా పట్టించుకోరా?

- వీధుల్లో శునకాల స్వైరవిహారం
- గ్రామసింహాల దాడిలో ప్రాణాలు కోల్పోతున్న చిన్నారులు
- వేసవిలో మరింత పెరగనున్న బెడద



- కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం చిట్యాల గ్రామానికి చెందిన నాలుగేళ్ల ఇబ్రహీం గత నెల 20న వీధి శునకాల దాడిలో మృత్యువాతపడ్డాడు. ఉయ్యాలలో ఉన్న బాలుడ్ని గమనించిన రెండు కుక్కలు.. అతడ్ని ముఖంపై కరిచి తీవ్రంగా గాయపరిచాయి. తల్లిదండ్రులు మేల్కొని చూసేలోగా చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు.
- విజయనగరం జిల్లా బలిజిపేట మండలం అంపావల్లికి చెందిన పదేళ్ల యశ్వంత్ గత నెల 27న కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. స్నేహితుడితో సైకిల్‌పై వెళుతున్న యశ్వంత్‌ను వెంటపడి మరీ శునకాల దాడి చేసి గాయపరిచాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు.
- గుంటూరు జిల్లా వినుకొండలో గత నెల 16న వీధి కుక్కలు సృష్టించిన బీభత్సంలో 12 మంది గాయపడ్డారు. వినుకొండలోని విష్ణుకుండినగర్‌లో మొదలైన శునకాల దాడి క్రమంగా మరో నాలుగు వీధులకు విస్తరించింది. గాయపడిన వారందరికీ సకాలంలో వైద్యం అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

ఈనాడు – అమరావతి

శునకాల పునరుత్పత్తి నియంత్రణ కోసం రాష్ట్రవ్యాప్తంగా పురపాలక, నగరపాలక సంస్థల్లో ఏటా చేస్తున్న ఖర్చు రూ.5 కోట్లపైమాటే. గత ఇరవై ఏళ్లలో రూ.100 కోట్లకుపైగా వెచ్చించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అలాగని వీధి కుక్కలను నియంత్రించారా? వీటి బెడద నుంచి ప్రజలు బయటపడ్డారా? అంటే సమాధానం దొరకదు. ఏటా జనవరి నుంచి జూన్ మధ్య 2.50 లక్షల మందికిపైగా కుక్కకాట్లతో సర్కారు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ఇందులో పట్టణ ప్రాంతాల్లో బాధితుల సంఖ్య 1.80 లక్షలకుపైగా ఉంటోంది. గుంటూరు, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో శునకాల బెడద అత్యధికం. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏటా 10 వేల మందికిపైగా కుక్క కాటుతో చేరుతుండటం జిల్లాలో సమస్య తీవ్రతకు నిదర్శనం. సుప్రీంకోర్టు ఆదేశాలతో గత కొన్నేళ్లుగా పట్టణ ప్రాంతాల్లో శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. 2011 లెక్కల ప్రకారం 110 పురపాలక, నగరపాలక సంస్థల్లో 1.70 లక్షలకు పైగా వీధి కుక్కలు ఉన్నాయి. వీటిలో 1.69 లక్షలకు పైగా శునకాలకు శస్త్ర చికిత్సలు చేయాలన్న లక్ష్యంలో. . ఇప్పటివరకు 99 లక్షలకుపైగా పూర్తి చేశారు. ఒక్కో కుక్కపై పురపాలక సంఘాలు రూ.400 నుంచి రూ.700 ఖర్చు చేస్తున్నాయి. ఇన్ని చర్యలు తీసుకున్నా గత ఏడేళ్లలో శునకాల పునరుత్పత్తి పెరగడం విశేషం. తాజా సమాచారం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 5.50 లక్షలకుపైగా వీధి కుక్కలున్నట్లు పశుసంవర్ధక శాఖ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది.

లెక్కలు సరే... చికిత్సలేవీ?

పట్టణాల్లో రోజూ 200 నుంచి 250 వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నా వాస్తవ పరిస్థితులపై పర్యవేక్షణ లోపించడంతో కొందరు ఉద్యోగులు, కార్మికులు కలిసి కాకిలెక్కలతో సొమ్ము చేసుకుంటున్నారు. ప్రత్యేకించి విశాఖ, తూర్పు గోదావరి, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో ఈ సమస్య ఉంది. పురపాలక, నగరపాలక సంస్థల్లో శస్త్ర చికిత్సల పేరుతో నిధులు దుర్వినియోగమవుతున్నాయి. ఆరు జిల్లాల్లో ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శస్త్ర చికిత్సలపైనా పర్యవేక్షణ లోపించడంతో లక్ష్యం పక్కదారి పడుతోంది. అవినీతి నిరోధకశాఖ (అనిశా) ఈ గోల్‌మాల్ వ్యవహారంపై దృష్టి పెట్టి ఇప్పటికే కొన్ని జిల్లాల్లో పక్కా సమాచారాన్ని సేకరించింది.

గ్రామాల్లో దయనీయం...

కుక్కల నియంత్రణపై అత్యధిక గ్రామ పంచాయతీలు చేతులెత్తేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిధుల లేమి, సిబ్బంది కొరత వేధిస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంటూరు, కృష్ణా, అనంతపురం, విజయనగరం జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలో గ్రామసింహాల బెడద ఎక్కువగా ఉంది. ఏటా రాష్ట్రంలో ఏప్రిల్ నుంచి జూన్ మధ్య ఎక్కువగా కుక్క కాట్లు కేసులు నమోదవుతున్నాయి. ఇందుకు కారణాలను విశ్లేషించి పంచాయతీలకు తదుపరిచర్యల కోసం ఆదేశించాల్సిన పశుసంవర్ధకశాఖ దృష్టి సారించడం లేదు. రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీల్లో 15 శాతం చోట్ల కూడా కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తున్న దాఖలా లేవు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక కార్యాచరణ కోసం ప్రతిపాదనలైతే సిద్ధమైనా ఆచరణకు నోచుకోలేదు.



విశాఖ సమీపంలోని నరవలో శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స

రాష్ట్రంలోని పురపాలక పాంతీయ కార్యాలయాల పరిధిలో వీధికుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల కోసం నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటివరకు పూర్తి చేసినవి...

ప్రాంతీయ కార్యాలయం	శస్త్ర చికిత్సల లక్ష్యం	పూర్తి చేసినవి
విశాఖపట్నం	33,410	20,469
రాజమహేంద్రవరం	46,454	19,357
గుంటూరు	28,158	15,084
అనంతపురం	61,352	44,562
మొత్తం	1,69,374	99,472

వారెవ్వా!



కాకినాడ నుంచి కోటిపల్లి గాల్లో

బస్సు లాంటి రైల్లో..!

కోటిపల్లి బండెక్కడండీ...?

రెండో ప్లాట్‌ఫాం మీదుంది చూడండి...

ఏదీ... ఎక్కడండీ బాబూ ...? కనిపించదే...!

ఇదే బాగా గమనించండి...

ఇదేటండీ బాబూ... మరీ బస్సులా ఉంది...

ఆగండాగండి... పదమూడేళ్ల క్రితం పది బోగీలతో నడిచిన రైలే...!

కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రైల్వే లైను వేసినప్పుడు మహా సంబరంగా నడిచేదండీ...

గోదారికి అవతల వంతెన పడకపోడం, కోటిపల్లి దాకా బస్సులు బాగా పడి ఈ రైలెక్కే జనాలు బాగా తగ్గిపోయారు గదండీ!

అందుకే ఇలా ఒంటికాయ సొంటికొమ్ములా మిగిలిపోయింది...

జనం తక్కువైనాగానండీ...

ఈ రైల్లో ప్రయాణం భలేగుంటదిలెండి...

డ్రైవర్ విజిలేస్తున్నాడు... పదండి మనమూ ఎక్కేద్దాం...

వేళంగి, ఓదూరు, చోడవరం దాటి రామచంద్రపురం ఊరు బయట కాకినాడ రోడ్డు దగ్గర గేటు దగ్గరకు రాగానే బండాగింది...



పాళ్లపూడి గోపీ, రేపాకుల లోవప్రసాద్ గబుక్కున బండి దిగి విజిల్ వేస్తూ గేటు వేశారు... బండి గేటు దాటగానే మళ్లీ దాన్ని ఎత్తేశారు...

ఇంతకీ ఈ గోపీ, ప్రసాద్‌లు ఎవరిని కదా మీ సందేహం... వీళ్లిద్దరూ గేట్‌మేన్లు. ఈ రైల్లో ఎవరొచ్చినా రాకపోయినా వీళ్లిద్దరూ ఉండాల్సిందే...

కాకినాడ-కోటిపల్లి మధ్య మొత్తం 31 గేట్లుంటే వాటిలో రెండింటికే సిబ్బంది ఉంటారు.

గంగనాపల్లి, కొవ్వాడ, కొరిపల్లి, కరప, వేళంగి, ఓదూరు, చోడవరం, చిన్నతాళ్ల పాలెం, గంగవరం ఇలా తొమ్మిది చోట్లా గోపీ, ప్రసాద్‌లే రైలు దిగి గేట్లు వేస్తారు. మిగతా వాటికి గార్డులే చేతి బావుటాలతో రైట్ చెప్పి రైలు వెళ్లే సమయంలో ప్రజలు పట్టాలపై రాకుండా పంపిస్తారు.

ఈ రైలుబస్‌ను నడిపే డ్రైవరు, గార్డు రోజూ మారుతుంటారు. మెకానిక్ వారానికోసారి మారుతుంటాడు.

ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో లేకపోవడంతో ప్రస్తుతమున్న గార్డే ప్రయాణికులకు టిక్కెట్లు ఇస్తున్నాడు.

రైలు కాకినాడ నుంచి బయలుదేరింది...

గంగనాపల్లి దాటి కొవ్వాడ మీదుగా వెళ్తుంటే

దూరంగా 108 అడుగుల సాయిబాబా బొమ్మ అంతెత్తున భలేగా కనిపిస్తుంటదండీ...

కొవ్వాడ గేటు దగ్గరకొచ్చేసరికి ఓ పెద్దాయన, ఆయన కూతురనుకుంటా...! చెయ్యెత్తారు...

వాళ్లను ఎక్కించుకున్నాక మళ్లీ బయల్దేరింది బండి...

కాకినాడ దాటి కరప వైపు వెళ్తుంటే పచ్చాపచ్చటి పొలాలు, ఆ చేలల్లో రాలిన ధాన్యం తింటూ కొంగలు కనువిందు చేస్తున్నాయి...

అక్కడ రామాలయం పక్కన కోనేరులో ఎర్ర తామరపూలు ఎంతందంగా ఉన్నాయో...

ఎంత అందమైన దృశ్యాలు...! కాసేపు దిగి అక్కడే ఉండిపోతే బావుణ్ణనిపిస్తున్నాయండీ...



ఈ రైలు బస్సు తిరిగే రూట్లో ద్రాక్షారామ, కోటిపల్లి పెద్ద శివుడి పుణ్యక్షేత్రాలండీ... మిగిలిన రోజుల్లో ఎలా ఉన్నానండీ... మహాశివరాత్రి రోజు మాత్రం ప్రయాణికులతో కిక్కిరిసిపోద్దండీ...

ఇంతాజేసి కాకినాడ నుంచి కోటిపల్లికి టికెట్టు పది రూపాయలేనండీ... బస్సుకైతే యాభై రూపాయల్దాకా పెట్టాలండీ... అందుకే కాకినాడ-కోటిపల్లి తిరుగుమరుగు ప్రయాణంలో 35 నుంచి 40 మంది ఎక్కిదిగుతుంటారండీ...

ఈ రైలుకు రోజుకు కనీసం 40 లీటర్ల డీజిల్ అవసరమవుతుంటదంట...

ప్రయాణికుల ద్వారా వచ్చే ఆదాయం ఇందుకు ఏ మాత్రం సరిపోకపోయినా ఏదో నలుగురికీ ఉపయోగపడిద్ది కదా! అని రైల్వే వాళ్లు నడుపుతున్నారంటండీ...

పైగా దారంతా అందమైన ప్రదేశాలు, గ్రామాలు ఉండడం మూలాన ఇటీవల పర్యాటకులు కూడా వస్తున్నారంట...



ఇదండీ రైలు బస్సు కథ... : ఏదేమైనా జన్మకోశివరాత్రి అన్నట్లు... మీరెప్పుడైనా కాకినాడ వెళ్తే ఈ రైలు బస్సు ఒక్కసారి ఎక్కి కాస్త దూరం ప్రయాణం చేయండేం...

– చొల్లంగి సుబ్రహ్మణ్యం, కాకినాడ
చిత్రాలు: శేషగిరి



ప్రగతి కౌఠ-బి

గొప్పట్రాళ్ల ఊళ్లు మారాయి



**కత్తులు స్వైర విహారం చేశాయక్కడ...
కత్తిలా అభివృద్ధి పదును దేలుతోందక్కడే.
తుపాకీ రాజ్యమేలిందక్కడ...
బుల్లెట్‌లా ఉద్యోగాల్లో దూసుకొస్తున్న యువతా అక్కడే.
రక్తం ఏరులై పారిందక్కడ...
శాంతి సంద్రమై నిలిచిందక్కడే.
భయం.. ఊరి శ్వాసను ఆపేసిందక్కడ...
స్వేచ్ఛ.. ఉపాధికి ఊపిరి పోస్తోందక్కడే.
కత్తులు ఏలిన రాజ్యం కప్పట్రాళ్ల... ప్రగతి శక్తులు నింపుకొంటోంది. గెలుపు బాటలు వేసుకొంటోంది.
తుపాకుల గర్జనకు వణికిన కౌఠ-బి... అభివృద్ధిని సాగు చేస్తోంది. ఉపాధి పంటలు పండిస్తోంది.
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఈ రెండు గ్రామాల విజయ పథం... మీరే చదవండి.**

అది గతం

నాలుగు దశాబ్దాల్లో 34 మంది ప్రాణాలు కోల్పోతే... 38 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. తెలుగు రాష్ట్రాల్లో కప్పట్రాళ్ల అత్యంత ఫ్యాక్షన్ గ్రామంగా మారింది. ముఠా కక్షలు..బాంబుల మోతతో దద్దరిల్లింది. రెండు కుటుంబాల మధ్య ఆధిపత్యపోరుతో ఎన్నో ప్రాణాలు బలయ్యాయి. ఎందరో కుటుంబ పెద్దలను కోల్పోయి అనాథలుగా మిగిలారు. ఊరిలో స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి. రక్తమోడిన నేలలో భయంభయంగా బతుకులు సాగేవి.

1990 దశకంలో మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉండేది. పోలీసులు, నక్సలైట్ల మధ్య గ్రామస్థులు నలిగిపోయేవారు. ఏకంగా 56 మందిపై నక్సల్స్ సానుభూతి పరులుగా ముద్రపడింది. ఏ ఎన్నికలు జరిగినా ఈ గ్రామస్థులను పోలీసులు అదుపులోకి తీసుకునే వారు. కుటుంబాల్లో కునుకు పట్టేది కాదు. భూపోరాటం దరిమిలా సాగుభూమిని రైతులు కోల్పోవాల్సి వచ్చింది.

ఇదీ ప్రస్తుతం

748 మంది మహిళలు పొదుపు సంఘం సభ్యులు. రూ.50లక్షలుపైగా రుణాలు పొంది స్వశక్తితో ముందడుగులు వేస్తున్నారు. విద్యాలయం, బ్యాంకు వెలిశాయి. ఈ గ్రామానికి చెందిన అంజనమ్మ ఓంప్లిస్ ద్వారా మణిపూర్ వెళ్లి వంద గ్రూపులు ఏర్పాటు చేయగలిగింది. సబ్బులు, డిటర్జంట్ పౌడర్, పినాయిల్, ఇటుకలు తయారీల్లో శిక్షణ పొంది పలువురు కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నారు. ఎన్ఐఆర్డీ యాక్షన్ రీసెర్చ్ విలేజ్‌గా కప్పట్రాళ్ల ఎంపికైంది.

నాలుగు వేల జనాభా కలిగిన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌఠ 'బి' గ్రామంలో ఐఏఎస్ నుంచి అటెండర్ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పనిచేసే 180 మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. మరో వందమంది పైగా ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. 5 వేల ఎకరాల నల్లరేగడి భూమిలో అధునాతన సాగు విధానాలను అనుసరించి సోయాబీన్, శనగ పంటల విత్తనోత్పత్తి చేపడుతున్న కర్షకులు ఆదర్శంగా నిలుస్తున్నారు.

మంచి పని కోసం ఎవరో ఒకరు ముందడుగు వేస్తే... అందరూ కలిసి వస్తారు. ఈ గ్రామం విషయంలో ఇదే జరిగింది. 2006లో ఐపీఎస్ శిక్షణ పూర్తవ్వగానే ప్రొబేషన్‌లో భాగంగా 2007లో ఆర్కే రవికృష్ణ కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామం వచ్చారు. ఇక్కడి పరిస్థితిని గమనించారు. 2014లో జిల్లా ఎస్పీగా వచ్చిన రవికృష్ణ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు సొంత గ్రామాలను దత్తత తీసుకోవాలనే ప్రధాని మోదీ పిలుపును స్ఫూర్తిగా తీసుకున్నారు. రాజమండ్రి గోకవరం మండలం పరిధిలోని కామరాజుపేట ఆయన సొంతూరు. ఈ ఊరిని దత్తత తీసుకోకుండా కప్పట్రాళ్లను ఎంచుకున్నారు. దీన్ని బాగుచేసే క్రమంలో ఒకరిద్దరు ఉన్నతాధికారులు రవికృష్ణపై ఆగ్రహించారు. దురుసుగా, వాడకూడని పదజాలంతో దూషించారు. అవమానాలు పక్కనపెట్టి పదేళ్లలో కప్పట్రాళ్ల విజయం చూడాలని అడుగులు వేశారు. అక్కడి ప్రజలను తమ కుటుంబంలో భాగంగా చేసుకున్నారు. ఎస్పీ రవికృష్ణ భార్య పార్వతీ దేవి ఆ గ్రామ మహిళాసంఘంలో సభ్యురాలిగా ఉండటం దీనికి తార్కాణం.

అభివృద్ధికి శ్రీకారం

అక్కడ చదువులంటే వరండా, చెట్ల కిందే. 14ఏళ్ల క్రితమే ఉన్నత పాఠశాల భవనం రెండు ఎకరాల్లో మంజూరైనా ఫ్యాక్షన్ గొడవలతో ఆగిపోయింది. దీంతో రవికృష్ణ మొదటిగా విద్యాభివృద్ధిపై దృష్టిపెట్టారు. భూమి మంజూరు చేయించి ఐదు ఎకరాల్లో రూ.30లక్షలతో పాఠశాలను నిర్మించారు. ఏపీ విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావును కలిసి గ్రామ పరిస్థితి వివరించి మరో 10 అదనపు తరగతి గదులు మంజూరు చేయించారు. కర్నూలు ఎంపీ బుట్టా రేణుక ప్రహరీకి రూ.10లక్షలు ప్రకటించగా, బిల్డర్స్ అసోసియేషన్ సహకారంతో రూ.35లక్షలతో గోడ నిర్మాణం పూర్తిచేశారు. 'తానా' ఈ-లైబ్రరీ ఏర్పాటు చేసింది. ఇలా దాతల సాయంతో స్కూలు నిర్మిస్తున్నప్పుడే ప్రజల్లో పోలీసులు, అధికారులపై నమ్మకం ఏర్పడింది. బ్యాంకు ఉంటే ఊరు మారుతుందని భావించి అధికారులను ఒప్పించి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేయించారు. ఏడాదిన్నరలో రూ.11కోట్ల లావాదేవీలతోపాటు, రూ.7.30కోట్లు రుణాలుగా ఇచ్చారు. కుటీర పరిశ్రమల శాఖ, ఎన్ఐఆర్డీతో గ్రామాన్ని అనుబంధం చేసి మహిళలకు శిక్షణలిప్పించారు. కడప సెంట్రల్ జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఈ గ్రామానికి చెందిన 30 మందిని అప్పుడప్పుడూ కలుస్తూ వారి పిల్లల చదువుకు భద్రత కల్పించారు. సిమెంట్ ఫ్యాక్టరీల సాయంతో గ్రామం మొత్తం సీసీ రోడ్లుగా మార్చేశారు. తాగునీటికి ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేయించారు. కళ్యాణ మండపం, స్త్రీశక్తి భవనం ఇలా అభివృద్ధిలో ప్రస్తుతం ఈ గ్రామం దూసుకెళుతోంది. ఉచిత వైద్య శిబిరాలతోపాటు, వృద్ధులకు ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలు చేయించారు. గ్రామజ్యోతి ప్రాజెక్టు మహిళల సాధికారతపై కృషిచేసింది. సంక్రాంతి వంటి పండగలు గ్రామస్థులతో కలిసే జరుపుకొంటున్నామని, డీజీపీ జేవీ రాముడు, సాంబశివరావు వంటి ఉన్నతాధికారులు వెన్నుతట్టి ప్రోత్సహించారని, కప్పట్రాళ్ల విజయాన్ని చూడటమే నాలక్ష్యమంటారు రవికృష్ణ. ప్రస్తుతం ఈయన తితిదే ముఖ్య భద్రతాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఎక్కడున్నా కప్పట్రాళ్ల అభివృద్ధిని, అక్కడి ప్రజలను మరువనని చెబుతారు.

- ఎన్ఐఆర్డీ శిక్షణకు వెళ్లి ఇటుకల తయారీ నేర్చుకున్న యువజన సంఘంలోని గ్రామ యువత కప్పట్రాళ్లలో యూనిట్ ఏర్పాటు చేసి విజయం సాధించారు. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణంలో ఈ ఇటుకలే వాడుతున్నారు.
- 4500 జనాభా ఉన్న గ్రామంలో 14 రైతు సంఘాలు ఏర్పడి రూ.30లక్షలతో డ్రిప్, రూ.10లక్షలతో పండ్లతోటలు, రూ.30లక్షలతో ప్యాక్‌హౌస్‌లు అందించారు. ఎద్దుల బండ్లు, తార్పాలిన్లు ఇచ్చి పూర్తిగా వ్యవసాయం వైపు దృష్టిమరల్చారు. ఇలా రైతులకు ప్రభుత్వ పథకాలు రూ.కోటి దరిచేరాయి. అదనంగా రూ.45వేల రాయితీతో హర్యాణా గేదెలు(30), 21 కోళ్ల యూనిట్లు మంజూరు అయ్యాయి.
- తానా రూ.20లక్షలతో స్త్రీశక్తి భవన్ ఏర్పాటు చేస్తున్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, స్వచ్ఛతలో జిల్లాలో ఈ గ్రామం ముందంజలో ఉంది.





– సురేందర్, ఈనాడు డిజిటల్ – కర్నూలు



ఎంత గట్టిగా విసిరితే అంతే గట్టిగా తిరిగొచ్చే బంతిలా కౌఠ-బి గ్రామస్థులు కదిలారు. చదువు, వ్యవసాయాన్ని నమ్ముకొని ప్రగతి బాట పట్టారు. ఈ గ్రామ ప్రభుత్వ పాఠశాలలోనే చదివి 1996లో ఇదే గ్రామానికి చెందిన బి.రాజేందర్ ఐఏఎస్ సాధించడంతో యువతకు ఉద్యోగాలపై దృష్టి మళ్లింది. ప్రభుత్వం నిర్వహించిన వివిధ డీఎస్సీ పరీక్షలలో 60 మంది ఉపాధ్యాయులుగా కొలువులు పొందారు. వివిధ పోటీ పరీక్షల్లో 20 మంది పోలీసులుగా, పదుల సంఖ్యలో ఆర్టీసీ కండక్టర్లుగా, ఆరోగ్య కార్యకర్తలుగా స్థిరపడ్డారు. ఇటీవల వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో గ్రామానికి చెందిన మల్లెపూల మనోహర్ ఆడిటింగ్ విభాగంలో అధికారిగా ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ శాఖలతో పాటు బ్యాంకింగ్ కొలువులు సంపాదించారు. ఇటీవల పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించిన పరీక్షల్లో ఇంజినీర్లుగా, వ్యవసాయాధికారులుగా కొలువులు కొట్టారు. వృత్తి పరమైన వైద్య, ఇంజినీరింగ్ శిక్షణ పూర్తి చేసిన వారు, కంప్యూటర్ రంగాల్లో ఆరితేరిన వారు 76 మంది ప్రైవేటు రంగంలో చేరారు. కొందరు విదేశాల్లో సైతం కొలువులు చేస్తూ తమ ఊరి పేరును ఖండాంతరాలకు చాటారు. విద్యపై ఉన్న ఆసక్తితో ఇక్కడ గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ) వారు గ్రంథాలయం ఏర్పాటు చేశారు. సొంత నిధులతో నిర్వహిస్తున్నారు. గ్రామంలో ముప్పై ఏళ్ల క్రితమే నిర్మించిన అద్దె గదులు కమిటీకి ఆదాయం సమకూర్చుతున్నాయి.

మా గ్రామాన్ని అన్నిరంగాల్లో ప్రగతి పథంలో చూడాలని నా కోరిక, అందుకు అవసరమైన సహాయ సహకారాలందిస్తానని కేంద్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి డా.బొమ్మకంటి రాజేందర్ చెబుతుంటారు.

రైతులంతా పట్ట భద్రులే..

కౌఠ'బి' గ్రామంలోని రైతులంతా దాదాపు పట్టభద్రులే కావడం విశేషం. భూములను సాగు చేస్తూ వందలాది మంది యువకులు విత్తనోత్పత్తి రైతులుగా పేరు గాంచారు. గతేడాది రెండు వేల ఎకరాలలో సోయాబీన్ విత్తనోత్పత్తి చేపట్టగా, 300 ఎకరాల్లో రబీలో శనగ విత్తనోత్పత్తి చేశారు. చెరకు పంట పండించి 2000 సంవత్సరంలో ఇదే గ్రామ రైతులు ఆదిలాబాద్ జిల్లాలోనే అత్యధికంగా 12 పరిశ్రమల్లో నాణ్యమైన బెల్లం తయారీకి అందించారు. ఈ ఏడాది ఆదిలాబాద్ జిల్లాకు అవసరమైన రెండువేల క్వింటాళ్ల శనగ విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులు సత్తా చాటారు. గ్రామంలో మద్యం గొలుసు దుకాణం(బెల్టుషాపు) లేకుండా చేసి మద్యానికి దూరంగా ఉంటున్నారు. ఏటా భక్తి భావనలు ఉప్పొంగే విధంగా గ్రామస్థులు సొంత నిధులతో నిర్మించిన శబరిమాత, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల్లో ఘనంగా వార్షికోత్సవాలు నిర్వహిస్తారు. గ్రామంలో ఏ ఒక్క బడీడు పిల్లవాడు బడిబయట లేకుండా చూడాలని చదువుకున్న యువకులు సంకల్పించారు. సాధించారు. 'ఒకరి స్ఫూర్తిని ఒకరు అందిపుచ్చుకొని యువకులంతా విజయబావుటాలు ఎగరేస్తున్నార'ని ఉపాధ్యాయుడు లింగారెడ్డి పొంగిపోతారు. 'అధికారుల సాయంతోనే వ్యవసాయంలో లాభాలు చూస్తున్నామ'ని రైతు సురేందర్‌రెడ్డి ఆనందంగా నవ్వుతారు.



– సూది నరేశ్, న్యూస్‌టుడే, బోథ్

ఈనాడు సినిమా

‘2.ఓ’నూ వదల్లేదు!


రజనీకాంత్

రజనీకాంత్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ‘2.ఓ’. పాటల వేడుకను ఘనంగా నిర్వహించినట్టే టీజర్‌నూ భారీస్థాయిలో విడుదల చేయాలని చిత్ర బృందం భావిస్తోంది. ఇంతలోనే ఈ సినిమా టీజర్ లీకవడం చిత్రబృందాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. మరికొన్ని వారాల్లో ‘2.ఓ’ టీజర్‌ను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పలు భాషల్లో విడుదల చేయాలని చిత్రబృందం భావించింది. అయితే 1.26 నిమిషాల నిడివి ఉన్న ఈ సినిమా టీజర్ ఆదివారం లీకయింది. అన్ని సామాజిక మాధ్యమాల్లోనూ ‘2.ఓ’ టీజర్ హల్‌చల్ చేస్తోంది. దీనిపై రజనీకాంత్ కుమార్తె సౌందర్య ట్విట్టర్‌లో ఘాటుగా స్పందించారు. కఠోర శ్రమ, ప్రయత్నం, నిర్మాతల అంకితభావాన్ని పక్కనబెట్టి కొన్ని క్షణాల సంతోషం కోసం ఇలా విడుదల చేయడం మనస్సాక్షికి విరుద్ధమైన పని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నిజానికి ఈ సినిమా టీజర్‌ను చిత్ర నిర్మాత లైకా సంస్థ అధినేత సుభాస్కరన్ పుట్టినరోజున ప్రముఖుల కోసం లండన్‌లో ప్రదర్శించారని, అప్పుడే ఎవరో ఫోనులో చిత్రీకరించి ఇలా సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారన్న వార్తలు కోలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. రంజిత్ దర్శకత్వంలోని ‘కాలా’ టీజర్ కూడా విడుదలకు ముందురోజే ఇదేవిధంగా సామాజిక మాధ్యమంలో లీకైంది. దీంతో ఆశ్చర్యపోయిన నటుడు, నిర్మాత ధనుష్ ట్విట్టర్‌లో అధికారికంగా విడుదల చేశారు.

– న్యూస్‌టుడే, చెన్నై



జయసుధ, జయప్రద, జీవిత, బాబూమోహన్, కృష్ణంరాజు, రాజశేఖర్, టి.సుబ్బిరామిరెడ్డి, పి.సుశీల, జగపతిబాబు

శ్రీదేవి మళ్లీ పుడుతుంది

శ్రీదేవి జ్ఞాపకాలతో మరోసారి తల్లడిల్లిపోయింది తెలుగు చలన చిత్రపరిశ్రమ. ఆదివారం హైదరాబాద్‌లో టి.సుబ్బిరామిరెడ్డి కళా పరిషత్ ఆధ్వర్యంలో శ్రీదేవి సంతాప సభ జరిగింది. తెలుగు చిత్రసీమకు చెందిన పలువురు నటీనటులు ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీదేవితో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ‘శ్రీదేవి మళ్లీ శ్రీదేవిగానే పుట్టాలి’ అని అభిలషించారు.

“శ్రీదేవి నన్నెప్పుడూ ‘సర్’ అని పిలిచేది. పెద్దలంటే ఆమెకు చాలా గౌరవం. నటిగా కొన్ని పాత్రలు ఆమె తప్ప ఎవ్వరూ చేయలేరు. ఆమధ్య కలిసినప్పుడు ‘చిత్రసీమకొచ్చి నాకు యాభై ఏళ్లు. మీకూ యాభై ఏళ్లయ్యాయి. దీన్ని ఓ వేడుకగా జరుపుకోవాలి. ఆ కార్యక్రమానికి నేను తప్పకుండా వస్తా’ అంది. ‘బొబ్బిలి బ్రహ్మన్న’ హిందీలో తీశాం. అందులో కథానాయికగా శ్రీదేవి నటించింది. నేను ఫోన్ చేయగానే ఒప్పుకొంది. ఆ సినిమా పూర్తయ్యేంత వరకూ బాగా సహకరించింది”

- కృష్ణంరాజు

“మన కళ్ల ముందు నుంచి శ్రీదేవి వెళ్లిపోవడం అన్యాయం. ‘అనురాగ దేవత’ షూటింగ్ రవీంద్ర భారతిలో జరుగుతోంటే మేం వెళ్లాం. ‘చూసుకో పదిలంగా’ అనే పాట.. ప్రేక్షకుల్లో కూర్చుని చూశాం. అదో జ్ఞాపకం. రామానాయుడు ‘దేవత’ చేశారు. ఎన్టీఆర్ ‘అనురాగ దేవత’ చేశారు. అలాంటి దేవత.. స్వర్ణోత్సవం జరుపుకోవాల్సిన సమయంలో కన్నీటి వీడ్కోలు ఇవ్వాల్సి రావడం బాధాకరమైన విషయం”

- పరుచూరి గోపాలకృష్ణ

“తనతో పదిహేను సినిమాలు చేసుంటా. పోటాపోటీగా నటించేవాళ్లం. మామధ్య ఓ ఆరోగ్యకరమైన పోటీ ఉండేది. అందం, నాట్యం, డైలాగ్.. ఇలా అన్నింట్లోనూ పోటీ ఉండేది. శ్రీదేవి అవ్వాలన్న కోరికతో చాలామంది ఈ పరిశ్రమలోకి వచ్చారు. అతిలోక సుందరి తెలియని లోకాలకు వెళ్లిపోయింది. మంచి తల్లిగా తన బిడ్డల్ని తీర్చిదిద్దాలన్న తపన ఉండేది”

- జయప్రద

“దేవలోకంలోంచి వచ్చిన సుందరిలా మన కళ్ల ముందు కదిలి.. మళ్లీ తన లోకానికి వెళ్లిపోయింది. తన ఎనిమిదేళ్ల వయసులో తనకు నేను ఓ పాట పాడినందుకు గర్విస్తున్నాను. హీరోయిన్‌గా తొలి సినిమాలోనూ నేనే పాట పాడాను. అది భగవంతుడు నాకిచ్చిన అవకాశం”

- పి.సుశీల

“అందరూ అనుకుంటున్నట్టు శ్రీదేవికి ఆర్థిక సమస్యలేం లేవు. శ్రీదేవి కెరీర్‌లో పుంజుకుంటున్న దశలోనే ఆమె మాతృమూర్తి చెన్నైలో స్థలాలు కొన్నారు. ‘ఈ స్థలాలు అమ్మేసి.. హైదరాబాద్‌లో ఏమైనా కొనాలా’ అని నన్ను శ్రీదేవి చాలాసార్లు సలహా అడిగేది. హిందీలో ఆమెతో రెండు చిత్రాలు నిర్మించా. అవి రెండూ బాగా ఆడాయి”

- టి.సుబ్బిరామిరెడ్డి

“నేనూ, శ్రీదేవి పది చిత్రాల వరకూ నటించాం. బాల నటిగా ఉన్నప్పుడు.. తనని చూడ్డానికి ప్రత్యేకంగా ఆమె ఇంటికి వెళ్లా. అలా నేను చూసిన మొదటి నటి ఆమె. మా అమ్మగారు, శ్రీదేవి అమ్మగారు మంచి స్నేహితులు. చెల్లాయి సుభాషిణితో కూడా సాన్నిహిత్యం ఉండేది. నన్నెప్పుడూ ‘జయసుధగారూ’ అనే పిలిచేది. శ్రీదేవి ప్రతి పుట్టిన రోజుకీ చెన్నై తప్పకుండా వెళ్లేదాన్ని. శ్రీదేవి మరణవార్త కలచివేసింది. నాకేదో అయిపోతోందన్న భయం వచ్చేసింది. ముంబైకి కూడా వెళ్లి చూడాలనిపించలేదు. కనీసం టీవీ కూడా చూడలేదు. చివరి సారి తన మొహం చూడాలనుకుని కేవలం ఇరవై సెకన్ల పాటు టీవీ ఆన్ చేశా. ఆమె పార్థివ దేహం చూస్తుంటే చిన్నప్పటి శ్రీదేవిలా కనిపించింది”

- జయసుధ

“ఓసారి బోనీకపూర్ ఇంటికివెళ్లా. ఓకుర్రాడు టీ తీసుకొచ్చాడు. శ్రీదేవి ఆ కప్పు తీసుకుని నా చేతుల్లో పెడుతుంటే.. ఆశ్చర్యపోయా. నా మనసులో ఆవిడకున్న స్థాయివేరు. ఆమె కప్పు అందించడం ఒప్పుకోలేకపోయా. ఈ విషయం నాతో పాటు వచ్చిన అశ్వనీదత్‌కు చెప్పుకుంటూ కుమిలిపోయా. శ్రీదేవి మరణం తరవాత రాంగోపాల్ వర్మ రాసిన ఉత్తరం చదివా. వర్మ గురించి రకరకాలుగా అనుకుంటాం. కానీ వర్మ హృదయం ఎంత మెత్తనైందో తొలిసారి తెలిసింది”

- అల్లు అరవింద్

ఈ కార్యక్రమంలో జగపతిబాబు, అమల, జీవిత, రాజశేఖర్, పింకి రెడ్డి, ఉపాసన, శోభనా రెడ్డి, సుమంత్, కోట శ్రీనివాసరావు, నరేష్, శివాజీ రాజా, అలీ, కవిత, రేలంగి నరసింహారావు, బాబూ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


పూజా హెగ్డే

కల్యాణ వైభోగమే


నితిన్, రాశీ ఖన్నా

‘దిల్’తో నిర్మాతగా మారిన రాజు కాస్త... ‘దిల్’రాజు అయిపోయారు. ఆ సినిమా వచ్చి 14 ఏళ్లయ్యింది. ఇన్నాళ్లకి మళ్లీ నితిన్‌తో కలసి ఓ సినిమా రూపొందిస్తున్నారాయన. అదే... ‘శ్రీనివాస కల్యాణం’. రాశీ ఖన్నా, నందిత శ్వేత కథానాయికలు. సతీష్ వేగేశ్న దర్శకుడు. ప్రకాష్ రాజ్ కీలక పాత్రధారి. ఆదివారం హైదరాబాద్‌లో చిత్రీకరణ లాంఛనంగా ప్రారంభమైంది. ఈనెల 16 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. జూన్‌కల్లా సినిమా మొత్తం పూర్తవుతుంది. జులై చివరి వారంలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు దర్శక నిర్మాతలు తెలిపారు. సంగీతం: మిక్కీ జె.మేయర్

‘గీతాంజలి’ గుర్తుకొస్తోంది!


నాని

విరాట్ కొండూరు కథానాయకుడిగా లక్ష్మీకాంత్ చెన్నా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘పరిచయం’. సిమ్రత్ కౌర్ కథానాయిక. రియాజ్ నిర్మిస్తున్నారు. కథానాయకుడు నాని హైదరాబాద్‌లో టీజర్‌ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ “ఈ సినిమా టీజర్ చూశాక మణిరత్నం ‘గీతాంజలి’ గుర్తుకొస్తోంది. నా మిత్రుడైన లక్ష్మీకాంత్ చెన్నాకి, నిర్మాత రియాజ్‌కి ఈ చిత్రంతో మంచి విజయం దక్కాలని కోరుకొంటున్నా” అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ “వినోదంతో పాటు, బలమైన భావోద్వేగాలతో కూడుకొన్న చిత్రమిది. నాని ‘గీతాంజలి’తో పోల్చడం ఆనందంగా ఉంది” అన్నారు. “వచ్చే నెల మొదటివారంలో చిత్రాన్ని విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం” అన్నారు నిర్మాత. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు శేఖర్ చంద్రతో పాటు చిత్రబృందం పాల్గొంది.

కుటుంబ కథలో ప్రేమ


రాహుల్, కావ్య థాపర్

ప్రముఖ ఫైట్ మాస్టర్ విజయ్ తనయుడు రాహుల్ కథానాయకుడిగా వి.ఎస్.క్రియేటివ్ వర్క్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. రాము కొప్పుల దర్శకుడు. దివ్య విజయ్ నిర్మాత. కావ్య థాపర్ కథానాయిక. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శకుడు మాట్లాడుతూ “చక్కటి ప్రేమకథతో కూడిన కుటుంబ కథా చిత్రమిది. అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. రాహుల్ బాడీ లాంగ్వేజ్‌కి సరిపోయే కథ ఇది, తను బాగా నటించాడు” అన్నారు. నిర్మాత మాట్లాడుతూ “ఖర్చుకు వెనుకాడకుండా చిత్రాన్ని తీర్చిదిద్దాం. మణిశర్మ అందించిన స్వరాలు, శ్యామ్ కె. నాయుడు ఛాయాగ్రహణం ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయ”న్నారు.

‘అల్లరి’ చేద్దాం రండి


‘అల్లరి’ నరేష్

‘అల్లరి’ నరేష్ కథానాయకుడిగా ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఓ చిత్రానికి శ్రీకారం చుట్టింది. ‘నందిని నర్సింగ్ హోమ్’తో ఆకట్టుకున్న పివి గిరి దర్శకత్వం వహిస్తారు. అనిల్ సుంకర నిర్మాత. ఆదివారం హైదరాబాద్‌లో చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. “అహనా పెళ్లంట’, ‘యాక్షన్ త్రీడీ’, ‘జేమ్స్ బాండ్’ చిత్రాల తరవాత నరేష్‌తో తెరకెక్కిస్తున్న నాలుగో చిత్రమిది. నరేష్ నుంచి కోరుకునే వినోదం పుష్కలంగా ఉంటుంది. త్వరలోనే కథానాయిక, మిగిలిన సాంకేతిక నిపుణుల వివరాలు ప్రకటిస్తామ”న్నారు నిర్మాత. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: నగేష్, కళ: గాంధి.

కల్లో కూడా ఊహించలేదు!

తెలుగులో చేసిన తొలి సినిమా ‘ముకుంద’లో పల్లెటూరి అమ్మాయిగా అమాయకంగా కనిపించింది పూజాహెగ్డే. రెండో సినిమాకి వచ్చేసరికి కుర్రాళ్ల గుండెల్లో ‘డీజే’ మోత మోగించింది. ఘాటైన అందాలతో ఆకట్టుకుంది. ఆ రెండు పాత్రల్లాగే తన ఆలోచనల్లో అంత వ్యత్యాసం ఉంటుందని చెబుతోంది పూజా. తెలుగులో మెరిసి, ఆ తర్వాత బాలీవుడ్‌కు వెళ్లి ఇప్పుడు మళ్లీ తెలుగు చిత్రాలతో బిజీ అయిపోయింది. బెల్లంకొండ సాయిశ్రీనివాస్‌తో కలిసి ‘సాక్ష్యం’లో నటిస్తున్న పూజ, త్వరలోనే ‘రంగస్థలం’లో ప్రత్యేకమైన పాటతో అలరించబోతోంది. తదుపరి మహేష్‌తోనూ జోడీ కట్టబోతోంది. కథానాయికగా తన ప్రయాణం గురించి చెబుతూ... “ఒకొక్క సినిమా నాలో ఒక్కో రకమైన కోణాన్ని ఆవిష్కరించాలని ఆశపడుతుంటా. అదృష్టం కొద్దీ అలాంటి అవకాశాలే లభిస్తున్నాయి. నా వ్యక్తిగత జీవితం గడిచిన విధానమూ అంతే. చిన్నప్పుడు టామ్‌బాయ్‌లా ఉండేదాన్ని. చిన్నహెయిర్ కటింగ్‌తో, నాకు నచ్చినట్టుగా గడిపేదాన్ని. కథానాయికని అవుతానని కలలో కూడా అనుకోలేదు. అందాల పోటీలే నా జీవితాన్ని మలుపు తిప్పాయి. గతాన్ని ఓ సారి గుర్తు చేసుకుంటే ఇంతగా మారిపోయానా అని నాకే ఆశ్చర్యం కలుగుతుంది. భవిష్యత్తులో నా సినిమాల్ని చూసుకొన్నప్పుడు కూడా నేను చేసిన పాత్రలు అదే తరహాలో ఆశ్చర్యం కలిగించాలనేది నా ఆశ. అది దృష్టిలో ఉంచుకొనే కథల్ని ఎంపిక చేసుకొంటున్నా. డీ గ్లామర్ పాత్రలకైనా నేను సిద్ధమే” అని చెప్పింది పూజాహెగ్డే.

మంత్రం వేసి


విజయ్ దేవరకొండ

మానవుల ఎదుగుదలకి అధునాతన సాంకేతికవిజ్ఞానం అవసరమే. కానీ దాని ధ్యాసలోపడి మానవత్వపు విలువల్ని మరిచేపోయే దశకి చేరువలో ఉన్న ఓ యువకుడిలో ఓ యువతి ఎలా మార్పు తీసుకొచ్చిందనేదే మా చిత్రం అంటున్నారు శ్రీధర్ మర్రి. ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ‘ఏ మంత్రం వేశావే’. విజయ్ దేవరకొండ, శివానీసింగ్ జంటగా నటించారు. ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శ్రీధర్ విలేకర్లతో మాట్లాడుతూ “సాంకేతికత మనల్ని శాసించకూడదు. దాన్నే మనం శాసించాలి అనే అంశాన్ని వినోదాత్మకంగా చెప్పాను. విజయ్ దేవరకొండ నటన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ సినిమా నిర్మాణంలో నాకు చేదోడువాదోడుగా నిలిచిన మల్కాపురం శివకుమార్ ద్వారా 9న విడుదలవుతుంద”న్నారు. మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ “ఇది యువతకి నచ్చే చిత్రం. ‘పెళ్ళి చూపులు’, ‘అర్జున్‌రెడ్డి’ తర్వాత విజయ్ దేవరకొండ నుంచి వస్తున్న మరో విజయవంతమైన చిత్రమిది. డిజిటల్ సర్వీసు ప్రొవైడర్లు ఐదేళ్ల ఒప్పందాన్ని అతిక్రమించి గత పదమూడేళ్ల నుంచీ నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్లను దోచుకుంటున్నారు. వి.పి.ఎఫ్ ఛార్జీలను క్రమేపీ తగ్గిస్తామని హామీలిచ్చి కూడా తగ్గించకుండా ఇంకా ఏళ్లతరబడి వసూలు చేస్తున్నారు. ఇప్పుడు దక్షిణాది చిత్రపరిశ్రమలంతా ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి థియేటర్లలో ప్రదర్శనలు నిలిపేసి తమ నిరసనలను తెలుపుతున్నాయి. అంతేగానీ ఇది బంద్ కాదు. ఈ నెల 9 వరకూ తేలకపోయిన పక్షంలో మా సినిమా విడుదలను వాయిదా వేసి మా నిరసనను కొనసాగిస్తామ”న్నారు.

అంకెల్లో ఆస్కార్



90వ ఆస్కార్ వేడుకకు సమయం ఆసన్నమైంది. సోమవారం ఉదయం 6.30 గంటల నుంచి (భారత కాలమానం ప్రకారం) ఆస్కార్ సందడి మొదలవుతుంది. ఈ ఏడాదీ ఆస్కార్ వేడుకనూ అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. జిమ్మీ కిమ్మెల్ వ్యాఖ్యాతగా వ్యవహరించబోయే ఈ కార్యక్రమం కోసం ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అంతకంటే ముందు ఈ వేడుక వెనుక ఉన్న విశేషాలను చదివేయండి.

1 ఆస్కార్ నామినేషన్లు పొందిన వారందరూ పురస్కారం గెలుచుకున్నా గెలవకున్నా ప్రత్యేక గిఫ్ట్‌ప్యాక్ మాత్రం అందుకుంటారు. అందులో నోరూరించే చాక్లెట్లు, క్యాండీలు మొదలుకొని మరెన్నో ఖరీదైన బహుమతులు ఉంటాయట. ఒక్కో గిఫ్ట్ ప్యాక్ ఖరీదే 1 లక్ష డాలర్లుంటుందట.

3 ఆస్కార్ అకాడెమీలోని 7258 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారి ఓటు ప్రాధాన్యతల ఆధారంగానే విజేతలను ప్రకటిస్తారు. సభ్యుల ఇళ్లకు ఓటింగ్ పత్రాలను పంపడానికైన రవాణా ఖర్చే 3 లక్షల డాలర్లని సమాచారం.

10 ఆస్కార్ వేడుక అంటేనే ఫ్యాషన్‌కు చిరునామా లాంటిది. తళుకులీనే దుస్తుల్లో తారలు అందాలు ఆరబోస్తూ అలరిస్తుంటారు. అందుకు వారు పెట్టే ఖర్చు చూస్తే అవాక్కవ్వాల్సిందే. మెరిల్ స్ట్రీప్ లాంటి ‘ఎ’ కేటగిరీ తారలు తమ ఆహార్యానికి పెట్టే ఖర్చు సుమారు 10 మిలియన్ డాలర్లట! మధ్య స్థాయి తారలు చేసే ఖర్చు 1.5 మిలియన్ డాలర్లు, తొలిసారి వేడుకకు వస్తున్న తారలు చేసే ఖర్చు 226 లక్షల డాలర్లని సమాచారం.

15 గతేడాది ఆస్కార్ వేడుకకు వ్యాఖ్యాతగా వ్యవహరించిన జిమ్మీ కిమ్మెల్ ఈ ఏడాదీ అదే పాత్రను పోషిస్తున్నాడు. ఆస్కార్ వ్యాఖ్యాతగా ఆయన అందుకుంటున్న పారితోషికం 15 వేల డాలర్లని సమాచారం.

26 ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఆస్కార్ వేడుక ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తారు. అందుకే ఆ సమయంలో బుల్లితెరపై వాణిజ్య ప్రకటనల కోసం తీవ్ర పోటీ ఉంటుంది. ఈసారి ఆస్కార్ సమయంలో 30 సెకన్ల పాటు ప్రసారమయ్యే ఒక్కో వాణిజ్య ప్రకటనకు 26 లక్షల డాలర్లు చెల్లించడానికి కంపెనీలు సిద్ధమయ్యాయి.

44 అంగరంగ వైభవంగా నిర్వహించే ఆస్కార్ వేడుకకు అయ్యే ఖర్చు కూడా ఆ స్థాయిలోనే ఉంటుంది. ఏటికేడు ఈ వ్యయం పెరుగుతూ పోతోంది. ఈ ఏడాది ఆస్కార్ వేడుకకు చేస్తున్న వ్యయం 44 మిలియన్ డాలర్లని అంచనా.

45 ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఆస్కార్ వేడుక కోసం వేదికను కళ్లు చెదిరేలా అలంకరిస్తుంటారు. ఈ ఏడాది 1750 చదరపు అడుగుల సువిశాలమైన వేదికను సిద్ధం చేశారట. మేలుజాతి స్వరోవ్‌స్కీ ముత్యాలు పొదిగి వేదికను అలంకరించారట. ఏ వందో వెయ్యో కాదు సుమారు 45 మిలియన్ల ముత్యాలు.

75 ఆస్కార్ వేడుక తర్వాత నిర్వహించే వ్యానిటీ ఫెయిర్ పార్టీ సందడి సందడిగా జరుగుతుంది. ఈ పార్టీలో తారలతో కలిసి విందులో పాల్గొనేందుకు ఎన్నో జంటలు ఆసక్తి చూపుతుంటాయి. ఈసారి ఈ పార్టీలో పాలుపంచుకునేందుకు ఒక్కో జంటకు టికెట్ ధర 75 వేల డాలర్లు.

100 ఓ చిత్రం ఆస్కార్ బరిలో విజేతగా నిలవాలంటే ప్రేక్షకులను ఆకట్టుకోవడం మాత్రమే సరిపోదు. హాలీవుడ్‌లో భారీ ప్రచార కార్యక్రమాలు కూడా చేపట్టాలి. అప్పుడే ఆ సినిమా ఆస్కార్ సభ్యుల దృష్టిని ఆకర్షించగలదు. అందుకే దర్శకనిర్మాతలు భారీగా ఖర్చు పెట్టి ప్రచారం చేస్తుంటారు. ఈ ఏడాది ప్రచార కార్యక్రమాలకు పెట్టిన మొత్తం ఖర్చు 100 మిలియన్ డాలర్లకు పైనే.

130 ఆస్కార్ వేడుకలో పాల్గొనేందుకు లాస్ ఏంజెలెస్ నగరానికి ప్రపంచం నలుమూలల నుంచి వేల సంఖ్యలో సినీ ప్రముఖులు, సినీ ప్రియులు వస్తుంటారు. దీంతో పాటు ఆస్కార్ సంబరాలకు ముందు, తర్వాత ఇక్కడ ఎన్నో వినోద కార్యక్రమాలు జరుగుతుంటాయి. వీటి ద్వారా లాస్ ఏంజెలెస్‌కు భారీగా ఆదాయం సమకూరుతుంది. వార్షికాదాయంలో సుమారు 130 మిలియన్ డాలర్ల హెచ్చుదల కనిపిస్తుందని అంచనా.

225 కన్నుల పండువలా జరిగే ఆస్కార్ వేడుకను ప్రత్యక్షంగా చూడాలని సినీ ప్రియులు ఆశపడుతుంటారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తుంటారు. ఈసారి 225 దేశాల్లో ఆస్కార్ వేడుక ప్రత్యక్ష ప్రసారం కానుంది.

900 విజేతలు ఎంతో గర్వంగా ముద్దాడే ఆస్కార్ ప్రతిమ బంగారు వర్ణంలో మిరిమిట్లు గొలుపుతూ ఎంతో చూడముచ్చటగా ఉంటుంది. నిజానికి అది పూర్తిస్థాయి బంగారంతో చేసింది కాదు. వెండితో తయారు చేసి పైన 24 కారెట్ బంగారు ప్లేటు అమర్చుతారు. ఒక్కో ఆస్కార్ ప్రతిమ తయారీకయ్యే ఖర్చు 900 డాలర్లు.

24700 ఆస్కార్ వేడుకలో ప్రత్యేకాకర్షణగా నిలిచేది విశాలమైన రెడ్ కార్పెట్. అతిథులుగా విచ్చేసిన తారలంతా రెడ్ కార్పెట్‌పై నడుస్తూ హొయలుపోతుంటారు. ఆ రెడ్ కార్పెట్ విస్తీర్ణం 16500 చదరపు అడుగులు. దానికయ్యే వ్యయమే 24700 డాలర్లు.

3300 ఈ ఏడాది ఆస్కార్ వేడుకకు సువిశాలమైన డాల్బీ థియేటర్ వేదికగా నిలిచింది. ఇందులో 3300 మంది ఆహూతులు ఆసీనులై కార్యక్రమాన్ని వీక్షించే వెసలుబాటు ఉంది. ఆహూతులకు వారికి కేటాయించిన సీట్లలో కూర్చొనేందుకు 60 మంది సహాయకులను(ఉషర్లు) నియమించారు.

మధ్యలో ఆపేస్తే బరువు పెరుగుతామా?

కసరత్తులు చేసే విషయంలో చాలా అపోహలుంటాయి. దాని వల్ల కొంతమంది వ్యాయామం చేయడానికి పూర్తిగా దూరమవుతారు. మరికొందరు వ్యాయామం చేయాల్సిన అవసరమే లేదనుకుంటారు. అసలు ఆ అపోహలేంటో, వాస్తవాలేంటో ఒకసారి చూద్దామా!



■ **అపోహ:** సన్నగా ఉన్నవాళ్లు వ్యాయామం చేయాల్సిన అవసరం లేదు.

వాస్తవం: కసరత్తులు కేవలం బరువు తగ్గడానికే కాదు. శరీరం దృఢంగా తయారవడానికీ అవసరమే. లావుగా లేకపోయినా సరే ఆరోగ్యంగా ఉండటానికి రోజువారి దినచర్యలో కాసేపైనా వ్యాయామం చేయాల్సిందే. అంతేగానీ, లావుగా ఉన్నవాళ్లే వ్యాయామం చేయాలన్న నిబంధన లేదు.

■ **అపోహ:** ఉన్నట్టుండి వ్యాయామం చేయడం, జిమ్‌కు వెళ్లడం మానేస్తే బరువు పెరుగుతారు.

వాస్తవం: క్రమం తప్పకుండా వ్యాయామం చేసి మధ్యలో మానేసినప్పుడు చాలా మందిలో ఇలా జరుగుతుంది. కానీ దానికి మన ఆహారంలో మార్పులు చేసుకోకపోవడమే ముఖ్య కారణం. వ్యాయామం చేస్తున్నప్పుడు శరీరానికి ఎక్కువ శక్తి అవసరం. అందుకే ఆహారం కూడా ఎక్కువగా తీసుకోవడం అలవాటవుతుంది. వ్యాయామం మానేశాక కూడా ఆహారంలో మార్పులు చేసుకోకపోతే... అవసరానికి మించిన కెలొరీలు అంది తొందరగా బరువు పెరిగిపోతాం. మితంగా ఆహారం తింటూ, ఎంతోకొంత వ్యాయామం చేస్తే సరిపోతుంది.

■ **అపోహ:** కనీసం గంట సేపు కసరత్తులు చేస్తేనే సరైన ఫలితాలు పొందొచ్చు.

వాస్తవం : గంటసేపు వ్యాయామం చేస్తేనే మంచి ఫలితాలుంటాయనేది అపోహ మాత్రమే. చాలా మంది అంత సమయం ఉండదని వ్యాయామం చేయడమే మొదలుపెట్టరు. సమయం ఎక్కువ లేదని వ్యాయామం చేయకుండా ఉండటం కన్నా పది నిమిషాలు దొరకినా ఉపయోగించుకుంటే మంచిది. ఒకేసారి గంటసేపు కేటాయించలేకపోతే పది నిమిషాల విడతల్లో రోజులో మూడు సార్లు వ్యాయామం చేసినా మంచి ఫలితాలుంటాయని చాలా అధ్యయనాలు తేల్చాయి. ఇలా వారం మొత్తం కలిపి కనీసం 250 నిమిషాలు వ్యాయామం కోసం కేటాయిస్తే చాలు.

జుట్టుకు సి విటమిన్



జుట్టు ఎక్కువగా రాలిపోవడం, పెరగకపోవడానికి మన ఆహారంలో లోపాలే ముఖ్య కారణం కావచ్చు. అసలు జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పకుండా తీసుకోవాల్సిన మూలకాలు కొన్ని ఉన్నాయి. అవేంటో, అవి ఎందులో పుష్కలంగా ఉంటాయో ఒకసారి చూద్దాం!

- ఖనిజాలూ విటమిన్లతో పాటూ జుట్టు ఎదుగుదలకు ముఖ్యంగా కావాల్సినవి మాంసకృత్తులు. వెంట్రుక మొత్తం ప్రొటీన్‌తోనే తయారవుతుంది. మాంసాహారులకు చేపలూ, చికెన్, గుడ్ల నుంచి ఇది కావాల్సిన మోతాదులో అందుతుంది. శాకాహారులు మాత్రం ఎక్కువగా పాలకూర, బీన్స్ తీసుకోడానికి ప్రయత్నించాలి.
- శరీర భాగాలన్నింటికీ సరిగ్గా రక్తం సరఫరా చేయడంలో ఇనుముదే కీలక పాత్ర. ఇది జుట్టు కుదుళ్లకు రక్తం అందేలా చేసి దృఢంగా మార్చడమే కాదు, వేగంగా పెరిగేలా చేస్తుంది. జుట్టు నిర్జీవంగా, సన్నగా అవ్వడానికి ఇనుములోపం కూడా కారణమే. ఎండుఫలాలూ, ఆప్రికాట్‌లూ, గుడ్లూ, పాలకూరా, మాంసంలో ఇది పుష్కలంగా ఉంటుంది.
- జుట్టు రాలిపోవడానికి మరో కారణం బయోటిన్ లోపం. ఇది సరైన స్థాయిలో ఉంటే జుట్టు బలహీనంగా మారడం, తెగిపోవడం లాంటి సమస్యలుండవు. ప్రొటీన్‌ను విడగొట్టి అమైనో ఆమ్లాలూ, గ్లుకోజ్‌గా మార్చడంలో దీనిదే ప్రధానపాత్ర. ఇది జుట్టు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పీనట్‌బటర్, చేపలూ, పుట్టగొడుగులను ఆహారంలో ఎక్కువగా చేర్చుకుంటే శరీరంలో బయోటిన్ స్థాయి సరిగ్గా ఉంటుంది.



- విటమిన్-ఇ ని బ్యూటీ విటమిన్ అంటారు. ఇది శరీరానికి సరిగ్గా అందితే జుట్టు పొడవుగా, ఆరోగ్యంగా ఉంటుంది. బాదంగింజల్లో ఈ పోషకం ఎక్కువగా ఉంటుంది. దీన్ని ఆహారంలో చేర్చుకోవడమే కాదు నేరుగా తలకు కూడా పట్టించుకోవచ్చు. రెండు విటమిన్-ఇ క్యాప్సిల్స్‌ను కొబ్బరినూనెలో కలిపి మాడుకు రాసుకొని అరగంట తర్వాత కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే జుట్టుకు రక్తం, ప్రాణవాయువు సరఫరా మెరుగుపడుతుంది.
- ఆహారంలో కావాల్సినంత ఇనుమును తీసుకున్నా కూడా దాన్ని గ్రహించి రక్తంలో చేర్చేది విటమిన్-సి. దీని వల్ల జుట్టు బలంగా మారుతుంది. ఇది నిమ్మజాతి పండ్లలో ఎక్కువగా లభిస్తుంది. కొన్ని సౌందర్య ఉత్పత్తులను కూడా విటమిన్-సి ఉండేలా తయారుచేస్తున్నారు. అలాంటి వాటిని ఎంచుకున్నా మంచి ఫలితం ఉంటుంది.

పిల్లలు పుట్టినప్పటి నుంచీ టీకాలు వేయించడం... చిన్న అనారోగ్యం చేసినా వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లడం... తన బాధ్యత అనుకుంటుందా తల్లి. మరి ఆమె సంగతి... ఏదో పెద్ద జబ్బు చేసినప్పుడే ఆసుపత్రికి వెళ్లడం కాదు. వ్యక్తిగతంగా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ముందునుంచీ తన ఆరోగ్యాన్ని కాపాడుకోగలగడం కూడా తెలిసుండాలి. అప్పుడే ఆమె ఇంటిల్లిపాదినీ చూసుకోవచ్చు. అదెలాగంటే... యౌవనం, పునరుత్పత్తి దశ, మధ్య వయసు, మెనోపాజ్... ఇలా మహిళలకు దశలవారీగా ప్రత్యేకమైన అవసరాలు ఉంటాయి. తదనుగుణంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ముఖ్యంగా ఏ పరీక్షలు, ఎప్పుడు, ఎందుకు చేయించుకోవాలో తెలుసుకోవాలి.

ఈ పరీక్షలు...

మన ఆరోగ్యానికి రక్ష!



కౌమారం నుంచీ... ఏడాదికోసారి పరీక్షలు చేయించుకోవడం ముఖ్యం. ఎటువంటివీ అనేది వయసూ, కుటుంబ ఆరోగ్య చరిత్ర, రిస్క్‌ఫ్యాక్టర్లను బట్టీ ఉంటుంది. ముఖ్యంగా కనీసం ఏడాదికోసారి శారీరకంగా పరీక్ష చేయించుకోవడం మంచిది. అలాగే పరిస్థితిని బట్టీ అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరి.

శారీరక పరీక్ష: ఎత్తూ, బరువూ, బీఎంఐ, గుండె కొట్టుకునే వేగం, రక్తపోటు.. వీటన్నింటినీ పరీక్షిస్తారు. ఒకవేళ ఆమె వయసు 21 సంవత్సరాలు దాటినా, పెళ్లయి సంసార జీవితం గడుపుతున్నా పొట్ట పరీక్ష, కటివలయ (పెల్విక్ ఎగ్జామినేషన్) పరీక్ష చేయించుకోవాలి. ఎత్తుకు తగ్గ బరువుండాలి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే బీఎంఐ 18 - 23 లోపు ఉండాలి. అంతకన్నా తక్కువ ఉన్నా లేదా ఎక్కువగా ఉన్నా సమస్యలు రావచ్చు. ముఖ్యంగా ఎక్కువగా ఉన్నప్పుడు అధికరక్తపోటూ, మధుమేహం, గుండెజబ్బులు వంటివి ఎదురుకావచ్చు. పొట్ట పరీక్షతో లోపల నీరు చేరినా, గడ్డలున్నా, లివర్, స్ప్లీన్, గర్భాశయం వంటి పరిమాణం పెరిగినా తెలుసుకోవచ్చు. కటివలయ పరీక్షలో స్త్రీల జననేంద్రియాల ఆరోగ్యాన్ని అంచనా వేస్తారు.

స్క్రీనింగ్ పరీక్షలు...

ఈ పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవడం ద్వారా ముప్పును అంచనా వేయొచ్చు. వాటిల్లో ఇవి ముఖ్యం.

పాప్‌స్మియర్: గర్భాశయ ముఖద్వారానికి వచ్చే క్యాన్సర్‌ని గుర్తించడానికి చేసే చాలా ముఖ్యమైన పరీక్ష ఇది. ఇందులో గర్భాశయ ముఖద్వారం నుంచి కొన్ని కణాలను సేకరించి, పరీక్షిస్తారు. దీంతో క్యాన్సర్ రావడానికి ఐదు నుంచి పది సంవత్సరాల ముందుగానే గుర్తించవచ్చు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ భారతీయ స్త్రీలల్లో అత్యంత సాధారణంగా కనిపిస్తుంది. అందుకే కలయిక మొదలుపెట్టిన సంవత్సరం తరువాతి నుంచీ, లేదా ఇరవైఒక్క సంవత్సరాల నుంచీ చేయించుకోవాలి. ప్రతి రెండు మూడు సంవత్సరాలకోసారి చేయించుకుంటూ ఉండాలి. అప్పుడే క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి, రాకుండానే నివారించవచ్చు. ఇప్పుడు మనకు పాప్‌స్మియర్‌తోపాటు హెచ్‌పీవీ (హ్యూమన్‌పాపిలోమా వైరస్) పరీక్ష కూడా అందుబాటులో ఉంది. దీన్ని ఐదేళ్లకోసారి చేయించుకుంటే క్యాన్సర్ ముప్పును ముందుగానే పసిగట్టవచ్చు.

మామోగ్రాఫీ: దీనిద్వారా రొమ్ముక్యాన్సర్‌ని ప్రారంభదశలోనే గుర్తించొచ్చు. సాధారణంగా అయితే దీన్ని నలభై ఏళ్ల నుంచీ చేయించుకోవాలి. అయితే కుటుంబంలో ఎవరైనా క్యాన్సర్ బాధితులు ఉన్నా... రిస్క్‌ఫ్యాక్టర్స్ ఉంటే గనుక అంతకన్నా ముందునుంచీ చేయించుకోవాలి. అలాగే ప్రతి రెండుమూడేళ్లకోసారి చేయించుకోవాలి. దీన్ని ప్రత్యేకమైన ఎక్సరే, ఆ తరువాత అల్ట్రాసౌండ్ స్కాన్ ద్వారా చేస్తారు. అలాగే స్వీయ రొమ్ము పరీక్ష చేసుకోవడం కూడా తెలిసుండాలి. నెలసరి అయిపోయిన వెంటనే రొమ్ముల్ని చేతులతో తాకి పరీక్షించుకోవడం వల్ల తేడాలు ఏమైనా ఉంటే గమనించుకోవచ్చు.

సుఖవ్యాధులు: అపరిచితులతో శృంగార సంబంధాలు ఉన్నవారికీ, అసురక్షితంగా శృంగారంలో పాల్గొనేవారికీ క్లమీడియా, సిఫిలిస్, గొనోకాకస్, ట్రైకోమొనాస్, హెర్పిస్ వంటి ఇతర ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుంది. అనుమానం ఉన్నప్పుడు వీటికి సంబంధించిన ఎస్‌టీడీ స్క్రీన్ పరీక్షల ద్వారా ఎటువంటి ఇన్‌ఫెక్షన్ ఉందో తెలుసుకుని చికిత్స తీసుకోవాలి.



డాక్టర్ వై. సవితాదేవి
గైనకాలజిస్ట్

గుండె ఆరోగ్యానికి: పద్దెనిమిది సంవత్సరాలు దాటాక ప్రతి రెండేళ్లకోసారి అధికరక్తపోటు పరీక్ష చేయించుకోవాలి. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా హైబీపీ, పక్షవాతం, గుండెపోటు... వంటి సమస్యలు ఉన్నప్పుడు ప్రతి ఆర్నెల్లకోసారి పరీక్ష చేయించుకోవాలి. అధిక బరువూ గుండెజబ్బులకు కారణమే. అందుకే బరువున్నవారు రెండేళ్లకోసారి బీఎంఐ, నడుము చుట్టుకొలతను అంచనా వేసుకోవాలి.

రక్తపరీక్ష: కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ల స్థాయిలు ఎక్కువగా ఉంటే, అవి గుండె జబ్బులకు దారితీస్తాయి. అందుకే నలభైఏళ్లు దాటాక కనీసం ఒకటి లేదా రెండేళ్లకోసారి వాటికి సంబంధించిన పరీక్షలూ తప్పనిసరి.

మధుమేహం కోసం: వయసు నలభైఅయిదు దాటడం, బీఎంఐ ముప్ఫై కన్నా ఎక్కువగా ఉండటం, గర్భం దాల్చినప్పుడు జస్టేషనల్ డయాబిటీస్, పీసీఓఎస్, కుటుంబంలో మధుమేహం... ఇవన్నీ ఆ సమస్యకు కారణమే. ఇలాంటివారు పరగడుపున రక్తపరీక్ష చేయించుకోవాలి. రక్తంలో చక్కెరశాతం 100 లోపు వస్తే.. భయపడక్కర్లేదు. గ్లూకోజ్ ఛాలెంజ్ టెస్ట్ ద్వారా కూడా మధుమేహం ఉందో లేదో చెబుతారు.

ఎముకల దృఢత్వం కోసం: వయసుపైబడిన స్త్రీలల్లో అత్యంత సాధారణంగా కనిపించే సమస్య ఆస్టియోపోరోసిస్. అంటే ఎముకలు గుల్లబారతాయి. ఏ మాత్రం జారి కిందపడినా, ఒక్కోసారి కాలు మెలికపడినా ఫ్రాక్చర్లు అవుతాయి. అందుకే బాగా సన్నగా ఉన్నవారూ, వయసు నలభైఅయిదు పైన ఉన్నవారూ, మెనోపాజ్ దశకు చేరుకున్నవారూ, ఉబ్బసంతో బాధపడేవారూ, స్టిరాయిడ్లు ఎక్కువగా తీసుకునేవారు కాస్త అప్రమత్తంగా ఉండాలి. ఇది జన్యుపరంగా కూడా రావచ్చు. మెనోపాజ్ తరువాత ప్రతి స్త్రీలో ఎముకల సాంద్రత తగ్గుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ బోన్‌డెన్సిటీ (డెక్సా) పరీక్ష చేయించుకోవాలి. ఒకవేళ ఎముకల దృఢంగా ఉంటే మూడేళ్ల తరువాత చేయించుకోవాలి.

బవెల్ క్యాన్సర్: ఇది పేగులకు సంబంధించిన క్యాన్సర్. మలంలో రక్తం పోవడాన్ని గుర్తించే అక్కల్ట్ బ్లడ్ టెస్ట్ చేయడం వల్ల దీన్ని గుర్తించొచ్చు. ఆ రిస్క్ ఉన్నవారు రెండేళ్లకోసారి చేయించుకోవడం మంచిది.

ఇవీ తప్పనిసరే...

పై పరీక్షలన్నీ ఒకెత్తయితే... అదనంగా చేయించుకోవాల్సినవీ కొన్ని ఉన్నాయి.

టీకాలు: ప్రపంచవ్యాప్త అధ్యయనాలు యుక్త వయసులో అమ్మాయిలకూ, వయసుమీరిన వారికీ ఇవ్వాల్సిన టీకాలూ ముఖ్యమేనని చెబుతున్నాయి. యుక్త వయసులో ఉన్న అమ్మాయిలకు తల్లులు కాబోయే సమయం దగ్గర పడుతుంది కాబట్టి కొన్నిరకాల టీకాలు మళ్లీ ఇవ్వడం మంచిది. వాటిల్లో ముఖ్యమైనది టీ డాప్ (ధనుర్వాతం, డిఫ్తీరియా, కోరింత దగ్గు), రుబెల్లా, హెపటైటిస్ బీ తీసుకోవాలి. వీటిని బూస్టర్ డోస్‌లు అంటారు. అలాగే పది పన్నెండు సంవత్సరాలకు హెచ్‌పీవీ టీకా కూడా ఇవ్వాల్సి ఉంటుంది. యాభైఏళ్లు దాటిన స్త్రీలకు వ్యాధినిరోధకశక్తి తగ్గడం వల్ల ఇన్‌ఫెక్షన్లు సర్వసాధారణం. అందుకే ఇన్‌ఫ్లుయెంజా, హెర్పిస్ జోస్టర్, న్యూమోకాకస్.. వంటి టీకాలూ తప్పనిసరే.

మానసిక ఆరోగ్యం: పురుషుల కన్నా స్త్రీలల్లోనే మానసిక సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ఎప్పుడయినా ఆందోళనగా అనిపించినా, అలసటా, మూడ్స్ స్వింగ్స్.. నిద్రపట్టకపోవడం, ఆకలి లేకపోవడం, అతిగా తినాలని అనిపించడం.. వంటి సంకేతాలు కనిపిస్తే.. మానసిక నిపుణుల సలహా తీసుకోవాలి.

ఇవి కాకుండా కళ్లూ, పళ్ల ఆరోగ్యాన్ని కూడా గమనించుకోవాలి.

నజరానా



బంగాళా దుంపలను ఉడికించేటప్పుడు కొన్ని ఉల్లిపాయ ముక్కలూ, వెల్లులి రెబ్బలు వేయాలి. ఇలా చేస్తే కూరకు మంచి వాసన రావడమే కాకుండా రుచిగానూ ఉంటుంది.

అమ్మానాన్నలే కేసు పెట్టారు...

■ నాకు పదిహేడేళ్లప్పుడే పెళ్లయ్యింది. కానీ కొన్నాళ్లకే ఇద్దరి మధ్య పొరపచ్చాలు రావడంతో ఆ తరువాత రెండేళ్లకు విడాకులు తీసుకున్నాం. ఆ విషయాన్ని మా ఇంట్లో చెప్పలేదు. నా భర్తే నాకోసం మరో సంబంధం వెతికాడు. అత్తామామయ్యలే తల్లిదండ్రులుగా నాకు మరోపెళ్లి చేశారు. నన్ను చదివించారు కూడా. కానీ ఇప్పుడు మా ఇంట్లో వాళ్లు నా మొదటి భర్త తల్లిదండ్రులపై నన్ను బెదిరించి వేరే పెళ్లి చేశారని కేసుపెట్టారు. అన్నీ తెలిసే నన్ను రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తినీ బెదిరిస్తున్నారు. ఈ పెళ్లి చేసుకున్నందుకు అమ్మానాన్నల ఆస్తి కూడా రాదంటున్నారు. ఈ సమస్యని ఎదుర్కొనేదెలా? - ఓ సోదరి

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

● మీది చాలా సున్నితమైన సమస్య. తల్లిదండ్రులకు చెప్పకుండా మీ అత్తగారు వాళ్లు అంత కఠినమైన నిర్ణయం తీసుకోవడం సరైంది కాదు. మీ భర్తకూ మీకూ పొసగనప్పుడు విడాకులు తీసుకునేముందైనా మీ అమ్మానాన్నలకు ఒకసారి చెప్పాల్సింది. కనీసం రెండో పెళ్లి చేసుకున్న తర్వాతైనా మీరు సుఖంగా ఉన్న సంగతీ వాళ్లకు చెప్పలేదా? మీకు చెప్పకుండానే మీమీద కేసు పెట్టారంటే మీమధ్య అసలు మాటలే లేనట్లున్నాయి. మీరు గనుక అప్పుడే అన్ని విషయాలు చెప్పేసి ఉంటే ఏ సమస్యా ఉండేది కాదు. ఇప్పుడు ఈ కేసునుంచి మీ అత్తామామల్ని బయట పడేయాల్సిన బాధ్యత మీమీదే ఉంది. ఇప్పటికైనా మీ అమ్మానాన్నల్ని కలవండి. మీ అత్తగారి వాళ్ల తప్పేం లేదనీ, ఇష్టపూర్వకంగానే రెండోపెళ్లి చేసుకున్నాననీ, ఇప్పుడు సుఖంగా ఉన్నాననీ వివరించేందుకు ప్రయత్నించండి. విడాకుల విషయం వాళ్లతో చెప్పడానికి భయమేసి అత్తామామల మద్దతు తీసుకున్నానని తెలియజేయండి. అయినా వాళ్లకోపం తగ్గకపోతే ఇవేవీ బలవంతంగా జరగలేదన్న విషయం కోర్టులో మీరే నిరూపించాల్సి ఉంటుంది. రెండో పెళ్లికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కాగితాలూ, మొదటి పెళ్లికి సంబంధించిన విడాకుల కాగితాలు సాక్ష్యాలుగా సమర్పించాల్సి ఉంటుంది. మీ తల్లిదండ్రులు చీటింగ్ కేసు పెట్టి ఉండొచ్చు. లేదా బలవంతపు పెళ్లి గురించి కేసు పెట్టి ఉండొచ్చు. మీరిప్పుడు మేజర్! బలవంతపు పెళ్లి మేజర్లకు జరిగితే ఆ అమ్మాయి మాత్రమే ఫిర్యాదు చెయ్యాలి. వేరే వాళ్లు కేసు పెట్టినా దాన్ని పరిగణలోకి తీసుకోరు. ఇక ఆస్తి విషయానికొస్తే దానికి మీ రెండో పెళ్లి ఎలాంటి అడ్డంకీ కాదు.

– మీ సందేహాలను, సమస్యల్ని **vasulegal@eenadu.net** కు పంపించగలరు.

వీళ్ల లక్ష్యం మిస్‌ఇండియా!

ఈ ఇద్దరి నేపథ్యాలూ, ప్రాంతాలు వేరు. ఒకరు డాక్టరయితే, మరొకరు ఇంటీరియర్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. కానీ ఇద్దరూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మిస్ ఇండియా అందాల పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఆ ప్రతిభావనులే భాస్కరాల సాయి కామాక్షి, కామవరపు శ్రేయారావు. ఈ ఏడాది జూన్‌లో జరుగనున్న మిస్ ఇండియా పోటీలకు ప్రస్తుతం సిద్ధమవుతున్న వీళ్లు... అసలు ఇటువైపు ఎందుకు, ఎలా వచ్చారో వివరించారిలా.

ఎనభైమందిలో ఒకరిగా...

– భాస్కరాల సాయి కామాక్షి.

❑ ఫెమీనా మిస్ ఇండియా - 2018 పోటీలకు మిస్ తెలంగాణగా ఎంపికవుతానని అనుకోలేదు. అమ్మా, నాన్న, అన్నయ్య, నేనూ.. ఇదీ మా కుటుంబం. చెన్నై మా సొంతూరు అయినా నా చిన్నప్పుడే హైదరాబాద్ వచ్చేశాం. ఇంటర్ ఇక్కడే చదివా. మెడిసిన్ కిందటేడాదే పూర్తిచేశా.

❑ వైద్యం చేస్తూనే ఓ అయిదు లఘుచిత్రాల్లో కూడా నటించా. మిస్ ఇండియా పోటీల గురించి తెలిసి ప్రయత్నిద్దామని అనిపించింది. కానీ నేనే 'మిస్ ఇండియా తెలంగాణా - 2018' గా గెలుస్తానని అనుకోలేదు.

❑ చిన్నప్పుడు నాకెదురైన చిన్న సమస్యే నన్ను ఒకవిధంగా ఇటువైపు నడిపించింది. ఎనిమిదేళ్లున్నప్పుడు బంధువు నుంచి లైంగికవేధింపులు ఎదుర్కొన్నా. ఎవరికి చెప్పుకోవాలో తెలియక బాగా ఒత్తిడికి లోనయ్యా. ఏదైనా సాధించి, అప్పుడు నా గొంతు విప్పాలనిపించేది. పూర్తిగా పుస్తకాల పురుగులా మారిపోయా. వైద్యరంగంలోకి వచ్చా.



❑ నాలా మరెవరూ బాధపడకూడదనే ఉద్దేశంతో 'వాయిస్ ఫర్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి పనిచేస్తున్నా. చిన్నవయసులోనే ఈ తరహా వేధింపులకు గురయ్యే చిన్నారుల్లో ధైర్యం నింపేందుకు ప్రయత్నిస్తున్నా. అసలు అలా లైంగిక వేధింపులకు గురికాకుండా ఉండేందుకు ఏం చేయాలనేదీ చెబుతున్నా.

❑ మూడేళ్ల క్రితం ఐశ్వర్యారాయ్, ప్రియాంకాచోప్రా వీడియోలు చూశాక నాకూ అందాల పోటీలకు వెళ్లాలని అనిపించింది. అందుకే దరఖాస్తు చేసుకున్నా. ఫిట్‌నెస్ పట్ల అవగాహన ఉంది. మరికొంత శిక్షణ తీసుకున్నా. దాదాపు 80 మందిలో ఎంపికైన ముగ్గురిలో ఒకరిగా నిలిచా. మాకు రకుల్‌ప్రీత్‌సింగ్ మెంటర్‌గా వ్యవహరించారు. జూన్ మూడోవారంలో మిస్ ఇండియా పోటీలకు వెళ్లబోతున్నా. అక్కడ గెలవడమే నా ధ్యేయం.

స్నేహితుల సలహాతో...

– కామవరపు శ్రేయారావు

❑ మాది కాకినాడ. అయితే చదువంతా హైదరాబాద్‌లోనే. నాన్న ఛార్టెడ్ అకౌంటెంట్. నేనొక్కదాన్నే. ఆడపిల్లలకు చదువు చాలా ముఖ్యమని చెబుతుంది అమ్మ. నేను కాస్త భిన్నంగా ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సును ఎంచుకుని పూర్తిచేశా. మూడో ఏడాదిలో అనుకుంటా నా స్నేహితురాళ్లు కొందరు మిస్ ఇండియా పోటీల్లో పాల్గొన్నారు. వాళ్లందరికన్నా నేను పొడవు కావడంతో నన్నూ పోటీచేయమనేవారు. నాకు అవన్నీ సరిపడవు అనుకుని వదిలేశా.

❑ చదువయ్యాక ఉద్యోగం చేస్తూనే ఆటిజం పిల్లల కోసం పని చేస్తున్నా. ఈసారి స్నేహితులు మరోసారి చెప్పడంతో ప్రయత్నిద్దాం అనిపించింది. గతేడాది తెలంగాణా తరపున కొంచెం శిక్షణ తీసుకుని, పోటీ చేశాను. టాప్ 3 లో ఒకరిగా ఎంపికయ్యా. కానీ గెలవలేదు. ఈ ఏడాది మిస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ తరపున పోటీకి దరఖాస్తు చేశా.



❑ ఫిట్‌నెస్‌ను పెంచుకొని, సహజసిద్ధంగా సన్నబడాలనుకున్నా. ఉద్యోగానికి వెళ్తూనే వ్యాయామం చేసేదాన్ని. గత నెలలో జరిగిన ఆడిషన్స్‌కు దాదాపు 90 మందికి పైగా వచ్చారు. నృత్యం, వ్యక్తిత్వం, సామర్థ్యం, ర్యాంప్‌వాక్ వంటి పలు అంశాల్లో పరీక్షలు జరిగితే టాప్ -3లో ఒకరిగా నిలిచా. జూన్‌లో జరిగే మిస్ ఇండియా పోటీలకు సిద్ధమవుతున్నా.

❑ బరువు ఒకేసారి తగ్గడానికి చికిత్సలు కాకుండా, సహజసిద్ధంగా ప్రయత్నించడమే ఆరోగ్యకరమనుకుంటా. ఇప్పుడు స్వీట్లూ, చాక్లెట్లు మానేసి పచ్చికూరగాయలూ, గ్రీన్‌టీ ఎక్కువగా తీసుకుంటున్నా. ఈత కూడా కొడతాను. ఊహించకుండానే అర్హత సాధించా. విజయం సాధించాలనే లక్ష్యంతో ఇప్పుడు ఇంకా కష్టపడుతున్నా.

ఒకేసారి నీళ్లు అందేలా...

ఎండలు పెరుగుతున్నాయి. మన ఇంటిముందు ఎంతో ఇష్టంగా పెంచుకున్న మొక్కలు త్వరగా వాడిపోకుండా ఉండాలంటే అవి ఆరోగ్యంగా పెరిగేందుకు చిన్నచిన్న ఏర్పాట్లు చేసుకోవడం తప్పనిసరి.



- ఒక ప్లాస్టిక్ సీసా తీసుకుని దానికి అడుగునా, లేదంటే అక్కడక్కడా చిన్న రంధ్రాలు చేయండి. అందులో నుంచి నీళ్లు ధారలా కాకుండా చుక్కలుగా వచ్చేలా ఉండాలి. మొక్కకు కావాల్సిన నీళ్లు అందులో నింపి ఈ సీసాలను మొక్క పక్కనున్న మట్టిలో పాతాలి. దీనిద్వారా మెల్లగా నీళ్లు అంది మొక్కలు ఎండిపోకుండా ఉంటాయి.
- మొక్కను కుండీలో పెంచుతుంటే... విరిగిపోయిన ప్యూమిస్ రాయిని ఇంకా చిన్న ముక్కలు చేసి ఆ మట్టిలో కలపాలి. ఇవి నీళ్లు పీల్చుకుని ఎక్కువసేపు మట్టి తడిగా ఉండేలా చేస్తాయి.
- చిన్న చిన్న అలంకరణ మొక్కలు నాలుగైదు కుండీల్లో పెంచుతుంటే వాటన్నింటికీ ఒకేసారి నీళ్లు అందేలా చేయొచ్చు. పెద్ద పాత్ర తీసుకుని నీళ్లు నింపాలి. దానిలో మందంగా ఉండే కాటన్ దారం లేదంటే దారంలా పేనిన కాటన్ వస్త్రం ఒక కొనను ఉంచాలి. ఇంకో కొన కుండీలో వేయాలి. ఇలా నాలుగైదు దారాలు అదే పాత్రలో వేసి వాటి కొనల్ని మిగతా మొక్కలున్న కుండీల్లో వేయొచ్చు. తడి తగ్గినప్పుడల్లా మట్టి ఆ దారం ద్వారా నీటిని పీల్చుకుంటుంది. అంటే ఇదొక వత్తిలాగా పనిచేస్తుందన్న మాట!
- కాస్త వెడల్పూ, లోతూ ఉన్న ట్రే తీసుకొని అందులో చిన్న చిన్న రాళ్లు నింపాలి. అవి పూర్తిగా మునిగేటట్లు నీళ్లు పోసి, ఇప్పుడందులో కుండీని పెట్టాలి. ఒక వేళ కుండీనుంచి నీళ్లు కారుతుంటే అవి ట్రేలోకి చేరతాయి. మొక్కకు నీళ్లు అవసరమైతే కుండీ ద్వారా ట్రేలో ఉన్న నీటిని పీల్చుకుంటుంది. నీరు వృథా కాదు. కుండీ మాత్రం మట్టితో చేసిందై ఉండాలి.
- మొక్కకు ఎక్కువ నీళ్లు అవసరమనిపిస్తే కొన్ని న్యూస్‌పేపర్లను నీళ్లలో తడిపి బంతుల్లా చేసి వాటిని మొక్క చుట్టూ ఉంచొచ్చు. దీని ద్వారా మొక్క చుట్టూ ఉన్న మట్టి ఎండిపోదు. మొక్క కూడా ఆరోగ్యంగా ఉంటుంది. గుర్తుంచుకోవల్సిన ముఖ్య విషయం ఏంటంటే.. అవసరాని కన్నా అతిగా నీళ్లు అందితే మొక్క పాడవుతుంది. ఇది దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయాలి.

శాస్త్రవేత్తలుగా, అధ్యాపకులుగా ఎదగాలనుకుంటున్నారా? అయితే కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రతిష్ఠాత్మక సైన్స్ విద్యాసంస్థలు అందించే డ్యూయల్ కోర్సులు మీకో మంచి అవకాశం! బైపీసీ వారే కాదు, ఎంపీసీ, ఎంబైపీసీ వారు కూడా ఈ సీట్లకు పోటీపడవచ్చు. ఐదేళ్ల ఈ కోర్సుల ప్రత్యేకతలేమిటి? వీటిలో చేరే మార్గం ఏమిటి? ప్రవేశపరీక్షకు ఎలా సిద్ధం కావాలి? తెలుసుకుందాం!

ఐఐఎస్ఈఆర్‌లో ప్రవేశాలు



ప్రవేశపరీక్షలో ప్రశ్నలన్నీ విద్యార్థుల విశ్లేషణ, తార్కిక సామర్థ్యాలను పరీక్షించేలా ఉండటం ఐఐఎస్ఈఆర్ ప్రత్యేకత. ప్రశ్నలు ఐఐటీ-జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ స్థాయిలో ఉంటాయి.

చక్కని భవితకు సైన్స్ భళా!

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) భారత ప్రభుత్వ అధీనంలో మానవ వనరుల అభివృద్ధి శాఖ విభాగంలో స్వతంత్రంగా పని చేసే విద్యాసంస్థలు. మన దేశంలో ఈ సంస్థలు బెరహంపూర్, భోపాల్, కోల్‌కతా, మొహాలీ, పుణె, తిరువనంతపురం, తిరుపతిల్లో ఉన్నాయి. ఈ 7 విద్యాసంస్థలూ సంయుక్తంగా 5 సంవత్సరాల డ్యూయల్ బ్యాచిలర్ సైన్స్- మాస్టర్ సైన్స్ కోర్సులను అందిస్తున్నాయి.



ఎస్. కిరణ్‌కుమార్
డైరెక్టర్, కెమ్‌బయోసిస్ కోచింగ్ సెంటర్

ఉన్నత ప్రమాణాలతో కూడిన సైన్స్ విద్య, పరిశోధన, శిక్షణ కోసం ఈ ఐఐఎస్ఈఆర్ విద్యాసంస్థలను మానవ వనరుల అభివృద్ధి శాఖ స్థాపించింది.

ఈ విద్యాసంస్థల్లో నాణ్యమైన, అధునాతన ప్రయోగశాలలు, జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్‌తో కూడిన అత్యాధునిక డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉంటాయి. పరిశోధన, బోధన రంగంలో విశేష అనుభవం కలిగిన అధ్యాపక బృందంతో శిక్షణ ఇస్తారు. ఫలితంగా సంబంధిత సైన్స్ కోర్సుల్లో శిక్షణ పూర్తిచేసినవారికి అధిక వేతనాలతో కూడిన ఉద్యోగావకాశాలుంటాయి. వీరు బోధన రంగంలో అధ్యాపకులుగా, పరిశోధన సంస్థలు, పరిశ్రమల్లో శాస్త్రవేత్తలుగా స్థిరపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

గత ఏడాది ఐఐఎస్ఈఆర్ విద్యార్థులు పొగలేని దీపావళి మందుగుండు సామగ్రి తయారీలో విజయం సాధించారు.

ఏ సబ్జెక్టుల్లో...

ఈ విద్యాసంస్థలు బేసిక్ సైన్స్ కోర్సులైన బయలాజికల్ సైన్స్, కెమికల్ సైన్స్, మేథమేటికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ మొదలైన సబ్జెక్టుల్లో 5 సంవత్సరాల డ్యూయల్ బీఎస్- ఎంఎస్ కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సుల్లో చేరటానికి 10+2లో ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీతోపాటు ఇతర విద్యార్థులూ అర్హులే.

ఐఐఎస్ఈఆర్- భోపాల్‌లో డ్యూయల్ బీఎస్- ఎంఎస్, ఇంజినీరింగ్ సైన్స్ కోర్సును కూడా ప్రవేశపెడుతున్నారు. ఈ కోర్సుకు 10+2లో మేథమేటిక్స్ చదివినవారు అర్హులు.

ఐఐఎస్ఈఆర్- భోపాల్ ఈ ఏడాది నుంచి బ్యాచిలర్ సైన్స్ ఇన్ ఎకనామిక్ సైన్స్ కోర్సును ప్రవేశపెడుతోంది. ఈ కోర్సుకి 10+2లో మేథమేటిక్స్ చదివిన వారు అర్హులు.

ఈ విద్యాసంస్థల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు మొదటి రెండేళ్లు అన్ని బేసిక్ సైన్స్‌ల్లో సమగ్రంగా శిక్షణనిస్తారు. తరువాతి రెండేళ్లు ఎంపిక చేసుకున్న స్పెషలైజ్‌డ్ సైన్స్ సబ్జెక్టుల్లో విస్తృత పరిశోధన, బోధన, శిక్షణనిస్తారు. చివరి (అయిదో) సంవత్సరంలో రిసెర్చ్ ప్రాజెక్టు కూడా ఉంటుంది.

ఐఐఎస్ఈఆర్‌లో వివిధ బేసిక్ సైన్సెస్‌లో సమాజ హితానికి దోహదపడే అనేక అంశాలపై విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ సంస్థలు పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సులను కూడా అందిస్తున్నాయి.

ఎక్కడ? ఎన్ని సీట్లు?

ఐఐఎస్ఈఆర్	సీట్ల సంఖ్య (2017)
బెరహంపూర్	100
భోపాల్	260
కోల్‌కతా	200
మొహాలీ	200
పుణె	200
తిరువనంతపురం	200
తిరుపతి	125

ఆప్టిట్యూడ్ పరీక్ష ఎలా?

ఈ పరీక్షకు ఎన్‌సీఈఆర్‌టీ 11, 12 తరగతుల బయాలజీ, మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సిలబస్‌ను ప్రామాణికంగా తీసుకున్నారు.

ఆప్టిట్యూడ్ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఈ ప్రశ్నపత్రంలో ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో మాత్రమే ఉంటాయి.

ఈ ప్రవేశపరీక్ష ప్రశ్నపత్రంలో 4 సబ్జెక్టుల్లో (బయాలజీ, మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) 15 ప్రశ్నల చొప్పున మొత్తం 60 ప్రశ్నలకు 3 గంటల సమయాన్ని ఇస్తారు. సరైన సమాధానం గుర్తించిన ప్రశ్నలకు +3 మార్కులు, ప్రతి తప్పు సమాధానానికి -1 రుణాత్మక మార్కులున్నాయి. గరిష్ఠ మార్కులు 180.

ఈ ఆప్టిట్యూడ్ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేయాలి. మన తెలుగు రాష్ట్రాల్లో గత ఏడాది హైదరాబాద్, విజయవాడ, తిరుపతిల్లో ఈ పరీక్షను నిర్వహిస్తారు. గత ఏడాది ఈ ఆప్టిట్యూడ్ పరీక్ష జూన్ 25న జరిగింది.

ఇలా తయారవ్వాలి

విద్యావిధానం సమగ్రంగా ఉంటుంది కాబట్టి ప్రవేశపరీక్షలు కూడా ఆ స్థాయిలోనే ఉంటాయి. ప్రశ్నలన్నీ విద్యార్థుల విశ్లేషణ, తార్కిక సామర్థ్యాలను పరీక్షించేలా ఉండటం ఐఐఎస్ఈఆర్ ప్రత్యేకత. ప్రశ్నలు ఐఐటీ-జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ స్థాయిలో ఉంటున్నాయి.

ఈ ప్రవేశపరీక్ష రాసేవారు మొదట ప్రాథమిక భావనలు, తెలుగు అకాడమీ, సీబీఎస్ఈ, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను రిఫర్ చేయాలి. బేసిక్ కాన్సెప్టులపై పట్టు సాధించాక అంశాలవారీగా రిఫరెన్స్ పుస్తకాల ద్వారా సబ్జెక్టును క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.

బయాలజీ: దీనిలో జనరల్ బయాలజీ, సెల్ బయాలజీ, జెనెటిక్స్, ఎకాలజీ అండ్ ఎవల్యూషన్, బయోటెక్నాలజీ, ఆనిమల్ ఫిజియాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, రిప్రొడక్షన్, డీఎన్ఏ ధర్మాలు, ఆర్‌డీఎన్ఏ టెక్నాలజీ, ట్రాన్స్‌లేషన్, ట్రాన్స్‌క్రిప్షన్ మొదలైన అంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడుగుతున్నారు. వీటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి.

కెమిస్ట్రీ: ఆర్గానిక్ కెమిస్ట్రీలో.. జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, రియాక్షన్ మెకానిజం, స్టీరియో కెమిస్ట్రీ, నేమ్‌డ్ రియాక్షన్స్, ఎరోమ్యాటిసిటీ, కార్బోహైడ్రేట్స్, అమైనో యాసిడ్స్, పాలిమర్స్, ఫిజికల్ కెమిస్ట్రీలో మోల్ కాన్సెప్ట్, సొల్యూషన్స్, సాలిడ్ స్టేట్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, కెమికల్ కైనెటిక్స్, థర్మోడైనమిక్స్ సంబంధిత అంశాలను అధ్యయనం చేయాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో పిరియాడిక్ ప్రాపర్టీస్, రసాయన బంధం, సంశ్లిష్ట సమ్మేళనాలు, ఎస్, పి బ్లాక్ మూలకాలు, డి, ఎఫ్ బ్లాక్ మూలకాలు, మెటలర్జీ మొదలైనవాటిపై దృష్టి అవసరం.

ఫిజిక్స్: జనరల్ ఫిజిక్స్, ఆప్టిక్స్, మోడరన్ ఫిజిక్స్, ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజమ్, మెకానిక్స్ సంబంధిత సిలబస్‌ను అనువర్తిత ధోరణిలో శ్రద్ధగా అధ్యయనం చేయాలి.

మేథమేటిక్స్: దీనిలో కాలిక్యులస్, త్రికోణమితి, కోఆర్డినేట్ జామెట్రీ, ఆల్జీబ్రా, వెక్టర్స్ సంబంధిత సిలబస్‌ను క్షుణ్ణంగా సాధన చేయాలి.

బట్టీ ధోరణిలో కాకుండా సబ్జెక్టును అవగాహన చేసుకుని విభిన్న అంశాలను అన్వయించగలిగితే విజయం సాధ్యపడుతుంది. సబ్జెక్టును ఇష్టపడి చదవాలి. సానుకూల దృక్పథంతో కృషి చేస్తే ఆశించిన ర్యాంకు సాధించవచ్చు. మాదిరి ప్రశ్నపత్రాలకు www.iiseradmission.in ను చూడవచ్చు.



మూడు దారులు

ఈ విద్యాసంస్థల్లో ప్రవేశానికి మూడు రకాల ప్రవేశ మార్గాలున్నాయి.

1 2018-19 విద్యా సంవత్సరానికి ప్రామాణికమైన కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై) ఫెలోషిప్ పొందిన విద్యార్థులు అర్హులు (కటాఫ్ కూడా ఉండొచ్చు).

2 జేఈఈ అడ్వాన్స్‌డ్ 2018లో కామన్ ర్యాంకు జాబితాలో 10,000 కన్నా తక్కువ ర్యాంకు సాధించిన జనరల్ అభ్యర్థులు, రిజర్వ్ కేటగిరీ వారి కేటగిరీ ర్యాంకులో 10,000 కన్నా తక్కువ ర్యాంకు సాధించినవారు మాత్రమే అర్హులు.

3 స్టేట్ అండ్ సెంట్రల్ బోర్డ్ (ఎస్‌సీబీ) మార్గంలో 2017, 2018ల్లో 10+2 విధానంలో సైన్స్ విభాగంలో సంబంధిత బోర్డు నిర్దేశించిన కటాఫ్ మార్కు లేదా అంతకన్నా ఎక్కువ సాధించిన వారు అర్హులు.

ఐఐఎస్ఈఆర్ 2017 ఎస్‌సీబీ మార్గంలో మన తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు విద్యార్థులకు 97.3%, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డు వారికి 95.4% కటాఫ్ మార్కుగా నిర్ణయించారు.

ఈ విద్యాసంస్థలో గరిష్ఠంగా 50% సీట్లను కేవీపీవై, జేఈఈ ద్వారా భర్తీ చేస్తారు. ఈ మార్గంలో మిగిలిన సీట్లతోపాటు మిగిలిన 50% సీట్లను ఎస్‌సీబీ మార్గంలో అర్హత పొందిన విద్యార్థులకు ఐఐఎస్ఈఆర్ ప్రత్యేక ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో చూపించే ప్రతిభ ఆధారంగా భర్తీ చేస్తారు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

సాయుధ బలగాల్లో 1223 ఎస్ఐ, ఏఎస్ఐ పోస్టులు

నియామక సంస్థ: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ). **విభాగాలవారీ ఖాళీలు:** దిల్లీ పోలీస్‌లో ఎస్ఐ-150, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్‌లో ఎస్ఐ-1073, సీఐఎస్ఎఫ్‌లో ఎస్ఐ, ఏఎస్ఐ ఖాళీలను తర్వాత ప్రకటిస్తారు.
అర్హత: ఏదైనా డిగ్రీ, నిర్దేశించిన శారీరక ప్రమాణాలు, పురుష అభ్యర్థులకు లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్.
వయసు: 01.08.2018 నాటికి 20-25 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** రెండంచెల రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్/ ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ద్వారా.
రాతపరీక్ష తేదీలు: పేపర్ 1: 2018 జూన్ 4 నుంచి 10 వరకు, పేపర్ 2: 2018 డిసెంబరు 1.
దరఖాస్తు: ఆన్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ.100
చివరితేది: 02.04.2018 **వెబ్‌సైట్:** www.ssconline.nic.in

ఎంసీఈఎంఈ ఆర్మీ ప్రీ ప్రైమరీ స్కూల్

పాఠశాల: సికింద్రాబాద్ తిరుమలగిరిలోని మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ (ఎంసీఈఎంఈ)కి చెందిన ఆర్మీ ప్రీ ప్రైమరీ స్కూల్ **పోస్టులు:** టీచర్, క్లర్క్ తదితరాలు. **ఖాళీలు:** 11
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, బీఈడీ, పీజీ, ఇతర అర్హతలు. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. దరఖాస్తులు పాఠశాల కార్యాలయంలో అందుబాటులో ఉంటాయి. **చివరితేది:** 20.03.2018. **వెబ్‌సైట్:** http://www.mcemeapps.com/

ఫెలోషిప్స్

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్, జూన్ 2018

అర్హత: ఆయా సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణత.
పరీక్ష నిర్వహించనున్న విభాగాలు: 1) లైఫ్ సైన్సెస్ 2) ఎర్త్, అట్మాస్ఫిరిక్, ఓషన్ అండ్ ప్లానిటరీ సైన్సెస్ 3) మ్యాథమేటికల్ సైన్సెస్ 4) కెమికల్ సైన్సెస్ 5) ఫిజికల్ సైన్సెస్.
వయఃపరిమితి: జేఆర్ఎఫ్‌కు 28 ఏళ్లు. లెక్చరర్‌షిప్ అర్హతకు పరిమితి లేదు. **పరీక్ష తేది:** 17.06.2018 **ఆన్‌లైన్ దరఖాస్తు:** 05.03.2018 నుంచి 26.03.2018 వరకు
వెబ్‌సైట్: http://csirhrdg.res.in/

ప్రవేశాలు

టీఎస్ ఈసెట్-2018

తెలంగాణలో 2018-19 విద్యా సంవత్సరానికిగానూ వివిధ వృత్తి విద్యా కళాశాలల యూజీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీకి నిర్వహించే పరీక్ష.
కోర్సులు: బీఈ/ బీటెక్/ బీఫార్మసీ.
అర్హత: సంబంధిత బ్రాంచుల్లో ఇంజినీరింగ్ డిప్లొమా లేదా బీఎస్సీ (మ్యాథమేటిక్స్). **ఎంపిక:** ప్రవేశపరీక్ష ద్వారా.
ప్రవేశపరీక్ష తేది: 09.05.2018 **ఆన్‌లైన్ దరఖాస్తు:** 05.03.2018 నుంచి 06.04.2018 వరకు
వెబ్‌సైట్: http://ecet.tsche.ac.in/

నవోదయ విద్యాలయ సమితి

దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2018-19 విద్యా సంవత్సరానికి తొమ్మిదో తరగతి ప్రవేశాలు **అర్హత:** ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు.
ప్రవేశపరీక్ష తేది: 2018 మే 19. **దరఖాస్తు:** ఆన్‌లైన్
చివరితేది: 05.04.2018 **వెబ్‌సైట్:** http://nvshq.org/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

దివ్యమైన కెరియర్‌కు దారులివిగో!

దేశంలో స్పీచ్ అండ్ హియరింగ్ కోర్సులకు మైసూర్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ సంస్థ ప్రఖ్యాతమైంది. దివ్యాంగులకు నాణ్యమైన విద్య, సేవలందించే సుశిక్షితులను తయారు చేసేందుకు ఈ సంస్థను ఏర్పాటుచేశారు. ఈ సంస్థలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయుల్లో పలు కోర్సులు ఉన్నాయి. పరీక్షలో చూపిన ప్రతిభ ద్వారా ఎంపికచేస్తారు. ఇందులో చేరినవారికి ప్రతినెలా స్టైపెండ్ అందిస్తున్నారు.

ఏఐఐఎస్‌హెచ్‌తోపాటు అనుబంధ సంస్థల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ప్రకటన వెలువడింది.

డిప్లొమా కోర్సులు

1. డిప్లొమా ఇన్ హియరింగ్ ఎయిడ్ అండ్ ఇయర్ మౌల్డ్ టెక్నాలజీ

సీట్ల సంఖ్య: 25 **అర్హత:** ఫిజిక్స్‌తో ఇంటర్ లేదా ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌ల్లో డిప్లొమా / ఐటీఐ లేదా డెంటల్ టెక్నీషియన్ కోర్సు పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులు సంబంధిత అర్హత పరీక్షలో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. **వయసు:** జులై 1, 2018 నాటికి 24 ఏళ్లలోపు.

2. డిప్లొమా ఇన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్

సీట్ల సంఖ్య: 25 **అర్హత:** ఏదైనా గ్రూప్‌తో ఇంటర్లో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. **వయసు:** 17 ఏళ్లు ఉండాలి.

3. డిప్లొమా ఇన్ హియరింగ్, లాంగ్వేజ్ & స్పీచ్

సీట్ల సంఖ్య: ఒక్కో సెంటర్‌లో 25 చొప్పున ఉంటాయి. ఈ కోర్సును ఏఐఐఎస్‌హెచ్‌తోపాటు మరో ఎనిమిది సంస్థల్లో నిర్వహిస్తున్నారు. **అర్హత:** ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీ గ్రూప్‌తో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. **వయసు:** జులై 1, 2018 నాటికి 21 ఏళ్లలోపు.

ఈ కోర్సుల వ్యవధి ఏడాది. ఎంపికైనవారికి నెలకు రూ.250 చొప్పున పది నెలలపాటు స్టైపెండ్ చెల్లిస్తారు.

బ్యాచిలర్ డిగ్రీ...

I. బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ

సీట్లు: ఏఐఐఎస్‌హెచ్‌లో 62, జబల్‌పూర్‌లోని ఎన్ఎస్‌సీబీఎంసీలో 10. **అర్హత:** ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీ గ్రూప్‌తో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.

కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఎంపికైనవారికి మొదటి మూడేళ్లు సంవత్సరానికి 10 నెలలపాటు నెలకు రూ.800 చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు. నాలుగో ఏడాది ఇంటర్న్‌షిప్‌లో భాగంగా నెలకు రూ.5000 చొప్పున చెల్లిస్తారు.

2. స్పెషల్ బీఎడ్

సీట్లు: 20 **అర్హత:** ఏదైనా డిగ్రీలో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత. అలాగే జులై 1, 2018 నాటికి అభ్యర్థి వయసు 30 ఏళ్లలోపు ఉండాలి.

కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో చేరినవారికి నెలకు రూ.400 చొప్పున ఏటా పది నెలలపాటు స్టైపెండ్ చెల్లిస్తారు.

పీజీ డిప్లొమా

1. పీజీ డిప్లొమా ఇన్ అగ్మెంటేటివ్ అండ్ ఆల్టర్నేటివ్ కమ్యూనికేషన్

అర్హత: బీఎస్సీ (స్పీచ్ అండ్ హియరింగ్) / బీఏఎస్ఎల్‌పీ / స్పెషల్ బీఎడ్ వీటిలో ఎందులోనైనా 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత.

కోర్సు వ్యవధి ఏడాది. 20 సీట్లు ఉన్నాయి.



2. పీజీ డిప్లొమా ఇన్ క్లినికల్ లింగ్విస్టిక్స్ ఫర్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ

అర్హత: బీఎస్సీ (స్పీచ్ అండ్ హియరింగ్) / బీఏఎస్ఎల్‌పీ / స్పెషల్ బీఎడ్ వీటిలో ఎందులోనైనా 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత.

కోర్సు వ్యవధి ఏడాది. 10 సీట్లు ఉన్నాయి.

3. పీజీ డిప్లొమా ఇన్ ఫోరెన్సిక్ స్పీచ్ సైన్స్ అండ్ టెక్నాలజీ

అర్హత: బీఎస్సీ - ఫిజిక్స్ / మ్యాథ్స్ / ఎలక్ట్రానిక్స్ / కంప్యూటర్ సైన్స్ / ఫోరెన్సిక్ సైన్స్ / లేదా స్పీచ్ అండ్ హియరింగ్ ముఖ్యాంశంగా బీఎస్సీ / బీఏఎస్ఎల్‌పీ లేదా బీటెక్ - ఎలక్ట్రానిక్స్ / కంప్యూటర్ సైన్స్/ కమ్యూనికేషన్ లేదా ఎంబీబీఎస్ కోర్సు వ్యవధి ఏడాది. 10 సీట్లు ఉన్నాయి.

4. పీజీ డిప్లొమా ఇన్ న్యూరో ఆడియాలజీ

అర్హత: బీఎస్సీ (స్పీచ్ అండ్ హియరింగ్) / బీఏఎస్ఎల్‌పీ కోర్సు వ్యవధి ఏడాది. 10 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులకు ఎంపికైనవారికి నెలకు రూ.500 చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ: మే 2
పరీక్ష తేదీ: మే 26
వెబ్‌సైట్: http://aiishmysore.in

పాతికేళ్ల పాలనపై ఫలించిన పాచిక

- త్రిపురలో రెండేళ్ల నుంచే భాజపా వ్యూహం
- వామపక్ష కోటకు గండికొట్టేందుకు 'చతురంగ బలగాల' వినియోగం
- వేతన సంఘం నుంచి పొత్తుల వరకూ జాగ్రత్తగా నిర్ణయాలు
- ఆత్మరక్షణలో పడిపోయిన సీపీఎం

సంస్థాగత పునాదులే లేని త్రిపురలో మూడింట రెండొంతుల మెజార్టీని సాధించడం ద్వారా భాజపా.. వామపక్షాలను కంగు తినిపించింది. ఇదేమీ రాత్రికిరాత్రి జరిగిన అనూహ్య పరిణామం కాదు. రెండేళ్లపాటు కమలం పార్టీ సాగించిన వ్యూహ ఫలితం. అదంతా స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ప్రతివ్యూహానికి వామపక్షం పెద్దగా ప్రయత్నించలేదు. దేశవ్యాప్తంగా ఏడో వేతన సంఘం సిఫార్సులు అమలు చేస్తున్న వేళ.. త్రిపురలో నాలుగో వేతన సంఘం సిఫార్సులు అమల్లో ఉండటాన్ని నిలదీయడం నుంచి యువతను ప్రసన్నం చేసుకొని, తద్వారా తమ కుటుంబ ఆనవాయితీకి భిన్నంగా భాజపాకు ఓటువేసుకునేలా చేయడం, ఈశాన్యంలో ఆరెస్సెస్ చేపట్టిన దీర్ఘకాల అజెండా ద్వారా లబ్ధి పొందడం వరకూ కమలనాథులు గట్టి వ్యూహాలు పన్నారు. 25 ఏళ్లుగా వామపక్షాలు నిర్మించుకుంటూ వచ్చిన కోటను రెండేళ్ల కసరత్తుతో కూల్చేశారు.

వేతన సంఘం..

మార్పు కోసం ఓటువేయాలన్న భాజపా ప్రచారంలో.. నిరుద్యోగ అంశమే కీలకం. త్రిపురలో ఏడో వేతన సంఘం సిఫార్సులను అమలు చేయకపోవడాన్ని ఈ పార్టీ పదేపదే ప్రస్తావించింది. ఈ రాష్ట్రం కోసం తయారుచేసిన దార్శనిక పత్రంలోను, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా సహా అగ్రనేతల ఎన్నికల ప్రసంగాల్లో ఈ అంశం ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది. భాజపా అధికారంలోకి వస్తే ఏడో వేతన సంఘాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. దీనివల్ల రూ.20వేలుగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగి వేతనం కనీసం రూ.35వేలకు పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో.. ఏడో వేతన సంఘం సిఫార్సులను అమలు చేయలేకపోవడానికి ముఖ్యమంత్రి మాణిక్ సర్కారు చెప్పిన కారణాలు ఉద్యోగులకు 'డొల్ల'గా అనిపించాయి. వారి ఓట్లలో గణనీయభాగం భాజపాకే పడ్డాయి.

సీపీఎం కుటుంబాల్లో క్రాస్ఓటింగ్

కమ్యూనిస్టులకు ఓటుబ్యాంకుగా ఉన్న ప్రభావశీల కుటుంబాల ఓటింగ్‌లో చీలిక తీసుకురావడంలో భాజపా విజయం సాధించింది. సీపీఎం నిరంకుశంగా వ్యవహరిస్తోందంటూ కొందరు యువకులు కమలనాథుల వైపు మొగ్గారు. భాజపా హిందూత్వ రాజకీయాలు, ఆరెస్సెస్ సిద్ధాంతాలపై తమకు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ప్రధాని మోదీపై ఉన్న అభిమానంతో ఆ పార్టీకి ఓటువేశామని సీపీఎం కార్యకర్తల కుటుంబాల్లో కొందరు పేర్కొన్నారు. వెనుకబడిపోయిన త్రిపురకు ఆయన మార్గనిర్దేశం అవసరమని వారు చెప్పారు. సీపీఎంతో విభేదించి, చాలాకాలం కిందటే బయటకువచ్చేసిన కార్యకర్తలు.. చాలా ఏళ్లపాటు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయారు. ఇప్పుడు తొలిసారిగా వారు బయటకొచ్చి భాజపాకు ఓటువేశారు. వామపక్ష కుటుంబాల్లో కనీసం 10 శాతం మేర ఇలా క్రాస్ఓటింగ్ నమోదై ఉంటుందని భాజపా నేతలు విశ్లేషిస్తున్నారు.

పథకం ప్రకారం పార్టీ నిర్మాణం..

చైనా, బంగ్లాదేశ్‌కు పొరుగున ఉండటంతోపాటు బంగ్లాదేశ్ ముస్లింల చొరబాటు, క్రైస్తవంలోకి మత మార్పిళ్లు వంటి అంశాల కారణంగా ఈశాన్య రాష్ట్రాలపై ఆరెస్సెస్ నిశిత దృష్టిపెట్టింది. ఈ ప్రాంతంలోని ప్రతి రాష్ట్రాన్నీ.. మరో రాష్ట్ర శాఖలు దత్తత చేసుకోవాలని 1990లలోనే తీర్మానించింది. అసోంను కేరళ, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్‌ను మహారాష్ట్ర, మణిపూర్‌ను కర్ణాటక, అరుణాచల్‌ను విదర్భ ప్రాంతం, త్రిపురను పశ్చిమ బెంగాల్ దత్తత చేసుకున్నాయి. గత రెండేళ్లలో త్రిపురలో 'సంఘ్' తన కార్యకలాపాలను ఉద్ధృతం చేసింది. 2014 ఎన్నికల సమయంలో ఇక్కడ 60 శాఖలే ఉండేవి. ఇప్పుడవి 265కు పెరిగాయి. సామాజిక సేవ ద్వారా ప్రజలకు చేరువైంది. సీపీఎం కార్యకర్తలు, మాజీలు పెద్ద సంఖ్యలో 'సంఘ్'లో చేరారు. కమ్యూనిస్టు పాలనపై విసిగిపోయిన వీరందరికీ ప్రత్యామ్నాయ మార్గాన్ని ఆరెస్సెస్ చూపింది. దేశభక్తి, సంస్కృతి, చరిత్రకు సంబంధించిన వినూత్న అంశాలను బోధించింది.

ఇలా.. తెరవెనుక ఆరెస్సెస్ పనిచేస్తుండగా, తిరుగులేని వామపక్ష క్యాడర్‌కు దీటుగా తాను కూడా ఎదిగేందుకు భాజపా పావులు కదిపింది. నిజానికి ఆ పార్టీకి త్రిపురలో పెద్దగా ఉనికి లేదు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో 1.54 శాతం ఓట్లే వచ్చాయి. 50 స్థానాల్లో పోటీచేసి, అన్నిచోట్లా ధరావత్తు కోల్పోయింది. ఇప్పుడు పెద్ద సంఖ్యలో భాజపా, ఆరెస్సెస్ సభ్యులను సిద్ధం చేసుకోగలిగింది. వారు మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ యువ, మహిళ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలు, రైతుల విభాగాలను ఏర్పాటు చేశారు. ఆందోళనలు నిర్వహించారు.

నియోజకవర్గానికొక 'విస్తారక్'ను భాజపా నియమించింది. మండలాలు, స్థానిక నేతల్లో అంతర్గత కుమ్ములాటలు లేకుండా చూడటం వీరి విధి. ప్రతి పోలింగ్ బూత్‌లోనూ 17-18 పేజీలతో కూడిన ఓటర్ల జాబితా ఉంటుంది. ఒక్కో పేజీకి ఒక 'పన్నా ప్రముఖ్'ను పార్టీ నియమించింది. అందులోని 60 మంది ఓటర్ల బాగోగుల బాధ్యత వారిదే.

ఆ తర్వాతి దశలో 'శక్తి కేంద్ర విస్తారక్'లు ఉంటారు. రాష్ట్రంలోని ప్రతి ఐదు బూత్‌లకొకరు చొప్పున వీరిని భాజపా నియమించింది. మిస్డ్‌కాల్ ద్వారా ఓటర్ల నమోదు చేపట్టింది. 2లక్షల మందికిపైగా ఓటర్లు ఇలా నమోదయ్యారు. రైళ్లలోని ప్రయాణికులకు భాజపా కరపత్రాలను పంచడానికి 'ట్రైన్ సంపర్క్'లను నియమించింది. నీటి సరఫరా, గ్యాస్ సిలిండర్ తదితర సమస్యల గురించి వారు.. ప్రయాణికులను ఆరా తీశారు. ఆ వివరాలను అగర్తలాలోని పార్టీ కార్యకర్తలకు చేరవేసేవారు. ఈ కార్యకర్తలందరికీ సిద్ధాంతం, జాతీయవాదం, భారత సంస్కృతి వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికలకు ముందు అసోం నుంచి 400 మంది 'విస్తారక్'లను రప్పించి, వారి సేవలను వినియోగించుకుంది.

గిరిజన ఓటుకు గేలం..

త్రిపురలో వామపక్షానికి ప్రధాన బలంగా ఉన్న గిరిజనులను తనవైపునకు తిప్పుకోకుంటే విజయం సాధ్యం కాదని భాజపా ముందే గుర్తించింది. దీంతో ఎన్నికలకు నెల ముందు ఇండిజినెస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ)తో జట్టు కట్టింది. నిజానికి కొంతకాలం నుంచే ఈ పార్టీకి భాజపా మద్దతుగా నిలిచింది. అయినా పొత్తు విషయంలో తొందరపడలేదు. అన్ని అవకాశాలనూ పరిశీలించింది. ఐపీఎఫ్‌టీ.. గిరిజనుల కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తోంది. తద్వారా గిరిజనుల్లో గట్టి పట్టును పెంచుకుందని నిర్ధారించుకున్నాకే ఆ పార్టీతో భాజపా పొత్తు పెట్టుకుంది. అయితే రాష్ట్రంలో మెజార్టీగా ఉన్న బెంగాలీల ఓట్లను కోల్పోకుండా చూసేందుకు.. ప్రత్యేక గిరిజన రాష్ట్రానికి తాము మద్దతివ్వడంలేదని కమలనాథులు తేల్చిచెప్పారు. ఇవన్నీ ఫలించాయి. ఐపీఎఫ్‌టీ.. తాను పోటీ చేసిన 9 స్థానాల్లో ఎనిమిదింటిని కైవసం చేసుకుంది. రాష్ట్రంలోని 20 గిరిజన స్థానాల్లో కనీసం 18 సీట్లను ఎప్పుడూ సీపీఎం గెల్చుకునేది. ఈసారి రెండు స్థానాలకే పరిమితమైంది. ఆపార్టీకి కంచుకోటగా ఉన్న ఆశారామ్‌బరి నియోజకవర్గంలో గిరిజన నేత, ఉప ముఖ్యమంత్రి డెబ్బార్‌మాన్ కూడా ఓటమిపాలయ్యారు. చాలాకాలంగా సీపీఎంకు విధేయులుగా ఉన్నప్పటికీ తమకు దక్కిన ప్రయోజనం శూన్యమని గిరిపుత్రులు వాపోతున్నారు. తమ తెగల్లో నిరుద్యోగం పెరిగిపోయిందని, అందువల్ల మార్పు కోసం ఓటేశామని చెబుతున్నారు.

బలం పెంచిన మోదీ సభలు..

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. త్రిపురలో నాలుగు ఎన్నికల ప్రచార సభలు నిర్వహించారు. ఇంత చిన్న రాష్ట్రంలో ప్రధాని అన్ని సభలు నిర్వహించడం అనూహ్యం. ఎన్నికలకు మూడు రోజుల ముందు శాంతిర్‌బజార్, అగర్తలాలో రెండు సభలను మోదీ నిర్వహించారు. వీటికి రికార్డుస్థాయిలో ప్రజలు హాజరయ్యారు. భాజపా విజయం ఇక ఖాయమైపోయింది. భాజపా సీనియర్ నేతలు కూడా క్రమంతప్పకుండా ఈ రాష్ట్రాన్ని సందర్శిస్తూ.. కార్యకర్తల నైతిక స్థైర్యాన్ని పెంచారు. దాడికి గురైన కార్యకర్తలను పరామర్శించేవారు. వారి చికిత్స కోసం పార్టీ.. రూ.15లక్షలకుపైగా ఖర్చుపెట్టింది. గత మూడేళ్లలో త్రిపురను 52 మంది మంత్రులు సందర్శించారు. దీంతో ఈ రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్ల భాజపా నాయకత్వం, కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్న సందేశం బలంగా వెళ్లింది.

-ఈనాడు ప్రత్యేక విభాగం

విజయగీతిక రచయితలు వీరే..

త్రిపుర భాజపా పరం కావడానికి నలుగురు నేతల వ్యూహచతురత దోహదపడింది. వీరు క్షేత్రస్థాయిలో అవిశ్రాంతంగా శ్రమించి పార్టీకి ఘనవిజయాన్ని కట్టబెట్టారు.

సునీల్ దేవ్‌ధర్



త్రిపురలో భాజపా విజయంలో సింహభాగం మహారాష్ట్రకు చెందిన ఆరెస్సెస్ ప్రచారక్ సునీల్ దేవ్‌ధర్‌దే. 2014లో ఆయనను త్రిపురకు బాధ్యుడిగా అమిత్ షా నియమించారు. గత రెండున్నరేళ్లలో ఆయన.. రాష్ట్రంలోని మొత్తం 60 నియోజకవర్గాలను కనీసం మూడుసార్లు చుట్టివచ్చారు. 3214 పోలింగ్ బూత్‌లలో 3209 మంది ఏజెంట్లను నియమించారు. గత ఎన్నికల్లో 35 శాతం ఓట్లను పొందిన కాంగ్రెస్‌కు 1500 మంది ఏజెంట్లు మాత్రమే ఉండటం గమనార్హం. నిజాయతీపరుడిగా పేరున్న ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌పై నేరుగా పోరాటం చేయాలని కూడా దేవ్‌ధర్ నిర్ణయించారు. సీఎం నిజాయతీపరుడు, నిరాడంబరుడైనంత మాత్రన సరిపోదు, సమర్థంగానూ ఉండాలన్న వాదనను బలంగా వినిపించారు. ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు ఇతర పార్టీలతో మాట్లాడాలని భాజపా నాయకత్వాన్ని ఒప్పించారు. ఐపీఎఫ్‌టీతో పొత్తును పెట్టుకోవాలని నచ్చజెప్పారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బిప్లబ్ కుమార్ దేబ్‌ను ఆయనే ఎంపిక చేశారు.

విప్లవ్‌దేవ్...

47 ఏళ్ల దేవ్.. భాజపాలో అత్యంత పిన్న వయస్కుడైన రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా గుర్తింపు పొందారు. ఆరెస్సెస్ వాలంటీర్ అయిన దేవ్.. 2016లో పార్టీ బాధ్యతలను అన్యమనస్కంగానే స్వీకరించారు. అనుభవజ్ఞుడైన మాణిక్ సర్కార్‌కు ప్రతిగా ఆయనను దించడం విప్లవాత్మక నిర్ణయమే.

రామ్ మాధవ్..



త్రిపురలో భాజపా విజయంతో రామ్‌మాధవ్ ఖాతాలో మరో ఘనత నమోదైంది. 1981 నుంచి ఆరెస్సెస్‌కు పూర్తిస్థాయి కార్యకర్తగా ఉన్న ఆయన.. 2014లో భాజపాలోకి వచ్చారు. అప్పటినుంచి అనేక సంక్లిష్ట లక్ష్యాలను చేపట్టారు. జమ్మూ కశ్మీర్‌లో భాజపా, పీడీపీ మధ్య చరిత్రాత్మక మైత్రిని కుదర్చడం వంటివి ఇందులో ఉన్నాయి. త్రిపురలో 40 సీట్లు సాధించిపెడతానని ప్రధానికి హామీ ఇచ్చారు. ఆ దిశగా వ్యూహరచన చేసి, విజయం సాధించారు.

హిమాంత బిశ్వశర్మ



ఈయన.. 2015లో కాంగ్రెస్‌ను వీడి భాజపాలో చేరారు. భాజపా నేతృత్వంలోని ఈశాన్య ప్రజాస్వామ్య సంకీర్ణానికి కన్వీనర్‌గా వ్యవహరించారు. అసోంలో కాంగ్రెస్‌కు ఒకప్పుడు వ్యూహకర్తగా ఉన్న ఆయన.. నేడు ఆ పార్టీకి గట్టి విమర్శకుడిగా మారారు. అసోం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్‌లో భాజపా ప్రభుత్వాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. త్రిపురలో ఐపీఎఫ్‌టీతో భాజపా పొత్తు పెట్టుకోవడంలో శర్మ కూడా ముఖ్య భూమిక వహించారు.



రాజీనామా పత్రాన్ని అందజేసేందుకు ఆదివారం అగర్తలాలో గవర్నర్ తథాగత రాయ్‌ను కలిసిన మాణిక్ సర్కార్

మాణిక్ సర్కార్ రాజీనామా

- ప్రజా తీర్పును తమ పార్టీ గౌరవిస్తోందని వెల్లడి

అగర్తల: అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం నేపథ్యంలో త్రిపుర ముఖ్యమంత్రి పదవికి మాణిక్ సర్కార్ రాజీనామా చేశారు. ఆదివారం రాజ్‌భవన్‌కు విచ్చేసిన ఆయన.. గవర్నర్ తథాగత రాయ్‌కు తన రాజీనామా సమర్పించారు. సుమారు 20 నిమిషాలపాటు గవర్నర్‌తో భేటీ అయ్యారు. అనంతరం మాణిక్ సర్కార్ విలేకర్లతో మాట్లాడుతూ.. 20 ఏళ్లపాటు సీఎంగా సేవలందించేందుకు తనకు అవకాశమిచ్చిన రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును తమ పార్టీ సీపీఎం గౌరవిస్తోందని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం మెరుగైన పాలనను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేంతవరకు తాను ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగుతానని వెల్లడించారు.

ధలాయ్ జిల్లాలో భాజపా హవా: త్రిపురలో సీపీఎంకు పెట్టని కోటగా పరిగణించే ధలాయ్ జిల్లాలో భాజపా అద్భుత ఫలితాలను సాధించింది. జిల్లాలో మొత్తం ఆరు అసెంబ్లీ సీట్లుండగా.. అన్నింటినీ గెల్చుకుంది.

ఆరెస్సెస్ అగ్రనేతలతో అమిత్ షా భేటీ!

నాగపూర్: భాజపా అధ్యక్షుడు అమిత్ షా ఆదివారం నాడిక్కడ ఆరెస్సెస్ అగ్రనేత డాక్టర్. మోహన్ భగవత్‌తో పాటు భయ్యాజీ జోషి తదితర నాయకులను కలుసుకున్నారు. ఇక్కడి మహల్ ప్రాంతంలోని ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం జరిగినట్లు అభిజ్ఞ వర్గాలు వెల్లడించాయి. ఈశాన్య భారతంలో విజయం మూటకట్టుకున్న నేపథ్యంలో అమిత్ షా ఇక్కడ ఆరెస్సెస్ నేతలను కలుసుకోవడం గమనార్హం. ఈ నెల 9 నుంచీ పదకొండో తేదీ వరకూ జరగనున్న 'అఖిల భారతీయ ప్రతినిధి సభ'(ఏబీపీఎస్) వార్షిక సమావేశాల దరిమిలా ఆరెస్సెస్ అగ్రనేతలంతా ఇప్పటికే ఇక్కడ మేదోమథనాన్ని మొదలు పెట్టినట్లు అభిజ్ఞ వర్గాలు పేర్కొన్నాయి.

18 మంది ఎమ్మెల్యేల ఓటమి

కోహిమా: నాగాలాండ్ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 18 మంది ఎమ్మెల్యేలు ఓటమి చవిచూశారు. వారిలో నేషనల్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ అభ్యర్థులు ముగ్గురు, ఎన్‌పీఎఫ్ నేతలు తొమ్మిది మంది, ముగ్గురు భాజపా అభ్యర్థులు, ఎన్‌పీపీకి చెందిన ఇద్దరు, కాంగ్రెస్ అభ్యర్థి ఒకరు ఉన్నారు.



అగర్తలాలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న భాజపా త్రిపుర అధ్యక్షుడు విప్లవ్ దేవ్

విద్వేష రాజకీయాలను తిరస్కరించారు

- త్రిపుర ఫలితాలు ఎంతో సంతోషాన్నిచ్చాయి
- వివేకానంద ఆశ్రమం రజతోత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్య



తుమకూరు (కర్ణాటక), న్యూస్‌టుడే: భాజపాకు అధికారం దక్కేలా పెద్దఎత్తున ఓటేయడం ద్వారా ఈశాన్య రాష్ట్రాల ప్రజలు విద్వేషపూరిత రాజకీయాలను తిరస్కరించారని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా త్రిపుర ఎన్నికల ఫలితాలు తనకు ఎంతో సంతోషాన్నిచ్చాయన్నారు. కర్ణాటకలోని తుమకూరులో రామకృష్ణ వివేకానంద ఆశ్రమం రజతోత్సవాలు, స్వామి వివేకానందుడి శిష్యురాలు, సామాజిక కార్యకర్త సోదరి నివేదిత 150వ జన్మదినోత్సవాలు సందర్భంగా దిల్లీ నుంచి ఆదివారం ప్రధాని మోదీ దూరదృశ్య మాధ్యమం(వీడియో కాన్ఫరెన్స్) ద్వారా "యువశక్తి; నవ భారతం కోసం దార్శనికత" అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ గత కాంగ్రెస్, వామపక్షాల ప్రభుత్వాల్లో ఈశాన్య రాష్ట్రాల ప్రజలు భారత ప్రధాన స్రవంతి నుంచి తాము వేరుపడిపోయామనే భావనలో ఉండేవారని పేర్కొన్నారు. ఈ భావనను దూరం చేసేందుకు తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం దేశంలో నూతన శకం ఆరంభమైందన్నారు.

ఎన్నికల ఫలితాలతో యువత సంకల్పం సాకారమవుతోందని, దేశాన్ని ఒక్కతాటిపై నడిపించేందుకు యువత ముందుకు రావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. జీవితం చాలా స్వల్పమైందని వివేకానందుడు బోధించాడని గుర్తుచేస్తూ చిన్న వయసులోనే అనుకున్నదాన్ని సాధించిన ఆయన జీవితం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్ధారించుకుని దాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. యువతలో కౌశల్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని, ప్రతీ జిల్లాలో కౌశల్యాభివృద్ధి కేంద్రాల్ని నెలకొల్పుతున్నట్లు చెప్పారు. ప్రధాని మాటల్ని వినేందుకు వివిధ ప్రాంతాల నుంచి పది వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. తనకు నేరుగా మాట్లాడాలనే ఆశ ఉన్నప్పటికీ పనుల ఒత్తిడి కారణంగా రాలేకపోతున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. సిద్ధగంగా మఠాధిపతి శివకుమారస్వామికి ప్రణామాలు అంటూ కన్నడలో ప్రధాని తొలుత సంభాషణ ప్రారంభించారు. గతంలో మఠాధిపతి ఆశీస్సులు పొందేందుకు వచ్చిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. దేశాభివృద్ధికి శివకుమారస్వామి, వివేకానంద ఆశ్రమం చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ తరహా కార్యక్రమాలు యువతకు ప్రేరణగా నిలవాలని ప్రధాని ఆకాంక్షించారు.

త్రిపుర సారథి విప్లవ్ దేవ్!

- శాసనసభాపక్ష నేతగా రేపు ఎన్నిక
- ప్రమాణ స్వీకారోత్సవానికి రానున్న ప్రధాని మోదీ



అగర్తల: త్రిపురలో అపూర్వ విజయాన్ని సాధించిన భాజపా, మిత్రపక్షం ఈ నెల 6వ తేదీన శాసనసభాపక్ష నేతను ఎన్నుకోనున్నాయి. భాజపా నుంచి ఎన్నికైన 35 మంది, ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీటీఎఫ్) తరఫున నెగ్గిన 8 మంది ఈ సమావేశంలో పాల్గొంటారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దీనికి హాజరవుతున్నారు. భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షుడు విప్లవ్ దేవ్‌కే సీఎం పగ్గాలు దక్కేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి. ప్రభుత్వంలో 'గౌరవప్రదమైన ప్రాతినిధ్యాన్ని' తమకు కల్పించాలని ఐపీటీఎఫ్ డిమాండ్ చేస్తోంది. గిరిజన శాసనసభ్యుల నుంచి ఒకరికి ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించాలనీ, అదే ఆనవాయితీ అని ఆ పార్టీ అభిప్రాయపడింది. ఎస్టీలకు కేటాయించిన 20 స్థానాలకు గానూ 17 చోట్ల భాజపా కూటమి విజయం సాధించింది. ఈనెల 8న జరిగే నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు హాజరుకానున్నారు.

సీఎంగా జనసంఘ్ నేత బిడ్డ

త్రిపుర ముఖ్యమంత్రి కాబోతున్న విప్లవ్‌దేవ్ (47) గోమతి జిల్లాలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టారు. ఆయన తండ్రి హరధన్‌దేవ్ జనసంఘ్‌లో స్థానిక నేత. విప్లవ్‌దేవ్ పట్టభద్రుడయ్యాక దిల్లీ వెళ్లి ఆరెస్సెస్‌లో చేరారు. దాదాపు 16 ఏళ్లు అక్కడ సేవలందించారు. 2015లో తిరిగి రాష్ట్రానికి వచ్చి మరుసటి ఏడాదే పార్టీ రాష్ట్ర శాఖకు అధ్యక్షుడయ్యారు. ఆయన భార్య ఎస్‌బీఐలో అధికారి. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నేనే ముఖ్యమంత్రిని

- గవర్నర్‌ను కలిసిన రియో, జిలియాంగ్
- నాగాలాండ్ ప్రభుత్వ ఏర్పాటులో కొనసాగుతున్న అనిశ్చితి
- ఆధిక్యం నిరూపణకు ఇద్దరికీ 48 గంటల వ్యవధి ఇచ్చిన గవర్నర్

కోహిమా: నాగాలాండ్‌లో ప్రభుత్వ ఏర్పాటు అంశం ఆదివారం కొత్త మలుపు తిరిగింది. భాజపా భాగస్వామ్య పక్షమయిన నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ) నేత నిఫియు రియో, తాజా మాజీ ముఖ్యమంత్రి, నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) నేత టి.ఆర్.జిలియాంగ్ ఇద్దరూ ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకొచ్చారు. మద్దతిస్తున్న శాసనసభ్యుల సంతకాలతో కూడిన లేఖను తనకు సమర్పించడానికి వారికి గవర్నర్ పి.బి.ఆచార్య 48 గంటల సమయం ఇచ్చారు.

ఎన్‌డీపీపీ-భాజపా కూటమి నేతలు ఆదివారం గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. ఎన్‌డీపీపీ నేత రియోకు ఆధిక్యం ఉందని, ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేయాలని అంతకు ముందు గవర్నర్ చెప్పారు.

మరోవైపు జిలియాంగ్ కూడా గవర్నర్‌ను కలవడంతో రాజకీయం రసకందాయంలో పడింది.

ఆచార్య మాట్లాడుతూ ఇద్దరు నేతలూ తమకు ఆధిక్యం ఉందని చెప్పారని, ప్రభుత్వ ఏర్పాటుకు ఎవరినీ ఆహ్వానించలేదని పేర్కొన్నారు. "ఎవరికి ఆధిక్యం ఉందో చూసి వారిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడం నా కర్తవ్యం. 30 మంది కంటే ఎక్కువ మంది శాసనసభ్యుల సంతకాలు సమర్పించిన వారికి అవకాశం ఇస్తా." అని చెప్పారు.

రియో 30 మంది ఎన్‌డీపీపీ-భాజపా శాసనసభ్యుల జాబితాను, ఒక జేడీయూ శాసనసభ్యుడు, ఒక స్వతంత్ర సభ్యుడి మద్దతు లేఖలను సమర్పించారని గవర్నర్ వెల్లడించారు.

జిలియాంగ్ రాజీనామా చేస్తాననుకున్నానని, కానీ ప్రభుత్వం ఏర్పాటు చేయగలనని ఆయన అనుకుంటున్నారని చెప్పారు. జిలియాంగ్ 26 మంది ఎన్‌పీఎఫ్ శాసనసభ్యులు, ఇద్దరు ఎన్‌పీపీ సభ్యులు, ఒక జేడీయూ సభ్యుడి పేర్లతో కూడిన జాబితాను సమర్పించారన్నారు. జేడీయూ సభ్యుడు రియోకు మద్దతిస్తున్నట్లు ఉదయం లేఖ సమర్పించారని తాను జిలియాంగ్‌కు చెప్పినట్లు ఆచార్య వెల్లడించారు. ప్రభుత్వ ఏర్పాటుకు తనకు భాజపా మద్దతిస్తుందని ఆశిస్తున్నట్లు జిలియాంగ్ చెప్పారన్నారు. ఎన్‌పీఎఫ్-భాజపా భాగస్వామ్యం ఇంకా కొనసాగుతోందని భాజపా అధ్యక్షుడు అమిత్‌షాకు లేఖ రాసినట్లు ఎన్‌పీఎఫ్ అధ్యక్షుడు తనతో చెప్పారని ఆచార్య తెలిపారు. జిలియాంగ్ చెప్పేది కూడా సరిగానే ఉందని, భాజపా తనతో ఉందో లేదో ఆయనకు స్పష్టత రానివ్వాలని అన్నారు. ఇవన్నీ స్పష్టమయితే అప్పుడు నిర్ణయం తీసుకుంటామన్నారు.

60స్థానాలున్న నాగాలాండ్ శాసనసభకు నిర్వహించిన ఎన్నికల్లో ఎవరికీ స్పష్టమైన ఆధిక్యం రాలేదు. హంగ్ ఫలితాలు వెలువడ్డాయి. ఎన్‌పీఎఫ్‌కు 26 స్థానాలు దక్కాయి. భాజపాకు 12, ఎన్‌డీపీపీకి 18 దక్కాయి. జేడీయూ ఒక స్థానం గెల్చుకోగా మరో స్థానాన్ని స్వతంత్ర అభ్యర్థి గెల్చుకున్నారు. నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ)కి రెండు స్థానాలు దక్కాయి.

రెండు మూడు రోజుల్లో భాజపా-ఎన్‌డీపీపీ ప్రభుత్వం ఏర్పడుతుందని భాజపా సీనియర్ నేత రామ్ మాధవ్ అన్నారు. తమది ఎన్నికలకు ముందే ఏర్పడిన కూటమి అని, తమకు 32 మంది సభ్యుల మద్దతు ఉందని, అందుకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని గవర్నర్‌ను అడిగామని చెప్పారు.



నాగాలాండ్ గవర్నర్ పీబీ ఆచార్యను కలిసిన ఎన్‌డీపీపీ నేత నిఫియు రియో, భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్

పొత్తులపై సీపీఎంలో ఒత్తిడి

దిల్లీ/ కోల్‌కతా: త్రిపుర ఎన్నికల్లో సీపీఎం పరాజయం పాలైన నేపథ్యంలో ఇతర పక్షాలతో ఆ పార్టీ పొత్తులపై సత్వరం నిర్ణయం తీసుకోవాలంటూ ఒత్తిడి పెరుగుతోంది. దేశంలో మారుతున్న పోకడలకు తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకోవడంలో మునుపటి సారథులు తగిన రీతిలో వ్యవహరించలేదనే భావనా పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. పొత్తులపై, ముఖ్యంగా కాంగ్రెస్‌తో అవగాహనపై తుది నిర్ణయాన్ని వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే పార్టీ సమావేశాల్లో తీసుకుంటారు. ఇతర పార్టీలతో కలిసి వెళ్లకూడదనేది పార్టీ సారథిగా ప్రకాశ్ కారాట్ ఉన్నప్పటి నిర్ణయం. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాత్రం దీనికి భిన్నంగా, భాజపాయేతర పార్టీలతో అవగాహన ఉండాలని గట్టిగా అభిప్రాయపడుతున్నారు. ప్రజలతో సంబంధాలు కోల్పోవడం, క్షేత్రస్థాయి పరిస్థితులను మదింపు చేయలేకపోవడం ఓటమికి కారణాలని పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు. త్రిపుర ఫలితాలతో కొత్త పంథాలో ఆలోచించడం అనివార్యమయిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు హన్నన్‌మొల్లా చెప్పారు.

ఈశాన్య ఫలితాల ప్రభావం కర్ణాటకపై ఉండదు: కాంగ్రెస్

దిల్లీ: ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాల ప్రభావం కర్ణాటకపై ఏ మాత్రం ఉండదని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. అంతే కాదు, కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీనే జయకేతనం ఎగురవేస్తుందని కూడా విశ్వసిస్తున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పునరుత్థానమౌతోందనీ.... ఈశాన్య రాష్ట్రాల్లో భాజపా విజయం ఓ విపరీతమన్న అభిప్రాయాన్ని ఓ సీనియర్ నాయకుడు వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు విదేశాలకు వెళ్లి ఉన్న నేపథ్యంలో ఈశాన్య ఎన్నికల ఫలితాలపై వ్యాఖ్యానించేందుకు నాయకులెవరూ కూడా ఇష్టపడటం లేదు.



గవర్నర్ గంగా ప్రసాద్‌ను కలిసిన నేషనల్ పీపుల్స్ పార్టీ నేత కాన్రాడ్ సంగ్మా

మేఘాలయ ముఖ్యమంత్రిగా కాన్రాడ్ సంగ్మా!


- ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమివ్వాలని గవర్నర్‌కు వినతి

షిల్లాంగ్: నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) అధ్యక్షుడు కాన్రాడ్ సంగ్మా మేఘాలయ ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలున్నాయి..! సర్కారును ఏర్పాటు చేయడానికి తమకు అవకాశమివ్వాలని ఆదివారం సాయంత్రం ఆయన రాష్ట్ర గవర్నర్ గంగాప్రసాద్‌ను కోరారు. రెండు ప్రాంతీయ పార్టీలు, ఒక స్వతంత్ర సభ్యుడితో సహా తనకు మొత్తం 34 మంది శాసనసభ్యుల మద్దతు ఉందంటూ వారి సంతకాలతో ఒక లేఖ సమర్పించారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపడం సులభం కాకపోయినా తనకు మద్దతునిస్తున్నవారంతా రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నారని ఆయన విలేకరులకు చెప్పారు. కేంద్రంలో, మణిపూర్‌లో భాజపాతో ఎన్‌పీపీకి భాగస్వామ్యం ఉంది. అతిపెద్ద పార్టీగా అవతరించిన తమకు ముందుగా అవకాశమివ్వాలని కాంగ్రెస్ ప్రతినిధి బృందం శనివారమే గవర్నర్‌ను కోరింది. ప్రభుత్వ ఏర్పాటుకు కాన్రాడ్ సంగ్మానే ఆహ్వానించే సూచనలు కనిపిస్తున్నాయి. సీఎం ప్రమాణ స్వీకారం ఈ నెల 6న జరిగే అవకాశం ఉంది.

గవర్నర్‌కు రాజీనామా సమర్పించిన సీఎం: మేఘాలయా ఎన్నికల్లో ఆధిక్యాన్ని సాధించలేకపోవడంతో ప్రస్తుత సీఎం ముకుల్ సంగ్మా ఆదివారం గవర్నర్‌ను కలిసి రాజీనామా లేఖ సమర్పించారు. గవర్నర్ దానిని ఆమోదించి, తదుపరి సర్కారు ఏర్పడేవరకు ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని కోరారు. తాను పోటీ చేసిన 2 నియోజకవర్గాల్లో ముకుల్ విజయం సాధించారు.



ఈనాడు బిజినెస్



కోడిగుడ్లు

4న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	345	వరంగల్	347
చిల్లరగా(ఒక గుడ్డు)	4.05	విశాఖపట్నం	350
బెంగళూరు	375	చెన్నై	385
5వ తేదీకి		చిత్తూరు	378
విజయవాడ/గోదావరి	340	నమక్కల్	370



ముకేశ్ అంబానీ కుమారుడి పెళ్లి?

- వధువు రసెల్ మెహతా తనయ శ్లోక!
- త్వరలో నిశ్చితార్థం; డిసెంబరులో వివాహం!

దిల్లీ

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీ వివాహం ఈ ఏడాది చివర్లో జరగబోతోందని విశ్వసనీయ వర్గాల సమాచారం. వజ్రాల వ్యాపారి, రోజీ బ్లూ డైమండ్స్ అధిపతి రసెల్ మెహతా చిన్న కుమార్తె శ్లోక మెహతాను ఆయన మనువాడబోతున్నారని తెలిసింది. త్వరలోనే నిశ్చితార్థం తేదీని ప్రకటించి, డిసెంబరు ప్రారంభంలో పెళ్లి ముహూర్తం నిర్ణయిస్తారని సమాచారం. అయితే ఇరు కుటుంబాలు ఈ విషయమై మాట్లాడేందుకు నిరాకరించాయి. అంబానీ కుటుంబానికి సన్నిహితులైన ఒకరు మాట్లాడుతూ 'నిశ్చితార్థం, పెళ్లి తేదీ లాంటివి ఏమీ నిర్ణయించలేదు. అలాంటిది ఏదైనా ఉంటే అందరికీ సమాచారం ఇస్తామ'ని తెలిపారు. ఆకాష్, శ్లోక ఇద్దరూ ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో కలిసి చదువుకున్నారు. ప్రస్తుతం ఆకాశ్ రిలయన్స్ జియో బోర్డులో కొనసాగుతున్నారు.

అప్పట్లోనే ఇష్టపడ్డారా? ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుకొనే సమయంలోనే ఆకాశ్, శ్లోక ఒకరినొకరు ఇష్టపడేవారని, 12వ తరగతి బోర్డు పరీక్షలు పూర్తి కాగానే ఆకాశ్ ఆమెకు తన ప్రేమను వ్యక్తపరిచారని తెలుస్తోంది. శ్లోక కూడా అతని ప్రేమను అప్పుడే అంగీకరించడం, తాజాగా కుటుంబ సభ్యులు కూడా ఓకే చెప్పేయడంతో వీరు పెళ్లిపీటలు ఎక్కబోతున్నారని ప్రచారం సాగుతోంది.


ఆకాశ్

ఆకాశ్ అంబానీ రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) ఛైర్మన్ ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నీతా అంబానీల పెద్ద కుమారుడు. ఇతనికి కవల సోదరి ఇషా అంబానీ, తమ్ముడు అనంత్ అంబానీ ఉన్నారు. ఆర్ఐఎల్ అనుబంధ పరిశ్రమ అయిన జియో ఇన్ఫోకామ్ వ్యూహ రచనలో ముఖ్యుడు (చీఫ్ ఆఫ్ స్ట్రాటెజీ) ఆకాశ్. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్, రిలయన్స్ రిటైల్ బోర్డు సభ్యుల్లో ఈయన ఒకరు. ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీ నుంచి అర్థశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేశారు. ఆకాశ్ జంతు ప్రేమికుడు. మంచి ఫొటోగ్రాఫర్ కూడా. ప్రపంచవ్యాప్తంగా ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి ఇష్టపడతారు. కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపడానికి ఇష్టపడతారు.

శ్లోక

శ్లోక 2009లో ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి విద్యాభ్యాసం పూర్తి చేసిన తర్వాత ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి ఆంత్రోపాలజీలో డిగ్రీ, ది లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ నుంచి న్యాయ విద్యలో మాస్టర్స్ పూర్తి చేశారు. జులై 2014 నుంచి రోజీ బ్లూ స్వచ్ఛంద సంస్థలో డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఎన్‌జీఓలను, వాలంటీర్లను ఒక వేదిక మీదకు తీసుకొచ్చే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన 'కనెక్ట్ ఫర్' అనే సంస్థకు సహ వ్యవస్థాపకురాలు కూడా. రసెల్ మెహతా, మోనాల ముగ్గురు సంతానంలో శ్లోక చిన్నది. ఇటీవల పీఎన్‌బీ కుంభకోణంలో వెలుగులోకి వచ్చిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి మోనా బంధువు కావడం గమనార్హం.

33,480 దిగువన దిద్దుబాటే!



సమీక్ష : హోలీ సెలవుతో గతవారం నాలుగు రోజులే పనిచేసిన మార్కెట్లు.. స్వల్ప నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల క్షీణత ప్రతికూలంగా మారగా.. డిసెంబరు త్రైమాసిక జీడీపీ గణాంకాలు, ఫిబ్రవరి వాహన విక్రయాలు, రూపాయి స్థిరత్వం, తగ్గిన ముడిచమురు ధరలు సానుకూల ప్రభావాన్ని చూపాయి. బలమైన అంతర్జాతీయ సంకేతాలతో దేశీయ మార్కెట్లు వారాన్ని సానుకూలంగానే ప్రారంభించాయి. అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో భారత జీడీపీ వృద్ధి వేగవంతమైన వృద్ధిని నమోదు చేయడంతో సెంటిమెంట్ బలపడింది. ఎంపిక చేసిన మధ్య, చిన్న షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అధిక నష్టభయం కలిగిన 9,491 బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) పేర్లను ఆర్థిక శాఖ ప్రకటించడంతో మదుపర్లు అప్రమత్తత వహించారు. జనవరి చివరకు పీ నోట్లు ఎనిమిదిన్నరేళ్ల కనిష్ఠానికి చేరాయన్న వార్తలు సైతం ఇందుకు తోడయ్యాయి. ఈ ఏడాదిలో మూడు సార్లకు పైగా వడ్డీ రేట్ల పెంపునకు అమెరికా ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ సంకేతాలివ్వడంతో అంతర్జాతీయ మార్కెట్లు కుదేలయ్యాయి. అయితే జీడీపీ గణాంకాలు అంచనాలు మించడం, వాహన విక్రయాలు రాణించడం తక్కువ స్థాయిలో సూచీలకు మద్దతు ఇచ్చాయి. ఈ పరిణామాలతో వారం మొత్తం మీద సెన్సెక్స్ 0.28 శాతం నష్టపోయి 34,046 వద్ద ముగిసింది. నిఫ్టీ 0.31 శాతం తగ్గి 10,458 దగ్గర స్థిరపడింది. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికర విక్రయాలు రూ. 3,535 కోట్లుగా నమోదయ్యాయి. డీఐఐలు, ఫండ్లు మాత్రం రూ. 4,050 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 4:5గా నమోదుకావడం.. మార్కెట్లలో అప్రమత్తతను సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } వరుసగా గత మూడు వారాల పాటు సెన్సెక్స్ 33480- 34610 పాయింట్ల శ్రేణిలో స్థిరీకరించుకుంది. ఈ శ్రేణి నుంచి బయటపడితే సూచీకి.. స్వల్ప కాలంలో సంకేతాలు లభించొచ్చు. 33450 పాయింట్ల స్థాయి కోల్పోతే మాత్రం.. 200 రోజుల సగటు కదలికల స్థాయి అయిన 32,600 పాయింట్లకు చేరొచ్చు.

ప్రభావిత అంశాలు } అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు, దేశీయ పరిణామాలు మార్కెట్లకు దిశానిర్దేశం చేయొచ్చు. ఉత్పత్తిదార్లను రక్షించడం కోసం ఉక్కు, అల్యూమినియంలపై దిగుమతి సుంకం విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం సైతం ప్రభావం చూపే అవకాశం ఉంది. దేశీయంగా ఎటువంటి కీలక పరిణామాలు లేకపోవడంతో.. షేరు ఆధారిత కదలికలు చోటుచేసుకోవచ్చు. డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు వార్తలతో రూపాయికి ఒత్తిడి కొనసాగొచ్చు. అమెరికా ఆర్థిక గణాంకాలు, జపాన్ నాలుగో త్రైమాసిక జీడీపీ గణాంకాలు, బ్యాంక్ ఆఫ్ జపాన్ పరపతి సమీక్ష, చైనా ఎగుమతులు, దిగుమతుల గణాంకాల నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. ముడిచమురు ధరలు, ఎఫ్ఐఐలు, డీఐఐల పెట్టుబడులు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతాయి.

తక్షణ మద్దతు స్థాయిలు: 33,770, 33,482, 32,699; **తక్షణ నిరోధ స్థాయిలు**: 34,315, 34,666, 35,006

33,480 పాయింట్ల దిగువన ముగిస్తే.. మార్కెట్లలో మరింత దిద్దుబాటు చోటుచేసుకోవచ్చు.


– సతీశ్ కంతేటి, జెన్ మనీ

చూపు.. అంతర్జాతీయం వైపు

- ఫెడ్ రిజర్వ్ పరిణామాలపై మార్కెట్ దృష్టి
- స్థిరీకరణ దిశగా మన సూచీలు
- లోహ, ఫార్మా రంగాలకు ప్రతికూలతలు
- టెలికాం షేర్లూ నష్టపోయే అవకాశం

స్టాక్ మార్కెట్ ఈ వారం


స్వల్పకాలంలో కీలక వార్తలేవీ లేకపోవడంతో స్టాక్ మార్కెట్లు ఈ వారం స్థిరీకరణ చెందే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. అంతర్జాతీయ పరిణామాల నుంచి సంకేతాలు అందిపుచ్చుకోవచ్చని భావిస్తున్నారు. జీడీపీ గణాంకాలు రాణిస్తాయన్న అంచనాలతో గత వారం ప్రారంభంలో మార్కెట్లు రికవరీ సంకేతాలను కనబరచాయి. అయితే మొండి బకాయిల సమస్యల నేపథ్యంలో బ్యాంకింగ్ రంగ షేర్ల విక్రయాలు లాభాలకు అడ్డుకట్టవేశాయి. అంతర్జాతీయంగా చూస్తే ఫెడరల్ రిజర్వ్ భవిష్యత్ వడ్డీ రేట్ల విషయంలో కఠిన వైఖరి అవలంబించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో మదుపర్లు ట్రేడింగ్ పట్ల జాగ్రత్త వహించొచ్చు. నేడు వెలువడే పీఎమ్ఐ గణాంకాల(సేవా రంగం)ను మార్కెట్ గమనించొచ్చు. మొత్తం మీద చూస్తే అంతర్జాతీయ స్థూల ఆర్థిక గణాంకాలు, పరిణామాలు; పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు తదితరాలను పరిశీలించొచ్చు. అల్యూమినియం, ఉక్కుపై దిగుమతి సుంకం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు సైతం మన మార్కెట్‌పై కొంత ప్రభావం చూపవచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే...




టెలికాం: ఈ రంగ షేర్లు ప్రతికూలంగా కదలాడవచ్చు. టాటా కమ్యూనికేషన్స్ తప్ప మిగతా అన్నీ దిద్దుబాటుకు గురయ్యే అవకాశం ఉంది. ఆ షేరు మాత్రం స్థిరీకరణ దిశగా పయనించొచ్చు. గత కొద్ది నెలలుగా ఈ రంగం ఒత్తిడిలో ఉంది. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ తప్ప మిగతా అన్నీ డిసెంబరు త్రైమాసిక ఫలితాల్లో బలహీనతలను కనబరచాయి.



వాహన: ప్రధాన వాహన కంపెనీలు ఈ వారం దిద్దుబాటుకు గురికావొచ్చు. అయితే ఫిబ్రవరి నెలలో మంచి విక్రయాలను సాధించిన నేపథ్యంలో నష్టాలు పరిమితంగానే ఉండొచ్చు. రాబోయే నెలల్లో అమ్మకాలు రాణించొచ్చన్న అంచనాల మధ్య మొత్తం మీద ఈ రంగ భవిష్యత్ సానుకూలంగానే కనిపిస్తోంది. టాటా మోటార్స్ త్వరలోనే ధరలు పెంచుతుందన్న వార్తలు ఆ కంపెనీ షేరుపై ప్రభావం చూపొచ్చు.




చమురు: కాస్త సానుకూల ధోరణితో ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు ఈ వారం స్థిరీకరణకు గురికావొచ్చు. మధ్య నుంచి దీర్ఘకాలానికి ఈ రంగ మూలాలు బలంగా ఉన్నప్పటికీ.. స్వల్పకాలంలో సాంకేతిక చార్టులపై కొంత స్తబ్దత కనిపిస్తోంది. ముడి చమురు ధరల ప్రభావం అప్‌స్ట్రీమ్ కంపెనీలైన ఓఎన్‌జీసీ, కెయిర్న్ ఇండియాలపై పడవచ్చు.



యంత్రపరికరాలు: మిశ్రమంగా కదలాడవచ్చు. ఆయా షేర్లను బట్టి కదలికలు ఉండొచ్చు. ఎల్ అండ్ టీకి ఆర్డర్ల దన్నుతో సానుకూలతలు కనిపిస్తున్నాయి. భెల్ ప్రస్తుత స్థాయిల వద్ద స్థిరీకరణకు గురికావొచ్చు. సీమెన్స్ షేర్లు ఊగిసలాడవచ్చు. ఆర్డర్ల కారణంగా రామ్‌కీ ఇన్‌ఫ్రా, సద్భవ్ ఇన్‌ఫ్రా షేర్లు సైతం వెలుగులోకి రావొచ్చు.




బ్యాంకింగ్: ప్రభుత్వ రంగ బ్యాంకులపై సెంటిమెంటు బలహీనంగా ఉన్నప్పటికీ గత వారం నష్టాల నుంచి ఈ రంగం కొద్దిగా కోలుకోవచ్చు. అయితే కొత్త మోసాల కేసుల నేపథ్యంలో వాటిపై ప్రభావం పడవచ్చు. మధ్యకాలంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు వాటి మార్కెట్ వాటాను తగ్గించుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటి షేర్లపై ఒత్తిడి కనిపించొచ్చు.




ఎఫ్ఎమ్‌సీజీ: ఇటీవలి కాలంలో ముడి పదార్థాల వ్యయాలు క్షీణించిన నేపథ్యంలో ఈ రంగ కంపెనీలు మోస్తరు లాభాలను పొందొచ్చు. ప్రధాన మార్కెట్ నుంచి ఈ స్క్రిప్‌లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. జీఎస్‌టీ ప్రయోజనాలను బదిలీ చేయని కారణంగా ప్రభుత్వానికి హెచ్‌యూఎల్ ఎక్కువ చెల్లించాల్సి రావొచ్చు. ఆ ప్రభావం ఈ కంపెనీ షేరుపై పడవచ్చు.

లోహ: బలహీన ధోరణి కొనసాగించొచ్చు. ట్రంప్ ప్రభుత్వం ఉక్కు, అల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని భారీగా విధిస్తూ నిర్ణయం తీసుకోవడం మన లోహ ఎగుమతి కంపెనీలపై ప్రభావాన్ని చూపించొచ్చు. ముడి ఇనుము ధరలను తగ్గించిన నేపథ్యంలో ఎన్ఎమ్‌డీసీ షేర్లు నష్టపోవచ్చు.






సిమెంటు: ఈ రంగ కంపెనీల స్క్రిప్‌లు మిశ్రమ ధోరణిలో కదలాడవచ్చు. ఏసీసీ, అంబుజా సిమెంట్స్‌లు బలహీనంగా కనిపిస్తున్నాయి. నష్టపోయే అవకాశం ఉంది. అల్ట్రాటెక్ ఒక శ్రేణికి పరిమితమై కదలాడవచ్చు. మొత్తం మీద గ్రాసిమ్ ఇండస్ట్రీస్ ఒకటే మెరుగ్గా కనిపిస్తోంది.




ఫార్మా: ఔషధ కంపెనీల షేర్లు మరింత నష్టపోయే అవకాశం ఉంది. ఆయా కంపెనీల తయారీ ప్లాంట్లకు యూఎస్ఎఫ్‌డీఏ నుంచి ఎదురవుతున్న ఇబ్బందులు ఇందుకు నేపథ్యం. ముఖ్యంగా సన్‌ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌లు గత రెండు వారాలుగా నియంత్రణపరమైన ఒత్తిళ్లలో ఉన్నాయి.



వెండి సానుకూలమే!

కమొడిటీస్ ఈ వారం




● బంగారం, వెండి

పసిడి ఏప్రిల్ ఫ్యూచర్ కాంట్రాక్టు గత వారం రూ. 30,526 వద్ద ప్రారంభమైంది. ఆ తర్వాత లాభాలు కొనసాగిస్తూ రూ. 30,644 వద్ద వారం గరిష్ఠాన్ని నమోదు చేసింది. అయితే ఫెడ్ వ్యాఖ్యల నేపథ్యంలో దిద్దుబాటుకు లోనై రూ. 30,119కు దిగివచ్చింది. అయితే తక్కువ స్థాయిలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో తిరిగి పుంజుకుని.. చివరకు 0.25% నష్టంతో రూ. 30,449 వద్ద ముగిసింది. ఈవారం పసిడిపై ప్రధానంగా భౌగోళిక అనిశ్చితులు, ఆర్థిక గణాంకాలు, ఫెడ్ ప్రభావం చూపనున్నాయి. సాంకేతిక స్థాయిలు సైతం ఇందుకు తోడవ్వచ్చు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీయడం, బలహీన డాలర్‌తో పసిడికి మద్దతు దక్కొచ్చు. వీటన్నింటి దృష్ట్యా ఈవారం రూ. 30,341 దిగువన ముగిస్తే.. ట్రేడర్లు తాజా షార్ట్ సెల్లింగ్ పొజిషన్లు తీసుకోవడం మంచిది. లాంగ్ పొజిషన్లు తీసుకునేవారు రూ. 30,546 ఎగువన మాత్రమే తీసుకోవాలి. వెండి మే కాంట్రాక్టుకు క్రితం వారం ప్రారంభ ధర రూ. 39,130. వారం మొత్తం మీద రూ. 38,289- 39,283 మధ్య కదలాడింది. ఆఖరుకు 0.67% తగ్గి రూ. 38,868 వద్ద స్థిరపడింది. సానుకూల మూలాలు ఉండటంతో దీర్ఘకాల వ్యూహంలో భాగంగా పడినప్పుడల్లా కొనుగోలు చేయడం ఉత్తమం.

● ప్రాథమిక లోహాలు

రాగి ఏప్రిల్ కాంట్రాక్టు ఈ వారం రూ. 436.80- 470.50 మధ్య కదలాడొచ్చు. రూ. 461.80 ఎగువకు వెళ్లకుంటే.. పెరిగినప్పుడల్లా అమ్మే వ్యూహంతో ముందుకెళ్లడం మంచిది. కొనుగోలు చేద్దామనుకునేవారు రూ. 437 చేరే వరకు వేచిచూడటం ఉత్తమం. సీసం మార్చి కాంట్రాక్టు రూ. 163.35 ఎగువకు చేరకుంటే.. పెరిగితే అమ్ముకోవచ్చు. జింక్ మార్చి కాంట్రాక్టుకు తాజా షార్ట్ సెల్లింగ్ ఎదురుకావొచ్చు. రూ. 226 స్థాయి వద్ద షార్ట్ సెల్ చేయొచ్చు. అల్యూమినియం మార్చి కాంట్రాక్టుకు రూ. 143.85 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు. ఇది అధిగమిస్తే మరింత పెరగొచ్చు. అందువల్ల వేచిచూసే ధోరణి పాటించడం మంచిది. అయితే ఈ వారంలో ఒక్కరోజైనా రూ. 139.45 దిగువకు చేరితే.. ప్రతికూల ధోరణి కొనసాగొచ్చు.






● ఇంధన రంగం

ముడిచమురు మార్చి కాంట్రాక్టు ఈ వారం మరింత పైకి వెళ్లొచ్చు. అయితే దిద్దుబాటుకు అవకాశం ఉండటంతో ఆచితూచి వ్యవహరించాలి. అందువల్ల రూ. 3,895 వద్ద స్టాప్‌లాస్‌గా పరిగణించాలి. అదే విధంగా రూ. 4,133 స్థాయిని జాగ్రత్త గమనించాలి. ఈ స్థాయిని అధిగమిస్తే.. రూ. 4,225 వరకు పెరగొచ్చు. సహజవాయువు మార్చి కాంట్రాక్టుకు ఈ వారం కూడా లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. తగ్గినప్పుడల్లా.. కొనుగోలు చేయొచ్చు.

గతవారం పొజిషన్లు ఇలా


కమొడిటీ (నవంబరు కాంట్రాక్టు)	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (ఏప్రిల్)	462.40	453	(2.03)
సీసం (మార్చి)	165.40	160.60	(2.90)
జింక్ (మార్చి)	229.95	220.40	(4.15)
అల్యూమినియం (మార్చి)	141.95	140.50	(1.02)
నికెల్ (మార్చి)	891.70	880	(1.31)
ముడి చమురు (మార్చి)	4,130	3,996	(3.24)
సహజ వాయువు (మార్చి)	176	177.30	0.74
సెనగలు (మార్చి)	3,860	3,689	(4.43)
ధనియాలు (ఏప్రిల్)	5,510	5,480	(0.54)
గోరు చిక్కుడు (మార్చి)	4,310	4,313	0.07



● వ్యవసాయ ఉత్పత్తులు

సెనగల్లో ఈవారం సైతం నష్టాలు రూ. 3,620; ఆ తర్వాత రూ. 3,558 వరకు కొనసాగొచ్చు. అయితే రూ. 3,602 వద్ద కొంత మద్దతు లభించొచ్చు. ధనియాలు ఏప్రిల్ కాంట్రాక్టు ఒడుదొడుకులు ఎదుర్కోవచ్చు. అయితే రూ. 5,319 వద్ద నిరోధం కనిపిస్తోంది. దీంతో ఆ స్థాయి అధిగమిస్తే కొనుగోళ్ల మద్దతు లభించొచ్చు. గోరుచిక్కుడు మార్చి కాంట్రాక్టు రూ. 4,254 దిగువకు చేరితే మరింత బలహీనపడొచ్చు. రూ. 4,084 వద్ద కొనుగోలు చేయొచ్చు.

–ఆర్ఎల్‌పీ కమొడిటీ& డెరివేటివ్స్



వేగవంతమైన వృద్ధి మళ్లీ భారత్‌దే: జైట్లీ

జమ్మూ: వచ్చే దశాబ్దాల్లో వేగంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని దక్కించుకుంటుందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ధీమా వ్యక్తం చేశారు. 'ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో భారత్‌కు గొప్ప అవకాశాలు లభిస్తున్నాయి. అన్ని దేశాలు సవాళ్లు ఎదుర్కొంటుంటే. . భారత్ మాత్రం వాటి అడుగుజాడల్లో నడవడం లేదు. ప్రపంచంలో వేగవంతమైన వృద్ధి సాధిస్తున్న దేశంగా నిలవడం ద్వారా భారతీయులకు అవకాశాలు పెరగబోతున్నాయి' అని జమ్మూ విశ్వవిద్యాలయం 17వ స్నాతకోత్సవ వేడుకలో పాల్గొన్న జైట్లీ పేర్కొన్నారు. 'ప్రపంచంలో వెలుగురేఖలుగా ఉన్న దేశాల్లో మనది ఒకటి. గత మూడు దశాబ్దాల్లో చైనా వృద్ధి మాదిరిగానే.. వచ్చే 1-2 దశాబ్దాల్లో భారత్ హవా కొనసాగనుంది. జమ్మూలో సంక్షోభ పరిస్థితులు లేకుంటే.. గొప్ప రాష్ట్రంగా మారేది. చదువుకున్న యువత రాష్ట్రంలో మార్పు తీసుకొస్తారని ఆశిస్తున్నాను' అని జైట్లీ వెల్లడించారు.

అమ్ముడుపోని.. 4.4 లక్షల ఇళ్లు!

- 2017లో 7 నగరాల్లో పరిస్థితి
- హైదరాబాద్‌లో 28,000 గృహాలు అలాగే
- జేఎల్ఎల్ ఇండియా సర్వే

దిల్లీ: దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో 2017 ఆఖరుకు 4.4 లక్షల ఇళ్లు అమ్ముడుపోలేదని ప్రాపర్టీ కన్సల్టెంట్ జేఎల్ఎల్ ఇండియా నిర్వహించిన సర్వేలో తేలింది. ఇందులో 1.5 లక్షల ఫ్లాట్లు దిల్లీ, పరిసర ప్రాంతాల్లోనే ఉన్నట్లు తెలిసింది. అధిక సంఖ్యలో అమ్ముడుపోకపోవడం అనేది ఇళ్ల ధరలు స్థిరంగా ఉండేందుకు అవకాశం కల్పిస్తుందని జేఎల్ఎల్ అంచనా వేసింది. ముంబయి, దిల్లీ, చెన్నై, హైదరాబాద్, పుణె, బెంగళూరు, కోల్‌కతా నగరాల్లో జేఎల్ఎల్ తాజాగా సర్వే నిర్వహించింది. అమ్ముడుపోని వాటిలో 34,700 ఫ్లాట్లు నిర్మాణం పూర్తయి నివసించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపింది. ఇందులో 20 శాతం వరకూ చెన్నైలోనే ఉన్నాయని వెల్లడించింది. అమ్ముడుపోని ఇళ్లలో దిల్లీ అగ్రస్థానం (1,50,654)లో ఉండగా, కోల్‌కతా (26,000) ఆఖరు స్థానంలో ఉంది. హైదరాబాద్‌లో దాదాపు 28,000; ముంబయిలో 86,000; బెంగళూరులో 70,000; పుణెలో 36,000 చొప్పున ఇళ్లు అమ్ముడుపోలేదు. జేఎల్ఎల్ ఇండియా సీఈఓ రమేశ్ నాయర్ మాట్లాడుతూ 'నివాస గృహాల మార్కెట్ కొంతకాలం వేచిచూసే ధోరణిలో కొనసాగుతుంది. స్థిరాస్తి వ్యాపారంలో వచ్చిన కొత్త నిబంధనలు, పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ ప్రభావం కూడా గృహ నిర్మాణ రంగంపై ప్రభావం చూపింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎవరూ కొత్త ప్రాజెక్టులు ప్రారంభించేందుకు సాహసం చేయకపోవడంతో మిగిలినవి రాబోయే త్రైమాసికాల్లో అమ్ముకొనే వీలుంద'ని అన్నారు.

విజయవాడ
సోమవారం మార్చి 5, 2018
siri@eenadu.net

ఆర్థిక స్వేచ్ఛకు.. అడుగులివే..!



గ్రాఫిక్: పార్థు

ఆర్థిక వ్యవహారాల్లో మహిళలకు మించిన ఆర్థిక వేత్తలు లేరు. ఓ చేత్తో.. కీలక ఉద్యోగాలు నెరవేరుస్తున్నారు.. వ్యాపార సామ్రాజ్యాలు నెలకొల్పుతున్నారు. కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుతుంటారు. అయితే, ఆర్థిక ప్రణాళికల విషయానికి వచ్చినప్పుడు మాత్రం.. మహిళలు కొంత దూరంగానే ఉండేవారని చెప్పొచ్చు. మాకు ప్రత్యేకంగా అవసరమా? అనే ధోరణే కనిపించేది. కానీ, మారిన పరిస్థితుల నేపథ్యంలో.. వారూ తమకు ప్రత్యేకంగా ఆర్థిక ప్రణాళిక ఉండాలన్న విషయాన్ని గుర్తిస్తున్నారు. తాము కష్టపడి సంపాదించిన డబ్బును సమర్థంగా వినియోగించుకొని, ఆర్థిక స్వేచ్ఛ సాధించాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. వీరందరికీ మార్గదర్శిగా నిలిచేందుకు.. 'మార్చి 8, అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా ఈ ప్రత్యేక కథనం..

కార్యాలయంలో, వ్యాపారంలో కొన్ని లక్షల రూపాయల లెక్కలను ఏ ఇబ్బందీ లేకుండా చేసే మహిళ.. సొంతింట్లో ఆర్థిక లావాదేవీలను అసలు పట్టించుకోరు. నాకెందుకు అవన్నీ అంటూ.. వెనకడుగు వేస్తుంటారు.. 2013లో ఒక మ్యూచువల్ ఫండ్ సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం చూస్తే.. ఆర్జించే మహిళల్లో దాదాపు 77 శాతం వరకూ ఆర్థిక నిర్ణయాలను తీసుకునేందుకు జీవిత భాగస్వామి, నాన్న సలహాలను పాటిస్తున్నారని తేలింది. మిగతా 23శాతంలో 18శాతం వరకూ ఒంటరి ఉద్యోగినులు. 'చాలా మంది మహిళలు కుటుంబానికి సంబంధించిన ఆర్థిక నిర్ణయాల్లో పాలుపంచుకోవడానికి ఇష్టపడరు. నిర్ణయం తీసుకున్నాకే.. దాని గురించి వారికి తెలుస్తుంది'. అప్పటి సర్వేలో తేలిందిది. అయితే, ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. నిర్ణయం తీసుకునే ముందు దాని గురించి తెలుసుకోవడం.. లేదా ఉమ్మడిగా కలిసి నిర్ణయం తీసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. అయితే, ఇది మరింత పెరగాల్సిన అవసరం ఉంది.

అవగాహన లేకపోతే..

కుటుంబ ఆర్థిక విషయాల గురించి ఆ ఇంటి మహిళలకు కచ్చితంగా తెలిసి ఉండాలి. కుటుంబంలో అనుకోని ఇబ్బందులు వచ్చినప్పుడు ఆర్థికపరమైన చిక్కులు తలెత్తకుండా ఇది కాపాడుతుంది. ఇక్కడ ఒక ఉదాహరణ చూద్దాం.. కుమార్ వయసు 43 ఏళ్లు. ఒక రోజు అతను గుండెపోటుతో కుప్పకూలిపోయారు. అతని భార్య శ్రావణి గృహిణి. 40 ఏళ్లు.. 12, 7 ఏళ్ల ఇద్దరు పిల్లలు. ఆస్తులు, అప్పులు, పెట్టుబడుల గురించి ఏమీ వారికి తెలియవు. ఎవరిని సంప్రదించాలో కూడా తెలియదు. ఇప్పటివరకూ ఎప్పుడూ కూడా శ్రావణి తన భర్త కుమార్‌ను ఆర్థిక విషయాల గురించి అడిగేవారు కాదు. ఒక్క రూపాయి ఖర్చయినా సరే.. కుమార్ చేతుల మీదుగానే జరిగేది.. దీంతో ఇప్పుడు ఏం చేయాలో తెలియని స్థితిలో పడిపోయింది తను. ఇలాంటి సంఘటనలు తరచూ చూస్తూనే వింటూనే ఉంటాం కదూ.. ఇలాంటి పరిస్థితులు ఎదురవ్వకుండా ఉండాలంటే.. కుటుంబ ఆర్థిక ప్రణాళికల్లో దంపతులిద్దరి భాగస్వామ్యం ఉన్నప్పుడే.. అది సరైన ఆర్థిక ప్రణాళిక అనిపించుకుంటుంది.

ఎవరిపైనా ఆధారపడకుండా..

పురుషులతో పోలిస్తే మహిళల జీవిత కాలం ఎక్కువే. 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' గణాంకాల ప్రకారం చూస్తే.. సగటు పురుషుడి ఆయుర్దాయం 68.5ఏళ్లు కాగా.. మహిళల సగటు ఆయుర్దాయం 73.5ఏళ్లు. మన దేశంలో భర్త కన్నా భార్య వయసు 3-5ఏళ్లు తక్కువగా ఉంటుంది. ఈ గణాంకాలను పరిశీలిస్తే.. మహిళ కనీసం 8-10 ఏళ్లపాటు సొంతంగా.. ఎవరిమీదా ఆధారపడకుండా జీవించేందుకు అవసరమైన ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఉద్యోగం వదిలేసినా..

తనపై ఆధారపడిన వారికోసం త్యాగాలు చేయడంలో మహిళలకు మించిన వారు లేరు. కుటుంబం కోసం చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకునేవారు ఎందరో. మగవారిలో ఇది చాలాచాలా తక్కువగా కనిపిస్తుంది. ఈ ఉద్యోగం మానేయడం కొన్నిసార్లు తాత్కాలికంగా ఉండొచ్చు. మరికొన్నిసార్లు శాశ్వతంగా కావచ్చు. అయితే, తాత్కాలికంగా విరామం తీసుకున్నప్పుడు.. ఆర్థికంగా ఇబ్బందులు రాకుండా ముందు నుంచే తగిన ప్రణాళిక, ఆలోచన ఉండాలి. లేకపోతే, ఈ సమయంలో ఆర్థికంగా జీవిత భాగస్వామిపై ఆధారపడాల్సి వస్తుంది. అప్పటివరకూ సొంతంగా ఆర్జించిన మహిళల్లో చాలామందికి ఇది నచ్చకపోవచ్చు.

సొంతంగా నిర్ణయం..

ఒక విషయాన్ని పలు కోణాల్లో విశ్లేషించి, సరైన నిర్ణయం తీసుకోవడంలో మహిళలు ఎప్పుడూ ముందుంటారు. ఆర్థిక విషయాల్లోనూ వారు సమర్థంగా తమ పాత్ర నిర్వహించగలరు. అందుకే, మీ డబ్బును మీరే నిర్వహించుకునే ఆర్థిక స్వేచ్ఛ మీకు రావాలి. దీని కోసం 'ఒక్కసారి డబ్బు సంగతి చూద్దాం' అని గట్టిగా అనుకోండి.. మీ ఆర్థిక జీవితం ఎవరిపైనా ఆధారపడకూడదన్న విషయాన్ని ఇక్కడ గుర్తుపెట్టుకుంటే చాలు!

విడాకులు తీసుకుంటే..

కారణాలేమైనా ఉండొచ్చు.. కొన్నిసార్లు వివాహ బంధం నుంచి బయటకు రావాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. ఇలాంటప్పుడు ఆర్థికంగా స్వేచ్ఛ లేకపోతే మహిళలు కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటారన్న సంగతి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మానసిక ఉద్వేగాల సంగతి ఎలా ఉన్నా.. ఆర్థిక విషయాల్లో వారు కొంత గందరగోళానికి గురవుతుంటారు. ముందునుంచే ఆర్థిక ప్రణాళిక పటిష్ఠంగా ఉంటే.. వారు తమకు నచ్చని బంధం నుంచి ఏ ఇబ్బందీ లేకుండా బయటకు రాగలరు. ఆర్థిక వనరులకు ఇబ్బంది లేకుండా ఉంటే.. వారు తమకు నచ్చిన ఉద్యోగం, వ్యాపారం మీద అధిక దృష్టి కేంద్రీకరించేందుకు అవకాశం ఉంటుంది. ఉద్యోగ, వ్యాపార జీవితంలో మరింత ఉన్నత శిఖరాలకు వెళ్లేందుకు.. ఆర్థిక చిక్కులు కారణం కాకూడదు.

సంపాదించడం ప్రారంభించాలి..

గృహిణిగా బాధ్యతలు నిర్వహించడం అంత తేలికేమీ కాదు. ఆ సేవలకు వెలకట్టడం ఎవరివల్లా కాదు. కానీ, సొంత సంపాదన లేకుండా ఉన్నప్పుడు మరొకరిపైన ఆధారపడటం అనేది తప్పదు. ఈ పరిస్థితి నుంచి గృహిణులు, విడాకులు తీసుకున్న మహిళలు.. వితంతువులు, ఒంటరి మహిళలు బయటకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే, ముందుగా వీరు తాము సంపాదించలేకపోతున్నాం అనే భావన నుంచి బయటకు రావాలి. డబ్బు ఆర్జనకు ఉన్న మార్గాలపై దృష్టి పెట్టాలి..

ఈ రోజుల్లో డబ్బు సంపాదించడం పెద్ద విషయమేమీ కాదు. ఉన్నత చదువులు చదివి, గృహిణిగా బాధ్యతలు నిర్వహించేవారు ఉంటారు. కొంతమందికి పెద్ద చదువులు ఉండకపోవచ్చు. కానీ, ప్రత్యేకమైన అభిరుచులు ఉండొచ్చు. డబ్బు సంపాదించేందుకు మీకున్న చదువు, అభిరుచులను మార్గంగా చేసుకోండి.

◆ **వీడియోలతో..:** ఇప్పుడంతా ఆన్‌లైన్ యుగం. మీరు ఉన్నత చదువులు చదివినవారైతే.. మీ సబ్జెక్టులలో వీడియో పాఠాలు తయారు చేసి, యూట్యూబ్‌లాంటి వాటిల్లో అప్‌లోడ్ చేయొచ్చు. ఆన్‌లైన్ ట్యూషన్లు చెప్పేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలి. వంటలు, అల్లికలు, సరదా వీడియోలు.. ఒకటేమిటి.. ఇక్కడ అపారమైన అవకాశాలున్నాయి. వీటిని ఎలా వినియోగించుకోవాలో ఆలోచించడమే మీరు చేయాల్సిన మొదటి పని.

◆ **ఈ కామర్స్ వెబ్‌సైట్ల ద్వారా:** మీరు ఏదైనా వస్తువులను తయారు చేయగలరా.. అయితే, ఈ కామర్స్ వెబ్‌సైట్లలో మీ పేరును నమోదు చేసుకోండి. ఇంటి నుంచే మీ వస్తువులను విక్రయించే అవకాశం ఉంటుంది.

ఇవన్నీ కేవలం కొన్ని ఆలోచనలు మాత్రమే. వీటికి మించి అవకాశాలు కూడా బోలెడున్నాయి. అయితే, ఇంటి నుంచే పని చేయండి.. అంటూ వచ్చే మోసపూరిత ప్రకటనలకు మాత్రం స్పందించకండి. వారిని నమ్మి డబ్బు కట్టి, నష్టపోవద్దు. ఈ విషయంలో జాగ్రత్త సుమా!

వ్యాపారం చేస్తారా..

మహిళలు వ్యాపారవేత్తలుగా మారడానికి అటు ప్రభుత్వ పరంగా... ఇటు బ్యాంకుల నుంచీ సహాయం, ప్రత్యేక రుణాలు అందుబాటులో ఉన్నాయి.

◆ **ముద్ర రుణాలు:** వ్యాపారం చేయాలనుకుంటున్న మహిళలకు భారత ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకమిది. కొత్తగా ఏ వ్యాపారం ప్రారంభించాలనుకుంటే ఈ రుణాన్ని తీసుకోవచ్చు. బ్యూటీపార్లర్, ట్యుటోరియల్ సెంటర్, టైలరింగ్, టిఫిన్ సెంటర్ ఇలా ఏదైనా సరే.. మీ ఇష్టం.. గుర్తింపు కోసం ఆధార్, మీ వ్యాపారానికి సంబంధించిన పూర్తి వివరాలు ఉంటే చాలు. ఒకసారి పరిశీలన పూర్తయితే.. బ్యాంకులు ముద్రా కార్డును జారీ చేస్తాయి. రూ. 50వేల నుంచి రూ. 50లక్షల వరకూ ముద్రా పథకంలో రుణం పొందే అవకాశం ఉంది. నిబంధనల ప్రకారం రూ. 10లక్షల వరకూ ఎలాంటి హామీ లేకుండానే రుణం తీసుకునే అవకాశం ఉంది. అంతకుమించినప్పుడు మాత్రం హామీ చూపించాల్సిన అవసరం ఉంటుంది.

◆ **ఎస్‌బీఐ... స్త్రీ శక్తి...:** మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రత్యేకంగా అందిస్తోన్న పథకమిది. ఒక వ్యాపారంలో 50శాతానికి మించి మహిళకు భాగస్వామ్యం ఉంటే.. ఈ రుణం పొందేందుకు అర్హులు. రూ. 5లక్షల వరకూ రుణం పొందేందుకు ఎలాంటి హామీ అవసరం లేదు. రూ. 2లక్షలకు లోపు రుణం తీసుకున్నప్పుడు సాధారణ వడ్డీకన్నా 0.5శాతం తక్కువగా ఉంటుంది.

◆ **పంజాబ్ నేషనల్ బ్యాంకు** కూడా మహిళల కోసం ప్రత్యేకంగా 5 పథకాలను అందిస్తోంది. చిన్న వ్యాపారాల కోసం మహిళాఉదయం పథకం; ఇంటర్నెట్ కేంద్రం, బ్యూటీ పార్లర్, టైలరింగ్ షాపు ఏర్పాటు కోసం మహిళా సమృద్ధి యోజన; క్రెచ్‌ల ఏర్పాటు కోసం ప్రత్యేక రుణం, వ్యవసాయేతర అవసరాల కోసం కల్యాణి కార్డ్, చిన్న, మధ్య తరహా వ్యాపారాలను ప్రారంభించేందుకు పీఎన్‌బీ మహిళా సశక్తి కరణ్ అభియాన్ పేరుతో రుణాలు అందిస్తోంది.

ప్రణాళిక.. ప్రతి ఒక్కరికీ...

◆ **మలి వయసు కోసం:** మహిళలైనా.. పురుషులైనా.. తమ మలి వయసులో ఆర్థిక ఇబ్బందులు రాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే, చాలామంది భారతీయులు 40 ఏళ్లు దాటాకే.. పదవీ విరమణ ప్రణాళికల గురించి ఆలోచిస్తుంటారు. అయితే, మహిళలు పదవీ విరమణ ప్రణాళికలకు ఏ మాత్రం ప్రాధాన్యం ఇవ్వరు. ఆర్థిక విషయాల్లో ఇది పెద్ద పొరపాటుగానే భావించాలి. ఆర్థిక స్వేచ్ఛ దిశగా అడుగులు వేసే ప్రతి మహిళా.. తనకు సొంతంగా పదవీ విరమణ ప్రణాళిక ఉండేలా చూసుకోవాలి. ఉద్యోగం/వ్యాపారం ప్రారంభించిన రోజే.. పదవీ విరమణ కోసం పెట్టుబడులను ప్రత్యేకించాలి. దీనివల్ల పెట్టుబడులు వృద్ధి చెందేందుకు మంచి సమయం దొరుకుతుంది. ఆదాయం ఆగిపోయిన రోజున ఇతరుల మీద ఆధారపడాల్సిన అవసరాన్ని ఇది తప్పిస్తుంది.

◆ **50/30/20 సూత్రం:** సంపాదించిన మొత్తంలో 50శాతాన్ని కుటుంబ నిర్వహణ కోసం వెచ్చించాలి. అంటే.. అద్దె, పిల్లల ఫీజులు, నిత్యావసరాల కొనుగోలు ఇలాంటివాటికన్నమాట. 30శాతాన్ని కచ్చితంగా పొదుపు, పెట్టుబడుల కోసం కేటాయించాలి. ఇది మన ఆర్థిక లక్ష్యాలను తీర్చుకునేందుకు ఉపయోగపడాలి. పదవీ విరమణ, పిల్లల ఉన్నత చదువుల ఖర్చుల్లాంటివి దృష్టిలో పెట్టుకోవాలి. ఇక మిగిలిన 20శాతంతో మీరు అవసరమైన కొనుగోలు, వినోదం లాంటి వాటికి కేటాయించుకోవచ్చు.

◆ **అత్యవసర నిధి:** అనుకోని ఖర్చులు ఎదురైనప్పుడు.. తాత్కాలికంగా ఉద్యోగం మానేయాల్సిన సందర్భం వచ్చినప్పుడు ఆర్థికంగా ఇబ్బంది రాకుండా ఉండాలంటే.. కనీసం 12 నెలల ఖర్చులకు సరిపడా డబ్బు మీ చేతిలో ఉండాలి. దీన్ని లిక్విడ్ ఫండ్లలో మదుపు చేయాలి.

◆ **వీలునామా రాయండి:** మీపై ఆధారపడిన పిల్లలు ఉన్నప్పుడు.. మీ పేరుమీద ఉన్న ఆస్తులు వారికి ఏ ఇబ్బందీ లేకుండా చేరేలా వీలునామా రాయాలి. ఆస్తులు మీ పేరుమీద ఉన్నప్పుడు.. మీరు ఏ వయసు వారైనా సరే.. వీలునామా రాయడం ఎప్పుడూ అవసరం అని గుర్తు పెట్టుకోండి.

◆ **బీమా రక్షణ:** చాలామంది మహిళలు జీవిత బీమా విషయాన్ని సరిగా పట్టించుకోరు. ఆరోగ్య బీమా పాలసీలనూ తీసుకోరు. పెరుగుతున్న వైద్య ఖర్చుల నేపథ్యంలో మహిళలు తప్పనిసరిగా తమ పేరుమీద ఆరోగ్య బీమా ఉండేలా చూసుకోవాలి. ఆర్జించే మహిళలైనా.. గృహిణులైనా తమ పేరుమీద జీవిత బీమా పాలసీ ఉండాల్సిందే. కొన్ని ఆరోగ్య బీమా పాలసీలు మహిళల కోసం ప్రత్యేకంగా ఉన్నాయి. వీటిని తీసుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వవచ్చు.

◆ **ఆర్థిక లక్ష్యాలను సాధించేలా..:** మీకంటూ కొన్ని ఆర్థిక లక్ష్యాలను నిర్ణయించుకోండి. వాటిని సాధించేందుకు మీరు ప్రత్యేకంగా పెట్టుబడులను ప్రారంభించండి. మూడేళ్లలోపు లక్ష్యాలకు డెట్ ఫండ్లను ఎంచుకోండి. 3-5ఏళ్ల మధ్యలో ఉన్న లక్ష్యాలకు అనుగుణంగా బ్యాలెన్స్‌డ్ ఫండ్లలో మదుపు చేయాలి. ఐదేళ్లకు మించి లక్ష్యం ఉన్నప్పుడు ఈక్విటీ ఫండ్లను ఎంచుకునేందుకు ప్రయత్నించాలి.



సాయి కృష్ణ పత్రి
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

పాలసీ కోసం.. ఏడాది సమయమా?

❑ **నేను 30శాతం పన్ను శ్లాబులో ఉన్నాను. ప్రావిడెంట్ ఫండ్ రూ.48,000 చెల్లిస్తున్నాను. ఆదాయపు పన్ను ఆదా కోసం ఇంటి రుణం తీసుకుందామని అనుకుంటున్నాను. మా నాన్నగారు తీసుకున్న ఇంటిరుణంపై రూ.10లక్షల వరకూ టాపప్ లోన్ ఇస్తాం అంటోంది బ్యాంకు. వడ్డీ 10శాతం. ఆ లోన్ మార్జిన్ మనీగా వాడుకొని, నేను ఇంటి రుణం తీసుకోవడం మంచిదేనా?**

- వినోద్

❑ మీ నాన్నగారి ఇంటి రుణంపై టాపప్ తీసుకుంటే.. రూ. 10లక్షలపై వడ్డీ ఏడాదికి సుమారు రూ. 1లక్ష అవుతుంది. మీరు ఇంటి రుణం తీసుకుంటే దాని వడ్డీ రూ. 2,00,000పై మీకు ఆదాయపు పన్ను రూ. 62,400 మిగులుతుంది. కాబట్టి, టాపప్ రుణం తీసుకొని, దానిని మార్జిన్ మనీగా ఉపయోగించుకోవడం లాభదాయకం కాదు. ఆదాయపు పన్ను సెక్షన్ 80సీ ప్రయోజనం కోసం మీరు ప్రస్తుతం ఇంటి రుణం చెల్లింపుపై ఆధారపడకుండా ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్)లో ఏడాదికి రూ. 1,02,000లను పెట్టుబడి పెట్టండి. వీటి వ్యవధి మూడేళ్లు. మూడేళ్లలోపు కొంత డబ్బు డివిడెండ్ రూపంలో కూడా మీకు అందే అవకాశం ఉంది. మీరు పొదుపు చేసుకున్న మొత్తం మార్జిన్ మనీగా సరిపోనప్పుడు స్వల్పకాలిక సర్దుబాటు కోసం కొద్ది మొత్తాన్ని అప్పుగా తీసుకోవచ్చు. కానీ, మొత్తం మార్జిన్ మనీ కోసం మరో అప్పు తీసుకోవడం మంచిది కాదు. రెండు రుణాల చెల్లింపులు భారం అయ్యే అవకాశం ఉంది.

❑ **మా వారి వయసు 32 ఏళ్లు. ఏడాదికి రూ. 8లక్షల ఆదాయం. ఆన్‌లైన్‌లో మంచి టర్మ్ పాలసీ తీసుకుందామని ఏడాది నుంచీ అనుకుంటున్నారు. మంచి పాలసీని ఎంచుకోవడం ఎలా?**

- కోమలి



❑ జీవిత బీమా కోసం టర్మ్ పాలసీని ఎంచుకోవాలనుకోవడం మంచి ఆలోచనే. ఆన్‌లైన్‌లో పాలసీ తీసుకోవడం వల్ల ప్రీమియం తక్కువగా ఉంటుంది. అయితే, మంచి పాలసీ కోసం వెతుకుతూ ఏడాది పాటు ఆలస్యం చేశారంటే? మంచి పద్ధతి కాదు. ఈ సమయంలో ఏదైనా జరిగితే? ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. పాలసీ తీసుకోవాలని నిర్ణయించుకున్న వారంలోగా ఆన్‌లైన్‌లో తీసేసుకోవాలి. లేదా.. నిపుణుడైన బీమా ఏజెంటును, మీ బ్యాంకును సంప్రదించాలి. వాళ్లే మీ వెంటపడి మీకు పాలసీ జారీ అయ్యేలా చూస్తారు. ప్రస్తుత జీవన విధానంలో చాలామంది వినోదాలకు సమయం కేటాయిస్తున్నారు కానీ.. బీమా పాలసీ ప్రక్రియను పూర్తి చేయడానికి కాస్త సమయాన్ని కూడా కేటాయించలేకపోతున్నారు. కుటుంబాన్ని ప్రేమించే వారెవరైనా తమకు ఏదైనా అయితే.. అన్న జాగ్రత్త తీసుకోవడం తప్పనిసరి. ముందు ఆలస్యం చేయకుండా ఆన్‌లైన్‌లోనే.. ఏజెంటు ద్వారానో పాలసీ తీసేసుకోండి. అవసరమైతే తర్వాత మెరుగైన పాలసీని తీరిగ్గా ఎంపిక చేసుకోవచ్చు.

❑ **నా వయసు 35 ఏళ్లు. నా భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రుల పేరుతో రూ.5లక్షలకు ఆరోగ్య బీమా తీసుకోవాలని ఆలోచిస్తున్నాను. కుటుంబంలో అందరికీ విడివిడిగా వర్తించేలా వ్యక్తిగత పాలసీ తీసుకోవాలా? లేక ప్రీమియం తక్కువగా ఉండేలా ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీ తీసుకుంటే బాగుంటుందా?**

మార్గదర్శి

- శ్రీనివాస్

❑ కుటుంబం అంతటికీ వర్తించేలా రూ. 5లక్షల ఫ్లోటర్ పాలసీ తీసుకుంటే కుటుంబంలో అందరికీ కలిపి రూ. 5లక్షల బీమా రక్షణ ఉంటుంది. విడివిడిగా వ్యక్తిగత ఆరోగ్య బీమా తీసుకుంటే.. ఓ ఏడాదిలో ఎవరికి సమస్య వచ్చినా.. ఇతరులతో సంబంధం లేకుండా రూ. 5లక్షల వరకూ ఆరోగ్య బీమా అందుబాటులో ఉంటుంది. అయితే, ఫ్లోటర్ పాలసీతో పోలిస్తే... వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీకి ప్రీమియం అధికంగా ఉంటుంది. సాధారణంగా తక్కువ వయసున్న కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమస్యలు తక్కువగా ఉంటాయి. కాబట్టి, మీకు, మీ భార్య, పిల్లలకు కలిపి ఒక ఫ్లోటర్ పాలసీ తీసుకోండి. మీ తల్లిదండ్రులకు విడివిడిగా ఆరోగ్య పాలసీ తీసుకోవడమే ఉత్తమం.




వంగా రాజేంద్ర ప్రసాద్
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

కొత్త పథకం

ఆర్థిక వృద్ధితో పాటుగా..

భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి ఫలాలను అందుకోవాలని భావించే వారి కోసం **ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్ రిసర్జంట్ ఇండియా ఫండ్ (సిరీస్ 6)**ను అందుబాటులోకి తెచ్చింది. దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో పాలుపంచుకొని, తద్వారా లాభాలు ఆర్జించే కంపెనీల ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత పథకాల్లో మదుపు చేయడం ద్వారా పెట్టుబడి పెరుగుదలకు దోహదం చేసే వ్యూహంతో ఈ ఫండ్ పనిచేస్తుంది. గ్రోత్, డివిడెండ్ ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. కనీస పెట్టుబడి రూ. 1,000. మదుపు చేసిన మొత్తాన్ని మూడున్నర ఏళ్ల పాటు కొనసాగించాలి. దీని ప్రామాణిక సూచీ ఎస్అండ్‌పీ బీఎస్ఈ 500. ఈ క్లోజ్ ఎండెడ్ పథకం ఎన్ఎఫ్ఓ చివరి తేదీ మార్చి 7.

చివరి నిమిషంలో.. చేయొద్దు పొరపాట్లు!



ఆర్థిక సంవత్సరం చివరి నెలలో ఉన్నాం. ఆదాయపు పన్ను మినహాయింపు పొందేందుకు నిర్ణీత పెట్టుబడి పథకాల్లో మదుపు చేసేందుకు అందరూ హడావుడిపడే సమయమిది.. కేవలం పన్ను ఆదా కోసం అన్నట్లే పెట్టుబడులు పెడితే వీటివల్ల పెద్దగా ఫలితం ఉండదు సరికదా.. నష్టపోయే అవకాశం కూడా ఉంది. కాబట్టి, ఎలాంటి పొరపాట్లకూ తావీయకుండా.. పన్ను ప్రణాళిక సమర్థంగా ఎలా వేసుకోవాలో చూద్దామా!

పన్ను మినహాయింపు పొందేందుకు కొంత మొత్తం పెట్టుబడి పెట్టాలనగానే చాలామంది ఏ ఆలోచనా లేకుండా.. ఏదో ఒక పాలసీ తీసుకోవడమో.. లేదా ఏదైనా ఒక పెట్టుబడి పథకంలో మదుపు చేయాలని చూస్తుంటారు. స్వల్పకాలిక దృష్టితో దీర్ఘకాలిక పథకాలను ఎంచుకొని, తీరా మరుసటి ఏడాది ప్రీమియం చెల్లించకుండా ఆపేస్తుంటారు. ఇది మంచి ఆర్థిక ప్రణాళిక అనిపించుకోదు.

సెక్షన్ 80సీని అర్థం చేసుకోండి...

ఆదాయపు పన్ను మినహాయింపు అనగానే అందరికీ గుర్తుకొచ్చేది సెక్షన్ 80సీనే. ఈ సెక్షన్ కింద రూ. 1,50,000 వరకూ పెట్టుబడి పెట్టుకోవచ్చు. పీఎఫ్, పిల్లల ట్యూషన్ ఫీజులు, గృహరుణం అసలు, పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ, ఎన్‌పీఎస్, జీవిత బీమా పాలసీలు, ఈఎల్ఎస్ఎస్‌లు, బ్యాంకు పన్ను ఆదా ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఇలా అనేకానేక పథకాలు ఇందులో ఉంటాయి. కొంత మంది ఈ సెక్షన్ పరిధిలోకి వచ్చే పెట్టుబడి పథకాల్లోనే ఎక్కువగా మదుపు చేస్తుంటారు. పరిమితికి మించి ఇందులో మదుపు చేసినా ఉపయోగం లేదు. కాబట్టి, ముందుగా వీపీఎఫ్‌లాంటి వాటి తర్వాత ఎంత మేరకు ఈ సెక్షన్‌లో తక్కువ పడిందో చూసి, ఆ మేరకే మదుపు చేయండి.

మదుపు.. ఖర్చు.. ఒక్కటి కాదు

ఆదాయపు పన్ను మినహాయింపు పొందేందుకు వివిధ పెట్టుబడి పథకాలతో పాటు, కొన్ని రకాల ఖర్చులకూ అనుమతి ఉంది. ఉదాహరణకు పీపీఎఫ్, వీపీఎఫ్, ఎన్ఎస్‌సీ, ఎన్‌పీఎస్, ఫిక్స్‌డ్ డిపాజిట్లులాంటివన్నీ పెట్టుబడులు. పిల్లల చదువుల ఫీజులు, గృహరుణం అసలులాంటివి ఖర్చులుగా చూడొచ్చు. బీమా పాలసీలు కూడా ఈ సెక్షన్ పరిధిలోనే ఉన్నప్పటికీ అవి దీర్ఘకాలిక పథకాలు. కేవలం పన్ను ఆదా కోసం మాత్రమే అనుకుంటే.. బీమా పాలసీ తీసుకోకపోవడమే మేలు. అయితే, ప్రతి వ్యక్తికీ తన వార్షికాదాయానికి 12 రెట్ల వరకూ జీవిత బీమా ఉండాల్సిందే. దీన్ని తక్కువ ఖర్చుతో లభించే టర్మ్ పాలసీద్వారా తీసుకోవాలి. పన్ను ఆదా కోసం బీమా పాలసీ అనేది సరికాదు.

పరిమితులు తెలుసుకోండి..

ఇంటి అద్దె భత్యం, రవాణా, వైద్య ఖర్చుల తిరిగి చెల్లింపు.. ఇలా రకరకాల మినహాయింపులు ఉంటాయి. వీటికి కొన్ని పరిమితులు ఉంటాయి. మీకు లభించే మినహాయింపులేమిటి? వాటికి విధించిన పరిమితులేమిటి? ముందు తెలుసుకోవాలి. మీ కార్యాలయంలో వీటి గురించి అడగండి. ఇవన్నీ పూర్తిగా పొందారా లేదా చూసుకోండి. ఆ తర్వాతే మీకు నికరంగా ఎంత పన్ను వర్తిస్తుందో లెక్క వేసుకొని, అందుకు అనుగుణంగా పెట్టుబడి పెట్టండి.

వ్యవధి చూసుకోండి..

పన్ను ఆదా పథకాల్లో కొన్ని దీర్ఘకాలం కొనసాగేవి ఉంటాయి.. మరికొన్నింటి వ్యవధి 3-5ఏళ్ల వరకూ ఉంటుంది. మీరు పెట్టుబడులు పెట్టేప్పుడు ఏ వ్యవధి పథకాలను ఎంచుకుంటున్నారో సరిగా చూసుకోండి. ఉదాహరణకు ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల (ఈఎల్ఎస్ఎస్) వ్యవధి 3ఏళ్లు. అదే బీమా పాలసీ తీసుకుంటే.. 15 ఏళ్ల వ్యవధైనా ఉంటుంది. అంతకాలం మదుపు చేయాలంటే.. మధ్యలో ఎన్నో అవాంతరాలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, పెట్టుబడి పథకాన్ని ఎంచుకునేప్పుడు ఎంత వ్యవధి పాటు మనం ఇబ్బందిలేకుండా చెల్లించగలం అన్నదీ ప్రధానంగా చూసుకోవాల్సిన విషయం.

నిరంకుశత్వం దిశగా చైనా

- జీవితాంతం అధ్యక్ష పీఠంపై షి జిన్‌పింగ్‌ను కూర్చోబెట్టడానికి రంగం సిద్ధం
- రాజ్యాంగ సవరణకు నేడు ఎన్‌పీసీ ఆమోదం



బీజింగ్: చైనాలో మరో చరిత్రాత్మక పరిణామానికి రంగం సిద్ధమయింది. అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌కు అపరిమిత అధికారాలను కట్టబెట్టడానికి వీలుగా ఆయన పదవీకాలపు పరిమితిని ఎత్తివేయడానికి చేపట్టే రాజ్యాంగ సవరణలకు ఆమోదం తెలిపేందుకు చైనా పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ) సోమవారం భేటీ కాబోతోంది. ఇదే కనక జరిగితే జిన్‌పింగ్ జీవితాంతం అధికార పీఠంపై ఆసీనులయి ఉంటారు. నిరంకుశత్వాన్ని అనుమతించకుండా నియంత్రించేందుకు దశాబ్దాల పాటు చేసిన ప్రయత్నాలు పనికిరాకుండా పోతాయి. జిన్‌పింగ్ 2012లో చైనా కమ్యూనిస్ట్ పార్టీ అధిపతిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి ఆయన అధికారాన్నంతా తన గుప్పెట్లో ఉంచుకోవడానికి, గడచిన రెండు దశాబ్దాలుగా ఏర్పాటు చేసుకున్న సమష్టి నాయకత్వపు నిబంధలను ఉల్లంఘించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. జాతీయ భద్రత, ఆర్థికవ్యవస్థ, ఆర్థిక సంస్కరణలను, ఇతర ప్రధాన కార్యక్రమాలను పర్యవేక్షించే సంస్థలకు అధిపతిగా ఆయన తనను తానే నియమించుకున్నారు. ఈ క్రమంలో ఆయన పార్టీలో రెండో స్థానంలో ఉన్న ప్రధాని లీ కెచాంగ్‌ను సమర్థంగా పక్కనపెట్టేశారు.

మావో జెడాంగ్ సాంస్కృతిక విప్లవం నేపథ్యంలో ప్రబలిన మితిమీరిన నియంతృత్వపు ధోరణి మళ్లీ ప్రబలకుండా నియంత్రించేందుకు చైనా సమున్నత నాయకుడు డాంగ్ షావ్‌పింగ్ 1982లో ఒక పద్ధతిని తీసుకొచ్చారు. ఒక వ్యక్తి జీవితాంతం అధ్యక్షపదవిలో ఉండడానికి వీల్లేకుండా రాజ్యాంగ నిబంధన తీసుకొచ్చారు. వరుసగా రెండు సార్లకన్నా ఎక్కువసార్లు ఆ పదవిని చేపట్టడానికి వీల్లేకుండా చేశారు. ఇప్పుడు ఆయన కృషి మొత్తం బూడిదలో పోసిన పన్నీరవుతోంది.

ప్రతిపాదిత రాజ్యాంగ సవరణకు ఎన్‌పీసీ ఆమోదం తెలపడం దాదాపు ఖాయమే. అయితే ఎంత మంది ప్రతినిధులు ఓటింగ్‌కు గైర్హాజవుతారనేదే ఆసక్తికరం. రాజ్యాంగ సవరణ ప్రతిపాదనకు ఎంతమందికి అభ్యంతరం ఉంది అనేదానికి గైర్హాజరు ఒక సూచిక.

ప్రతిపాదిత రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న వారూ ఉన్నారు. చైనా అధికారిక యువజన పత్రిక మాజీ ఎడిటర్ లి డాటాంగ్ స్పందిస్తూ అధ్యక్షపదవీ కాలానికి పరిమితి ఎత్తివేయడమంటే అస్తవ్యస్త పరిస్థితులకు బీజం వేయడమేనని స్పష్టం చేశారు. సవరణకు వ్యతిరేకంగా ఓటు వేయాలని శాసనకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదన.. ఒక దారుణ మోసమని ప్రభుత్వ సంస్కరణల్లో కీలక పాత్ర పోషించిన మహిళా వ్యాపారవేత్త వాంగ్ యింగ్ చెప్పారు.

అన్నీ బాగున్నంత కాలం పార్టీ.. జిన్‌పింగ్ మాట వింటుందని, వచ్చే ఐదేళ్ల కాలంలో ఏవైన తీవ్ర ఆర్థిక పొరపాట్లు సంభవిస్తే ఆయన పదవీ కాలం పొడిగింపునకు అవకాశాలు సన్నగిల్లుతాయని లండన్ స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్‌లో చైనా ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ స్టీవ్ త్సాంగ్ అభిప్రాయపడ్డారు. ప్రజాభిప్రాయంతో నిమిత్తం లేకుండానే రాజ్యాంగాన్ని ఎలా సవరిస్తారని యూనివర్సిటీ ఆఫ్ షికాగోలో చైనా వ్యవహారాల నిపుణుడైన డాలి యాంగ్ ప్రశ్నించారు.

అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌కు పదవీ కాలపు పరిమితిని ఎత్తివేయాలన్న ప్రతిపాదనను చైనా ఆదివారం సమర్థించుకుంది. పాలక కమ్యూనిస్ట్ పార్టీ (సీపీసీ) అధికారాన్ని, నాయకత్వపు ఐక్యతను కొనసాగించుకోవడానికి పదవీకాలపు పరిమితిని ఎత్తివేయడం అవసరమని చెప్పింది. సీపీసీ ఈ ప్రతిపాదనను తీసుకురావడానికి గల కారణాలపై పార్టీ తొలిసారి వివరణ ఇచ్చింది. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఝూంగ్ యెసూయ్ మీడియాతో మాట్లాడుతూ అధ్యక్షుడికే పదవీ కాల పరిమితి ఉందని, పార్టీ అధిపతికి, సైన్యాధిపతికి అటువంటి పరిమితులేమీ లేవని గుర్తు చేశారు. కొత్త పరిస్థితులకు తగ్గట్లుగా మార్పులు చేసుకోవడం, కొత్త అనుభవాలను పరిగణనలోకి తీసుకోవడం, కొత్త నిబంధనలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా మాత్రమే రాజ్యాంగం కలకాలం నిలిచిపోతుంది అని ఝూంగ్ అన్నారు.

రక్షణ బడ్జెట్‌ను వెల్లడించని చైనా

వార్షిక పార్లమెంట్ సమావేశాలకు ముందు రక్షణ బడ్జెట్‌ను ప్రకటించే చైనా ఇటీవల కాలంలో తొలిసారి ఈ సంప్రదాయాన్ని విస్మరించింది. ప్రతి ఏటా నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ) అధికార ప్రతినిధి దేశ రక్షణ బడ్జెట్‌ను శాతం రూపంలో వెల్లడిస్తారు. ఎన్‌పీసీ అధికార ప్రతినిధి ఝూంగ్ యెసూయ్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ చైనా సైనిక వ్యయం క్రమంగా పెరగడాన్ని సమర్థించినా ఎంత శాతం పెరుగుదల ఉందో వెల్లడించలేదు. రక్షణ విధానం.. స్వభావ రీత్యా రక్షణాత్మకమని చెప్పిన ఝూంగ్.. చైనా అభివృద్ధి.. ఏ ఇతర దేశానికీ ముప్పు కాదన్నారు. చైనా గత ఏడాది రక్షణ బడ్జెట్‌ను దాదాపు రూ.9.81లక్షల కోట్లకు పెంచింది. భారత్ తాజా రక్షణ బడ్జెట్ దాదాపు రూ.3.42లక్షల కోట్లు మాత్రమే కావడం గమనార్హం. అమెరికా రక్షణ బడ్జెట్ (దాదాపు రూ.39.31 లక్షల కోట్లు) ప్రపంచంలోనే అందరికన్నా ఎక్కువ. బెల్ట్ అండ్ రోడ్డు కార్యక్రమం.. చైనా భౌగోళిక-వ్యూహాత్మక సాధనమనే వాదనను ఝూంగ్ తోసిపుచ్చారు. అలాంటి ముద్ర వేయడం తప్పుడు భాష్యం చెప్పడమేనన్నారు.

జిన్‌పింగ్ పదవీకాలంపై పరిమితి ఎత్తివేత భేష్

- స్వాగతించిన ట్రంప్



వాషింగ్టన్: రెండో దఫా పదవీకాలంపై పరిమితిని ఎత్తివేసుకునే దిశగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చర్యలు తీసుకోవడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొనియాడారు. ఏదోఒక రోజు అమెరికా కూడా ఇలాంటి ప్రయత్నం చేయవచ్చని చెప్పారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన మద్దతుదారులు, నిధులను సమీకరించే నేతలతో ట్రంప్ తాజాగా రహస్య సమావేశాన్ని నిర్వహించారు. ఆ వివరాలు మీడియాకు పొక్కాయి. వీటి ప్రకారం.. "జిన్‌పింగ్ ఇప్పుడు జీవితకాలం పాటు అధ్యక్షుడిగా కొనసాగగలరు. ఆయన గొప్పవారు. దీన్ని సాధించగలిగారు" అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆసాంతం ఆయన చలోక్తులను కురిపించారని, సరదాగా ప్రసంగించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. తమ అధ్యక్షుడి పదవీకాలంపై పరిమితులను ఎత్తివేయడానికి చైనాలోని అధికార కమ్యూనిస్టు పార్టీ చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు గరిష్ఠంగా రెండు విడతలు (8 ఏళ్లు) మాత్రమే ఆ పదవిలో ఉండగలరు.

పాక్‌లో సెనేటర్‌గా ఎన్నికైన తొలి హిందూ దళిత మహిళ

- పీపీపీ టిక్కెట్‌తో విజయం సాధించిన కొల్హి



కరాచీ: పాకిస్థాన్‌లో ప్రప్రథమంగా ఓ హిందూ దళిత మహిళ సెనేటర్‌గా ఎన్నికయ్యారు. సింధ్ ప్రావిన్స్‌కు చెందిన కృష్ణ కుమారి కొల్హి (39)అనే మహిళ ...బిలావల్ భుట్టో జర్దారీ సారథ్యంలోని 'పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ' (పీపీపీ) ప్రతినిధిగా పాక్ సెనేట్‌కు ఎన్నికయ్యారు. మైనారిటీలకు ప్రత్యేకించిన సింధ్ స్థానం నుంచి దళిత మహిళ అయిన కొల్హి ఎన్నికైన విషయాన్ని పీపీపీ ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. పాకిస్థాన్‌లో మహిళా, మైనారిటీ హక్కుల కోణం నుంచి చూస్తే కొల్హి ఎన్నిక ఓ మైలురాయి వంటిదని పీపీపీ పేర్కొంది. సింధ్ ప్రావిన్స్‌లోని మారుమూల జిల్లా అయిన థార్‌లో నగర్‌పర్కర్ అనే కుగ్రామానికి చెందిన కొల్హి నిరుపేద రైతుకుటుంబానికి చెందిన వ్యక్తి. చిన్నవయసులోనే వివాహమైంది. తర్వాత ఆమె చక్కగా చదువుకుని సింధ్ విశ్వవిద్యాలయం నుంచి సోషియాలజీలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. సామాజిక కార్యకర్తగా ఆమె పీపీపీలో చేరారు. నిరుపేద వర్గాల హక్కుల కోసం ఆమె అనితరసాధ్యమైన పోరాటాలు చేశారు.

ప్రణబ్‌ముఖర్జీకి డి.లిట్ ప్రదానం

షిబ్‌పూర్(పశ్చిమబెంగాల్): మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీకి ఇక్కడి 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ'(ఐఐఈఎస్‌టి) ఆదివారం డి.లిట్‌ను ప్రదానం చేసింది. తాను ఎంతో వినమ్రంగా డి.లిట్‌ను స్వీకరిస్తున్నట్లు ప్రణబ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ చెప్పారు. సామాజిక, ఆర్థిక, కళారంగాల్లో ప్రణబ్ సేవలకు గుర్తింపుగా ఆయనకు డి.లిట్‌ను ప్రదానం చేసినట్లు ఐఐఈఎస్‌టీ సంచాలకులు ప్రొఫెసర్. అజయ్ రే తెలిపారు.

'తప్పుదోవ పట్టించే ప్రకటనలకు ప్రచారకర్తలదే బాధ్యత'

దిల్లీ: వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా ఉన్న వ్యాపార ప్రకటనలకు వాటి ప్రచారకర్త(బ్రాండ్ అంబాసిడర్)లనే బాధ్యులుగా చేయాలని 'అఖిల భారత వర్తకుల సమాఖ్య(సీఏఐటీ)' అభిప్రాయపడింది. వినియోగదారుల పరిరక్షణ బిల్లులో ఈ మేరకు నిబంధనలు చేర్చాల్సిందిగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి రామ్‌విలాస్ పాస్వాన్‌ను ఆదివారం ఓ లేఖలో కోరింది. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లుకు పార్లమెంటు ఆమోదం దక్కేలా చూడాలని విన్నవించింది.

ఇంద్రాణితో కలిపి కార్తి చిదంబరాన్ని ప్రశ్నించిన సీబీఐ

ముంబయి: ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో అరెస్టయిన కార్తి చిదంబరాన్ని సీబీఐ దర్యాప్తులో భాగంగా ఆదివారం బైకుల్లా కారాగారానికి తీసుకొచ్చి ఇంద్రాణి ముఖర్జియాతో కలిపి విచారించినట్లు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. వారిద్దరిని ముఖాముఖి కూర్చోబెట్టి దాదాపు నాలుగు గంటల పాటు సీబీఐ బృందం ప్రశ్నించినట్లు ఆ అధికారి తెలిపారు. ఐఎన్‌ఎక్స్ మీడియా ప్రైవేటు లిమిటెడ్ మాజీ డైరెక్టర్ అయిన ఇంద్రాణి ముఖర్జియాను షీనా బోరా హత్య కేసులో ఈ కారాగారంలో ఉంచారు. ఆయన్ను గత నెల 28న సీబీఐ అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయన సీబీఐ కస్టడీలో ఉన్నారు.

విశ్వవిద్యాలయాలు ప్రతిభా కేంద్రాలుగా ఎదగాలి

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



జస్టిస్ ఖేహర్‌కు గౌరవ పట్టాను అందజేస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు, దిల్లీ: విద్యావంతులైన ప్రజలు ముఖ్యంగా మహిళలు తమ హక్కుల కోసం మాట్లాడకపోతే చదువుకున్న డిగ్రీల ద్వారా నాణ్యమైన జీవితం లభించదని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. ఆదివారం చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీ 67వ వార్షిక స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. పంజాబ్ గవర్నర్, చండీగఢ్ పాలనాధికారి వీపీ సింగ్ బాడ్‌నోరే, హర్యానా గవర్నర్ సోలంకి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. విద్యార్థుల సిద్ధాంతాల మీద నియంత్రణ విధించకుండా ఆలోచనలకు స్వేచ్ఛ ఇవ్వడమే నిజమైన విశ్వవిద్యాలయమని ఆయన అభిప్రాయపడ్డారు. తాను పని చేసే రంగంలో స్వేచ్ఛగా ఆలోచించడానికి అవకాశం లభించినప్పుడే ఆ రంగంలో దూసుకెళ్లగలరని అభిప్రాయపడ్డారు. నిజమైన విద్య యాంత్రికంగా పనిచేయడానికి కాదన్నారు. అనంతరం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖెహార్, ప్రొఫెసర్ తేజీందర్ సింగ్‌లకు గౌరవ పట్టాలు ప్రదానం చేశారు. ప్రముఖ క్రీడాకారుడు మిల్కాసింగ్‌కు పంజాబ్ యూనివర్సిటీ ప్రకటించిన 'ఖేల్ రతన్' అవార్డును వెంకయ్యనాయుడు బహూకరించారు. విశ్వవిద్యాలయాలు ప్రతిభా కేంద్రాలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

చరిత్రను ఫరూక్ అబ్దుల్లా మరోసారి చదువుకోవాలి!

- కేంద్రమంత్రి జితేంద్రసింగ్

దిల్లీ: దేశవిభజన విషయంలో మహమ్మద్ అలీ జిన్నా పాత్రపై జమ్ము-కశ్మీరు మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ముందాయన(ఫరూక్ అబ్దుల్లా) చరిత్రను మరోసారి చదువుకోవాలని సూచించారు. అసలు జిన్నాకు దేశవిభజనే ఇష్టం లేదని పేర్కొనడాన్ని మంత్రి ఖండించారు. కాగా, శనివారం జమ్ములో ఫరూక్ అబ్దుల్లా మాట్లాడుతూ...దేశ విభజనకు మూలకారకులు జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్‌పటేల్, మౌలానా అబ్దుల్ కలాం అజాద్‌లేనని స్పష్టం చేశారు. అంతేతప్ప విభజనకు మహమ్మద్ అలీ జిన్నా ఏ విధంగానూ బాధ్యులు కారని పేర్కొన్నారు. శనివారం నాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాస్తవానికి జిన్నా అసలు పాకిస్థాన్ ఏర్పడాలని కోరుకోనేలేదన్నారు.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి వాహనాలకు సంఖ్యా ఫలకాలు

- దిల్లీ హైకోర్టులో కేంద్రం ప్రమాణపత్రం దాఖలు

దిల్లీ: రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి వాహనాలకు త్వరలోనే సంఖ్యా ఫలకాలు(నంబర్ ప్లేట్లు) ఏర్పాటుకానున్నాయి. వారితోపాటు గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు, విదేశాంగశాఖ వినియోగించే వాహనాలపై నిబంధనల ప్రకారం సంఖ్యా ఫలకాలను ప్రదర్శిస్తామంటూ కేంద్ర రోడ్డురవాణా, రహదారుల శాఖ దిల్లీ హైకోర్టులో ప్రమాణపత్రం దాఖలు చేసింది. వాహనాల రిజిస్ట్రేషన్ కోసం సంబంధిత విభాగాలకు ఈ ఏడాది జనవరి 2న లేఖ రాశామని వెల్లడించింది. లేఖపై ఉపరాష్ట్రపతి సచివాలయం స్పందించిందని.. ఉపరాష్ట్రపతి, ఆయన సతీమణి వినియోగిస్తున్న వాహనాలు సహా కార్యాలయానికి సంబంధించి అన్ని వాహనాలు రిజిస్ట్రేషన్ సంఖ్యను ప్రదర్శిస్తున్నట్లు తెలిపిందని పేర్కొంది. తమ వద్ద ఉన్న వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు విదేశాంగశాఖ సమాచారమందించినట్లు వెల్లడించింది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి సహా రాజ్యాంగపరమైన ఉన్నత పదవుల్లో ఉన్నవారు వినియోగించే వాహనాలపై నిబంధనల ప్రకారం సంఖ్యా ఫలకం ఉండేలా ఆదేశించాలని కోరుతూ 'న్యాయభూమి' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు విచారణ జరుపుతోంది. వారి వాహనాలపై సంఖ్యా ఫలకాలనికి బదులు జాతీయ చిహ్నాన్ని వినియోగిస్తుండటంతో.. వాటిని సులభంగా గుర్తించి ఉగ్రవాదులు దాడి చేసే అవకాశముందని పిల్‌లో పేర్కొన్నారు. వాహనాలకు రిజిస్ట్రేషన్ లేకపోతే.. వాటి వల్ల ప్రమాదానికి గురైన వ్యక్తులు బీమా ప్రయోజనాలను పొందడం కష్టమవుతుందని సూచించారు.

శ్రీశ్రీతో సమావేశానికి రాజకీయ రంగు వద్దు: ఆదిత్యనాథ్

లఖ్‌నవూ: 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' సారథి శ్రీశ్రీ రవిశంకర్‌ను తాను కలుసుకోవడం వెనుక రాజకీయ కోణమేదీ లేదని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. శ్రీశ్రీతో తన సమావేశానికి అలాంటి రంగులేమీ అద్దరాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శ్రీశ్రీతో తనకు ఎన్నో ఏళ్ల నుంచీ పరిచయం ఉందన్నారు. ఆయన ఎప్పుడు లఖ్‌నవూ వచ్చినా...తాను వెళ్లి కలుసుకుంటూనే ఉంటున్నట్లు ఆదిత్యనాథ్ వెల్లడించారు. మధ్యవర్తిత్వం ద్వారా అయోధ్య సమస్యకు పరిష్కారం కనుగొనే విషయంలో శ్రీశ్రీ చొరవ చూపుతున్న విషయం గమనార్హం. ఈ కృషిలో భాగంగా శ్రీశ్రీ గత ఏడాది కాలంలో అయోధ్య, బెంగళూరు, లఖ్‌నవూ, దిల్లీ, హైదరాబాద్, చెన్నైలలో అయిదువందల మందికి పైగా నాయకులను స్వయంగా కలుసుకున్నారు. తాజాగా గతవారం శ్రీశ్రీ 'ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు'(ఏఐఎంపీఎల్‌బి) సభ్యుడు సల్మాన్ నద్వీని కలుసుకున్నారు.

ఇక పార్లమెంటులో వాడీవేడీ'

- నేటి నుంచి బడ్జెట్ సమావేశాల ద్వితీయార్ధం
- పీఎన్‌బీ కుంభకోణంపై గళమెత్తనున్న విపక్షాలు
- ప్రభుత్వమే లక్ష్యంగా విమర్శలు గుప్పించే అవకాశం
- దీటుగా ఎదుర్కొనేందుకు కేంద్రం సన్నద్ధం

దిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) కుంభకోణం, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం తనయుడు కార్తి చిదంబరం అరెస్టు వంటి పరిస్థితుల నేపథ్యంలో తాజా సమావేశాలు వాడీవేడీగా సాగే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా అంశమూ కీలకం కానుంది. నెలరోజుల విరామం అనంతరం పునఃప్రారంభమవుతున్న తాజా సమావేశాల్లో కేంద్ర బడ్జెట్‌పై కూడా చర్చ జరగనుంది.

పీఎన్‌బీని రూ.వేల కోట్లు ముంచిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ విదేశాలకు తప్పించుకుపోవడంపై ప్రభుత్వాన్ని తాజా సమావేశాల్లో ప్రతిపక్షాలు నిలదీసే అవకాశాలున్నాయి. అయితే త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలతో ఉత్సాహంగా ఉన్న అధికార భాజపా.. విపక్షాలను దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది. పరారీలో ఉన్న మోసగాళ్లు, రుణ ఎగవేతదారుల ఆస్తులను జప్తు చేసేందుకు వీలుకల్పించే 'పరారీలోని ఆర్థిక నేరగాళ్ల బిల్లు', 'ముమ్మారు తలాక్ బిల్లు'లకు తాజా సమావేశాల్లో ఆమోదం దక్కేలా చూడాలని కేంద్రప్రభుత్వం భావిస్తోంది. ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించే 'ఓబీసీ బిల్లు'ను కూడా ప్రస్తుత సమావేశాల్లో ఆమోదింపజేసుకోవాలని కేంద్రం యోచిస్తోంది.

పీఎన్‌బీ కుంభకోణానికి సంబంధించి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇప్పటికే పలుమార్లు ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పించారు. పార్లమెంటు సమావేశాల్లో ఈ ఆరోపణలు, విమర్శల పర్వాన్ని కాంగ్రెస్ కొనసాగించే అవకాశముంది. ప్రభుత్వాన్ని నిలదీయడంలో తమతో కలిసివచ్చేలా పలు పార్టీల మద్దతును కాంగ్రెస్ కూడగడుతోంది. మరోవైపు, కార్తి చిదంబరం అరెస్టును ప్రధానంగా ప్రస్తావిస్తూ.. గత యూపీఏ హయాంలో చోటుచేసుకున్న అవినీతిని భాజపా ఎండగట్టే అవకాశముంది.

తెదేపా ఎంపీలూ అడ్డుకునే అవకాశం

మిత్రపక్షం తెదేపా కూడా తాజా సమావేశాల్లో భాజపాను లక్ష్యంగా చేసుకునే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తగినన్ని నిధులు దక్కకపోవడం వంటి అంశాలపై తెదేపా ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభల్లో కార్యకలాపాలను అడ్డుకునే అవకాశముంది. ప్రత్యేక హోదా సహా 19 అంశాలపై తమ ఆందోళనలను కేంద్రం పరిష్కరించేంత వరకు పార్లమెంటులో తమ పోరాట తీవ్రతను క్రమంగా పెంచుతామని తెదేపా నేతలు తోట నరసింహం, గల్లా జయదేవ్, కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు.

ప్రజా సమస్యలను గుర్తించాలి

- తక్షణ పరిష్కారానికి మార్గాలు అన్వేషించాలి
- ముసాయిదా కమిటీ సమావేశంలో మాజీ ప్రధాని మన్మోహన్ పిలుపు



ఈనాడు, దిల్లీ: రాజకీయంగా నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు దృష్టిలో ఉంచుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుగానే సిద్ధం కావాలని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పిలుపునిచ్చారు. ఆదివారమిక్కడ మన్మోహన్‌సింగ్ నేతృత్వంలో ఏఐసీసీ రాజకీయ తీర్మానాల ముసాయిదా కమిటీ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు గులాంనబీఆజాద్, మల్లికార్జున ఖర్గే, ఏకే ఆంటోనీ, మీరాకుమార్, జనార్ధన ద్వివేది, పొన్నం ప్రభాకర్, పళ్లంరాజు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్‌కు క్రమక్రమంగా దూరమవుతున్న ఎస్సీ, బీసీ వర్గాలను ఆకర్షించే అంశంపై చర్చించారు. మహిళలు, నిరుద్యోగుల సమస్యలు, విదేశీ వ్యవహారాలు, సరిహద్దు దేశాలతో వస్తున్న సమస్యలను ఎలా ఎదుర్కోవాలన్నదానిపై చర్చించారు. ఈ సందర్భంగా మన్మోహన్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో సమస్యలు ఏంటి? తక్షణ పరిష్కారం ఏంటి? పరిష్కారానికి ముందస్తు సన్నాహకాలు ఏంటి? అనే దానిపై కమిటీ సభ్యులంతా సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు.


తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎక్కడా కూడా ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు అమలు కావడం లేదని చెప్పారు. సంపన్నశ్రేణి ఎత్తివేసేలా పార్లమెంటులో పోరాడాలన్నారు. కనీసం 9 లేదా 10 శాతం రిజర్వేషన్లు కూడా ఓబీసీలకు దక్కడం లేదని, ఈ నేపథ్యంలో నియంత్రణలు అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్ని మోసం చేస్తున్నాయని పళ్లంరాజు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు విజయవంతం కాకపోయినా ఏదో చేసేశామన్న ప్రభుత్వపు అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. మీరాకుమార్ మాట్లాడుతూ.. ఎస్సీ,ఎస్టీ మైనార్టీ వర్గాలపై కాంగ్రెస్ ప్రధానంగా దృష్టిసారించాలన్నారు. మహిళాబిల్లు పార్లమెంటులో ఆమోదం పొందేలా కాంగ్రెస్ కృషి చేయాలని పార్టీ మహిళా అధ్యక్షురాలు సుస్మితాదేవ్ సూచించారు.

2019 సాధారణ ఎన్నికలు, కొన్ని రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వ్యవసాయం, నిరుద్యోగం, పేదరికం తదితర సమస్యలపై గళం పెంచాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ నెల 16 నుంచి 18 వరకు పార్టీ ప్లీనరీ సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ మూడు అంశాలపై ప్రత్యేకంగా తీర్మానం చేయనున్నారు.

భద్రాచలంలోనే మావోయిస్టుల మృతదేహాలు

- వివరాలు తెలిస్తే సంప్రదించాలని సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్

భద్రాచలం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులో పూజారికాంకేడు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఛత్తీస్‌గఢ్ వాసుల మృతదేహాలు ఇంకా భద్రాచలం ప్రభుత్వాసుపత్రిలోనే ఉన్నాయి. ఎదురుకాల్పుల్లో 11 మంది మృతి చెందగా ఇప్పటికే గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ మృతదేహాన్ని, మావోయిస్టు నేత దడబోయిన స్వామి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామాలకు తరలించారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం నిపుణుల పర్యవేక్షణలో పంచనామా నిర్వహించి.. మృతదేహాలు పాడవ్వకుండా భద్రపర్చారు. శీతలీకరణ పేటికల్లో వీటిని ఉంచినప్పటికీ ఈ ప్రాంతంలో భరించలేని దుర్వాసన వస్తోంది. ఘటనాస్థలి నుంచి హెలికాప్టర్‌లో మృతదేహాల తరలింపు ఆలస్యమవ్వడంతో అప్పటికే దుర్వాసన వచ్చాయి. సకాలంలో మృతుల ఫొటోలను వీడియోలను పోలీసు అధికారులు వెల్లడించి ఉంటే ఇప్పటికల్లా బంధువులకు సమాచారం అందేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికీ అటుగా ఎవ్వరినీ వెళ్లనీయకుండా బందోబస్తు చేపట్టారు. ఇలాంటి పెద్ద ఎన్‌కౌంటర్‌లో జాగ్రత్తలు అవసరమైనప్పటికీ సరైన పద్ధతి పాటించకపోవడంతో మృతదేహాలు చెడిపోయే ప్రమాదం ఏర్పడిందని కొందరు ఆందోళన చెందుతున్నారు.



భద్రాచలం ఆసుపత్రి పోస్టుమార్టం గది వద్ద శవాల పేటికలు

గందరగోళం వీడేదెన్నడు

మృతుల పేర్లను వెల్లడించడంలో పోలీసులు గందరగోళానికి తెరదించడంలేదు. ఆదివారం సాయంత్రం మరోసారి సామాజిక మాధ్యమాల్లో 9పేర్లను వెల్లడించారు. వీరిది ఛత్తీస్‌గఢ్ అని పేర్కొన్నప్పటికీ శనివారం విడుదలైన జాబితాతో, ఆదివారంనాటి కొన్నిపేర్లు సరిపోలడం లేదు. ఈఫొటోలను గుర్తుపట్టిన వారు తమ దృష్టికి తీసుకురావాలని సామాజిక మాధ్యమాల్లో భద్రాచలం పోలీసులు ప్రకటన విడుదల చేశారు. ఒక మృతదేహాన్ని గుర్తించేందుకు బంధువులు వచ్చినట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు.

రాజ్‌నాథ్ సింగ్‌తో గవర్నర్ నరసింహన్ భేటీ!

దిల్లీ: తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ ఆదివారం నాడిక్కడ కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమైనారు. రాజ్‌నాథ్ సింగ్‌ను ఆయన నివాసంలో కలుసుకున్నారు. అయితే, సమావేశం వివరాలేమీ అధికారికంగా తెలియరాలేదు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిస్థితి, అభివృద్ధి కార్యకలాపాల గురించి గవర్నర్ నరసింహన్ వివరించినట్లు తెలుస్తోంది. తెలుగురాష్ట్రాల్లో నక్సల్ వ్యతిరేక చర్యలపై కూడా చర్చలు జరిగాయి. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు(రెండోవిడత) సోమవారం నుంచీ మొదలౌతున్నాయి.

రైళ్లలో 'సర్వీసు కెప్టెన్'

దిల్లీ: రైలు ప్రయాణంలో ఎదురయ్యే వేర్వేరు ఇబ్బందులపై వేర్వేరు అధికారులకు ఫిర్యాదు చేయాల్సిన అవసరం ఇకపై ఉండబోదు! ప్రయాణికుల నుంచి అన్నిరకాల ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పరిష్కరించే 'సర్వీసు కెప్టెన్' త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఈ మేరకు అన్ని మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సర్వీసు కెప్టెన్/రైల్వే పర్యవేక్షకుడిని నియమించాలని రైల్వే కమిటీ ఒకటి సిఫార్సు చేసింది. ప్రయాణికులు సులభంగా గుర్తించేందుకు వీలుగా సర్వీసు కెప్టెన్‌కు ప్రత్యేక ఏకరూప దుస్తులుండాలని సూచించింది. శుభ్రత, వస్త్రాలపై వచ్చే ఫిర్యాదులు, మరమ్మతులు వంటి అన్ని అంశాలను ఆ వ్యక్తి నిరంతరం పర్యవేక్షించాలని అభిప్రాయపడింది. జూనియర్ ఇంజినీర్ లేదా మాస్టర్ క్రాఫ్ట్స్‌మ్యాన్ స్థాయి ఉద్యోగుల నుంచి సర్వీసు కెప్టెన్లను కనీసం రెండేళ్ల కాలానికి నియమించాలని సూచించింది.



టికెట్ల అస్థిర ధరల వ్యవస్థలో మార్పులు

కోల్‌కతా: ప్రీమియం రైళ్ల టికెట్ల విక్రయానికి సంబంధించి ప్రస్తుతం అనుసరిస్తున్న 'అస్థిర ధరల వ్యవస్థ(ఫ్లెక్సీ ఫేర్ సిస్టమ్)'లో మార్పులు చోటుచేసుకునే అవకాశాలున్నాయి. రైల్వే బోర్డు ఛైర్మన్ అశ్వనీ లోహానీ ఆదివారం ఈ మేరకు సంకేతాలిచ్చారు. ప్రయాణికులతోపాటు రైల్వేకూ ప్రయోజనాలు కలిగేలా అస్థిర ధరల వ్యవస్థలో త్వరలోనే మార్పులు తీసుకొచ్చే అవకాశముందని తెలిపారు.

బాబోయ్.. దెయ్యాలు!

దిల్లీ

బాబోయ్ దెయ్యాలు....అంటూ పలు రాష్ట్రాలకు చెందిన ప్రజా ప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. తమకు కీడు జరుగుతోందంటూ కొందరు పరిహారంగా పూజలు పునస్కారాలను చేస్తున్నారు. మరికొందరు తాముంటున్న ఇళ్లకు వాస్తుపరమైన మార్పుచేర్పులు చేసుకుంటున్నారు. ఇంకొందరైతే. ..ఎన్ని చేసినా దెయ్యాలు తమను వదలడం లేదంటూ ఏకంగా ఇళ్లనే ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. ఈ పరిస్థితిని చూసి హేతువాదులు ఆశ్చర్యంతో పాటూ ఆవేదన కూడా చెందుతున్నారు.

బిహారు, రాజస్థాన్, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాల చట్టసభల సభ్యులకు ఇటీవలి కాలంలో 'దెయ్యాల' భయం విపరీతంగా పట్టుకుంది.

★ ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు, బిహారు మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ ఇప్పటిదాకా పట్నాలో తానుంటున్న ప్రభుత్వ బంగ్లాను ఉన్నట్టుండి ఖాళీచేసేశారు. ఆ బంగ్లాలో దెయ్యాలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని ఆయన చెబుతున్నారు. ముఖ్యమంత్రి నితిష్ కుమార్, ఉపముఖ్యమంత్రి సుశీల్ కుమారు మోదీలు ఈ బంగ్లాలోకి దెయ్యాలను పంపారని తేజ్ ప్రతాప్ యాదవ్ ఆరోపిస్తున్నారు. అవి తనను వెంటాడుతున్నాయని నేరుగా విలేకరుల సమావేశంలోనే ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఇక రాజస్థాన్ శాసనసభ సభ్యులు కొందరి భయాలు విపరీతంగా ఉన్నాయి. సదరు శాసనసభా భవనాన్ని నిర్మించిన స్థలంలో కొంతభాగం ఒకప్పుడు శ్మశాన వాటిక అని వారు చెబుతున్నారు. అందుకే, ఈ భవనం వద్దుబాబోయ్! అది దెయ్యాల మయం అని భయపడుతున్నారు. ఆరు నెలల వ్యవధిలో ఇద్దరు శాసనసభ్యులు చనిపోవడంతో వారిలో భయం కూడా బాగా పెరిగింది. అందుకే, ఈ భవనంలో పవిత్రపూజలు నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నారు. హేతువాద నేత ముక్తాదభోల్కర్ స్పందిస్తూ...ప్రజాప్రతినిధులు కనీసం శాస్త్రీయ పరిజ్ఞానాన్ని వినియోగించకుండానే ఇలాంటి చర్యలకు దిగడం శోచనీయమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరలించేందుకు బహుశా ఈ చర్య చేపట్టి ఉండవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఇక, అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం అయితే ముఖ్యమంత్రి అధికార నివాసాన్ని ప్రభుత్వ అతిథి గృహంగా మార్చుకునేందుకు నిర్ణయించినట్లు తెలిపింది.

నీరవ్, ఛోక్సీల ఆస్తులు అమ్మకుండా నిషేధం

- జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ ఉత్తర్వు

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసగించిన కేసులో ప్రధాన నిందితులు నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీలకు చెందిన ఆస్తుల్ని విక్రయించకుండా 60కి పైగా వ్యక్తులు/ కంపెనీలపై 'జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్' (ఎన్‌సీఎల్‌టీ) నిషేధం విధించింది. తమ విజ్ఞప్తి మేరకు ఈ నిషేధ ఉత్తర్వులు వెలువడినట్లు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు చెందిన కొందరి ఆస్తులపైనా నిషేధం వర్తిస్తుంది. తిరిగి ప్రకటించేవరకు ఈ ఆస్తులపై, కంపెనీలపై ఎలాంటి లావాదేవీలు జరగకుండా ఇంజంక్షన్ ఉత్తర్వులు అమల్లోకి వచ్చాయి. ఎన్‌సీఎల్‌టీలో తదుపరి విచారణ ఈ నెల 26న జరగనుంది. దానికి సంబంధిత పక్షాలు హాజరుకాకపోతే వారి పరోక్షంలో తీర్పు వెలువరిస్తారు.

మరోవైపు- నీరవ్, ఛోక్సీల ఆస్తిపాస్తులపై అవసరమైన చర్యలన్నీ చేపట్టేందుకు మారిషస్ ముందుకు వచ్చింది. పీఎన్‌బీ మోసంపై మీడియా కథనాలను పరిగణనలో తీసుకున్నామని మారిషస్‌కు చెందిన 'ఆర్థిక సేవల కమిషన్' (ఎఫ్ఎస్‌సీ) ఒక ప్రకటనలో తెలిపింది. మారిషస్ రెవెన్యూ సంస్థ, బ్యాంక్ ఆఫ్ మారిషస్, ఆర్థిక నిఘా విభాగాలు ఈ వ్యవహారంపై దృష్టి సారించాయనీ, సమాచార మార్పిడి ఒప్పందాలను అనుసరించి వివరాలను సమకూరుస్తాయనీ వివరించింది. తమ దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించే రీతిలో వ్యక్తులు గానీ, సంస్థలు గానీ ఎలాంటి లావాదేవీలు చేసినా వాటిపై నియంత్రణ చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది.

ఛాంపియన్స్


రిజ్వి

రిజ్వి అదరహో


జీతూ


మెహులి

- ప్రపంచ రికార్డుతో పసిడి
- జీతూ, మెహులిలకు కాంస్యాలు
- సీనియర్ షూటింగ్ ప్రపంచకప్

దిల్లీ: సీనియర్ షూటింగ్ ప్రపంచకప్ తొలిరోజు భారత షూటర్లు అద్భుత ప్రదర్శన చేశారు. అరంగేట్ర ప్రపంచకప్‌లోనే షాజర్ రిజ్వి అదరగొట్టాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ విభాగంలో ప్రపంచ రికార్డు బద్దలు కొట్టి మరీ స్వర్ణం సొంతం చేసుకున్నాడు. మీరట్‌కు చెందిన రిజ్వి ఫైనల్లో మొత్తం 242.3 పాయింట్లతో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. 24 రౌండ్ల ఫైనల్లో ఒలింపిక్ ఛాంపియన్ రెయిట్జ్ (జర్మనీ-239.7 పాయింట్లు)ని వెనక్కి నెట్టి రిజ్వి స్వర్ణం గెలిచాడు. భారత స్టార్ షూటర్ జీతురాయ్ కాంస్యం గెలిచాడు. అతను 219 పాయింట్లు సాధించాడు. ఫైనల్‌కు చేరిన మరో భారత షూటర్ ఓం ప్రకాశ్ 198.4 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు. అర్హత రౌండ్లో రిజ్వి 579 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి ఫైనల్ చేరాడు. మరోవైపు మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో మెహులి ఘోష్ కాంస్యం సాధించింది. సీనియర్ విభాగంలో తొలిసారి పోటీపడిన ఈ జూనియర్ షూటర్ పతకాన్ని సొంతం చేసుకుంది. 228.4 పాయింట్ల స్కోరుతో ఆమె జూనియర్ స్థాయిలో ప్రపంచ రికార్డు సృష్టించింది. మహిళల ఫైనల్‌కు కూడా ముగ్గురు భారత షూటర్లు అర్హత సాధించారు. అంజుమ్ మౌద్గిల్ 208.6 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలవగా.. అపూర్వి 144.1 పాయింట్లతో ఏడో స్థానానికి పరిమితమైంది. లౌరా (రొమేనియా-251.5) స్వర్ణం, హాంగ్ జు (చైనా-251) రజతం దక్కించుకున్నారు. పోటీల తొలి రోజు భారత షూటర్ల అద్భుత ప్రదర్శనపై భారత జాతీయ రైఫిల్ సంఘం అధ్యక్షుడు రనిందర్ సింగ్ స్పందిస్తూ.. "యువ షూటర్లు మా నమ్మకాన్ని నిలబెట్టినందుకు చాలా ఉద్వేగంగా ఉంది. ఇది అద్భుత ప్రదర్శన. ముఖ్యంగా రిజ్వి.. మొదటి ప్రపంచకప్‌లోనే స్వర్ణం గెలవడంతో పాటు ప్రపంచ రికార్డు సృష్టించాడు. మెహులి కూడా గొప్ప ఘనత సాధించింది. ఎందుకంటే జూనియర్ షూటరైన ఆమె సీనియర్ విభాగంలో పతకం గెలిచింది" అన్నాడు.

భారత్.. చేజేతులా

- 9 పెనాల్టీకార్నర్లు వృథా
- ఇంగ్లాండ్‌తో మ్యాచ్ డ్రా
- అజ్లాన్‌షా హాకీ




ఇపో: పెనాల్టీకార్నర్లను గోల్స్‌గా మలచలేని బలహీనతను భారత్ మరోసారి బయటపెట్టింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా తొమ్మిది పెనాల్టీకార్నర్ అవకాశాలు లభించినా ఒక్కదాన్నీ సద్వినియోగం చేసుకోలేకపోయింది. దీంతో ఆదివారం ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌ను భారత్ 1-1తో డ్రా చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ఆద్యంతం భారత్‌దే జోరు. బంతి మీద సర్దార్ సేనదే పట్టు. తొలి క్వార్టర్ కాసేపట్లో ముగుస్తుందనగా శైలానంద్ లాక్రా (14వ నిమిషం) గోల్ కొట్టి భారత్‌ను ఆధిక్యంలో నిలబెట్టాడు. అతడికిదే తొలి అంతర్జాతీయ గోల్. తొలి గోల్ ఇచ్చిన ఉత్సాహంతో రెండో క్వార్టర్లో భారత్ దాడులను మరింత పెంచింది. ఈ ఒక్క క్వార్టర్‌లోనే భారత్‌కు ఎనిమిది పెనాల్టీకార్నర్లు దక్కడం విశేషం. కానీ డ్రాగ్‌ఫ్లిక్ స్పెషలిస్టులు వరుణ్ కుమార్, అమిత్ రోహిదాస్ వీటిని గోల్స్‌గా మలచలేకపోయారు. ఇంగ్లాండ్ గోల్‌కీపర్ జార్జ్ పినర్ అడ్డుగోడగా మారి భారత ఆటగాళ్ల ప్రయత్నాలను అడ్డుకున్నాడు. మూడో క్వార్టర్‌లో రెండు జట్లూ గట్టిగానే పోరాడాయి. కానీ ఆధిపత్యం మాత్రం భారత్‌దే. దాడులు కొనసాగించిన సర్దార్ బృందం.. గోల్ అవకాశాలను సృష్టించుకుంది. కానీ ఇంగ్లాండ్ డిఫెన్స్ బలంగా ఉండడంతో గోల్స్ త్రుటిలో తప్పాయి. 48వ నిమిషంలో లభించిన ఆఖరి పెనాల్టీకార్నర్‌ను కూడా భారత్ వృథా చేయడం విజయవకాశాలను దెబ్బ తీసింది. మరో ఏడు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా... ఇంగ్లాండ్‌కు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. ఈ అవకాశాన్ని గ్లెగోర్న్ సద్వినియోగం చేసి స్కోరు సమం చేశాడు. తర్వాత భారత్ గోల్ ప్రయత్నాలు ఫలించలేదు. తొలి మ్యాచ్‌లో భారత్ అర్జెంటీనా చేతిలో ఓడిన సంగతి తెలిసిందే. భారత్ తర్వాత మ్యాచ్‌లో ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో తలపడనుంది.

మెరిసిన విహారి

- భారత్-ఎపై భారత్-బి విజయం
- దేవధర్ ట్రోఫీ

ధర్మశాల: హనుమ విహారి (95 నాటౌట్; 76 బంతుల్లో 16×4, 1×6) సత్తాచాటడంతో దేవధర్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో భారత్- బి ఎనిమిది వికెట్ల తేడాతో భారత్-ఎపై విజయం సాధించింది. ఆదివారం వర్షం వల్ల 43 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్-ఎ 41.2 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. లెఫ్టార్మ్ స్పిన్నర్ ధర్మేంద్ర జడేజా (4/36) ప్రత్యర్థిని కట్టడి చేశాడు. 42 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన భారత్-ఎ కనీసం వంద పరుగులైనా చేస్తుందా అనిపించింది. అయితే కష్టాల్లో పడ్డ జట్టును రికీభుయ్ (78; 107 బంతుల్లో 5×4, 4×6) ఆదుకున్నాడు. అనంతరం ఛేదనలో సవరించిన 175 పరుగుల లక్ష్యాన్ని భారత్-బి రెండు వికెట్లు కోల్పోయి 26.2 ఓవర్లలోనే ఛేదించింది.

తాల్ చెస్ విజేత ఆనంద్



మాస్కో: భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తాల్ మెమోరియల్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్లో విజేతగా నిలిచాడు. ఎనిమిదో రౌండ్లో 30 ఎత్తుల్లో అలెగ్జాండర్ గ్రిషుక్ (రష్యా)ను ఓడించిన విషీ.. ఆఖరి రౌండ్లో బోరిస్ గెల్ఫాండ్ (రష్యా)తో డ్రా చేసుకున్నాడు. అతను 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్ సొంతం చేసుకున్నాడు. మమెద్యరోవ్ ఐదు పాయింట్లతో రెండో స్థానం సాధించాడు.

నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా కార్తీక్



ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో పాల్గొనే కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు దినేశ్ కార్తీక్ కెప్టెన్‌గా నియమితుయ్యాడు. ఓపెనర్ రాబిన్ ఉతప్ప వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. గత సీజన్ వరకు నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా ఉన్న గంభీర్ ఈసారి దిల్లీకి మారిన సంగతి తెలిసిందే. టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి మాదిరిగానే తానూ జట్టును దూకుడుగా నడిపించేందుకు ప్రయత్నిస్తానని కార్తీక్ అన్నాడు. ఈ సీజన్‌కు నాలుగు ఐపీఎల్ జట్లకు కెప్టెన్లు మారడం విశేషం. దిల్లీకి గంభీర్, రాజస్థాన్‌కు స్టీవ్ స్మిత్, పంజాబ్‌కు అశ్విన్, కోల్‌కతాకు కార్తీక్ కొత్తగా సారథ్య బాధ్యతలు చేపట్టనున్నారు.

పంజాబ్ బౌలింగ్ కోచ్‌గా ప్రసాద్

భారత మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్ కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. జాతీయ జూనియర్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేసిన ప్రసాద్.. త్వరలో జరిగే ఐపీఎల్‌లో పంజాబ్ కోచ్ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు బ్రాడ్ హాడ్జ్‌ను వచ్చే మూడు సీజన్లకు ప్రధాన కోచ్‌గా నియమిస్తున్నట్లు కూడా పంజాబ్ యాజమాన్యం చెప్పింది.

అఫ్గాన్‌కు స్కాట్లాండ్ షాక్

ప్రపంచకప్ క్వాలిఫయర్స్

బులవాయో: ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో అఫ్గానిస్థాన్‌కు షాక్ తగిలింది. మెక్‌లియోడ్ (157 నాటౌట్; 146 బంతుల్లో 23×4, 1×6) అజేయ సెంచరీతో చెలరేగడంతో స్కాట్లాండ్ 7 వికెట్ల తేడాతో టోర్నీ ఫేవరెట్లలో ఒకటైన అఫ్గాన్ ఓడించింది. ఆదివారం మొదట అఫ్గాన్.. బారింగ్టన్ (3/42), వీల్ (3/36) ధాటికి 49.4 ఓవర్లలో 255 పరుగులకే పరిమితమైంది. మహ్మద్ నబి (92), నజిబుల్లా జద్రాన్ (67) రాణించారు. లక్ష్యాన్ని స్కాట్లాండ్ 47.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. బ్రెండన్ టేలర్ (100; 91 బంతుల్లో 7×4, 1×6), సికిందర్ రజా (123; 66 బంతుల్లో 7×4, 9×6) సెంచరీలతో చెలరేగడంతో నేపాల్‌పై జింబాబ్వే 116 పరుగుల తేడాతో నెగ్గింది. మొదట జింబాబ్వే 50 ఓవర్లలో 6 వికెట్లకు 380 పరుగుల భారీ స్కోరు చేసింది. నేపాల్ 8 వికెట్లకు 264 పరుగులే చేయగలిగింది. మిగతా మ్యాచ్‌ల్లో ఐర్లాండ్ 93 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై, యూఏఈ 56 పరుగుల తేడాతో పపువా న్యూగినియాపై నెగ్గాయి.


మేఘన

ఆ అమ్మాయిలో ఉన్న నమ్మకం.. భారత జిమ్నాస్టిక్స్ సమాఖ్య (జీఎఫ్ఐ)లో లేదు! ఆ క్రీడాకారిణిలోని ఆత్మవిశ్వాసం భారత క్రీడాప్రాధికార సంస్థ (సాయ్)లో కనిపించలేదు! పతకం సంగతి అటుంచితే.. అసలు రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో సత్తా ఉన్న క్రీడాకారిణి దేశంలో లేనే లేదన్నది ఇటు సమాఖ్య పెద్దలు.. అటు సాయ్ అధికారుల బలమైన అభిప్రాయం! కానీ వారి అభిప్రాయం తప్పని నిరూపించింది గుండ్లపల్లి మేఘనారెడ్డి. భారత్ తరఫున కామన్వెల్త్ క్రీడలకు ఎంపికైన ఏకైక జిమ్నాస్ట్‌గా రికార్డు సృష్టించింది ఈ తెలుగమ్మాయి.

పట్టుబట్టి.. పంతం నెగ్గి..!

ఈనాడు - హైదరాబాద్

ఒక క్రీడాకారిణి కోసం ప్రత్యేకంగా సెలెక్షన్స్ నిర్వహించిన సందర్భం ఎప్పుడైనా చూశామా? ఒక క్రీడాకారిణిని ఎంపిక చేయడానికి సమాఖ్య పెద్దలు, సాయ్ అధికారులు, కోచ్‌లు, పరిశీలకులు రావడం ఎప్పుడైనా విన్నామా? క్రీడారంగంలో హేమాహేమీలంతా ఒకచోట చేరి ఒకరిని ఎంపిక చేయడం గురించి ఎన్నడైనా చదివామా? ఇటీవల దిల్లీలో ఇలాంటి సందర్భమే సాక్షాత్కరించింది. రిథమిక్స్ జిమ్నాస్టిక్స్‌లో భారత క్రీడాకారుల్లో పస లేదని భావించిన వారికి సమాధానమే మేఘన.

ఏప్రిల్ 4న ఆస్ట్రేలియాలో ప్రారంభమయ్యే కామన్వెల్త్ క్రీడల్లో 13 క్రీడాంశాల్లో భారత్ పాల్గొనబోతోంది. అందులో జిమ్నాస్టిక్స్ ఒకటి. ఆరుగురు సభ్యుల భారత బృందంలో ఒక్క రిథమిక్ జిమ్నాస్ట్ కూడా లేరు. కానీ మెరుపు తీగ మేఘన ఉందన్న సంగతే మరిచిపోయారు క్రీడా సమాఖ్య పెద్దలు. మేఘనలోని ప్రతిభను గుర్తించిన క్లీన్ స్పోర్ట్స్ ఇండియా కన్వీనర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పాపారావు.. జీఎఫ్ఐ, సాయ్, కేంద్ర క్రీడాశాఖలపై ఒత్తిడి తెచ్చారు. నెల రోజులకు పైగా ఒత్తిడి తేగా.. చివరికి ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు దిల్లీలో సెలెక్షన్స్ నిర్వహించారు. సెలెక్షన్స్‌లో 52.75 స్కోరుతో అదరగొట్టింది మేఘన. రెండో స్థానంలో నిలిచిన క్రీడాకారిణికి.. మేఘనకు మధ్య తేడా 10 పాయింట్లకు పైమాటే. అంతే.. మరోమాట లేకుండా భారత జట్టులో మేఘనకు చోటు దక్కింది.

సెలెక్షన్స్ నిర్వహించకుండా దాటవేసిన జీఎఫ్ఐ, సాయ్, క్రీడల శాఖ ఇప్పుడు జిమ్నాస్టిక్స్‌లో పతకం ఖాయమని సంబరపడుతున్నాయి! కారణం.. మేఘన. సెలెక్షన్స్‌లో ఆమె చేసిన స్కోరు కామన్వెల్త్ క్రీడల్లో ఫేవరెట్ల అత్యుత్తమ స్కోరుకు దగ్గర్లో ఉంది. రిథమిక్‌లో బాల్స్, క్లబ్స్, రిబ్బన్, హూప్‌ల పేర్లతో 4 విభాగాలుంటాయి. ఒక్కో విభాగంలో స్వర్ణం, రజతం, కాంస్యం చొప్పున మొత్తం 12 పతకాలు ఉంటాయి. వీటికి తోడు ఓవరాల్‌గా ఆల్‌రౌండ్ విభాగం మరొకటి ఉంటుంది. మొత్తంగా 15 పతకాలు అన్నమాట. సెలెక్షన్స్ ప్రదర్శనను పునరావృతం చేసినా మేఘనకు పతకం ఖాయమన్నది విశ్లేషకుల అంచనా. అసలు సెలెక్షన్స్‌కే నోచుకోని అమ్మాయి.. ఏకంగా పతకంపై నమ్మకం కలిగించడం విశేషం!

> "కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొంటుండటం ఆనందంగా ఉంది. పతకం గురించి ఇప్పుడే ఆలోచించడం లేదు. తొలుత ఫైనల్ చేరుకోవడం నా లక్ష్యం"
> – మేఘన
>
> "మేఘన విదేశాల్లో శిక్షణ తీసుకోవాలంటే ఆమెతో పాటు కోచ్, రిఫరీ కూడా ఉండాలి. ఐరోపాలో ఒక్క పర్యటనకు సుమారు రూ.3 లక్షలు ఖర్చవుతుంది. ప్రొఫెషనల్ జిమ్నాస్ట్‌లు ఏడాదికి 9 టోర్నీల్లో పాల్గొంటారు. మేఘన ఇప్పటివరకు 5 టోర్నీల్లో మాత్రమే పాల్గొంది. అయినా మేఘన ప్రదర్శన మెరుగ్గా ఉండటం అదృష్టం"
> – మేఘన తల్లి ప్రవీణ

మేఘన పతకంపై నమ్మకానికి మరో కారణం.. ఆమె కోచ్ వార్వరా ఫిలియో. గ్రీస్ దేశం తరఫున అత్యుత్తమ జిమ్నాస్ట్. రియో ఒలింపిక్స్‌లో ఆకట్టుకున్న వార్వరా.. అంతకుముందు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. నిరుడు ఏథెన్స్‌లో మేఘనను చూసిన వార్వరా.. అప్పట్నుంచి ఆమెకు మార్గనిర్దేశకురాలిగా మారింది. గ్రీస్‌లోనే మేఘనకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తోంది. కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణ పతకమే లక్ష్యంగా శిక్షణ సాగుతోంది. గ్రీస్‌లో ఉన్నప్పుడు మేఘన వాళ్లింట్లోనే ఉంటుంది. హైదరాబాద్‌లో మేఘన ఇంట్లో వార్వరా బస చేస్తుంది. ఈ ఇండియా- గ్రీస్ జోడీ కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు పతకం అందిస్తారన్నది అందరి విశ్వాసం.

2011లో ఎల్బీ స్టేడియంలో కోచ్ బ్రిజ్ కిషోర్ దగ్గర ఓనమాలు నేర్చుకుంది మేఘన. 2015 జాతీయ క్రీడల్లో తెలంగాణకు స్వర్ణం పతకం అందించింది. అదే ఏడాది జాతీయ పాఠశాలల క్రీడల్లోనూ మేఘనకు బంగారు పతకం లభించింది. అప్పట్నుంచి జాతీయ స్థాయిలో సరైన పోటీలు లేకపోవడం మేఘన పేరు వినిపించకపోడానికి అసలు కారణం. అయితే తల్లిదండ్రుల సహకారంతో విదేశాల్లో శిక్షణ తీసుకుంటుంది. తెలంగాణ ప్రభుత్వం సైతం రూ.5 లక్షలు ఇవ్వడంతో రష్యాలో శిక్షణ ఇప్పించారు.


మార్క్రమ్ (143)

విజయానికి వికెట్ దూరంలో

ఆసీస్ చేతుల్లో తొలి టెస్టు

డర్బన్: దక్షిణాఫ్రికాతో నాలుగు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా విజయానికి వికెట్ దూరంలో నిలిచింది. 417 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సఫారీ జట్టు.. నాలుగో రోజు, ఆదివారం ఆట ఆఖరకు 293/9తో పరాజయం అంచున నిలిచింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలోనే దక్షిణాఫ్రికా 49/4తో కష్టాల్లో పడినా.. ఓపెనర్ మార్క్రమ్ (143; 218 బంతుల్లో 19×4) సూపర్ సెంచరీతో జట్టులో మళ్లీ ఆశలు రేకెత్తించాడు. అతడికి డిబ్రుయిన్ (36), డికాక్ (81 బ్యాటింగ్) సహకరించడంతో ఒక దశలో దక్షిణాఫ్రికా 283/5తో నిలిచింది. 5 వికెట్లు చేతిలో ఉండగా, 134 పరుగులే చేయాల్సి ఉండటం.. మార్క్రమ్, డికాక్ ఊపుమీదుండటంతో సఫారీ జట్టు అద్భుతమేమైనా చేస్తుందేమో అనిపించింది. ఐతే మార్క్రమ్‌ను ఔట్ చేసిన మిచెల్ మార్ష్ దక్షిణాఫ్రికాను దెబ్బ తీశాడు. తర్వాత మిచెల్ స్టార్క్ (4/74) ఒకే ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టడంతో దక్షిణాఫ్రికా అనూహ్యంగా 290/9కు చేరుకుంది. డికాక్‌తో కలిసి మోర్కెల్ (27 బంతుల్లో 0 బ్యాటింగ్) పట్టుదల ప్రదర్శించడంతో ఆట ఐదో రోజుకు మళ్లింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 213/9తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కంగారూ జట్టు 227 పరుగులకు ఆలౌటైంది. విజయానికి దక్షిణాఫ్రికా ఇంకా 124 పరుగులు చేయాల్సి ఉండడంతో ఐదో రోజు ఆసీస్ విజయం లాంఛనమే కావచ్చు. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 351 పరుగులు చేయగా.. దక్షిణాఫ్రికా 162 పరుగులకే ఆలౌటైంది.


అరుణను అభినందిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

అరుణకు రూ.2 కోట్లు

నజరానా ప్రకటించిన సీఎం కేసీఆర్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో కాంస్యం గెలిచి చరిత్ర సృష్టించిన తెలుగు తేజం బుడ్డా అరుణ రెడ్డికి తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రూ.2 కోట్ల నజరానా ప్రకటించారు. ఆదివారం అరుణ తన కుటుంబ సభ్యులతో పాటు ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసింది. అరుణను అభినందించిన ఆయన నగదు ప్రోత్సాహకం ప్రకటించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, రాష్ట్రానికి మరింత గొప్ప పేరు తేవాలని ఆకాంక్షించారు. ఇదివరకే తెలంగాణ ప్రభుత్వం తరఫున అరుణకు మంత్రి పద్మారావు రూ.20 లక్షలు ప్రోత్సాహకంగా అందించిన విషయం తెలిసిందే. అరుణతో పాటు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి టి.పద్మారావు, శాట్స్ ఛైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

ఆ చేదు జ్ఞాపకం ఇంకా కళ్ల ముందు కదలాడుతూనే ఉంది. ఆ విషాదం ఇంకా క్రికెటర్లను వెంటాడుతూనే ఉంది. నాటి నుంచి షార్ట్ పిచ్ బంతి ఏ బ్యాట్స్‌మన్ తలకు తాకినా అందరిలో ఒకటే కంగారు! మరోసారి అలాంటి ఘోరం ఎక్కడ చూడాల్సి వస్తుందో అన్న ఆందోళన! ఆదివారం మళ్లీ మైదానంలో ఆ తరహా దృశ్యాలే కనిపించేసరికి ఆస్ట్రేలియా క్రికెటర్లలో కలవరం రేగింది. అయితే అదృష్టం కొద్దీ పెద్ద ప్రమాదం తప్పింది. షార్ట్ పిచ్ బంతి తలకు తాకిన బ్యాట్స్‌మన్ కాస్త కోలుకున్నాడు.

అదే బౌలర్.. అదే దెబ్బ!


బౌన్సర్ ధాటికి విలవిలలాడుతూ పకోవ్‌స్కి



సీన్ అబాట్

మెల్‌బోర్న్: మళ్లీ అదే టోర్నీ.. అదే బౌలర్.. మళ్లీ అలాంటి దృశ్యమే! కానీ ప్రమాదం తప్పింది. ఆస్ట్రేలియా దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నీ షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో 20 ఏళ్ల యువ బ్యాట్స్‌మన్ పకోవ్‌స్కి తలకు షార్ట్ పిచ్ బంతి బలంగా తాకింది. వెంటనే అతను కిందికి ఒరిగిపోయాడు. తమాయించుకునే ప్రయత్నం చేసినా అతడి వల్ల కాలేదు. అంతవరకు మామూలుగానే కనిపించిన బౌలర్.. బ్యాట్స్‌మెన్ ముందుకు పడిపోతుండగా కంగారెత్తిపోయి పరుగున వచ్చి అతడిని పట్టుకున్నాడు. వెంటనే మైదానంలోని ఆటగాళ్లందరూ బ్యాట్స్‌మెన్ వద్దకు చేరిపోయారు. అంపైర్ కూడా పరుగెత్తుకొచ్చాడు. అత్యవసర వైద్య సేవల కోసం వర్తమానం వెళ్లింది. నిమిషాల్లో పకోవ్‌స్కికి చికిత్స అందింది. ఆ తర్వాత అతను కొంచెం కోలుకుని అడుగులు వేయగలిగాడు. అయితే పకోవ్‌స్కి బ్యాటింగ్ కొనసాగించే పరిస్థితి లేకపోవడంతో రిటైర్డ్ పెవిలియన్‌కు వెళ్లిపోయాడు. అతడికి చికిత్స కొనసాగుతోంది. పకోవ్‌స్కి నిష్క్రమణ తర్వాత మ్యాచ్ కొనసాగింది. పకోవ్‌స్కికి బౌన్సర్ విసిరిన బౌలర్.. సీన్ అబాట్. ఈ పేరును క్రికెట్ అభిమానులు అంత సులువుగా మరిచిపోలేరు. మూడున్నరేళ్ల కిందట అతను విసిరిన షార్ట్ పిచ్ బంతి తగిలే ఆస్ట్రేలియా టెస్టు ఆటగాడు ఫిల్ హ్యూస్ మైదానంలో కుప్పకూలిపోయాడు. అతడిని వెంటనే ఆసుపత్రికి తరలించి అత్యున్నత స్థాయి వైద్యం అందించినా, శస్త్రచికిత్స కూడా చేసినా ఫలితం లేకపోయింది. మూడు రోజుల పోరాటం తర్వాత అతను ప్రాణాలు విడిచాడు. అప్పటి మ్యాచ్ కూడా షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలోనిదే కావడం గమనార్హం. నాటి నుంచి బ్యాట్స్‌మన్‌కు బౌన్సర్ తగిలితే చాలు అందరూ కంగారుపడిపోతున్నారు. ఆదివారం మళ్లీ అబాట్ బౌలింగ్‌లోనే షార్ట్ పిచ్ బంతి పకోవ్‌స్కి తలకు తాకేసరికి కలకలం రేగింది. అప్పుడు బాగా ఎత్తులో వచ్చిన షార్ట్ బంతిని హ్యూస్ పుల్ షాట్ ఆడబోగా అది అతడి తల వెనుక భాగంలో తాకింది. ఆదివారం నాటి బౌన్సర్ తక్కువ ఎత్తులోనే రాగా పకోవ్‌స్కి దాన్ని తప్పించుకునేందుకు కిందికి వంగి దెబ్బ తిన్నాడు. బంతి మాత్రం చాలా వేగంగానే వచ్చింది. హ్యూస్ మరణం తర్వాత కొంతకాలం పాటు మానసిక వేదనకు గురైన అబాట్.. తర్వాత మామూలు మనిషై, ఆటలో కొనసాగుతున్నాడు. ఇప్పుడు మళ్లీ తన బౌలింగ్‌లోనే దెబ్బ తాకి బ్యాట్స్‌మెన్ కుప్పకూలిపోతుంటే అతనెంత కంగారు పడ్డాడో వీడియోలో స్పష్టంగా కనిపించింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుత సామాజిక మాధ్యమాల్లో విస్తృతమవుతోంది. ప్రతిభావంతుడైన బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు తెచ్చుకున్న పకోవ్‌స్కి ఇలా బంతి తలకు తాకి ఇబ్బంది పడటం ఇదే తొలిసారి కాదు. తన తొలి ఫస్ట్‌క్లాస్ సీజన్లో అతను ఇలాగే బంతి తగిలి మూడు నెలల పాటు ఆటకు దూరం కావడం గమనార్హం.

కోర్టు చెప్పినా 'కొండ'పైనే ధరలు

- తిరుమలలో ఇడ్లీ 60.. భోజనం రూ.150..
- హోటళ్లలో కొనసాగుతున్న ధరల దందా

ఈనాడు – తిరుపతి

తిరుమలలోని హోటళ్లలో అధిక ధరల దందా కొనసాగుతోంది. హైకోర్టు చీవాట్లు పెట్టినా ఏమాత్రం మార్పు రాలేదు. ప్లేటు ఇడ్లీకి రూ.60, భోజనానికి రూ.150-200 మధ్యలో వసూలు చేస్తున్నారు. ధరలు అడగకుండా తినే భక్తులకు బిల్లు చూశాక గుండె గుబేలుమంటోంది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో.. తితిదే మూసివేసిన 15 హోటళ్లలో ఇటీవల 6 మాత్రమే తిరిగి తెరుచుకున్నాయి. మిగిలినవి అందుబాటులో లేక భక్తులకు అల్పాహారానికి, భోజనాలకు.. ముఖ్యంగా ఉత్తరాది వారికి ఇబ్బందులు తప్పడంలేదు.

తిరుమలలో మొత్తం 16 పెద్ద హోటళ్లు ఉన్నాయి. వీటిలో ధరలు ఎక్కువగా ఉన్నాయని.. వాటిని తితిదే నియంత్రించలేకపోతోందని గత సంవత్సరం హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. స్పందించిన హైకోర్టు చర్యలు తీసుకోవాలని తితిదేని ఆదేశించింది. దీంతో 15 హోటళ్లను గత సంవత్సరం డిసెంబరు చివర్లో మూసివేశారు. (సారంగి హోటల్‌కు తితిదే ప్రత్యేక నిబంధనలు వర్తింపజేయడంతో అది మూతపడలేదు) తితిదేకు భారీగా బకాయిలు పడటంతో పాటు. . ధరల్లోనూ వ్యత్యాసం ఉండటంతో వీటిపై చర్యలు తీసుకున్నారు. వీటిలో ఆరు హోటళ్లు 20 రోజుల క్రితం తెరుచుకున్నాయి. ఇవి బకాయిల్లో సగభాగం కట్టడంతో పునరుద్ధరణకు తితిదే అనుమతి ఇచ్చింది. అయినా ఈ హోటళ్లలో ధరలు తగ్గలేదు. గతంలో వసూలు చేసిన ధరలనే ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

అద్దె భారం..

ప్రస్తుతం మూతపడిన హోటళ్ల బకాయిలు రూ.కోట్లలో ఉన్నాయి. అంత అద్దెలు కట్టలేక... తితిదే నిర్దేశించిన ధరలను అమలు చేయలేక, వాటిని నిర్వహించలేమని వ్యాపారులు వదిలేశారు. వాటికి కొత్త టెండర్లు పిలవాల్సిన తితిదే మిన్నకుంటోంది. దీంతో ఇటీవల తెరుచుకున్న ఆరు హోటళ్లే భక్తులకు దిక్కయ్యాయి.

తెల్ల కాగితంపైనే బిల్లు

ప్రస్తుతం తిరుమల హోటళ్లలో ఇచ్చే బిల్లును ఒక తెల్ల పేపరుపై ఇస్తున్నారు. బిల్లుపై హోటల్ పేరు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వినియోగదారులు బిల్లు అడుగుతున్నా.. సమాధానం ఉండటం లేదు. హోటళ్లపై వేస్తున్న కనీస జీఎస్టీ 5% కూడా బిల్లుల్లో కనిపించడం లేదు.

పదార్థం	తితిదే నిర్దేశిత ధర	వసూలు చేస్తున్న ధర (రూపాయల్లో)
ఇడ్లీ	18	60
చపాతి	25	80
దోశ	20	70
ఫ్రైడ్‌రైస్	35	240-280
భోజనం	45	150-200

తితిదే అధికారులకు పట్టదు...

హోటళ్లలో ధరలు ఇంత ఎక్కువ ఉండడానికి గల కారణాలపై తితిదే అధికారులు సమీక్షించిన పాపాన పోలేదు. ఇటీవల మూడు పెద్ద క్యాంటీన్లకు టెండర్లు పిలిచిన అధికారులు... అందులో సాధారణ నెలవారీ అద్దెను రూ.10 లక్షలకుపైగా పేర్కొన్నారు. నెలకు అంత కంటే ఎక్కువ మొత్తానికి పాడుకున్న వారికి వాటి నిర్వహణ బాధ్యత అప్పగిస్తారు. ఇలా అధిక ధరలకు హోటళ్లను దక్కించుకున్న యజమానులు. ఆ మొత్తాన్ని భక్తుల నుంచి పిండేస్తున్నారు. తిరుమలలో ఇటీవల తెరుచుకున్న ఓ హోటల్ నెలవారీ అద్దె రూ.60 లక్షలు. ఇంత పెద్ద మొత్తం తిరుపతిలోని త్రీస్టార్ హోటల్‌కూ లేదని ఈ వర్గాల సమాచారం.

సాధారణ భోజనానికి రూ.180

మేం ఇద్దరం భోజనం చేశాం. బిల్లు 360 వచ్చింది. ఇదే మిటని అడిగితే ఇక్కడ ఇంతే అని సమాధానం ఇచ్చారు. ఏమీ చేయలేక బిల్లు కట్టి బయటకు వచ్చాం. రూ.180 తీసుకుని సాధారణ భోజనం పెట్టారు.

– శ్రీనివాస్, హైదరాబాద్, భక్తుడు

జేబులో డబ్బులన్నీ అయిపోయాయి

మేం అయిదుగురం భోజనానికి వెళ్లాం. భోజనానికి రూ.60-80 ధర ఉంటుందనుకున్నాం. బిల్లు రూ.900 చూసి ఘొల్లుమన్నాం. తీసుకొచ్చిన డబ్బులన్నీ అయిపోయాయి.

– నరసింహమూర్తి, రామచంద్రాపురం, తూ.గో.జిల్లా

ఫోన్ చేసి ఫిర్యాదు ఇవ్వండి

అధిక ధరలపై సమాచారం ఇస్తే వెంటనే స్పందిస్తాం. 0877 2233333 ఫోన్ నెంబరుకు ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. హోటళ్ల దోపిడీని ఉపేక్షించం.

– ఆకే రవికృష్ణ, తిరుమల చీఫ్ విజిలెన్స్ అధికారి



గవర్నర్‌కు శాలువాకప్పి స్వాగతం పలుకుతున్న మంత్రి ఉమా.. చిత్రంలో కలెక్టర్ లక్ష్మీకాంతం

గన్నవరంలో గవర్నర్‌కు స్వాగతం

గన్నవరం, న్యూస్‌టుడే: గవర్నర్ నరసింహన్ దంపతులకు గన్నవరం విమానాశ్రయంలో ఆదివారం అధికారులు ఘనస్వాగతం పలికారు. సాయంత్రం 5.10 గంటలకు హైదరాబాద్ నుంచి ఎయిర్‌ఇండియా విమానంలో గవర్నర్ ఇక్కడికి వచ్చారు. రాష్ట్ర జలవనరుల మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జిల్లా కలెక్టరు బి.లక్ష్మీకాంతం తదితరులు స్వాగతం పలికారు. అదే విమానంలో ప్రయాణించి హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇక్కడికి వచ్చారు.

రాష్ట్రానికి అన్యాయం చేస్తే భాజపాతో తెగదెంపులే

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి చినరాజప్ప

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పిన భాజపా కేంద్రంలో అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపించిందని, రాష్ట్రానికి అన్యాయం చేస్తే ఆ ప్రభుత్వంతో తెగదెంపులు చేసుకోడానికి సిద్ధమేనని ఉపముఖ్యమంత్రి, హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పులిగడ్డలోని నీటిపారుదల శాఖ అతిథిగృహంలో ఆదివారం ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోరితే అంతకన్నా ఎక్కువగా ప్రత్యేక ప్యాకేజీతో లబ్ధి చేకూరుస్తామని కేంద్రం చెప్పిందని గుర్తుచేశారు.

నేటి నుంచి బెంగళూరులో హెలీ ట్యాక్సీలు

రెండు ప్రాంతాల నుంచి విమానాశ్రయానికి సేవలు

బెంగళూరు, న్యూస్‌టుడే: బెంగళూరులోని విమానాశ్రయానికి ట్రాఫిక్ అడ్డంకులు లేకుండా త్వరగా చేరుకునే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. నగరంలోని రెండు ప్రాంతాల నుంచి కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకునేందుకు దేశంలోనే మొదటిసారిగా ట్యాక్సీల తరహాలో హెలికాప్టర్ల సేవలు సోమవారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఎలక్ట్రానిక్స్ సిటీ, హెచ్ఏఎల్ విమానాశ్రయాల నుంచి విమానాశ్రయానికి కేరళకు చెందిన(కొచ్చి) తంబి ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ హెలిట్యాక్సీలను నడుపుతుందని సంస్థ అధ్యక్షుడు, ఎండీ కెప్టెన్ కె.ఎన్.జి.నాయర్ ఆదివారం విలేకరులకు తెలిపారు. రెండో దశలో ఐటీసీ రాయల్ గార్డేనియా, కంఠీరవ స్టేడియం ఆవరణల నుంచి హెలీ ట్యాక్సీలను నడుపుతామని వెల్లడించారు.

శంషాబాద్ విమానాశ్రయంలో తప్పిన ప్రమాదం

హైదరాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్ విమానాశ్రయంలో ఆదివారం ఉదయం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. సౌదీ అరేబియాలోని జెడ్డా నుంచి ప్రయాణికులతో సిటీ లింక్ ఎయిర్ లైన్స్ విమానం ఇండోనేషియా బయల్దేరింది. మార్గమధ్యలో ఇంధనం అయిపోతున్న విషయాన్ని గమనించిన పైలట్.. వెంటనే దారి మళ్లించి శంషాబాద్ విమానాశ్రయం రాకపోకల నియంత్రణ అధికారులకు సమాచారం అందించాడు. విమానాన్ని శంషాబాద్‌లో ఆదివారం తెల్లవారుజామున అత్యవసరంగా దించారు. అనంతరం విమానంలో ఇంధనం నింపుతుండగా ప్రమాదవశాత్తు భారీగా బయటకు లీకైంది. ఇంధనానికి మండే శక్తి ఉండటంతో మంటలు అంటుకుంటాయని అందరూ ఆందోళనకు గురయ్యారు. అనంతరం దానిని శాస్త్రీయంగా తొలగించారు. ఆ తర్వాత ఉదయం 11.00 గంటలకు సిటీ లింక్ ఎయిర్‌లైన్స్ విమానం ఇండోనేషియాకు బయల్దేరి వెళ్లింది.

ఎస్పీ-బీఎస్పీ దోస్తీ.. తూచ్

యూపీ ఉప ఎన్నికల్లో అవగాహనపై భిన్న ప్రకటనలు

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లు తమ ఉమ్మడి శత్రువైన భాజపాని ఓడించడానికి చేతులు కలిపే విషయంలో ఆదివారం నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. గోరఖ్‌పూర్, ఫూల్పుర్ లోక్‌సభ స్థానాలకు ఈ నెల 11న జరగనున్న ఉప ఎన్నికల్లో తాము కలిసి పనిచేస్తామని బీఎస్పీ సీనియర్ నేతలు తొలుత విలేకరుల సమావేశంలో ప్రకటించారు. మరి కాసేపట్లోనే బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి పొత్తు లేనేలేదని తేల్చిచెప్పేశారు. దీంతో రెండు పార్టీల శ్రేణుల్లోనే కాకుండా రాజకీయ వర్గాల్లోనూ గందరగోళం ఏర్పడింది. యోగి ఆదిత్యనాథ్ (గోరఖ్‌పూర్), కేశవ్‌ప్రసాద్ మౌర్య (ఫూల్పుర్)లు శాసనమండలికి ఎన్నిక కావడంతో రెండు లోక్‌సభ స్థానాలు ఖాళీ అయ్యాయి. మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మాయావతి నివాసంలో బీఎస్పీ నేతలు సమావేశమై తాజా వ్యూహాన్ని చర్చించారు. ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్‌యాదవ్‌తోనూ మాయా మాట్లాడారు. ఆదివారం రెండు పార్టీల నేతల మధ్య చర్చలు జరిగాయి. ఎస్పీ-బీఎస్పీ మధ్య అవగాహన కుదిరిందని బీఎస్పీ నేతలే వెల్లడించారు. దీనికి గానూ ఈ నెల 23న జరిగే రాజ్యసభ ఎన్నికల్లో విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతికి ఎస్పీతో పాటు ఇతర పక్షాలు మద్దతునిస్తాయని చెప్పారు.

పొత్తు ప్రసక్తే లేదు: మాయావతి

ఆదివారం సాయంత్రం మాయావతి స్పందిస్తూ- లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఎస్పీతో పొత్తు ప్రసక్తే లేదని తేల్చారు. రాజ్యసభ, శాసనమండలి ఎన్నికల్లో మాత్రం తాము పరస్పరం సహకరించుకోవచ్చన్నారు. కర్ణాటకలో మినహా దేశంలో మరెక్కడా ఏ పార్టీతో ఎలాంటి ఒప్పందం లేదని ప్రకటించారు. భాజపాని ఓడించగలిగే అభ్యర్థికి బీఎస్పీ కార్యకర్తలు ఓటు వేస్తారని చెప్పారు. యూపీ ఓటరు నాడి తెలుసుకునేందుకు ఉప ఎన్నికలు దోహదపడతాయనే ఉద్దేశంతో అన్ని పక్షాలూ వీటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి.

పులివెందులలో వైకాపా, తెదేపా ఘర్షణ

పులివెందుల, న్యూస్‌టుడే: కడప జిల్లా పులివెందులలో ఆదివారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. తెలుగుదేశం, వైకాపా వర్గీయుల నడుమ ఘర్షణ వాతావరణం ఏర్పడి అనంతరం రాళ్లు రువ్వుకోవడంతో పలువురు గాయపడ్డారు. పులివెందుల అభివృద్ధిపై ఎవరెవరు ఏమి చేశారో తెలియజేసేందుకు నాలుగు రోజుల క్రితం రాష్ట్ర శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి విసిరిన సవాల్‌ను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్వీకరించిన నేపథ్యంలో.. ఈ బహిరంగ చర్చకు వేదికైన స్థానిక పూలంగళ్లు కూడలిలో ఉద్రిక్తత నెలకొంది. పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఉన్నప్పటికీ బహిరంగ చర్చ పేరుతో వైకాపా, తెదేపా వర్గీయులు ఒకే చోటుకు చేరుకుని మీరెంత అంటే మీరెంత అంటూ కేకలు వేస్తూ రాళ్లు విసురుకున్నారు. సుమారు అరగంట పాటు పరస్పరం రాళ్ల దాడులకు పాల్పడ్డారు. చివరికి తక్కువ మంది ఉన్న తెదేపా వర్గీయులు వైకాపా వారి తాకిడికి తట్టుకోలేక భయాందోళనలతో పరుగులు తీశారు. వందమీటర్ల దూరం వరకు తెదేపా వర్గీయులను వైకాపా కార్యకర్తలు వెంబడించి తరిమివేశారు. భయంతో ఓ దుకాణంలో దాగిన కొంతమంది తెదేపా వారిని పసిగట్టిన వైకాపా కార్యకర్తలు దాడికి దిగారు. అలాగే కూడలిలో ఉన్న తెదేపా నాయకుల ఫ్లెక్సీలనూ చించివేశారు. తెదేపా వర్గీయుల దుకాణాలపై కూడా రాళ్లు విసిరారు. ఈ నేపథ్యంలో పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. దీంతో వైకాపా వర్గీయులు చెల్లాచెదురయ్యారు. అంతకుముందు రాళ్లతో దాడి, ప్రతిదాడికి దిగిన తెదేపా, వైకాపా వర్గీయులను అదుపు చేయలేక పోలీసులు కూడా ఓ పక్క నిల్చొని ఘర్షణ వాతావరణాన్ని చూస్తూ మిన్నకుండిపోయారు. చివరికి బాష్పవాయువును ప్రయోగించి ఆందోళనకారులను కొంతమేరకు అదుపుచేయగలిగారు.

గాయపడ్డ ట్రాఫిక్ ఎస్ఐ

వైకాపా, తెదేపా శ్రేణుల మధ్య జరిగిన ఘర్షణలో ట్రాఫిక్ ఎస్సై చిరంజీవి



వైకాపా దాడిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన తెదేపా శ్రేణులు

గాయపడ్డారు. రెండు ప్రైవేటు ఆటోల అద్దాలు పగిలిపోయాయి. ఓ పోలీసు వాహనం అద్దాలనూ ఆందోళనకారులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ బాబూజీ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితులను సమీక్షించి, ఆందోళనకారులను కట్టడిచేసేందుకు కృషిచేశారు. ఈ సందర్భంగా పాత ఎమ్మెల్యే కార్యాలయంలో గుమికూడినవారిని పోలీసులు తరిమివేశారు. ఆ కార్యాలయ ఆవరణలో నిల్చున్న ఆందోళనకారులను, కార్యకర్తలను కూడా చెల్లాచెదురు చేశారు. ఈ క్రమంలో వైకాపా కౌన్సిలర్ వరప్రసాద్ తలకు గాయమైంది. దీంతో ఆయన పోలీసుల జులుం నశించాలంటూ నినాదాలు చేశారు. పట్టణంలో 144 సెక్షన్ అమలుచేస్తున్నట్టు ఎస్పీ వెల్లడించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00